సనాతన ధర్మం

బెనారస్ కేంద్రీయ హిందూ కళాశాల పాలక సంఘము వారి 1916 నాటి ఆంగ్ల ప్రచురణ

అనుసృజన

ఆచార్య తాడేపల్లి పతంజలి



సనాతన ధర్మం

ఆంగ్లమూలం

బెనారస్ కేంద్రీయహిందూ కళాశాల పాలకసంఘము

వారి 1916 నాటి ప్రచురణ

తెనుగుసేత

ఆచార్య తాడేపల్లి పతంజలి

ప్రచురణ





విజ్ఞాన సరోవరం ప్రచురణలు

కొండా లక్ష్మీకాంతరెడ్డి గారి సౌజన్యంతో

'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక వారి విశిష్ట ప్రచురణ

2025

సనాతన ధర్మం
(నిత్యమైన సజీవ వాహిని)

ఆంగ్లమూలం : బెనారస్ కేంద్రీయహిందూ కళాశాల పాలకసంఘము
వారి 1916 నాటి ప్రచురణ

తెనుగు సేత : ఆచార్య తాడేపల్లి పతంజలి

ప్రచురణ : సెప్టెంబర్, 2025
భాద్రపదం - విశ్వావసు

ప్రథమ ముద్రణ : 2025

ప్రతులు : 1000

వెల : అమూల్యము

ప్రతులకు : 1) విజ్ఞాన సరోవరం ప్రచురణలు
కార్యదర్శి, కొండా లక్ష్మీకాంతరెడ్డి
2-2-18/31/సి, సాయి కృష్ణా నిలయం,
దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కాలనీ, హైదరాబాదు - 500 013.
సెల్ : 9959656464

2) మారుమాముల వెంకటరమణ శర్మ
'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం,
న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికిందరాబాద్-56.
సెల్ : 94410 15469

టైప్ సెట్టింగ్ : సమంత గ్రాఫిక్స్
హైదరాబాద్. సెల్ : 98495 51462

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
విద్యానగర్, హైదరాబాద్. సెల్ : 9866661478

సత్యమేవ జయతే నానృతమ్

(సత్యమే గెలుస్తుంది, అసత్యం గెలవదు)

ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత

(నీ సమస్య విషయంలో మేలుకో. జ్ఞాన యోగసాధన చేయి. అర్హుడైన గురువును ఆశ్రయించి బ్రహ్మ విద్యను కోరుకో. లేవండి, మేల్కొనండి. మరియు లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి).





విషయ సూచిక

సనాతన ధర్మము

మొదటి భాగము

హిందూమతానికి సంబంధించిన ప్రాథమిక భావాలు

సనాతన ధర్మము

రెండవ భాగము

సాధారణ హిందూ మతపరమైన ఆచారాలు మరియు సంస్కారాలు

సనాతన ధర్మము

మూడవ భాగము

నైతిక బోధనలు

కృతజ్ఞతలు మరియు పుస్తక పరిచయం

ఆచార్య తాడేపల్లి పతంజలి

ముందుగా ఈ పుస్తకం యొక్క అనువాదం పూర్తికావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు. ఈ అనువాద ప్రయాణంలో తోడుగా నిలిచిన వారందరికి కైచాపులు.

కుటుంబానికి కృతజ్ఞతలు

❋ **జననీజనకులు :** జన్మనిచ్చిన తల్లిదండ్రులు శ్రీ తాడేపల్లి పార్వతీశశాస్త్రి, శ్రీమతి సుశీల దంపతులకు నమస్సులు. నాకు తోడుగానిలుస్తున్న శ్రీమతి తాడేపల్లి మీనాక్షికి ధన్యవాదాలు. ఆత్మీయ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు.

❋ **పెదనాన్నగారు :** అమ్మవారిని సాక్షాత్కరింపచేసుకొని, తమ అంత్యక్రియలలో ఆ విషయాన్ని లోకానికి తెలియజేసి, వంశాన్ని పవిత్రం చేసిన పెదనాన్నగారు బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారికి వినమ్రాంజలి.

అనువాద ప్రయాణం

స్వామి దయతో నవంబర్ 2022లో మొదలైన ఈ సనాతన ధర్మ పుస్తకపు అనువాదం, గంగానది పుష్కరాల ప్రారంభం రోజున (22-04-2023) పూర్తయింది. తరువాత ఈ 2025 సంవత్సరంలో లోకపు వెలుగు చూస్తున్నది.

❋ **ప్రేరణ :** సుప్రసిద్ధ సాహిత్య, సంగీత విద్వాంసులు, బహుగ్రంథ కర్త అయిన **ఆచార్య పప్పు వేణుగోపాలరావు** గారు మరియు గుప్తా ఫౌండేషన్ అధినేత శ్రీ **మదుపల్లి మోహన గుప్తా** గారు, అభిమానంతో ఈ అనువాద కార్యక్రమాన్ని నాకు అప్పగించడం నేను చేసుకొన్న అదృష్టం. వారిద్దరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. తమ దర్శనం మాసపత్రికలో ధారావాహికగా ప్రచురిస్తున్న శ్రీ **మారుమాముల వెంకటరమణశర్మ**గారికి, పుస్తకరూపంలో సనాతన ధర్మాన్ని లోకానికి పరిచయం చేస్తున్న విజ్ఞాన సరోవరం ప్రచురణల **కార్యదర్శి** శ్రీ **కొండా లక్ష్మీకాంతరెడ్డి** గారికి నమోవాకములు. **ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు** ఈ పుస్తకం గురించి తరుచుగా నన్ను అడుగుతూ, ఈ పుస్తక ప్రచురణ రూపకల్పనకు తోడ్పడ్డారు. వారికి కైమోడ్పులు.

పుస్తక పరిచయం

❋ **పుస్తకం యొక్క పేరు మరియు దాని గురించి :** "Sanatana Dharma: An Elementary Text Book of Hindu Religion and Ethics" అనే ఈ పుస్తకం, హిందూ మతం మరియు నీతికి సంబంధించిన ప్రాథమిక పాఠ్యపుస్తకం. ఇది హిందూ ధర్మం, మత సూత్రాలు, నైతిక విలువల గురించి సరళంగా, సులభంగా అర్థమయ్యే విధంగా వివరిస్తుంది.

❋ **ప్రచురణ కర్తలు మరియు ఉద్దేశ్యం :** ఈ పుస్తకాన్ని 19వ శతాబ్దంలో బెనారస్‌లోని The Central Hindu College వారు ప్రచురించారు. యువతకు హిందూ మతతత్వాన్ని, దాని ఆచార వ్యవహారాలను సరళమైన శైలిలో అందించడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

❋ **పుస్తకంలో ఉన్న విషయాలు :** ఇందులో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, ధర్మశాస్త్రాలు మొదలైన ప్రామాణిక గ్రంథాల సారం పొందుపరచబడింది. సనాతన ధర్మాన్ని ఒక ప్రామాణిక రూపంలో, ఆధునిక దృష్టితో సమగ్రంగా ఇది వివరిస్తుంది.

❋ **ఎవరికి ఉపయోగపడుతుంది :** ఈ పుస్తకం కేవలం పాఠశాల విద్యార్థులకే కాకుండా, ఆధ్యాత్మికతను కొత్త కోణంలో అర్థం చేసుకోవాలనుకునే వారికీ, హిందూ ధర్మాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలనుకునే వారికీ ఉపయోగపడుతుంది. ఇది ఆధ్యాత్మిక మరియు తత్వపరమైన పఠనానికి ఒక బలమైన పునాదిగా పనిచేస్తుంది.

❋ **అనువాద ప్రక్రియ :** అనువాదం చేసేటప్పుడు మూలంలోని భావం చెడిపోకుండా, తెలుగుతనాన్ని అద్దడానికి ప్రయత్నించాను. దీని కోసం మూల గ్రంథాలను ఒకటికి పదిసార్లు చదివాను. సనాతన ధర్మానికి సంబంధించిన ఉపనిషత్తులు, స్మృతులు వంటి వాటిలోని శ్లోకాలను అనువదించేటప్పుడు, పూర్వాపర సమన్వయం కోసం మూల గ్రంథాలను కూడా పరిశీలించాను. ఎక్కడా పొరపాటు రాకుండా జాగ్రత్త వహించాను. ఆంగ్లమూలములో కొన్ని శ్లోకాలను అనువాదాలు ఇవ్వలేదు. అందరికి అర్థమవ్వాలని వాటిని అనువదించాను నేను.

❋ **పాఠకులకు విజ్ఞప్తి :** అక్షర దోషాలు లేకుండా చాలా జాగ్రత్త పడినప్పటికీ, ఎక్కడైనా ఏమైనా పొరపాట్లు కనిపిస్తే మన్నించవలసిందిగా కోరుతున్నాను. మీ అభిప్రాయాలను anjalit059@gmail.com మెయిల్‌కు తెలియజేస్తే సంతోషిస్తాను.

మీ

స్వాగతం



మారుమాముల వెంకటరమణ శర్మ

దర్శనం మాసపత్రిక సంపాదకులు

పాఠకులకు నమస్కారం! మా దర్శనం తరపున సహృదయులందరికీ ఈ పుస్తక పఠనానికి మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నాం. సనాతన ధర్మం యొక్క మహోన్నత భావాలను అందరికీ చేరువ చేయాలనే సంకల్పంతో, విజ్ఞాన సరోవరం ప్రచురణల కార్యదర్శి **శ్రీ కొండా లక్ష్మీకాంతరెడ్డిగారి** సౌజన్యంతో దర్శనం మాసపత్రికతరపున **"సనాతన ధర్మం"** అను పుస్తకాన్ని ప్రచురిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

ఈ పుస్తకం సనాతన ధర్మాన్ని ఒక కొత్త దృక్పథంలో పరిచయం చేస్తుంది. అవగాహన కలిగిస్తుంది. దీని మూలమైన ఆంగ్ల గ్రంథం ఎప్పటినుంచో విశేషమయిన ప్రఖ్యాతిని పొంది ఉన్నది. నాకు ఆ గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేయించాలనే ఒక అభిలాష ఎప్పటినుంచో ఉన్నది.

నా అభిలాషకు అనుగుణంగా ఒక రోజు అనుకోకుండా ఆర్మూర్ ప్రయాణంలో ఆచార్య తాడేపల్లి పతంజలి పరిచయమయ్యారు. సుప్రసిద్ధ సాహిత్య, సంగీత విద్వాంసులు, బహుగ్రంథ కర్త అయిన **ఆచార్య పప్పు వేణుగోపాలరావు** గారు మరియు గుప్తా ఫౌండేషన్ అధినేత **శ్రీ మదుపల్లి మోహన గుప్తా** గారి ప్రేరణతో ఈ పుస్తకాన్ని అనువాదం చేసానని వారు చెప్పినప్పుడు చాలా ఆనందం కలిగింది.

ఇంత గొప్ప గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేయించి, మాకు ప్రస్తుత ప్రచురణకు అనుమతించిన **గుప్తా ఫౌండేషన్ అధినేత శ్రీ మదుపల్లి మోహన గుప్తా** గారి సౌజన్యానికి అనేక ధన్యవాదాలు తెలియ చేస్తున్నాను.

ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించిన ఆచార్య తాడేపల్లి పతంజలి గారికి మా ధన్యవాదాలు. వారి కృషి ఎంతో అద్భుతమైనది. ఈ పుస్తకాన్ని ఎంతో శ్రమతో, శ్రద్ధతో వారు అనువదించారు. తెలుగు ప్రజలందరికీ అర్థమయ్యేలా, మనసుకు

హత్తుకునేలా ఆయన చేసిన ఈ అనువాదం నిజంగా అభినందనీయం.


సనాతన ధర్మంపై మాకు ఉన్న అంతులేని అభిమానానికి ప్రతీకగా మేం **"దర్శనం"** అనే మాస పత్రికను ప్రచురిస్తున్నాము. ఈ పత్రిక ప్రతి నెలా మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, ఆచారాల గురించి లోతైన వ్యాసాలను అందిస్తుంది. ఈ పత్రిక ద్వారా సనాతన ధర్మాన్ని మరింత లోతుగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. సనాతన ధర్మం అనువాద పుస్తకాన్ని మా **"దర్శనం"** మాసపత్రిక తరపున ప్రచురిస్తున్నందుకు చాలా అనందంగా ఉంది. ఆర్థికంగా ఈ పుస్తక ప్రచురణకు సహకరిస్తున్న **విజ్ఞాన సరోవరం ప్రచురణల కార్యదర్శి శ్రీ కొండా లక్ష్మీకాంతరెడ్డిగారికి** మరోమారు కృతజ్ఞతలు. ఈ పుస్తకానికి టైప్ సెట్టింగ్ చేసిన **సమంత గ్రాఫిక్స్** వారికి, ముద్రించిన **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్** వారికి ధన్యవాదాలు.

ధర్మం వైపుగా చేసే ప్రయాణంలో అందరం కలిసి నడుద్దాం. సనాతన ధర్మం యొక్క నిత్యనూతన సందేశాన్ని ప్రజలందరికీ చేరవేసే మా ప్రయత్నానికి మీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ కావాలని కోరుకుంటున్నాం. ధర్మో రక్షతి రక్షితః

మీ

మారుమాముల వెంకటరమణ శర్మ

జయం జయం సనాతనం



మనకు కనిపిస్తున్న ఈ పంచభూతాత్మకమైన (పృథ్వి, అప్, తేజో, వాయ్వాకాశాలు) ప్రకృతి ఎంత సనాతనమైనదో సనాతనధర్మం అంత సనాతనమైనది. దేవుడు - జీవుడు ఎంత సనాతనమో ఈ ధర్మం అంత సనాతనమైనది. ఆ సనాతన ధర్మమే హిందూధర్మం.

మతాలు కొందరు అవతారపురుషుల (స్త్రీల) పేర్లతో ఏర్పడ్డవి. శైవ - వైష్ణవ - సౌర - గార్హపత్య - శాక్తేయ - కాపాలికాలు. ఈ షణ్మతాలకు కొన్ని సిద్ధాంతాలు నియమాలుంటాయి. ధర్మం అనేది దేని - ఎవరి నియతకార్యం వారు చేసేది. సృష్టి ప్రారంభంలో చైతన్యమే (దివ్యశక్తే) ఉన్నది. అదే సనాతనం; ఈ క్రింది శ్లోకం చూడండి!

శ్లో ॥ దేహోదేవాలయః ప్రోక్తాః - జీవో దేవస్సనాతనః ।
త్యజేదజ్ఞాననిర్మాల్యం - సోఽహం భావేన పూజయేత్ ॥

ఈ దేహమే దేవాలయం; సనాతనుడైన ఆదేవుడే ఈ జీవుడు. అజ్ఞానమనే నిర్మాల్యాన్ని తొలగించుకోండి! ఆ పరమాత్మయే ఈ జీవాత్మగా భావించి అర్చించండి! ఈ ఆభాణక శ్లోకం ఆధారంగానేగాక వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, దర్శనాలు సనాతనధర్మాన్ని స్పష్టంగా వ్యక్తీకరించి పిపీలికాది బ్రహ్మపర్యంతం అంతా బ్రహ్మ (దివ్య) మయం అని ప్రస్థాపించాయి. ప్రత్యేకంగా దశకం ధర్మ లక్షణం అని కూడా వివరించాయి.

శ్లో ॥ ధృతిః, క్షమా, దమో, అస్తేయం - శౌచమింద్రియనిగ్రహః ।
ధీర్విద్యాసత్యమక్రోధో - దశకం ధర్మలక్షణమ్ ॥

ఇవన్నీ సనాతనధర్మం చెబుతున్నవే. ప్రపంచమంతా వర్తించేదే సనాతన ధర్మం. ఈ మహావాక్యాలన్నీ సనాతనధర్మానికి చెందినవే.

- సర్వేజనాః సుఖినో భవంతు (అందరు సుఖంగా ఉండాలి)
- మహాజనోయేనగతః సపంథాః (సజ్జనులు నడచిన మార్గం అనుసరణీయం)
- సర్వం ఖల్విదం బ్రహ్మ (ఈవిశ్వమంతా దైవమయం)

- ప్రజ్ఞానం బ్రహ్మ (ఉత్తమజ్ఞానమే దైవం)
- అహం బ్రహ్మాస్మి (నేనే ఆ దైవాన్ని)
- తత్త్వమ్ అసి (అది నీవు నేను అందరం ఒకటే)
- అయమాత్మా బ్రహ్మ (నా ఆత్మే పరమాత్మ).

అన్నం కొరకు, అధికారం కొరకు, అహంకార ప్రదర్శన కొరకు విజ్ఞానాధికార నిమిత్తం ప్రాణాలు తీసే ప్రపంచానికి, అందరూ ఆనందాన్ని కోరాలనీ, నీకూ నాకు అందరికీ ఆనందం కావాలని సనాతన ధర్మం ప్రవచించింది.

ఇటువంటి సనాతన ధర్మాన్ని కించపరుస్తూ ఈ మధ్య కాలంలో కొందరు అవాకులు చెవాకులు ప్రేలారు. వారికి జ్ఞానోదయం నిమిత్తం సనాతనధర్మం - సాధికారిక అనువాద గ్రంథాన్ని (Sananthana Dharma, An Elementary Text Book of Hindu Religion and Ethics) ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథం 1916లో వారణాసి కేంద్రీయ హిందూకాలేజి (Published by the Board of Trustees, Central Hindu College, Banaras) బోర్డు ఆఫ్ ట్రస్టువారు ప్రచురించారు.

ఆ గ్రంథాన్ని యథాతథంగా విజ్ఞాన సరోవర ప్రచురణ (హైదరాబాద్) పేరిట మేము 2025 మార్చిలో ప్రచురించాం. అపూర్వమైన ఈ గ్రంథం ప్రథమ భాగంలో ధర్మము, కర్మయోగము, త్యాగము తదితర అంశాలకు సంబంధించి ఆరు అధ్యాయాలున్నాయి. ద్వితీయ భాగంలో సంస్కారాలు, అర్చనలు, వర్ణాశ్రమాది ధర్మాలకు సంబంధించి ఏడు అధ్యాయాలున్నాయి. తృతీయ భాగంలో నైతిక విలువలు, శాస్త్రీయ దృక్పథం, మానవతా మూల్యాలు, ఉద్వేగాలు, దివ్యజ్ఞానాది వైభవాలు, దివ్యమానవ సంబంధాలు, సమానత్వం - సమరసతా పరమవైభవస్థితిగతులకు సంబంధించి పదకొండు అధ్యాయాలున్నాయి.

ఈ విధంగా 24 అధ్యాయాలున్న ఈ ఇంగ్లీషు గ్రంథాన్ని **దర్శనం పత్రిక** సంపాదకులు **శ్రీ మారుమాముల వేంకటరమణ శర్మ** గారి ప్రేరణతో ఆధ్యాత్మికవేత్త తెలుగు ఉపన్యాసకులు విశ్రాంత ప్రాచార్యులైన **డా॥ తాడేపల్లి పతంజలి**గారు తెలుగు చేశారు. నెలనెలా **దర్శనం**లో ప్రచురిస్తున్నారు. ఇప్పుడు ఆ అపూర్వ గ్రంథం తెలుగు ధార్మిక లోకం కోరిక మేరకు గ్రంథ రూపంలో వస్తున్నది. అనువాదకులు దర్శనం పత్రిక యాజమాన్యం అంగీకారంతో - సంయుక్తంగా **విజ్ఞాన సరోవర ప్రచురణలు** పేరిట ప్రచురిస్తున్నాం.


ఈ గ్రంథం ఈ విధంగా రూపుదిద్దుకొని తెలుగు వారి స్వప్న ఫలంగా ఒక సాధికారిక **ధార్మిక గ్రంథం**గా వస్తున్నదనే భావిస్తూ, ఈ గ్రంథాన్ని చదివి అందరికీ మార్గదర్శనం చేస్తారని ఆశిస్తున్నాం.

విజ్ఞాన సరోవరం ప్రచురణల అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారికి, ఈ గ్రంథ మూలరచయితకూ, అనువాదకులకూ, ప్రేరకులకూ, ముద్రణాలయ సోదరులకూ, ఆదుకొన్న సహకరించిన ఆప్తమిత్రులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

భాగ్యనగర్
రాఖీపూర్ణిమ
తేది : 8-8-2025

ఆచార్య కసిరెడ్డి
విజ్ఞాన సరోవర ప్రచురణలు

ధర్మంలోనే మన అస్తిత్వం



- డా.పి.భాస్కరయోగి
ప్రముఖ విశ్లేషకులు, విమర్శకులు

వెయ్యేళ్ల బానిసత్వంలో మనం స్వంత అస్తిత్వాన్ని కోల్పోయాం. పరాయి రాజనీతి క్రింద మాత్రమే కాక, పరాయి మత అసహిష్ణుత పద ఘట్టనల క్రింద నలిగిపోయాం. అందుకే మనకు సాంస్కృతిక విస్మృతి సంభవించింది. కానీ విచిత్రంగా భారతదేశం చారిత్రక, సాంస్కృతిక పరిణామాలపై విదేశాల్లో పరిశోధనలు ప్రారంభం అయ్యాయి.

ఒసామాబిన్ లాడెన్ 'ముస్లిం ప్రపంచంలో భారతదేశం ఒక అసమగ్ర అధ్యాయం మాత్రమే' అని ప్రకటన చేసినప్పటినుండి ఈ పరిశోధనలకు మరింత ప్రాధాన్యం పెరిగింది. కేవలం ఇరాన్ దేశాన్ని 15 సంవత్సరాలు ముస్లింలు పాలిస్తేనే అది ముస్లిం దేశంగా మారిపోయింది. ఇరాక్‌ను 17 సంవత్సరాలు, ఈజిప్ట్‌ను 21 సంవత్సరాలు ముస్లిం పాలకులు పరిపాలిస్తే అవి నూరు శాతం ఇస్లామిక్ దేశాలు (దారుల్ - ఇస్లాం)గా మారిపోయాయి. అలాగే యూరప్ ఖండాన్ని 50 సంవత్సరాలు క్రైస్తవులు పరిపాలిస్తే ఆ ఖండం మొత్తం క్రైస్తవ ఖండంగా మారింది. మరి 800 సంవత్సరాలు ముస్లింలు, 200 సంవత్సరాలు క్రైస్తవులు భారతదేశాన్ని పాలించినా భారత్ ముస్లిం దేశంగా, క్రైస్తవ దేశంగా మారలేదు అన్నదే పైన పేర్కొన్న పరిశోధకుల మెదడును తొలుస్తున్న ప్రశ్న.

మన తాత్విక, ఆధ్యాత్మిక పునాదుల గట్టిదనం అలాంటిది. ఆ పునాదుల మీదనే మన సామాజిక భవనం నిర్మాణమైంది. హిందుత్వ జీవన విధానానికి అనుగుణంగా ఏర్పడ్డ సూత్రాలతో ఈ పునాదులు నిర్మాణ మయ్యాయి.

ఓ మర్రిచెట్టు పైభాగానికి ఓ తీగ వచ్చి - నేను ఎంత ఎత్తుగా ఉన్నానో చూశావా? అని మర్రి చెట్టును వెక్కి రించిందట'. ఇలాంటి తీగలు ఆ చెట్టు జీవితంలో చాలా వస్తున్నాయి, పోతున్నాయి. అయితే ఆ చెట్టు అలాగే పెరుగుతున్నది. ఆ మర్రిచెట్టే హిందూధర్మం. ఈ తీగలన్నీ ఇతర మతాలు.

మ(ర్రిచెట్టులాంటి హైందవధర్మానికి తత్వము, ఆధ్యాత్మికము, సామాజికము అనే గట్టి వేర్లున్నాయి. పండుగలు మనకు ఖగోళ, సామాజిక, ఆధ్యాత్మిక, తాత్విక దృక్పథాన్ని కలిగిస్తాయి.

పంచాంగకర్తలు ధర్మసింధు, నిర్ణయ సింధు ఆధారంగా మన పండుగలను నిర్ణరుస్తారు. దానికి ఆధారం మన ఖగోళ, జ్యోతిష విజ్ఞానం. ఖగోళంలో జరిగే పరిణామం పర్వంతో సమ్మిళితం అయ్యింది. అలాగే ప్రతి పండగకూ ఓ జ్యోతిష్య విజ్ఞానం ఉంటుంది. తిథులకు, వారాలకు, గ్రహ, నక్షత్రాలకు ఖగోళంతో సంబంధం ఉంది. మన శాస్త్రాలను మనతో కలిపే ప్రయత్నం మన ఋషులు చేశారు. పేదవాని నుండి ధనవంతుల వరకూ ఒకే విధంగా పండుగలు జరుపుకోవడం ఇందులోని సామాజిక సూత్రం. ఇందులోని చిన్నచిన్న భేదాలు ప్రక్రియా పరమైనవే కాని మౌలికమైనవి కాదు. ప్రతి పండుగలో, ఆచారంలో మనం వాడే వస్తు సంస్కృతి మంగళకరమైనది. శరీరానికి భౌతికంగా ఆనందం కలిగిస్తే మనస్సుకు ఆంతరికమైన చైతన్యాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు మన ఇళ్లలో ఏ శు భకార్యం జరిగినా మామిడి తోరణాలు కడుతుంటాం. ఆ అలంకరణ చూపరులకు ఆనందం కలిగిస్తుంది. వైద్యపరమైన, ప్రకృతిపరమైన ఉపయోగంతో భౌతికంగా మనల్ని కట్టిపడేస్తే, ఆచరణలోని సంతృప్తి మన మనస్సును తాకుతుంది. అలాగే ప్రతి పండుగ మనకు తాత్విక దృక్పథాన్ని కల్గిస్తుంది. ఆలోచిస్తే ప్రతి పండుగ అంతే భావ చైతన్యాన్ని మనలో నింపుతుంది.

హైందవ ధర్మానికి ఆలంబనగా నిలిచే గొప్ప గ్రంథాలున్నాయి. ఇవన్నీ సంస్కృత భాషలో ఉన్నాయి. పాణిని రచించిన అష్టాధ్యాయి సంస్కృత భాషకు మరో ఆయువుపట్టు. పాణిని మహర్షిని 'ప్రపంచ భాషా పితామహుడు'గా గుర్తించారు. 102 మిలియన్ 78 కోట్ల 50 లక్షల శబ్దాలు సంస్కృత భాషలో ఉండడం విశేషం. వేదాలు వైదిక సంస్కృతంలో ఉండగా, రామాయణ, భారత, భాగవతాలు, అష్టాదశ పురాణాలు, కావ్యాలను లౌకిక సంస్కృతంలో రచించారు. సంస్కృత భాషలో రచించిన ఆయుర్వేదం, చతుష్షష్టి కళలు, పక్షిశాస్త్రం, తర్కశాస్త్రం, వైజ్ఞానిక శాస్త్రాలు - ఇలా ఎన్నో శాస్త్రాలు హైందవ ధర్మానికి శోభను చేకూర్చుతున్నాయి. అలాగే స్తోత్రాలు, పూజలు, అర్చనలు సంస్కృత భాషలో ఉండి ఆసేతు హిమాలయం వరకు హిందువుల సంప్రదాయాలు ఏకీకృతంగా ఉన్నట్లు ఋజువు చేస్తున్నారు.

సంవత్సరానికి 365 రోజులు ఉంటాయని క్రీ.శ. 5వ శతాబ్దంలో భాస్కరాచార్యుడు చెప్పాడు. ఆర్యభట్టు శూన్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. చరకుడు ఆయుర్వేదం చెప్పగా,

శుశ్రుతుడు శస్త్ర చికిత్సను మొదటగా చేసి నిరూపించాడు. బి.సి. 700 లోనే మనదేశంలో తక్షశిల విశ్వవిద్యాలయంలో 10,500 మంది విద్యార్థులు చదువుకొన్నారు. అంతగొప్ప విద్యావ్యవస్థ విదేశీయుల పాలనలో ధ్వంసం అయిపోయింది.

మన సంస్కృతి ప్రతి విషయంలో శుభాన్ని కోరుకునేదిగా ఉంటుంది. ఉదాహరణకు మన ఆశీస్సులైన దీర్ఘాయుష్మాన్‌భవ, దీర్ఘ సుమంగళీ భవ, శుభం భవతు, సమస్త సన్మంగళాని భవంతు... అంటూ నిరంతరం లోకానికి అనేక మంగళాశాసనాలు చేసింది మన ధర్మం. "కౌసల్యా సుప్రజారామా పూర్వా సంధ్యా ప్రవర్తతే! ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడ ధ్వజత ఉత్తిష్ఠ కమలాకాన్త త్రైలోక్యం మంగళం కురు" – ఈ ముల్లోకాలకు శుభాన్ని చేకూర్చడానికి నీవు నిద్రలేవాలి స్వామీ అని దైవ ప్రార్థన చేసే సంప్రదాయం మనది.

అలాగే మనకు గొప్ప వేదాంతం ఉంది. మనిషి తన వయస్సు మళ్ళగానే వైరాగ్యం అవలంబించమన్నది భగవద్గీత. 'నేను' అన్న అహంకారంలో కులం, ధనం, బలం, గర్వం, ప్రాంతం, భాష... ఇలా అన్నీ ఉన్నాయి. అలాంటి 'నేను'ను వదలమని మన శాస్త్రాల సారం. చతుర్విధ పురుషార్థాలు సాధించాలంటే పురుషునికి స్త్రీ తోడు అవసరం. అందుకే వివాహ మంత్రాల్లో 'నాతిచరామి' అనే మంత్ర ప్రమాణం చేస్తాడు. ఏడు అడుగులు, మూడు ముళ్లతో పెనవేసుకొన్న మన బంధం ఏడుజన్మల వరకు ఉంటుంది. ఇద్దరు త్యాగమూర్తుల కలయిక మన వివాహ బంధంలో ఉంటుంది. లోకహితం కొరకు భర్తకే త్యాగబుద్ధిని నేర్పించిన స్త్రీ మూర్తులు ఈ దేశంలో కన్పిస్తారు. ఉదాహరణకు దేవతలు రాక్షసులు అమృతం కోసం పాల సముద్రాన్ని చిలికినప్పుడు మొదట వచ్చిన హాలాహలాన్ని లోకహితం కోసం తాగమని పార్వతి తన భర్తను కోరిన ఘట్టం అద్భుతం.

గొప్ప వేదాంత సూత్రాలు, నీతి శ్లోకాలు, ధర్మ విషయాలు విజ్ఞులను మాత్రమేగాక బాలలు పాడే గేయాలు కూడా వారిని ఆ స్థాయిలో అలరించాయి. వారు తమ అస్తిత్వాన్ని మరచిపోకుండా కాపా డారు. పరాయి పాలనలో భారత, రామా యణాలను తమ అధికార మదంతో అణచివేస్తే యక్షగానాలు, బయలాటల్లో జానపదులు జన జీవితంలోనికి ఇతి హాసాలను తీసుకెళ్లారు.

వేయి సంవత్సరాలకు పైగా జరిగిన పరాయి పాలన అంతానికి ఈ నేల రక్త తర్పణాలతో, వీరుల నినాదాలతో మారుమ్రోగింది. సోమనాథ్, అయోధ్య, మథుర, కాశీ దేవాలయాలను పరాయి మూకలు అపవిత్రం చేస్తుంటే ఎదురు నిల్చిన వీరులకు ఈ దేశంలో కొదవేం లేదు. పాకిస్తాన్ కవ్వింపు చర్యల్ని కార్గిల్‌లో ఎదుర్కొన్న యువసైనిక

వీరకిశోరాల శరీరాల నుండి చిందిన రక్తబిందువుల త్యాగపు గుర్తులు ఇంకా మనం మరచిపోలేదు.


32 ఏళ్ల జీవితంలో కాలడి నుండి కాశ్మీర్ వరకు కాలినడకన పయనించి హైందవ జాతి కీర్తి పతాకను ఎగురేసిన ఆదిశంకరుడికి ఇచ్చిన ప్రాధాన్యాన్నే అగ్ని పరీక్ష నెదుర్కొని హరిదర్శనం చేసిన నిమ్న కులస్థుడైన నందనార్‌కు ఇచ్చింది. ఖండ ఖండాంతరాలలో హైందవ వేదాంత డిండిమను మ్రోగించిన వివేకానంద స్వామిని అక్కున జేర్చుకొన్న ఈ ధర్మం, భారతీయుల ఆర్యత్వాన్ని తట్టిలేపి 'వేదాలలోకి తిరిగి తీసుకెళ్లిన' దయానందుని ముందు నతమస్తకమై నిలబడింది. ఆదిశంకరుడినుండి మలయాళ స్వామి వరకు ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన ఈ నేల పరమపవిత్రంగా తన సంస్కృతిని కాపాడు కొంటున్నది.

కటికవాడైన ధర్మవ్యాధుడు, బ్రాహ్మణుడైన కౌశికుడికి ధర్మోపదేశం చేయడం హిందూ పురాణాల్లో చూస్తాం. విశిష్టాద్వైత సిద్ధాంతంలో ప్రముఖంగా వినిపించే పేర్లలో యామునాచార్యుడొకరు. ఆయనకు పెరియనిం అనే బ్రాహ్మణ శిష్యునితో బాటు, మార్నేరు నంబి అనే నిమ్నకులస్థుడు కూడా శిష్యుడుగా ఉన్నాడు. ఇద్దరికీ విద్యాదానం చేసిన ఘనత ఆచార్యులది. మార్నేరు నంబి కోరికపై పెరియ నంబి తన సహాధ్యాయుడి అంత్యక్రియలను నిర్వహించడం హైందవ ధర్మ విశేషం. వేద సూక్తాలను ప్రవచించిన స్త్రీలు మనకు కనిపిస్తారు. యమ ధర్మరాజు పాశాన్ని అదలించిన పతివ్రతా మూర్తులు ఈ నేలను పావనం చేశారు.

హైందవ ధర్మాన్ని ఈ భూమిపై నుండి ఎవరూ ఆవలకు త్రోసివేయలేరు. సూర్యచంద్రులతో ముడిపడి ఉన్నది ఈ ధర్మం. సూర్యచంద్రులనే తనలో విలీనం చేసుకోగల్గిన పరమాత్మలా ఇది శాశ్వతం, సనాతనం. ఈ జాతిపై సైద్ధాంతిక దాడులు, భౌతిక దాడులు ఎన్ని జరిగినా, పుటం పెట్టిన బంగారంలా హైందవ ధర్మం మహా తేజోవంతమై పైకి లేవడం చరిత్ర చెబుతున్న సత్యం.

హిందుత్వ జీవన విధానమును అణువణువునా నింపుకున్న ఈ "సనాతన ధర్మం" గ్రంథమును ముందు ఆంగ్ల, సంస్కృతాలలో ముద్రించి, నేడు తెలుగువారి సౌలభ్యం కోసం తెలుగు అనువాదమును కూడా తామే తమ విజ్ఞాన సరోవర ప్రచురణల ద్వారా ప్రచురిస్తున్న జిజ్ఞాసువులు, సాహితీ ప్రేమికులు శ్రీ కొండా లక్ష్మీకాంతరెడ్డి గారు ఎంతో అభినందనీయులు. పాఠకులు ఈ గ్రంథమును ఆదరిస్తారని ఆశిస్తూ....

నిత్యనూతనం - సనాతనం



- కొండా లక్ష్మీకాంత రెడ్డి

ఆకాశంబందుండి
శంభుని శిరంబందుండి
శుశ్లోకంబైన హిమాద్రి నుండి
భువి భూలోకంబందునకు
శోభాయమానమైన ప్రకృతీ సౌందర్యముతో

గంగమ్మ తల్లి అనాదిగా తన ధర్మాన్ని కాపాడుతూ మానవతా కల్యాణానికి సేవ చేస్తూ వస్తున్నది. ఆ జ్ఞాన సంపద ఋషులు తమ తమ తపస్సుల ద్వారా ధర్మజ్ఞానాన్ని పొందుతూ పంచుతూ వస్తున్న జ్ఞాన సంపద, ధర్మసంపద.

నిన్నటి దినం నేటి దినానికి సనాతనం. అది స్ఫూర్తిదాయకం. ఇది కొన్ని శతాబ్దాలుగా వస్తున్నటువంటి సనాతన ధర్మం.

ఈ "సనాతన ధర్మం" గ్రంథాన్ని చదవండి, పాటించండి. మీ జీవితం సఫలం - సుఫలం అవుతుంది.

ఇదివరకు ఆంగ్లం (సంస్కృత శ్లోకాలతో) లో ప్రచురించిన మా సంస్థ "విజ్ఞాన సరోవర ప్రచురణ"లకే తెలుగు గ్రంథ ముద్రణా భాగ్యము కూడా కలగడం మాకు అత్యంత ఆనందదాయకం.

ఈ గ్రంథమును ఆంగ్లం నుండి తెలుగులోనికి అనువదించిన ఆచార్య తాడేపల్లి పతంజలి గారికి ధన్యవాదములు.

గ్రంథంపై తమ సందేశములనందించిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి, మారుమాముల వెంకటరమణ శర్మ గారికి, డా॥ పి. భాస్కరయోగి గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

సకాలంలో ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ యాజమాన్యానికి, డిజైనర్స్ సమంత గ్రాఫిక్స్, హైదరాబాద్ వారికి ధన్యవాదాలు.

తొలిపలుకు

కేంద్రీయ హిందూ కళాశాల ధర్మకర్తల మండలి తమ అధీనంలోని విద్యా సంస్థలలో మతపరమైన మరియు నైతిక బోధనను అందించేందుకు కొన్ని ముఖ్యమైన మార్గదర్శకాలను రూపొందించింది. ఈ బోధనలో హిందూ ధర్మ సూత్రాలను, దానికి తగ్గట్టుగా పాశ్చాత్య విద్యా పద్ధతులతో సమన్వయం చేయడం కళాశాల ప్రధాన లక్ష్యం.

ఈ బోధనలో విస్తృత దృక్పథం, సహనం, మతాతీత స్వభావం ఉండాలి. అయితే ఇది ప్రత్యేకంగా హిందువులకు సంబంధించినదిగా ఉండాలి. హిందువులలోని విభిన్న ఆలోచనా విధానాలను సమన్వయం చేసే సామర్థ్యం దీనికి ఉండాలి. వివాదాస్పద సిద్ధాంతాలను వీలైనంత వరకూ పక్కన పెట్టాలి.

ఈ బోధన :

- సామాజిక, రాజకీయ అంశాల్లోకి ప్రవేశించకూడదు.
- విద్యార్థికి మతం మరియు నైతికతపై దృఢమైన అవగాహన కల్పించాలి.
- వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయుక్తమైన విలువలను ధర్మనిష్ఠ, విధేయత, స్వావలంబన, నిక్కచ్చితనం, వినయం, సమతుల్యత వంచన లేకుండా బోధించాలి.
- హిందువులను కలిపే సిద్ధాంతాలను స్పష్టంగా బోధించి, విభజించేవాటిని విస్మరించాలి.
- ఇతర మత విశ్వాసాల పట్ల గౌరవ భావన పెంచాలి.
- మతపరమైన విశ్వాసాలు భిన్నమైన మార్గాలుగా ఉన్నా, అందరూ ఒకే పరమాత్మని చేరుకోవడమే లక్ష్యమనే విషయాన్ని బోధించాలి.

ఈ పుస్తకంలోని ప్రధాన అంశాలు:

1. సామాన్యంగా హిందువులందరూ అంగీకరించే మతపరమైన, నైతిక బోధనలు ఇందులో ఉండాలి.

2. ఇతర మతాల కంటే హిందూమతాన్ని ప్రత్యేకంగా చూపించే అంశాలు ఇందులో తప్పక ఉండాలి.

3. ఏదైనా ఒక నిర్దిష్ట సిద్ధాంతం లేదా సంప్రదాయానికి మద్దతునిచ్చే విధంగా ఉండకూడదు.

ఈ పుస్తకం భారతదేశంలోని హిందూవిద్యార్థులకోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. వారి మతంపై సరైన అవగాహన కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుంది. కళాశాల స్థాయికి చేరుకున్నాక మరింత లోతైన అధ్యయనం చేయగలిగేలా ఇది ప్రాథమిక అవగాహన ఇస్తుంది.

పాఠ్యాంశాలలో భిన్న అభిప్రాయాలను ప్రస్తావించకుండా, ప్రామాణికంగా అంగీకరించబడిన సిద్ధాంతాలను మాత్రమే పొందుపరిచారు. విద్యార్థులు దీనిని స్వయంగా చదివి ఉపయోగించుకోవచ్చు. ఉపాధ్యాయులు క్లిష్టమైన విషయాలను సులభతరం చేయగలరు.

ప్రతి అధ్యాయంలో చివరగా శ్లోకాలను ఇచ్చారు. విద్యార్థులు వీటిని పఠించడంవల్ల తమ మత సంపదను తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

సనాతన ధర్మం - ఒక శాశ్వత దృక్పథం

ఈ పుస్తకంలో "సనాతన ధర్మం" అంటే "శాశ్వతమైన ధర్మం" అని అర్థం చేసుకోవాలి. భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో దీని ప్రాముఖ్యత తక్కువగా ఉన్నా, దీనిలో పొందుపరిచిన నైతిక బోధనలు అన్ని హిందూ సమాజాలకూ వర్తిస్తాయి.

"ఈ పుస్తకం హిందూ యువతలో మతపరమైన అవగాహన, దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. యువత మతంపై సరైన అవగాహన పెంచుకోవడానికి, సమాజానికి ఉపయోగకరమైన పౌరులుగా ఎదగడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది." అని ప్రచురణ కర్తలు పేర్కొన్నారు.

ఈ పుస్తకంలోని అంశాలు

ఈ పుస్తకాన్ని మూడు భాగాలుగా విడగొట్టారు.

హిందూ మతానికి సంబంధించిన ప్రాథమిక భావాలు 01 వ భాగములో 06 అధ్యాయాలలో ఉన్నాయి. అవి వరుసగా పరిచయం, అఖండ సత్యం, పునర్జన్మ, కర్మ, త్యాగం, కనిపించు మరియు కనిపించని ప్రపంచాలు.

ఇక 02 వ భాగము ఆచారాలు మరియు సంస్కారాలకు సంబంధించింది. ఇందులో సంస్కారాలు, శ్రద్ధ, శౌచం,నిత్యం చేయవలసిన పంచ యజ్ఞాలు, ఆరాధన, నాలుగు ఆశ్రమాలు, అను ఆరు అధ్యాయాలు ఉన్నాయి.

03 వ భాగము నైతిక బోధనలకు సంబంధించింది. నీతి శాస్త్రం అంటే ఏమిటి? మతం ద్వారా నీతి స్థాపన, మంచి, చెడు, నైతిక శాస్త్ర ప్రమాణం (ధర్మ నిర్ణయ పద్ధతి), ధర్మాన్ని నిలబెట్టే గుణాలు, ఆనందం మరియు భావోద్వేగాలు, స్వీయ నియంత్రణకు సంబంధించిన గుణాలు, మెరుగైన స్థితిలో ఉన్నవారితో (గురువులు, పెద్దలు, అధికారులు) సంబంధమున్న నైతికత మరియు దోషాలు, సమాన స్థాయిలో ఉన్నవారితో (స్నేహితులు, సహచరులు) సంబంధమున్న నైతికత మరియు దోషాలు,తక్కువ స్థాయిలో ఉన్నవారితో (చిన్నవారు, అనుచరులు) సంబంధమున్న నైతికత మరియు దోషాలు,ధర్మబద్ధమైన మరియు అధర్మబద్ధమైన కర్మల పరస్పర ప్రభావం అను 11 అధ్యాయాలు ఇందులో ఉన్నాయి.



సనాతన ధర్మము

మొదటి భాగము

హిందూమతానికి సంబంధించిన ప్రాథమిక భావాలు

ప్రార్థన

ఓం

ఆచార్య తాడేపల్లి పతంజలి 02 -10 -25

మంగలం దిశతు నో వినాయకో
మంగలం దిశతు నః సరస్వతీ
మంగలం దిశతు నః సముద్రజా
మంగలం దిశతు నో మహేశ్వరీ ॥

వినాయకుడు మనకు అదృష్టాన్ని ప్రసాదించుగాక !
సరస్వతి మాకు అదృష్టాన్ని ప్రసాదించుగాక !
సముద్రపు కుమార్తె లక్ష్మీదేవి మాకు అదృష్టాన్ని ప్రసాదించుగాక !
మహేశ్వరీ దేవి (పార్వతీదేవి) మనందరికీ శుభాలను ప్రసాదించుగాక.

పరిచయం

సనాతనధర్మం అంటే శాశ్వతమైన మతం. ప్రాచీన ధర్మం. ఇది చాలా కాలం క్రితం మానవులకు ప్రసాదింపబడిన పవిత్ర గ్రంథాలయిన వేదాలపై ఆధారపడింది. ఈ మతాన్ని ఆర్య మతం అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఈమతం ప్రపంచంలోనే మొదటి జాతిగా లెక్కించే ఆర్య జాతికి చెందిన మతం; ఆర్య అంటే శ్రేష్ఠమైనది. ప్రపంచ చరిత్రలో అన్ని జాతులలోను పాత్ర మరియు ప్రదర్శనలో గొప్ప జాతిగా ఈ ఆర్యజాతి ప్రసిద్ధికెక్కింది. ఈ జాతికి చెందిన ప్రజల మొదటి కుటుంబాలు ఇప్పుడు భారతదేశంలోని ఉత్తర భాగంలో స్థిరపడ్డాయి. ఆర్యులు అందులో నివసించారు కనుక వారు మొదట స్థిరపడిన ఆ భాగానికి ఆర్యావర్తము అని పేరు పెట్టారు. “తూర్పు మహాసముద్రం నుండి పశ్చిమ మహాసముద్రం వరకు ఉన్న రెండు పర్వతాల మధ్య (హిమాలయాలు మరియు వింధ్యపర్వతాలు) ఉన్న భూమిని ఆర్యావర్తమని విజ్ఞులు పిలుస్తారు.”

తరువాతి రోజుల్లో ఈ మతాన్ని హిందూ మతం అని పిలిచేవారు. ఇది ఇప్పుడు

సాధారణంగా అందరూ పిలిచే పేరు.

ఈ హిందూ మతం ఇప్పుడు ఉనికిలో ఉన్న అన్ని మతాలలో పురాతనమైనది. ఏ ఇతర మతం ఇంత మంది గొప్ప వ్యక్తులను, గొప్ప గురువులను, గొప్ప రచయితలను, గొప్ప ఋషులను, గొప్ప సాధువులను, గొప్ప రాజులను, గొప్ప యోధులను, గొప్ప రాజనీతిజ్ఞులను, గొప్ప శ్రేయోభిలాషులను, గొప్ప దేశభక్తులను సృష్టించలేదు. మీరు ఈ హిందూమతంలోని ఈ గొప్పవ్యక్తుల గురించి ఎంత ఎక్కువగా తెలుసుకుంటే, మీరు ఆ మతాన్ని అంతగా గౌరవిస్తారు. ప్రేమిస్తారు. మీరు ఈ మతంలో జన్మించినందుకు కృతజ్ఞతతో ఉంటారు. కానీ మీరు దానికి తగినట్లుగా ఎదగకపోతే, ఈ గొప్పదైన, పవిత్రమైన హిందూ మతం మీకు ఏ మంచి చేయలేదు.

సనాతన ధర్మానికి ఆధారం

ఈ పురాతన మతం ఒక బలమైన పునాదిపై ఆధారపడింది. దాని గోడలు కూడా పునాదికి తగినట్లుగా నిర్మించబడ్డాయి.

సనాతనధర్మపు పునాది శ్రుతి. అనగా విన్నది; గోడలు స్మృతి, అనగా స్మరణము.

శ్రుతి (వేదము) మహర్షుల ద్వారా మనకు ఇవ్వబడింది. వారు దానిని విన్నారు. దైవము నుండి ఆ శ్రుతిని స్వీకరించారు; ఈ పవిత్రమైన వేదాలు ఆధునిక కాలం వరకు వ్రాయబడలేదు, కానీ హృదయపూర్వకంగా శిష్యులచే నేర్చుకోబడ్డాయి. మరియు నిరంతరం పునరావృతం (తిరిగి తిరిగి చదవటం) చేయబడ్డాయి.

గురువు ఆ వేదాలను విద్యార్థులు వాటిని క్షుణ్ణంగా తెలుసుకునే వరకు మరలా మరలా గానం చేసేవాడు. పూర్తిగా రావాలని అనుకొన్నప్పుడు వేద భాగాలను పదేపదే గురువు, శిష్యులు వల్లె వేసేవారు.

చాలా ప్రాచీన కాలంలో తమ పూర్వీకులు వేదాన్ని ఎలా నేర్చుకున్నారో శిష్యులు ఇప్పటికీ అదే విధంగా నేర్చుకుంటున్నారు. మరియు ప్రస్తుతం కూడా ఏదైనా వైదిక పాఠశాలలో పూర్వీకుల తరహాలో ఉన్న వేద పఠనాన్ని మీరు వినవచ్చు.

నాలుగు వేదాలుగా వేదము ప్రసిద్ధి పొందింది. వేదం అంటే జ్ఞానం, తెలిసినది; మతానికి పునాది అయిన జ్ఞానం మానవునికి నాలుగు వేదాలలో ఇవ్వబడింది.

నాలుగు వేదాల పేర్లు వరుసగా ఋగ్వేదం, సామవేదము, యజుర్వేదము; మరియు అథర్వవేదం.

ప్రతి వేదం మూడు భాగాలుగా విభజించబడింది:

1. మంత్రం; లేదా సంహిత (వర్ణసంయోగము; వేదమునందు కొంతభాగము)
2. బ్రాహ్మణం.
3. ఉపనిషత్.

మంత్రాలు లేదా వాక్యాలను – మంత్ర భాగం– కలిగి ఉంటుంది. వీటిలో శబ్దాలక్రమం నిర్దిష్ట శక్తిని కలిగి ఉంటుంది. కొన్ని ప్రభావాలను ఉత్పత్తి చేస్తుంది. ఇవి దేవతల స్తోత్రాల రూపంలో ఉన్నాయి. ఈ మంత్రాలకి మానవులతో ఉన్న సంబంధాలను మనం ప్రస్తుతం అధ్యయనం చేస్తాము. ఆ మంత్రాలను సరిగ్గా చదవగలిగిన వ్యక్తులు సరిగ్గా జపించినప్పుడు, కొన్ని ఫలితాలు వస్తాయి. ఇవి మతపరమైన ఆచారాలలో ఉపయోగించబడతాయి. మరియు ఆచారముయొక్క విలువ ప్రధానంగా మంత్రాలను సరిగా పదే పదే ఉచ్చరించటంపై ఆధారపడి ఉంటుంది.

వేదాలలోని బ్రాహ్మణ భాగం ఆచారాలు ఎలా పాటించాలో చెప్పే సూత్రాలను కలిగి ఉంటాయి. మొదటి భాగంలో పేర్కొన్న మంత్రాలతో కూడిన యజ్ఞతంత్రములను ఎలా నిర్వహించాలో వివరిస్తుంది; ఇంకా, వాటితో అనుసంధానించబడిన పురాణ గాథలను కూడా బ్రాహ్మణములు చెబుతాయి.

ఉపనిషత్ భాగం బ్రహ్మము (పరమాత్మ) యొక్క స్వభావంపై లోతైన తాత్విక బోధలను కలిగి ఉంది. పరమాత్మ నుండి వేరు చేయబడిన నేను గురించి, మనిషి, విశ్వం, బంధం, విముక్తి మొదలయిన అంశాలను ఉపనిషత్తులు వ్యాఖ్యానిస్తాయి. ఉపనిషత్తు అన్ని తత్వశాస్త్రముల యొక్క పునాది. ప్రస్తుతం చిన్న వయస్సులో ఉన్న మీరు కొంచెం వయస్సు పెరిగిన తరువాత ఉపనిషత్తులను అధ్యయనం చేసి వాటిలో ఆనందించవచ్చు. ఉన్నత విద్యావంతులైనవారు మాత్రమే ఉపనిషత్తులను చదువగలరు. ఇవి ఇతరులకు చాలా కష్టం.

పూర్వపు రోజుల్లో వేదంలో నాల్గవ భాగం కూడా ఉంది, కొన్నిసార్లు దీనిని ఉపవేదం లేదా తంత్రం అని పిలుస్తారు; ఈ ఉపవేదము సైన్స్ (శాస్త్రము, విద్య, విజ్ఞానము) మరియు సైన్స్ ఆధారంగా చేయబడిన ఆచరణాత్మక సూచనలను కలిగి

ఉంటుంది; కానీ ఈ రోజుల్లో ఉపవేదానికి సంబంధించిన పురాతన తంత్రం కొద్దిగా మాత్రమే మిగిలి ఉంది, ఎందుకంటే ఈరోజుల్లో ప్రజలు తక్కువ ఆధ్యాత్మికత కలిగి ఉన్నారు కనుక ఋషులు ఉపవేదాలలో తాంత్రికానికి సంబంధించిన అధిక భాగాలను తీసివేసారు. అయితే కొన్ని తాంత్రిక ఆచారాలు మాత్రం ప్రస్తుత వైదిక రూపాలతో పూజలలో ఉపయోగించబడుతున్నాయి. తంత్రాల పేరుతో ఇప్పుడు ప్రచారంలో ఉన్న పుస్తకాలను సాధారణంగా వేదంలో భాగంగా లెక్కించరు.

సర్వోన్నతమైన అధికార ప్రవృత్తి వేదములో కనిపిస్తుంది. సనాతన ధర్మమును సక్రమముగా పాటించేవారికి వేదము శిరోధార్యమైనది. అన్ని వర్గాలకు సంబంధించిన, అన్ని తాత్విక వ్యవస్థలకు సంబంధించిన, వివాదములను పరిష్కరించే తుది అధికార పీఠంగా వేదానికి పేరు ఉన్నది.

స్మృతిని ధర్మ శాస్త్రమంటారు. ఇది వేదము తరువాత అధికారము కలిగిన శాస్త్రము. ఈ స్మృతులలో వ్యక్తి, కుటుంబము, చట్టాలు నిబంధనలు మొదలయిన విషయాలు ఉంటాయి. దూరదృష్టి కలిగిన ఋషులచే వ్రాయబడిన నాలుగు గొప్ప రచనలు ఇవి. సామాజిక మరియు జాతీయ జీవితము వీటిలో ప్రధాన విషయాలు. హిందూ సమాజం ఈ స్మృతులలోని చట్టాల ఆధారంగా స్థాపించబడింది మరియు పాలించబడుతుంది.

స్మృతులు ఇవి –

1. మను స్మృతి లేదా మానవ ధర్మ శాస్త్రం (మనువు యొక్క నియమాలు)
2. యాజ్ఞవల్క్య స్మృతి.
3. శంఖ లిఖిత స్మృతి.
4. పరాశర స్మృతి.

వీటిలో మొదటిది ఆర్యుల చట్టం యొక్క ప్రధాన సంకలనంగా పేరుపొందింది. మనువు ఈ జాతికి గొప్ప ధర్మ (న్యాయ) నిర్ణేత. ప్రపంచ చరిత్రలో హిందువుల కాలక్రమాన్ని ఏడు గొప్ప దివ్యయుగాలుగా లేదా కాల చక్రాలుగా విభజిస్తారు. వీటిలో ప్రతి ఒక్కటి మనువుతో ప్రారంభమయి అతనితో ముగుస్తుంది. కాబట్టి ప్రతి దివ్యయుగాన్ని మన్వంతరము, (మను–అంతర "రెండు మనువుల మధ్య") అని పిలుస్తారు. (మన్వంతరమనగా డెబ్బదియొక్క దివ్యయుగములని బహుజనపల్లి

సీతారామాచార్యుల వారు శబ్దరత్నాకరములో పేర్కొన్నారు. 43,20,000 మానవ సంవత్సరాలను ఒక దివ్యయుగముగా చెబుతారు–)

"స్వాయంభువ మనువు సంతతికి చెందిన గొప్ప మనస్సుగల మరియు గొప్ప తేజస్సు గల మరో ఆరుగురు మునులు ఉన్నారు. వారు వరుసగా స్వారోచిషుడు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు, చాక్షుసుడు, వైవస్వతుడు. వీరు జీవులను ఉత్పత్తి చేసారు." అని ఒక శ్లోక భావం. ప్రతి మన్వంతరానికి ఇద్దరు మునులు ఉన్నారు. మనం నాల్గవ మన్వంతరంలో ఉన్నాము. ఏడవ మనువు పాలనలో ఉన్నాము. దాని తదుపరి శ్లోకం వివస్వతుని కుమారుడయిన కుమారుడైన వైవస్వతుని గురించి మనకు చెబుతుంది. అతను చేసిన కొన్ని చట్టాలు మనుస్మృతిలో ఇవ్వబడ్డాయి.

యాజ్ఞవల్క్యస్మృతి మనుస్మృతిలోని సాధారణ సూత్రాలను అనుసరిస్తుంది. మనుస్మృతి తరువాత యాజ్ఞవల్క్యస్మృతి ప్రాముఖ్యత కలిగి ఉంది. దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో మినహా మిగిలిన రెండు స్మృతులు (శంఖ లిఖిత స్మృతి, పరాశర స్మృతి). ఇప్పుడు ఎక్కువగా చదవటంలేదు. అలాగే పండితులచే సూచించబడటం లేదు.

సనాతనధర్మానికి పునాది మరియు గోడలుగా శ్రుతి మరియు స్మృతులు చెప్పబడ్డాయి. పురాణం, పురాణాలు మరియు ఇతిహాస, చరిత్రలు శ్రుతి మరియు స్మృతులకు దన్నుగోడగా నిలబడ్డాయి.

చరిత్రలు మరియు కథలు దృష్టాంతములను, అన్యవిషయ సూచనలను పురాణాలు కలిగి ఉంటాయి. దేశంలోని తక్కువగా విద్య నేర్చుకున్న వారికోసం, ముఖ్యంగా వేదాలను అధ్యయనం చేయలేని వారికోసం పురాణాలు రూపొందించ బడ్డాయి. పురాణాలలోని చరిత్రలు మరియు కథలు చదవడానికి చాలా ఆసక్తికరంగా ఉంటాయి మరియు అన్ని రకాల సమాచారాలతో నిండి ఉంటాయి. వీటిలోని కొన్ని దృష్టాంతములను అర్థం చేసుకోవడం కష్టం. అటువంటివాటి కోసం ఉపాధ్యాయుని సహాయం అవసరం.

ఇతిహాసములో రెండు గొప్ప కావ్యాలు ఉన్నాయి:

1. రామాయణం– ఇది దశరథ మహా రాజు కుమారుడైన శ్రీరామచంద్రుని చరిత్ర. అతని భార్య సీత మరియు అతని సోదరుల చరిత్ర. మీ అందరికీ తెలిసిన, అత్యంత ఆసక్తికరమైన మరియు సంతోషకరమైన కథ ఇది.

2. మహాభారతం– ఇది కురువంశీయుల చరిత్ర. ఉత్తర భారతదేశంలోని ఒక రాజకుటుంబం కౌరవులు మరియు పాండవులు అనే రెండు పక్షాలుగా విడిపోయింది, వీరి మధ్య గొప్ప యుద్ధం జరిగింది. మహాభారతం చాలా అందమైన కథలు, గొప్ప నైతిక బోధనలు మరియు అన్ని రకాల ఉపయోగకరమైన పాఠాలను కలిగి ఉంది.

రామాయణం మరియు మహాభారతమను ఈ రెండు పుస్తకాలు, ప్రాచీన భారతదేశం గురించి, ఆనాటి ప్రజలు మరియు ఆచారాల గురించి మరియు ఆనాటి జీవన విధానాలు, కళలు మరియు వస్తువుల తయారీ గురించి మనకు చాలా విషయాలను తెలియజేస్తాయి. ఇవి చదివితే, ఒకప్పుడు భారతదేశం ఎంత గొప్పగా ఉందో, మరోసారి గొప్పగా ఈ దేశాన్ని తయారు చేయడానికి ఎలా ప్రవర్తించాలో కూడా మీరు నేర్చుకుంటారు[1].

సనాతనధర్మము యొక్క విజ్ఞానము మరియు దర్శనము

శ్రుతి, స్మృతి, పురాణాలు మరియు ఇతిహాసాలు ఈ హిందూ మతం యొక్క దివ్య భవనాన్ని తయారు చేస్తున్నప్పుడు, ఈ మతం స్వయంగా విజ్ఞానము మరియు దర్శనము యొక్క అద్భుతమైన సాహిత్యపు అభివృద్ధిగా పరిణమించిందని మేము కనుగొన్నాము.

వేదవిజ్ఞానము ఉద్ధరింపబడి షడంగాలుగా విభజించబడింది, అక్షరాలా ఈ షడంగాలనునవి వేదము యొక్క శాఖలు; ఈ ఆరు అంగములు లేదా శాఖలు, ఇప్పుడు లౌకిక జ్ఞానం అని ఇప్పుడు పిలవబడే విద్యావైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. పాత రోజుల్లో మతపరమైన జ్ఞానంగా లౌకిక జ్ఞానంగా – జ్ఞానాన్ని విడగొట్టలేదు.

షడంగాలలో 1. శిక్ష, 2. వ్యాకరణము, 3. ఛందస్సు, 4. నిరుక్తము, 5. జ్యోతిషము, 6. కల్పము ఉన్నాయి. ఈ వేదానికి అంగాలయిన షడంగాలలో అరవై నాలుగు శాస్త్రాల కళలతో పాటు, అధ్యయనం చేయవలసిన పద్ధతులను చేర్చారు. అందువలన షడంగాలలో ప్రావీణ్యం పొందిన ఎవరైనా వైవిధ్యమైన మరియు లోతైన అభ్యాసం ఉన్న వ్యక్తిగా రూపొందుతాడు.

దర్శనాలలో ఆరు విభాగాలు ఉన్నాయి. 1. న్యాయము, 2. వైశేషికము, 3. వేదాంతము, 4. మీమాంస, 5. సాంఖ్యము, 6. యోగము అను షడ్దర్శనములు

(ఆరు దర్శనాలు) జ్ఞానాన్ని దర్శింపచేసే మార్గాలు. సాధారణంగా షడ్దర్శనాలుగా వీటిని పిలుస్తారు. వీటన్నింటికీ ఒక లక్ష్యముంది. వేరు చేయబడిన మానవుల ఆత్మను తిరిగి పరమాత్మతో ఏకమయ్యేటట్లు చేసి, జన్మల బాధను అంతం చేయడం వీటి లక్ష్యం.

మరియు ఈదర్శనాలన్నింటికి జ్ఞాన వివేకములను అభివృద్ధి చేయాలనే ఒక పద్ధతి అంతస్సూత్రంగా ఉంది. విభిన్న మానసిక స్వభావాలకు అనుగుణంగా ఉంటూ ఈ దర్శనాలను ఉపయోగించే మార్గాలు భిన్నంగా ఉంటాయి. అందువల్ల అవి వేర్వేరు రహదారుల వలె కనిపిస్తాయి కానీ ఇవి అన్నీ ఒకే పట్టణము చేరటానికి ఉన్న రహదారులు.

ఈ ఆరువిధాలయిన దర్శనాలలో ఏమి ఉందో తెలుసుకోవటానికి, ప్రాథమిక స్థాయిలోనివారికి చెప్పబోయేది చదివితే సరిపోతుంది;

ఆరుదర్శనాలలోని న్యాయ మరియు వైశేషిక దర్శనాలు ప్రపంచంలోని అన్ని వస్తువులను నిర్దిష్ట సంఖ్యలో రకరకాలుగా అమర్చాయి. ఒక వ్యక్తి తన ఇంద్రియాల ద్వారా, అనుమితి (అనుమానమునందు అనుభవభేదము) మరియు సారూప్యత (సమానరూపత్వము.) కలిగి ఉండటం ద్వారా లేదా ఇతర అనుభవజ్ఞులైన పురుషుల సాక్ష్యం ద్వారా అన్ని విషయాలను తెలుసుకుంటాడని ఈ దర్శనాలు సూచించాయి. మరియు దేవుడు ఈ భౌతిక ప్రపంచాన్ని పరమాణువులు మరియు అణువులతో ఎలా సృష్టించాడో ఈ దర్శనాలు వివరిస్తాయి; చివరిగా ఈ దర్శనాలు మానవుని అంతర్యామి అయిన భగవంతుని గురించిన జ్ఞానమే అత్యున్నతమైన మరియు అత్యంత ఉపయోగకరమైన జ్ఞానమని చెబుతాయి. మరియు ఈ జ్ఞానాన్ని వివిధ మార్గాల్లో ఎలా పొందవచ్చో ఈ దర్శనాలు వివరిస్తాయి.

పురుషుడు, ఆత్మ మరియు ప్రకృతి యొక్క స్వభావం, పదార్థం – వీటిలో ఒకదానికి ఇంకొకటితో ఉన్న సంబంధాన్ని వివరంగా కొత్త మార్గాలలో షడ్దర్శనాలలో ఒకటయిన సాంఖ్యము (యోగవిశేషము) వివరిస్తుంది.

యోగమనగా ఇంద్రియములను వశపఱచుకొని చిత్తము ఈశ్వరునియందు లయింపజేయుట. ఇప్పుడు సాధారణంగా మనందరికి ఐదు జ్ఞానేంద్రియాలు, (చర్మం, కన్ను, ముక్కు, చెవి, నాలుక.) ఐదు కర్మేంద్రియాలు (నోరు, చేయి, పాదం,

మలద్వారం, జననేంద్రియము.) తెలుసు. అయితే అంతగా తెలియని ఇతర సూక్ష్మమైన ఇంద్రియాలు మరియు అవయవాలు కూడా మన శరీరంలో ఉన్నాయి. వాటిచేత ఆత్మ సాక్షాత్కారం కోరే మానవులు ఎలా సఫలత్వం పొందవచ్చో యోగము పూర్తిగా వివరిస్తుంది.

మతపరమైన మరియు ప్రాపంచికమైన కర్మ అంటే ఏమిటి? మరియు కర్మ యొక్క పర్యవసానాలు, కారణాలు మరియు ప్రభావాలు ఏమిటి? కర్మ మనిషిని ఈ జన్మలో లేదా మరొక జన్మలో ఎలా బంధిస్తుందో మీమాంస వివరిస్తుంది.

వేదాంతము పూర్తిగా చదవటంద్వారా భగవంతుడు లేదా ఆత్మ యొక్క ఖచ్చితమైన మరియు నిజమైన స్వభావమేమిటో చివరకు తెలుస్తుంది. మరియు మనిషి యొక్క జీవాంశ ఆత్మలో ఉందని వేదాంతం నిరూపిస్తుంది. కర్మ తనని బంధించకుండా మనిషి ఎలా జీవించగలడో వేదాంతం వివరిస్తుంది. చివరగా, ఈ ప్రపంచం అంతా భగవంతుని నుండి బయటకు వచ్చి కనిపించి అదృశ్యమవుతున్నదని చెబుతుంది. అది భగవంతుని యొక్క మాయాశక్తి అని చెబుతుంది. ఆ మాయాశక్తి అంటే ఏమిటో అర్థం చేసుకొని, యోగ సాధన తర్వాత జీవుడు తనను తాను ఎలా విలీనం చేసుకొంటాడో, భగవంతునితో ఎలా ఏకమవుతాడో మోక్షాన్నిఎలా పొందగలడో వేదాంతము చెబుతుంది.

సూచికలు

1. వీటి సారాంశాలు అనిబిసెంట్ ద్వారా సిహెచ్ కళాశాలలో ఉపన్యాసాలుగా ఇవ్వబడ్డాయి. మరియు “మహాయుద్ధపు కథ మరియు శ్రీరామచంద్ర” అనే పేరుతో ప్రచురించబడ్డాయి.

అధ్యాయం 1

ఒక ఉనికి

ఒక అనంతమైన శాశ్వతమైన, మార్పులేని ఉనికి ఒకటి ఉన్నది. దాని నుండి అన్నీ బయటకు వస్తాయి; అన్ని తిరిగి దానిలో లీనమవుతాయి. "ఉన్నది ఒకటే . రెండవది లేదు."[1]

దానిలో ఎప్పుడూ ఉన్నవి, ఉండబోయేవి మరియు ఉండగలిగేవన్నీ ఉంటాయి. సముద్రంలో కెరటం ఎగిసిపడినప్పుడు, సర్వ లోకంలో ఒక విశ్వం ఉదయిస్తుంది. అల మళ్లీ సముద్రంలోకి మునిగిపోయినట్లుగా, ఒక విశ్వం మళ్లీ అన్నింటిలో మునిగిపోతుంది. సముద్రమంటే నీరు. అలాగే సముద్ర తరంగం నీటి యొక్క రూపం లేదా అభివ్యక్తి. అలాగే ఉనికి ఒకటే ఉన్నది. ఈ విశ్వం ఉనికి యొక్క ఒక రూపం లేదా అభివ్యక్తి. "ఇదంతా నిజంగా బ్రహ్మమే."[2]

ఇది మతం యొక్క ప్రాథమిక సత్యం. మానవులు ఈ బ్రహ్మమునకు రక రకాల పేర్లను పెట్టారు. సనాతన ధర్మంలోని దీనికి పేరు మాత్రం ఒకటే ఒకటి. అదే "బ్రహ్మం".

ఆంగ్లం మాట్లాడే వ్యక్తులు సర్వానికి మూలమైన శక్తిని తన స్వంత స్వభావంలో, స్పష్టంగా అర్థం చేసుకోవడానికి వీలుగా భగవంతుడు (GOD) అనే పేరును ఉపయోగిస్తారు. కొన్నిసార్లు హిందువులు సమస్తమైన దైవ స్వరూపాన్ని నిర్గుణ బ్రహ్మంగా, గుణాలు లేని బ్రహ్మంగా లేదా నియమాలకు అతీతమైన బ్రహ్మంగా పేర్కొంటారు.

సర్వమైన బ్రహ్మంగా వ్యక్తీకరించబడిన స్థితి నుండి అతనిని వేరు చేసే విధానంలో నిర్గుణ బ్రహ్మమని పిలుస్తారు. విశ్వంతో కూడిన సర్వాధికారియయిన బ్రహ్మమును సగుణ బ్రహ్మమని, లేదా వ్యవస్థిత బ్రహ్మమని పిలుస్తారు.

సగుణ, నిర్గుణ బ్రహ్మములను "బ్రహ్మము యొక్క రెండు స్థితులు" గా బృహదారణ్యకోపనిషత్తు చెప్పింది.[3] ఈ విషయం అర్థం చేసుకోవటం చాలా కష్టం. బాలుడు (విద్యార్థి) సగుణ బ్రహ్మమును అర్థం చేసుకొంటే సరిపోతుంది. బ్రహ్మము అద్వితీయుడు. రెండవది లేనివాడు, బ్రహ్మమొక్కటే. ఆలోచన మరియు ఆనందం యొక్క ప్రభువుగా బ్రహ్మము ప్రకాశిస్తాడు.

బ్రహ్మమే స్వయంభువు. అన్ని జీవులకు మూలాధారమైనవాడు మరియు కారణమయినవాడు. ఆయనను కొన్నిసార్లు పురుషోత్తముడని, పరబ్రహ్మ అని, పరమాత్మ అని కూడా పిలుస్తారు.

ఆ పరమాత్మ (బ్రహ్మము) తననుతాను మూలప్రకృతిగా (మాయగా) లోకానికి వెల్లడిస్తాడు. మూలప్రకృతి అన్నింటికి మూలం. ఇది లోక రూపాన్ని తీసుకుంటుంది. ఇది అన్ని రకాల ఆకారాలు మరియు అన్ని రకాల శరీరాలను ఇవ్వగలదు; తాకడం, రుచి చూడడం, వాసన చూడడం, చూడడం మరియు వినడం వంటివన్నీ ఈ మూల ప్రకృతి శక్తితోనే జరుగుతుంది. ఈ మూలప్రకృతి మన ఐదు ఇంద్రియాలు గ్రహించగలిగే స్థాయిలో లేదు. రసాయన శాస్త్రవేత్తకు సంబంధించిన ఘనపదార్థాలు, ద్రవాలు మరియు వాయువులు పదార్థంతో తయారు చేయబడ్డాయి; మన చుట్టూ ఉన్న వస్తువులు, రాళ్ళు, చెట్లు, జంతువులు, మనుషులు అన్నీ పదార్థాలతోనే తయారయ్యాయి. అయితే అవన్నీ లోక వ్యవహారంలో ఉన్న పదార్థం కాదు; వీటిలోని పదార్థమనేది వినబడని, కనిపించని, వాసన పడని, స్థిరంగా లేని, కనిపించని, ఈశ్వరుని ఆత్మ. అది ఈశ్వరుని యొక్క అంశ.

మనం ఈశ్వరునికి సంబంధించిన ఈ పదార్థ భాగాన్ని శరీరమని పిలుస్తాము; లేదా కోశం[4] లేదా ఒక ఉపాధి, సాధనం; ఈ శరీరంపైకి వస్త్రాలతో కనిపిస్తుంటుంది. ఇది ఆత్మను మోసుకొస్తుంది.

ఈ విధంగా ఈశ్వరుడు ప్రతిశరీరంలో ఉన్నాడు. అతను అన్నిటికి జీవాన్ని ఇస్తాడు. అతనే "ఆత్మ". అతనే "నేను." అతడు శాశ్వతమైనవాడు. అతడు అంతరాత్మ పాలకుడు. అతడు అన్నింటిలో నివసిస్తాడు. మరియు అతను లేకుండా ఈ ప్రపంచంలో ఏదీ లేదు.

జీవమున్న ఈ శరీరంలో దేవుని యొక్క అంశను జీవుడు లేదా జీవాత్మ, వేరు చేయబడిన ఆత్మ అంటారు.

ఆత్మ మరియు శరీరము మధ్య చాలా ముఖ్యమైన తేడాలు ఉన్నాయి. వాటిలో కొన్ని తేడాలను ఇప్పుడే పైన చెప్పాము: ఇంద్రియాలు, పూర్తిగా అభివృద్ధి చెందినప్పుడు, శరీర తత్వాన్ని గ్రహిస్తాయి. కాని అవి ఆత్మను గ్రహించలేవు. ఆత్మ నిరాకారమైన శరీర రూపాన్ని తీసుకుంటుంది.

ఆత్మయే మన జీవితం. మనలో ప్రతి ఒక్కరిలో "నేను" అని రూపంలో ఉన్న ఆత్మ ఆలోచిస్తుంది. అనుభూతి చెందుతుంది మరియు గమనిస్తుంటుంది. ప్రతి ఒక్కరిలో మరియు ప్రతిదానిలో ఉన్న ఆత్మ ఒక్కటే.

కానీ పదార్థం (ఆత్మలేని శరీరం) ఆలోచించదు, లేదా అనుభూతి చెందదు లేదా గమనించదు; అది స్పృహ లేని జడం. మరియు అది నిరంతరం అనేక రూపాలుగా విభజించబడుతూ మరియు అనేకంగా మారే ధోరణిని కలిగి ఉంటుంది. కాబట్టి ఆత్మ మరియు పదార్థం ఒకదానికొకటి వ్యతిరేకమైనవిగా చెప్పబడ్డాయి; ఆత్మను తెలిసినవాడు, తెలిసినవాడు అని పిలుస్తారు, పదార్థాన్ని తెలుసుకోగల వస్తువు అని పిలుస్తారు.

విద్యార్థులు ఈ వ్యత్యాసాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఆత్మ మరియు పదార్థముల మధ్య ఎప్పుడూ తికమకపడకూడదు; అవి విరుద్ధమైనవి. "వ్యతిరేకజంట" వంటివి. వీటితోనే విశ్వం నిర్మించబడింది.

ఆత్మకు సత్ (శాశ్వతం), చిత్ (జ్ఞానం), ఆనందం అనే మూడు గుణాలు ఉన్నట్లే, పదార్థానికి కూడా తమః, రజః, సత్వం(-జడత్వం, చలనం, జ్ఞానం లేదా మంచితనం) అనే మూడు గుణాలున్నాయి. జడత్వం ఈ శరీర పదార్థానికి ప్రతిఘటన మరియు స్థిరత్వాన్ని ఇస్తుంది; చలనం శరీర పదార్థాన్ని చురుకుగా ఉంచుతుంది, కదిలిస్తుంది; జ్ఞానంలేదా మంచితనం అను అర్థాలు కలిగిన సత్వ గుణం జీవన కదలికలను సక్రమంగా చేస్తుంది. మీరు ఇలా అనవచ్చు: "రాయి తనంతట తానుగా కదలదు." కానీ మీరు చూడలేనంత చిన్నగా ఉన్న ఆ రాతి కణాలలోని ప్రతి కణం శాస్త్రీయ పరిభాషలో అర్థం చేసుకొనటానికి వీలుగా వేగంగా మరియు క్రమంగా అటూ ఇటూ కదులుతుందని, కంపిస్తున్నదని శాస్త్రం (సైన్స్) మీకు చెబుతోంది.

శక్తి, లేదా ఈశ్వరుని యొక్క దైవిక శక్తి- పదార్థము ఒక రూపాన్ని పొందడం ప్రారంభించేలా చేస్తుంది. దీనిని మాయ అని పిలుస్తారు. మరియు కొన్నిసార్లు దైవీ ప్రకృతి లేదా దైవిక ప్రకృతి అని పిలుస్తారు. శ్రీ కృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునా, నాకు ఒక ఉన్నతమైన శక్తి ఉంది. అదే జీవ-ఆత్మ శక్తి, ఇది ఈ జగత్తులో ఉన్న జీవరాశులకు మూలాధారమైన జీవాత్మలను కలిగి ఉంటుంది."[5]

విద్యార్థి, ఈశ్వరుడు మరియు మూలప్రకృతి అనే ఈ గొప్ప జంటకు ముఖాముఖిగా నిలబడి, ఈశ్వరుని యొక్క దివ్యశక్తి మూలప్రకృతిపై ఎలా

ప్రకాశిస్తున్నది? గుణాలు ఒకదానిపై ఒకటి ఎలా ప్రవర్తిస్తాయి? అను విషయాలను ఆలోచించవచ్చు. దైవిక శక్తితో రూపాలు కనిపించడం ప్రారంభిస్తాయి. ఈ దైవిక శక్తి మాయ. కాబట్టి ఈశ్వరుడు మాయ యొక్క ప్రభువు అని పిలువబడ్డాడు.

యువ విద్యార్థులు కూడా ఈ పేర్లను అర్థాలతో గుర్తుంచుకోవడానికి ప్రయత్నించాలి. ఇవి అర్థం కాకపోతే ప్రతి హిందూ బాలుడు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించవలసిన భగవద్గీత బోధనను అర్థం చేసుకోలేరు. మూలప్రకృతికి బదులుగా ప్రకృతి అనే పదాన్ని సాధారణంగా వాడతారు. మూల అనునది ఉపసర్గ . సాధారణంగా ఈ ఉపసర్గని వదిలి "ప్రకృతి" అని పలుకుతుంటారు.

జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వామృతమశ్నుతే ।
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥

ఏది తప్పకుండా తెలుసుకోవాలో, నీకు దానిని ఇప్పుడు నేను తెలియచేస్తాను, అది తెలుసుకున్న తరువాత, వ్యక్తి అమరత్వం పొందుతాడు. అది, సత్, అసత్ లకు అతీతముగా ఉండే ఆదిరహితమయిన బ్రహ్మము.

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్ ॥
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥

అన్నిచోట్ల ఆయన పాదములు, కన్నులు, శిరస్సులు మరియు ముఖములు ఉన్నాయి. ఆయన చెవులు కూడా అన్ని ప్రదేశాలలో ఉన్నాయి, ఎందుకంటే ఆయన ఈ జగత్తు అంతా నిండి ఉన్నాడు.

సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥

ఇంద్రియ వస్తువిషయములను అన్నింటినీ ఆయన తెలుసుకొనగలిగినా, ఆయన ఇంద్రియ రహితుడు. ఆయనకు దేనిపట్ల కూడా మమకారానుబంధము లేదు, అయినా ఆయనే సమస్త జగత్తును భరించి అన్నింటిని రక్షించి పోషించేవాడు. ఆయన నిర్గుణుడు అయినా, గుణములను అనుభవించువాడు.

బహిరంతశ్చ భూతానామ్ అచరం చరమేవ చ ।
సూక్ష్మత్వాత్ తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్ ॥

కదిలే కదలని అన్ని జీవులలోను బయట మరియు లోపల భగవంతుడు ఉన్నాడు. ఆయన సూక్ష్మమైనవాడు, అందువల్ల ఆయనను మనం అర్థం చేసుకోవటానికి శక్యము కానివాడు. చాలా దూరంలో ఉన్నాడు అలాగే చాలా దగ్గరగా కూడా ఉన్నాడు.

అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।
భూతభర్తృ చ తద్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥

ఆయన విభజించుటకు వీలులేని వాడయినప్పటికీ సర్వప్రాణులలో వేర్వేరుగా కనిపిస్తూ ఉంటాడు. ఆ పరమేశ్వరుడే, సమస్త భూతములకు (ప్రాణులకు) రక్షకుడు–పోషకుడు. ప్రళయ కారకుడు మరియు సృష్టికర్త అని తెలుసుకో.

జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥[6]

అన్ని తేజోమయవస్తువుల్లో ఉన్న ప్రకాశానికి ఆయనే మూలము. అజ్ఞానపు చీకటికి (మాయకు) అతీతుడు. జ్ఞానము ఆయనే. జ్ఞాన విషయము ఆయనే. మరియు జ్ఞాన లక్ష్యము ఆయనే. ఆయన ప్రాణులందరి హృదయములలో ఉంటాడు.

మను స్మృతిలో సృష్టి క్రమాన్ని వివరిస్తూ మనువు ఇలా అన్నాడు.

ఆసీదిదం తమోభూతమప్రజ్ఞాతమలక్షణం ।
అప్రతర్క్యమవిజ్ఞేయం ప్రసుప్త మివ సర్వతః ॥

ప్రళయము తరువాత ఈ ప్రపంచమంతా తమోమయమై, గుర్తించుటకు వీలులేనిస్థితిలో నిద్రాణమైనట్లు (నిద్రమత్తులో) ఉన్నది.

తతః స్వయంభూర్భగవానవ్యక్తో వ్యంజయన్నిదం ।
మహాభూతాది వృత్తేజాః ప్రాదురాసీ త్తమోనుదః ॥

ఆ పరమాత్మ మనస్సునకు మాత్రమే కనిపిస్తాడు. అతడు సూక్ష్మరూపుడు, వ్యక్తము కానివాడు, సనాతనుడు అచింత్యుడు. అట్టి భగవంతుడు తనకు తానే స్వయంగా ఆవిర్భవించాడు.

యోఽసావతీంద్రియగ్రాహ్యః సూక్ష్మ వ్యక్త స్సనాతనః ।
సర్వభూతమయోః చింత్యః స ఏవ స్వయముద్బభౌ ॥[7]

ఆ ప్రళయము తరువాత ఇంద్రియాలకు కనిపించనివాడు, స్వయముగా తెలియబడే వాడయిన ఆ భగవంతుడు ప్రపంచమందలి చీకట్లను తొలిగిస్తూ, ఆకాశము మొదలగు

పంచమహాభూతములు మొదలగువాటిని సృష్టిచేయదలచి తనంతట తానే ప్రత్యక్షమయ్యాడు.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥[8]

ఓ అర్జునా, నేను సర్వ భూతముల హృదయములలో కూర్చుని ఉన్నాను. నేనే సర్వ ప్రాణుల ఆది, మధ్యము మరియు అంత్యము.(మొదలు, మధ్య,చివర)

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽ క్షర ఉచ్యతే ॥

సృష్టిలో రెండు రకాల ప్రాణులు ఉన్నాయి, క్షరములు (నశించేవి) మరియు అక్షరములు (నశించనివి). భౌతిక జగత్తులో (పంచభూతములకు సంబంధించిన ఈ ప్రపంచములో) ఉన్నవి క్షరములు. అక్షరములు అంటే మోక్షము పొందిన జీవులు.

ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥

నాశరహితుడయిన పరమాత్మయైన అన్నిటికంటె, అందరికంటె గొప్పవాడయిన దివ్య పురుషుడు ఇంకొకడు ఉన్నాడు. ఆయన నాశనములేని ఈశ్వరునిగా ముల్లోకములలో ప్రవేశించి, సమస్త ప్రాణులను పోషిస్తూ ఉంటాడు.

యస్మాత్ క్షరమతీతోఽ హమక్షరాదపి చోత్తమః ।
అతోఽ స్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥[9]

నేను నాశనమగునట్టి ఈ భౌతిక పదార్థముకంటె, మరియు నాశరహితమైన జీవాత్మ కంటె కూడా అతీతమైనవాడను. కాబట్టి వేదములలో నేనే అన్నిటికంటె, అందరికంటె గొప్పవాడయిన దివ్యపురుషునిగా కీర్తింపబడ్డాను.

మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః ।
మనః షష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥[10]

అన్ని ప్రాణుల దేహములలో ఉన్న సనాతమైన జీవాత్మ నా అంశయే. అది (ఆ అంశ) ప్రకృతిలో ఉన్న మనస్సును, ఐదు ఇంద్రియాలను శబ్దము మొదలయిన విషయముల ద్వారా తనవైపు ఆకర్షిస్తుంది.

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥

ఎవడు నశిస్తున్న ఈ సమస్త ప్రాణులలో నాశనము లేక, అన్నింటిలోను సమముగా ఉన్న పరమాత్మను చూస్తాడో అతడే, నిజముగా చూసినవాడు.

యదా భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి ।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥

వేర్వేరుగా కనబడుతున్న జీవరాశులన్నీ ఒకే భగవంతునిలో ఉన్నట్టుగా భావించి, మరియు జీవరాశులన్నీ ఆ భగవంతునినుండే విస్తరించాయని తెలుసుకొన్నవాడు బ్రహ్మను పొందుతాడు. (అనగా తానే బ్రహ్మమవుతాడని భావము).

యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥ [11]

ఓ అర్జునా! ఎలాగైతే ఒక్క సూర్యుడే సమస్త ప్రపంచాన్ని ప్రకాశింపచేయునో, అలాగే ఒక్క ఆత్మయే అన్ని ప్రాణులలో ఉండి వాటిని చైతన్యముతో ప్రకాశింపచేయును.

భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥

అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥[12]

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి మరియు అహంకారము – అని నా ప్రకృతి ఎనిమిది విధములుగా ఉన్నది. (దీనిని అపరా ప్రకృతి లేక జడ ప్రకృతి అంటారు)

ఓ గొప్ప బాహువులు కలవాడా ! ఈ అపరా ప్రకృతికి అతీతంగా, నాకు మరొక ఉన్నతమైన శక్తి ఉంది. అదే జీవాత్మ శక్తి. (పరాప్రకృతి) ఇది ఈ ప్రపంచంలో ఉన్న జీవరాశులన్నింటికి మూలాధారమైన జీవాత్మలను కలిగి ఉంటుంది.

సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।
నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥[13]

ఓ మహా బాహువులు కల అర్జునా! ప్రకృతినుండి సత్త్వ గుణము, రజో గుణము, మరియు తమో గుణములు పుట్టుచున్నవి. ఈ గుణములే నాశనములేని నిత్య జీవాత్మను నాశనమయ్యే దేహానికి బంధిస్తాయి.

సూచికలు

1. ఛాందోగ్యోపనిషత్ ఆరవ అధ్యాయము. రెండవ ఖండము ఒకటవ మంత్రం "ఏకమేవాద్వితీయమ్".
2. అందుండియే, మూడవ అధ్యాయము. పదునాలుగవ ఖండము ఒకటవ మంత్రం "సర్వం ఖల్విదంబ్రహ్మ".
3. బృహదారణ్యకోపనిషత్తు రెండవ అధ్యాయము. మూడవ ఖండము ఒకటవమంత్రం.
4. కోషమని కూడా ఉచ్చారణ చేస్తారు.
5. భగవద్గీత 07వ అధ్యాయము, 05వ శ్లోకం.
6. భగవద్గీత 13 వ అధ్యాయము-12వ శ్లోకం నుండి 17వ శ్లోకం వరకు.
7. మనుస్మృతి- 01 వ అధ్యాయము 05, 06.07 శ్లోకాలు.
8. భగవద్గీత 10 వ అధ్యాయము-20వ శ్లోకం.
9. అందుండియే, 15 వ అధ్యాయము -16.
10. అందుండియే, 15 వ అధ్యాయము -17.
11. అందుండియే, 13 వ అధ్యాయము -27,30,33 శ్లోకాలు.
12. అందుండియే, 07 వ అధ్యాయము -04,05 శ్లోకాలు.
13. అందుండియే, 14 వ అధ్యాయము -05 శ్లోకం.

అధ్యాయం 2
అనేకత్వం

ఈశ్వరుడు ప్రకృతిని ప్రకాశింపజేసి, దానిని ఆకారాలుగా మార్చినప్పుడు, మొదట కనిపించే రూపాలు త్రిమూర్తులు. ఇవి ఈశ్వరుని యొక్క మూడు కోణాలు. ఇవి బ్రహ్మాండము అనిపిలువబడే విశ్వము లేదా ప్రపంచాల క్రమబద్ధమైన వ్యవస్థను కలిగించడానికి వ్యక్తమవుతాయి. (బ్రహ్మాండము అనగా బ్రహ్మయొక్క అండము వంటిది అని అర్థం.) లోకాలను సృష్టించే ఈశ్వరుని అంశకు బ్రహ్మ అని పేరు; బ్రహ్మ సృష్టికర్త. లోకాలను సంరక్షిస్తూ మరియు నిర్వహించే ఈశ్వరాంశకు విష్ణువు అని పేరు;

విష్ణువు సంరక్షకుడు. శివుడు లోకాలను కరిగించేవాడు. లోకాలు చెడిపోయినప్పుడు మరియు తదుపరి ఉపయోగం లేనప్పుడు భగవానుడు లోకాలను నాశనం చేస్తాడు. తనలో విలీనం చేసుకొంటాడు. ఇలా చేసే దైవాంశకు శివుడు లేదా మహాదేవుడు అని పేరు పెట్టారు; ఈ త్రిమూర్తులు ఈశ్వరుని యొక్క మొదటి వ్యక్తీకరణలు. అతని సర్వోన్నత రూపాలు. ఒకే సగుణ బ్రహ్మము లేదా పరమ ఈశ్వరుడు, మూడుగా త్రిమూర్తులుగా కనిపిస్తాడు. (సత్వరజస్తమోగుణాలతో కూడినది సగుణ బ్రహ్మమని అర్థం. నామరూపక్రియా రూపంలో ఆత్మచైతన్యం ప్రకాశిస్తే అది సగుణం.)

సృష్టికర్త అయిన బ్రహ్మ పదార్థాన్ని ఏడు మూల తత్వాలుగా మలిచాడు.[1] మేము మహత్-బుద్ధి(స్వచ్ఛమైన కారణం), మరియు అహంకారము, (విభజన సూత్రం) అను పేర్లతో మొదటి రెండు పేర్లను పిలుస్తున్నాము. మూల ప్రకృతినుండి మహత్తత్త్వము, దానినుండి అహంకారము పుడతాయి. లోకములో ఒక వస్తువును చూచి నిశ్చయించిన పిదప "నేనీ పనిని చేయాలి. నేనీ పనిని చేయగలను. ఈ వస్తువులు నాకొఱకు ఏర్పడినవి, నాకన్న మఱియొకడీ పనిని చేయరాదు. కనుక నేనే చేయుదును." అను ప్రత్యేకముగా చూపించు అభిమానమే అహంకారము. దీనినుండియే ఇంద్రియాలు తరువాత అయిదు మహాభూతములును పుట్టుచున్నవి. అవి వరుసగా 1. ఆకాశము, 2.వాయువు, 3.అగ్ని, 4. నీరు 5. భూమి. దీన్నే భూతాది (ధాతువుల) సృష్టి అంటారు. ఈ తత్వాలలో ప్రధానంగా కూర్చబడిన

విషయాలు జీవాత్మ లేకపోతే నిస్తేజంగా మరియు జడముగా ఉంటాయి. జీవాత్మ మనకు కనబడేటట్లుగా తన శక్తులను చూపించదు. ఇంద్రియాల పూతగా దాని శక్తి ఉంటుంది.

భూతాల తర్వాత, పది ఇంద్రియాలు సృష్టించబడ్డాయి; ఇవి మొదట బ్రహ్మ మనస్సులోని ఆలోచనలు మాత్రమే. మరియు తరువాత ఇవి తన్మాత్రలను ధరించాయి; ఈ తన్మాత్రలు ఇంద్రియాల యొక్క ఐదు కేంద్రాలయిన వాసన, రుచి, దృష్టి, స్పర్శ, వినికిడి కలిగి ఉంటాయి. తత్ – మాత్ర. తత్ అంటే పరబ్రహ్మం. మాత్రం అంటే కొలమానం. బ్రహ్మన్ని తెలుసుకొనడానికి ఉపయోగపడే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు కలసి పంచతన్మాత్రలు. ఇవి చెవి, చర్మం, కన్ను, నోరు, ముక్కు అనే జ్ఞానేంద్రియాలతో తెలుసుకొనదగినవి. ఈ ఇంద్రియాలలో తమోగుణం కంటే రజోగుణం మరియు సత్వగుణం ఎక్కువగా ఉంటాయి. కాబట్టి అవి చాలా చురుకుగా ఉంటాయి. మరియు అంతర్గత జీవాత్మ వీటిలో తన శక్తులను ఎక్కువగా చూపుతుంది.

ఇంద్రియాల సృష్టి తరువాత, బ్రహ్మ తన మనస్సులో ఇంద్రియాలతో అనుసంధానించబడిన దేవతలను సృష్టించాడు. మరియు కొన్నిసార్లు ఆరవ ఇంద్రియము అని పిలిచే మనస్సును సృష్టించాడు. మొదటి ఐదు ఇంద్రియాలను చెప్పినప్పుడు మనస్సు పదవది. పది ఇంద్రియాల ప్రసక్తి వచ్చినప్పుడు (చర్మం, కన్ను, చెవి, నాలుక, ఘ్రాణం అనే అయిదు జ్ఞానేంద్రియాలు. వాక్కు, చేయి, పాదం, మల ద్వారం, జననేంద్రియం అనే అయిదు కర్మేంద్రియాలు) మనస్సు పదకొండవది. ఈ మనస్సు బయటి ప్రపంచం నుండి ఇంద్రియాలు సేకరించిన అన్ని అనుభూతులను తనలోకి తీసుకుంటుంది. ఏ విధంగా ప్రవర్తించాలో ఇది ఏర్పాటు చేస్తుంది. ఆలోచిస్తుంది. ఈ దేవసంబంధమయిన ఇంద్రియాలలో మరియు మనస్సులలో తమో గుణము రజోగుణము కంటే సత్వగుణము ఎక్కువ.

ఈ గుణాలు ఎప్పటికీ వేరు చేయబడవని విద్యార్థి గుర్తుంచుకోవాలి, అయితే ఏదైనా నిర్దిష్టజీవిలో ఒక గుణము మరొకదాని కంటే ఎక్కువగా ప్రబలంగా ఉండవచ్చు. తమో–గుణ ఆధిపత్యం ఉన్నప్పుడు జీవిని తామసి అంటారు; రజో–గుణ ఆధిపత్యం ఉన్నప్పుడు, జీవిని రాజసికుడు అంటారు; సత్వగుణం ఆధిపత్యం వహించినప్పుడు, జీవిని సాత్వికుడంటారు. సాత్విక, రాజసిక మరియు తామసిక అనే ఈ మూడు గుణాల క్రింద అన్ని విషయాలను విభజించవచ్చు. [2]

బ్రహ్మదేవుడు తన మనస్సులో దేవతలను సృష్టించాడు. వారు ఈశ్వరుని నియమాలను అమలు చేస్తారు. అన్ని లోకాల యొక్క సరైన నిర్వహణను చూస్తారు. ఈశ్వరుడు రాజు. ఒకేఒకే ప్రభువు. దేవతలు అతని మంత్రులు. భూలోకములోని రాజు యొక్క మంత్రులు మరియు అధికారుల వలె ఈశ్వరునికి దేవతలు మంత్రులు. విద్యార్థులు దేవతలను సర్వోన్నతమైన ఈశ్వరునితో, బ్రహ్మముతో పోల్చి ఎప్పుడూ తికమకపడకూడదు. దేవతలు బ్రహ్మాండానికి (భూగోళ ఖగోళాదికము, అందలి లోకములు.) సంబంధించిన ఈశ్వరుని యొక్క ఉన్నత అధికారులు. మనమందరం ఈ ఒక నిర్దిష్ట ప్రపంచానికి ఈశ్వరునికి సంబంధించిన దిగువ అధికారులము.

దేవతలను కొన్నిసార్లు సురలు అని కూడా పిలుస్తారు, ప్రతి మనిషి తన కర్మల ద్వారా సంపాదించిన దానిని పొందేటట్టు వీరు చూస్తారు.[3] వారు మనిషి చేసిన కర్మలకు తగినట్లుగా ప్రాపంచిక విషయాలలో మానవులకు విజయాన్ని మరియు వైఫల్యాన్ని ఇస్తారు. మానవులు తమకు సేవ చేయడానికి ప్రయత్నించినప్పుడు దేవతలు అనేక విధాలుగా సహాయం చేస్తారు. అతివృష్టి(మితిమీతిన వాన), అనావృష్టి (వానలేకపోవుట), అనారోగ్యం మరియు కరువు మొదలయిన అనేక సమస్యలు మానవులు దేవతలకు చేయవలసిన పూజలను పూర్తిగా విస్మరించడం వల్ల వస్తాయి.

దేవతలది విస్తారమైన సమూహం. వారు ముఖ్యంగా ఇంద్ర, వాయు, అగ్ని, వరుణ మరియు కుబేరులను ఐదుగురు పాలకుల క్రింద విభజించబడ్డారు. ఇంద్రుడు ఆకాశముతో అలాగే గాలితో వాయువు; అగ్నితో అగ్ని : నీటితో వరుణుడు; భూమితో కుబేరుడు సంబంధం కలిగి ఉన్నారు. పురాణాలు మరియు ఇతిహాసాల్లో మనం చూస్తున్నట్లుగా ఒక్కొక్కరి పాలన కింద ఉన్న దేవతలకు వేర్వేరు పేర్లు ఉన్నాయి. ఉదాహరణకు, కుబేరుని సేవకులైన యక్షులతో భీముడు ఎలా పోరాడాడో విద్యార్థి చదివి ఉండవచ్చు.

ఈ దేవతలలో రజో-గుణ ఆధిపత్యం ఉంటుంది. అది వారి "ప్రకృతి చర్య" అని మనువు చెప్పాడు. అసురులనబడే రాక్షసులు దేవతలయొక్క శత్రువులు. వీరిలో ప్రతిఘటన లేదా జడత్వం అధికం. వీరిలో తమో-గుణం ప్రధానంగా ఉంటుంది.

బ్రహ్మ ఖనిజాలు, మొక్కలు, జంతువులు మరియు మనుషులను తన మనస్సులో సృష్టించాడు, తద్వారా ఇప్పుడు పరిణామం అని పిలవబడే జీవ శక్తుల విస్తృత

ప్రపంచాల చిత్రాన్ని పూర్తి చేసాడు. సంస్కృతంలో ఈ ప్రపంచ–పరిణామం, లేదా ప్రపంచ–ప్రక్రియను సంసారం అని పిలుస్తారు. ఇది జీవులన్నింటినీ బంధిస్తూ నిరంతరం తిరిగే చక్రంతో పోల్చబడింది.

ఆ విధంగా బ్రహ్మ ఒక విశ్వం యొక్క గొప్ప పనిలో తన భాగస్వామ్యాన్ని పూర్తిచేసాడు. అయితే ఈ జీవ రూపాలు అవసరమైన, భౌతిక పదార్థం ధరించిన, క్రియాశీల జీవులుగా మారవలసిన అవసరం ఉంది; ఇది విష్ణువు యొక్క పని. విష్ణువు అంతటా వ్యాపించే స్వభావంకలవాడు. లోకములను కాపాడువాడు మరియు సంరక్షకుడు. అతను ఈ అన్ని రూపాలలో తన ప్రాణాన్ని శ్వాసించాడు. ఒక పురాణం చెప్పినట్లుగా విష్ణువు స్థితికారకుడై అన్ని రూపాలలో ప్రాణంగా మారి వాటికి చైతన్యాన్ని ఇచ్చాడు.

ఇలా ఈ బ్రహ్మాండమంతా "జీవము మరియు చైతన్యంతో నిండిపోయింది." కానీ మనిషి తెరపైకి వచ్చినప్పుడు (పరిణామ క్రమంలో) ఇవి సరిపోలేదు. ఈశ్వరుని యొక్క రెండు కోణాలు (సృష్టి, స్థితి) మానవునికి జీవితాన్ని ఇచ్చాయి. కానీ మూడవ అంశమయిన రూపాలను కరిగించి ఐక్యత విముక్తి కలిగించే ఆనందస్థితి (లయము) ఇంకా మిగిలి ఉంది. మానవుని యొక్క మూడురకాల స్థితులను పూర్తి చేయడానికి మహాదేవుని అనుగ్రహం తప్పనిసరిగా జీవునికి కలగాలి. అప్పుడే జీవుడు ఈశ్వరుని యొక్క పరిపూర్ణ ప్రతిబింబమవుతాడు. ఇది (లయము) జరిగింది. తద్వారా జీవుడు తన సుదీర్ఘ పరిణామాన్ని ప్రారంభించాడు.

మునుపటి కల్పములలో(కల్పమనగా బ్రహ్మ యొక్క ఒక రోజు లేదా 432,000,000 సంవత్సరాలు) గడించిన ఖనిజములు, కూరగాయలు మరియు జంతు రాజ్యాల ద్వారా జీవుడు క్రమక్రమంగా అభివృద్ధి చెందాడు. మొక్కలు మరియు జంతువుల ద్వారా మానవులు పరిణామం చెందడం గురించిన చాలా అందమైన వర్ణనలను , "మనిషిలో ఆత్మ వ్యక్తమవుతుంది," మరియు "అనిత్యత్వము ద్వారా అతను నిత్యత్వాన్ని కోరుకుంటాడు," మొదలయిన సిద్ధాంతాలను పెద్దవారయిన తరువాత విద్యార్థులు ఐతరేయారణ్యకములో[4] చదవవచ్చు. వీటి వివరాలను అధునాతన పాఠ్యపుస్తకం (Sanatana Dharma: an advanced textbook of Hindu religion and ethics)లో చూడవచ్చు.

అవతారాలు అని పిలువబడే విష్ణువు యొక్క ప్రత్యేక వ్యక్తీకరణలను మనము మరచిపోకూడదు. అవ, తృ అను పదాలు కలిపితే అవతారమవుతుంది. అవ అనునది

మిక్కిలి అనే అర్థాన్నీ తెలిపే ఉపసర్గ. దేవతలు మనుష్యరూపములో భూమిపై అవతరించుట అని ఈ అవతార పదానికి అర్థం. అవతారమనునది ఒక విచిత్రమైన దైవిక ఆవిర్భావములకు వర్తింపజేయబడుతుంది. భగవంతుడు ఏదో ఒక రూపంలో అవతారమెత్తి ఒక ప్రత్యేక ఫలితాన్ని పొందుతాడు. ప్రపంచంతో విషయాలు చెడుగా జరుగుతున్నప్పుడు మరియు ప్రపంచాన్ని సరైన పరిణామ మార్గంలో ఉంచడానికి ప్రత్యేక సహాయం అవసరమైనప్పుడు, విష్ణువు కొన్ని సముచితమైన అవతారాలలో అవతరించి దిగి, విషయాలను సరిచేస్తాడు.

అతని పది అవతారాలు ఇతరుల అవతారాలకన్నా ముఖ్యమైనవిగా పరిగణించబడతాయి మరియు తరచుగా "దశావతారాలు"గా ప్రసిద్ధి.

1. మత్స్యావతారం

మత్స్యమనగా చేప. వైవస్వత మనువు ఒకసారి ఒక కష్టదశలో ఉన్న చిన్న చేపను చూసి, దానిని ఒక కమండలంలో ఉంచాడు; అది కమండలమంత పెరిగింది. ఆ తరువాత అతను దానిని ఒక పెద్ద కుండలో ఉంచాడు;

కొద్ది క్షణాల్లోనే ఆ చేప ఆ కుండ పట్టనిదంతైపోయింది. దీనితో మనువు దిగ్భ్రాంతి చెంది ఆ వెనువెంటనే రాజభటులను రప్పించి దానిని భద్రంగా ఒక చెరువులో వేయించాడు. మరొక్క క్షణంలోనే ఆ చేప ఆ చెరువును కూడా పట్టనంత పెద్దదిగా మారిపోయింది. తరువాత దానిని ఒక పెద్ద నదిలో వదిలాడు. అక్కడ కూడా చేప తన ప్రభావం చూపుతూ నదంతా తానై కదలాడింది. మనువు శ్రీమహావిష్ణువును ప్రార్థించి అతి కష్టంమీద తన భటుల చేత దానిని మహా సముద్రంలోకి విడిచిపెట్టించాడు. అపుడు ఆ చేప సముద్రమంతటి రూపము దాల్చింది.

ఏమి అర్థం కాని మనువు "హరీ! లక్ష్మీదేవి వక్షస్థలంపై క్రీడిస్తూ సంతోషంగా విహరించే ఆనందస్వరూపుడవు నువ్వు చేప రూపాన్ని ఎందుకు ధరించావో తెలుపుమయ్యా!" అని ప్రార్థించాడు. అప్పుడు విష్ణువు ఇలా జవాబిచ్చాడు.

"ఓ రాజా! ఈ రాత్రి గడచిన పిమ్మట రాబోయే ఏడవ నాటితో బ్రహ్మదేవుడికి ఒక పగలు పూర్తి అవుతోంది. భూలోకం మొదలు మూడులోకాలూ ప్రళయసముద్రంలో మునిగిపోతాయి. అప్పుడు నా ఆజ్ఞానుసారం ఒక పెద్ద నావ నీ దగ్గరకు వస్తుంది. అప్పుడు నీవు సమస్త ఓషధులు, విత్తనాల రాశులూ ఆ నౌకపై పెట్టుకుని ప్రళయసముద్రంలో విహరించు. సప్తఋషులు నీతో కలిసి ఆ ఓడలో ఉంటారు.

మీ ముందు అంతా పెనుచీకటి ఆవరిస్తుంది. మునుల శరీర కాంతులు మిణుకు మిణుకు అంటూ మెరుస్తుంటాయి. సముద్రంలో మీదున్న నావ ఊగుతూ తేలుతూ సాగిపోతూ ఉంటుంది.

మత్స్యరూపం ధరించిన నేను ఆ ఓడ సముద్రం అలలకు దెబ్బతినకుండా అన్నివైపులా నా పెద్ద ఈకలతో కూడిన నా రెక్కలను కదిలిస్తూ ఉంటాను. నావను ముక్కలు చేయడానికి వచ్చే పెద్ద పెద్ద జలచరాలను తరిమేస్తుంటాను. ఒక పెద్ద పాము నా ఆజ్ఞానుసారం, అక్కడ కనిపిస్తుంది. సుడిగాలులకు నావ తిరగబడకుండా ఆ పాముతో నా కొమ్ముకొనకు ఆ నావను బంధించు. నీకూ మునీశ్వరులకూ బాధ కలుగకుండా ఆ ప్రళయకాలం గడిచేంతవరకు నేను రక్షిస్తుంటాను. ఇందుకోసమే నేను ఈ మత్స్యరూపం ధరించాను. " ఇలా పలికి శ్రీమన్నారాయణుడు ఆ సత్యవ్రత మహారాజు చూస్తుండగా అదృశ్యం అయ్యాడు.

శ్రీమన్నారాయణుని ఆజ్ఞానుసారం ఋషులు మరియు సృష్టికి అవసరమైన జీవన మూలికలతో ఓడలోకి మనువు ప్రవేశించాడు. ద్రవిడదేశపు రాజుగా ఉండి ప్రళయకాలములో నారాయణ ప్రేరితుడయిన ఒక నావలో హరిధ్యానము చేసిన సత్యవ్రత మహారాజు ఈ కల్పములో వైవస్వత మనువుగా జన్మించి, మానవసృష్టికి కారకుడయ్యాడు. చేప రాకతో ఈసృష్టిలో జంతు జీవితం యొక్క గొప్ప పరిణామం ప్రారంభమైంది.

2. కూర్మావతారం

కూర్మమనగా తాబేలు. విష్ణువు అమృత మథనంలో సుడులు తిరుగుతున్న పర్వతానికి తాబేలు రూపంలో ఆధారమయ్యాడు. అమృతము మొదలయిన అవసరమైన రూపాలను ఇవ్వడానికి కారణమయిన గొప్ప సముద్రాన్ని కదిలించటానికి తాబేలు కారణమయింది. తాబేలు అనేది సృష్టి పరిణామంలో మత్స్యావతారం తరువాత గొప్ప దశ.

3. వరాహావతారం

వరాహమనగా పంది. భూమి నీటిలో మునిగిపోయిన సందర్భంలో విష్ణువు వరాహావతారంలో దానిని పైకి లేపాడు, పొడి భూమిలో సస్తనజంతుజాతి ఆరంభము కావటానికి ఒక ప్రతీక వరాహావతారం.

ఇలా హిందూమతంలోని మొదటి మూడు అవతారాల ద్వారా ఆధునిక శాస్త్రం మూడు గొప్ప పరిణామ దశలను గుర్తించింది.

4. నరసింహావతారం

మనిషి-సింహం కలిస్తే నరసింహం. దైత్యుల దౌర్జన్యం నుండి భూమిని విడిపించడానికి వచ్చిన అవతారం ఇది.

ఈ రాక్షస జాతిలో ప్రహ్లాదుడు జన్మించాడు. తన రాక్షసుడయిన తండ్రి బెదిరింపులు మరియు క్రూరత్వాలు ఎన్ని చేసినప్పటికీ. అతను తన చిన్ననాటి నుండి విష్ణువు పట్ల భక్తి భావంతో ఉండేవాడు. తండ్రి పదే పదే కొడుకుని చంపడానికి ప్రయత్నించాడు. కానీ విష్ణువు అతనిని రక్షించడానికి ఎప్పటికప్పుడు జోక్యం చేసుకున్నాడు; చివరికి భగవంతుడు నరసింహ రూపంలో స్తంభంను చీల్చుకొని ప్రవేశించి, రాక్షస రాజును చంపాడు.

5. వామనుడు, పొట్టివాడు

చివరకు భగవంతుడు మానవ జాతి యొక్క పరిణామానికి సహాయం చేయడానికి వీలుగా వామనావతారంలో మనిషిగా వచ్చాడు. సమస్తాన్ని నిండగలిగిన హక్కును మూడు అడుగులద్వారా బలి నుండి ఈ వామనుడు పొందాడు; అతని ఒక అడుగు భూమిని కప్పివేసింది. ఈరకంగా ఒక అడుగు ద్వారా అతను తన పరిణామ క్షేత్రాన్ని మనిషి కోసం గెలుచుకున్నాడు.

6. పరశురాముడు

గొడ్డలి కలిగిన రాముడు పరశురాముడు.

ఈ అవతారం ప్రజలను అణచివేస్తున్న క్షత్రియులను శిక్షించడానికి వచ్చింది. మరియు ప్రజలకు సహాయం చేయడానికి బదులుగా దౌర్జన్యముతో అధికారాన్ని ఉపయోగించే దుష్ట పాలకులకు నీతి బోధించడానికికూడా పరశురామావతారం వచ్చింది.

7. రాముడు

సాధారణంగా దశరథుని కుమారుని రామచంద్రుడని పిలుస్తారు - తన ముగ్గురు సోదరులతో కలిసి ఆదర్శ క్షత్రియునిగా, మార్గదర్శకుడయిన రాజుగా ఈ

అవతారంలో భగవంతుడు వచ్చాడు. అతను పరిపూర్ణ మానవ జీవితానికి ఉదాహరణగా నిలిచాడు. రాముడు విధేయత మరియు ప్రేమకలిగిన కుమారుడు, మృదుల స్వభావం కలిగిన భర్త. ఆప్యాయతగల సోదరుడు. ధీర యోధుడు. తెలివైన పాలకుడు. తన ప్రజలను శ్రద్ధగా రక్షించేవాడు. రాముడు ఖచ్చితంగా పరిపూర్ణమైన వ్యక్తి. అతని అద్భుతమైన కథ వాల్మీకి యొక్క రామాయణంలో చెప్పబడింది. రామాయణానికి తులసీదాస్ చేసిన సుందరమైన అనువాదము ప్రతి ఉత్తర భారతీయుని ఇంటిలో ప్రసిద్ధి.

8. కృష్ణుడు

కృష్ణుడు దివ్య ప్రేమ మరియు వివేకము యొక్క ఒక స్వరూపము. అనేక మంది ప్రజలు కృష్ణుని అత్యంత భక్తితో పూజిస్తారు. ఇతడు వ్రజ (ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని బృందావనం, మధుర అనే పుణ్యక్షేత్రాల చుట్టూ ఉన్న ప్రాంతం) మరియు బృందావనాల యొక్క అద్భుతమైన బిడ్డగా, అర్జునుని స్నేహితుడిగా, భగవద్గీత యొక్క వక్తగా, పాండవులకు తెలివైన సలహాదారుగా, భీష్ముడు ఆరాధించే వానిగా ప్రసిద్ధుడయిన కృష్ణుని కథ భారతీయ బాలునికి తెలియదా? (తెలుసునని భావం) కృష్ణుడు మహాభారతంలోని ప్రధాన వ్యక్తి. అతని జీవితం అనేక పురాణాలలో గుర్తించబడింది.

9. బుద్ధుడు

బుద్ధుడు సింహాసనాన్ని మరియు విలాసాన్ని వదులుకుని జ్ఞానాన్వేషణ కలిగిన ప్రయాణీకుడిగా మారి మహోదాత్తమైన సత్యానికి గురువయ్యాడు. అతను శాక్యమునిగా, గౌతముడిగా, సిద్ధార్థునిగా ప్రసిద్ధి చెందాడు. బుద్ధుడు మిలియన్ల (మిలియన్ అనగా పదిలక్షలు) కొద్దీ మానవ జాతి నమ్మే ఒక శక్తివంతమైన విశ్వాసాన్ని స్థాపించినాడు. బుద్ధావతారంలో విష్ణువు ఆర్యేతర ప్రజలకు విస్తృతంగా బోధలు చేసాడు.

10. కల్కి

కలియుగాన్ని అంతం చేసే అవతారముగా మరియు భవిష్యత్తులో అవతరించే వానిగా కల్కికి ప్రసిద్ధి ఉంది. అతను అవతరించినప్పుడు సత్యయుగం భూమికి తిరిగి వస్తుంది. ఒక కొత్త చక్రం ప్రారంభమవుతుంది.

మానవజాతి అభివృద్ధి మరియు పరిపూర్ణత ఈ అవతారాల ద్వారా సూచించబడ్డాయి.

పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్ ।
బ్రహ్మాణమీశం కమలాసనస్థమ్ ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥
రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।
గంధర్వయక్షాసురసిద్ధసంఘా వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥[5]

విశ్వ రూప దర్శన యోగములో అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "ఓ శ్రీ కృష్ణా! నీ దేహములో నేను – సకల దేవతలనూ, ఎన్నెనో ప్రాణికోటి సమూహములను, కమలములో కూర్చుని ఉన్న బ్రహ్మదేవుడిని, శివుడిని, అందరు ఋషులను, మరియు దివ్య సర్పములను – చూచుచున్నాను. రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, విశ్వదేవతలు, అశ్వినీ కుమారులు, మరుత్తులు, పితరులు, గంధర్వులు, యక్షులు, అసురులు మరియు సిద్ధులు అందరూ సంభ్రమాశ్చర్యములతో నిన్నే చూస్తున్నారు."

'ఇంద్రం మిత్రం వరుణం అగ్ని మాహు రయో
దివ్యః – స సుపర్ణో గరుత్మాన్ ।
ఏకం సత్ విప్రా బహుధా వదంతి అగ్నిం –
యమం మాత రిశ్వాన మాహుః ॥[6]

"ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, అని అతనిని పిలుస్తారు. అతను ప్రకాశవంతమైన బంగారు రెక్కలుగల గరుత్మంతుడు. అతనిని గురించి , ఋషులు అనేక రకాలుగా మాట్లాడతారు; వారు అతనిని అగ్ని, యమ, మాతరిశ్వ అని పిలుస్తారు."

ఆత్మైవ దేవతాస్సర్వాస్సర్వమాత్మన్యవస్థితమ్ ।
ఆత్మా హి జనయత్యేషాం కర్మయోగం శరీరిణామ్ ॥[7]

ఇంద్రాది దేవతలందరు తన ఆత్మయే. సర్వము పరమాత్మ స్వరూపుడగు తనయందే ఉన్నది. ఈ ఆత్మయే కర్మాను బంధమును కలిగించుచున్నది.

ఏతమేకే వదంత్యగ్నిం మనుమన్యే ప్రజాపతిమ్,
ఇంద్రమేకే పరే ప్రాణమపరే బ్రహ్మ శాశ్వతమ్ ॥[8]

ఆ పరమాత్మను కొందరు అగ్ని అని, మరి కొందరు మనువనే ప్రజాపతియని, ఇంక కొందరు ఇంద్రుడని, ప్రాణమని శాశ్వత స్వరూపుడైన పరబ్రహ్మ అని పిలుస్తున్నారు.

యథా సుదీప్తా త్పావకా ద్విస్ఫులింగా స్సహస్రశః ప్రభవన్తే సరూపా ।
స్తథాక్షరా ద్వివిధా సౌమ్య భావాః ప్రజాయన్తే తత్ర చైవాయన్తి ॥"

ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ ।
ఖం వాయుర్జ్యోతిరాప: పృథివీ విశ్వస్వ ధారిణీ ॥

తస్మాచ్చ దేవా బహుధా సంప్రసూతాః ।
సాధ్యా మనుష్యా: పశవో వయాంసి ॥[9]

బాగా మండుతున్న అగ్నిలోనుంచి వేలసంఖ్యలతో ఆ అగ్నితో సమానరూపములగు మిణుగురులు పుట్టుచున్నట్లుగా, అక్షర స్వరూపమగు పరమాత్మనుండి చైతన్య స్వభావముతో శరీర సంబంధముతో వివిధ స్వరూపాలు పొందిన జీవులు పుట్టుచున్నారు. తిరిగి వారు అచటనే లయమును గూడ పొందుతున్నారు.

ఆ పరమాత్మ నుండే జీవం, మనస్సు, అన్ని ఇంద్రియాలు, గాలి, ఆకాశం, నిప్పు, నీళ్లు, సకలానికి ఆధారమైన భూమి అన్నీ పుట్టాయి.

ఆ పరమాత్మ తత్త్వం నుండి వివిధ లోకాలలోని దేవతలు, సాధ్యులు, మానవులు, జంతువులు, పక్షులు, అన్నీరకరకాల మార్గాలలో పుట్టుకొచ్చాయి.

సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽ జ్ఞానమేవ చ ॥

ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥ [10]

సత్త్వ గుణము వలన జ్ఞానము, రజో గుణము వలన లోభము(దురాశ), మరియు తమో గుణము వలన నిర్లక్ష్యము మరియు మోహము (భ్రాంతి) జనించును.

సత్త్వ గుణములో ఉన్నవారు స్వర్గము మొదలైన ఊర్ధ్వలోకాలకు వెళతారు; రజో గుణములో ఉండేవారు మానవ లోకము మొదలయిన మధ్యలోకాలలోనే ఉండిపోతారు; తమో గుణములో ఉండేవారు అధోగతి పాలవుతారు. (అనగా పశు కీటకాది జన్మలుపొంది, రౌరవ, కుంభీపాకాది నరకాలలో పడతారని భావం).

సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।
జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥

రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।
రజః సత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా ॥

సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే ।
జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత ॥

లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా ।
రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥

అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।
తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥[11]

సత్త్వము వ్యక్తిని భౌతిక సుఖాలకు కట్టివేస్తుంది; రజో గుణము జీవాత్మను కర్మల పట్ల ఆసక్తి పరుస్తుంది; మరియు తమో గుణము జ్ఞానమును కప్పివేసి వ్యక్తిని మోహభ్రాంతిలో బంధిస్తుంది.

ఓ అర్జునా ! ఒక్కోసారి రజోతమస్సులపై సత్త్వముది పైచేయిగా ఉంటుంది. ఇంకోసారి సత్త్వము మరియు తమోగుణములపై రజో గుణము ఆధిపత్యంతో ఉంటుంది; మరి కొన్ని సార్లు సత్త్వరజో గుణములను అణచి తమోగుణము అభివృద్ధి చెందుతుంది.

ఓ అర్జునా! దేహములోని అన్ని ద్వారములు (అనగా శరీరములోని ఇంద్రియాలు, అంతః కరణములు) జ్ఞానముచే ప్రకాశిస్తున్నప్పుడు, అప్పుడు సత్త్వ గుణము అభివృద్ధి చెందుతున్నదని తెలుసుకొనుము. (జ్ఞానము ప్రకాశించుట అనగా సంసారములో వైరాగ్యము ఏర్పడుట. అప్పుడు రాగద్వేషాలు, దుఃఖ శోకాలు తొలగిపోతాయి)

రజో గుణము పెరిగినప్పుడు, లోభము (దురాశ), ప్రాపంచిక సుఖాల విషయాలలో ఆసక్తి, వ్యాకులత, అశాంతి మరియు యావ పెంపొందుతాయి.

తమో గుణము పెరిగినప్పుడు అజ్ఞానము, జడత్వము, నిర్లక్ష్యము, మరియు మోహము కలుగుతాయి.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥[12]

ఓ అర్జునా ! ఎప్పుడెప్పుడైతే ధర్మము క్షీణించునో, (ధర్మమునకు హాని కలిగినప్పుడు) అధర్మము పెరుగునో, ఆ సమయంలో నన్ను నేను భూలోకంలో సృజించుకుంటాను. (అనగా అవతరిస్తానని భావం)

ధర్మాత్ములను కాపాడటానికి, దుష్టులను నిర్మూలించటానికి, మరియు ధర్మ సూత్రములను తిరిగి స్థాపించటానికి నేను ఈ లోకంలో ప్రతి యుగములో అవతరిస్తాను.

సూచికలు

1. పాశ్చాత్య రసాయన శాస్త్రవేత్త ఈ పదాన్ని వేరొక అర్థంలో ఉపయోగిస్తాడు, కానీ పాత అర్థం మనకు సంబంధించినది
2. భగవద్గీత 14,17, 18 అధ్యాయాలు
3. కర్మను గురించి రాబోయే 4 అధ్యాయంలో వివరించబడింది
4. ఐతరేయారణ్యకము II. iii -2.
5. భగవద్గీత 11 వ ఆధ్యాయము 15 మరియు 22 శ్లోకాలు
6. ఋగ్వేదం; 1:164:46
7. మనుస్మృతి 12-119
8. పై పుస్తకములోనే 12-124
9. ముండకోపనిషత్ ద్వితీయ ఖండము
10. భగవద్గీత 14 వ ఆధ్యాయము 17 మరియు 18 శ్లోకాలు
11. భగవద్గీత 14 వ ఆధ్యాయము 09 నుండి 13 శ్లోకాలు
12. భగవద్గీత 04 వ ఆధ్యాయము 07 నుండి 08 శ్లోకాలు

అధ్యాయం 3

పునర్జన్మ

చివరి అధ్యాయంలో చెప్పబడిన పరిణామం ప్రకారం జీవాత్మ ఒక శరీరం నుండి ఇంకొక శరీరానికి వెళ్లడం జరుగుతుంది. కొందరివిషయంలో శక్తులు వారి పునర్జన్మలలోని శరీర ధారణ ద్వారా మెరుగుపడతాయి; వీటినే పునర్జన్మ (re-birth) పునరవతారం (re-incarnation) లేదా దేహాంతరప్రాప్తి (transmigration) అంటారు. పునర్జన్మ (re-incarnation) అనే పదానికి మళ్లీ మాంసాదులతో కూడిన శరీరాన్ని గ్రహించడం లేదా మళ్లీ భౌతిక శరీరంలోకి రావడం అని అక్షరార్థం. శరీరాంతరప్రాప్తి (transmigration) అంటే ఆత్మ ఒక శరీరం నుంచి మరొక శరీరంలోకి ప్రవేశించడం. మరణానంతరం ఆత్మ శరీరాన్ని విడిచి మరొక శరీరంలోకి వెళ్లడము కావచ్చు లేదా సాధన వల్ల కలిగిన శక్తితో ఇచ్ఛాపూర్వకంగా ఆత్మ తాత్కాలికంగా స్వీయదేహాన్ని వదలి, మరొక మృతదేహంలోకి ప్రవేశించడమైనా కావచ్చు. పునర్జన్మ, పునరవతారం , దేహాంతరప్రాప్తి – ఈ పదాలన్నీ సమానార్థకాలే. ఈ పదాల ద్వారా తెలుసుకోదగిన ప్రక్రియ ఏమిటో చూద్దాం.

జీవుడనగా, మనం ఇదివరకు చదివినట్లుగా బ్రహ్మములో ఒక భాగం. “నాలో ఒక భాగం, జీవుడు” అని శ్రీ కృష్ణుడు చెప్పాడు. బ్రహ్మ శక్తులను (జ్ఞాన శక్తులను) కలిగి ఉన్నవాడు బ్రాహ్మణుడు. “నువ్వే అది” అని శ్రుతి బోధిస్తుంది. అయితే విత్తనమునకు చెట్టుకు తేడా ఉన్నట్లుగా, కాలము మరియు స్థలముల మధ్య (Space and Time) తేడా కనిపిస్తుంటుంది.

చెట్టు ఒక విత్తనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దానికి స్వంత గుణమును ఇస్తుంది; అది విత్తనాన్ని నేలపై పడవేస్తుంది. తరువాత విత్తనం తన మాతృవృక్షంగా తాను మారేదాకా తన శక్తులను తనలో దాచిపెడుతూ నెమ్మదిగా పెరుగుతుంది; విత్తనం విలక్షణమయిన ప్రత్యేకతను ఏమీ కలిగి ఉండకపోవచ్చు, ఎందుకంటే దాని స్వభావం తల్లిదండ్రుల మాదిరిగానే ఉంటుంది.

విత్తనం మరియు వృక్షముల మధ్య సంబంధం జీవునికి ఈశ్వరునికి మధ్య ఉంటుంది. ఒక విత్తనంలా, జీవుడు కూడా ప్రకృతిలో ఈశ్వరుని నుండి బయటకు వస్తాడు. తాను ఈశ్వరునిగా మారేటంతవరకు తన అంతర్గత శక్తులను బయట

పెడుతూ నెమ్మదిగా పెరుగుతాడు; అతను ప్రత్యేకంగా మరేమీ కాలేడు. ఎందుకంటే జీవుని స్వభావం అతని తల్లిదండ్రులైన ఈశ్వరుని వలె ఉంటుంది.

ఈశ్వరుడు జ్ఞానవంతుడు మరియు శక్తివంతుడు. జీవుడు అవివేకుడు మరియు శక్తి లేనివాడు అని చెప్పబడింది;[1] అయితే జీవుడు జ్ఞానము మరియు శక్తులతో ఎదుగుతాడు. ఆ వృద్ధిని పరిణామం అంటారు.

జీవుని యొక్క సుదీర్ఘమైన యాత్ర, జీవరహిత పదార్థాలు, శిలలు మరియు ఖనిజాలు కలిగిన రాతియుగపు ప్రపంచాలద్వారా ప్రారంభమయిందని మనకు తెలుసు. ఆ దశలో అతను ఆధ్యాత్మిక ప్రపంచం గురించి ఏమి తెలియని స్థితిలో ఉన్నాడు. అయితే ఈ కాలంలో జీవుని దృష్టిని తన వైపుకు మళ్లించటానికి ఆధ్యాత్మిక ప్రపంచం ప్రయత్నించింది. ఆధ్యాత్మిక ప్రపంచము తన ఉనికిని జీవునికి వివిధ పద్ధతులలో బలవంతంగా తెలియచేసింది. దారుణమయిన ఉపద్రవాలు– భూకంపాలు, అగ్నిపర్వతాలు, జారిపడే భూఖండాలు, భయంకరమైన అలలు కలిగిన సునామీలు – ఇలా అనేక ఆధ్యాత్మిక ప్రపంచమును గుర్తు చేసుకోదగిన సంఘటనలు – జీవుని యొక్క దృష్టిని కదిలిస్తాయి. తాను ఒంటరిగా లేడని, తనకు తెలియకుండా తన వెలుపల ఏదో ఉన్నదనే వాస్తవాన్ని జీవునికి ఇవన్నీ తెలియచేసాయి.

విద్యార్థి భూమికి సంబంధించిన చరిత్ర యొక్క ప్రారంభ కాలాల చరిత్రలను చదివితే, జీవుడు ప్రారంభ దశలో అనేకమయిన దుర్గతులతో కొట్టుమిట్టాడని తెలుస్తుంది. ఇవన్నీ జీవులను మేల్కొల్పడానికి అవసరమయ్యాయి. చాలా కాలం తరువాత కొందరు జీవులు రాతియుగ సంస్కృతిని దాటి, దాని కంటె మృదువైన మరియు సౌకర్యవంతమైన శరీరాలకు సరిపోయేలా సౌకర్యాలు సమకూర్చుకొన్నారు. వారు వృక్షప్రపంచంద్వారా ప్రాణం నిలబెట్టుకుంటూ జీవితాలను గడిపే ఆలోచన చేసారు. ఈశ్వరుని నుండి బయటకు వచ్చిన మరికొందరు జీవులు (కొన్ని రకాల జంతువులు) శిలలు మరియు ఖనిజాలు కలిగిన రాతియుగ సంస్కృతిలో భాగమయ్యారు.

శిలలు మరియు ఖనిజాలు కలిగిన రాతియుగ ప్రపంచం తరువాత జీవులు వృక్ష ప్రపంచంలోనికి వచ్చారు. ఇప్పుడు బయటి ప్రపంచంలో మొక్కలలోని ప్రాణచైతన్యం జీవులకి బాగా అనుభవంలోకి వచ్చింది. వెచ్చని సూర్యుడు, సున్నితమైన గాలి మరియు జీవితాన్ని ఇచ్చే వర్షాన్ని జీవులు ఈ ప్రపంచంలో అనుభవించారు.

ఈ జీవులు పెద్దవారవుతున్న కొద్దీ లేదా మరింత సున్నితంగా వారు పెరిగేకొద్దీ, వారు పొదలు మరియు చెట్లు వంటి ఎక్కువ కాలం జీవించే మొక్కలను అనుభవంలో తెలుసుకొనే రోజులలోకి ప్రవేశించారు. వారిలోని అంతర్గత శక్తులు మరింతగా బహిర్గతమయ్యాయి. జీవులు జంతుప్రపంచంలోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న సమయానికి ముందుగా, వారి వెనుకటి తరం వృక్ష ప్రపంచపు అనుభవం పొందింది. అంత కంటె వెనుకటి తరం శిలాయుగపు అనుభవం పొందింది.

ఈ జంతు ప్రపంచంలో జీవులు చాలా వేగంగా పెరిగారు. ఆహారం కోసం వేటాడారు. ఒకరిని ఒకరు ఉపాయాలలో మించి, పరస్పరం మోసం చేసుకొంటూ ఒకరితో ఒకరు పోరాడారు. జీవులలోని ఇంద్రియాలు మరియు సాధారణ మానసిక శక్తులు బహిర్గతమయి శక్తిశాలులయ్యారు; చివరకు జంతువుల రూపాలు తమకు సరిపోవని వారు గ్రహించారు. జంతు పరిణామం ఆగిపోకుండా ఉండటానికి తమ అవసరం ఉన్నదని జీవులు గ్రహించారు.

విద్యార్థి ఇలా అడగవచ్చు :

జీవునికి అనుగుణంగా అతని రూపము పరిణామం చెందేలా ప్రకృతిలో ఏమేమి సహకరించాయి?

దీనికి జవాబిది

జీవుని యొక్క స్వంత ప్రయత్నాలు అతని పరిణామ క్రమానికి తోడ్పడ్డాయి. అతను తనను చుట్టుముట్టిన ప్రకృతి యొక్క గోడ ద్వారా బయటకు చూడాలని కోరుకున్నాడు; అతను చూడటానికి ప్రయత్నించాడు. అతని బాహ్య శక్తి ప్రకృతి యొక్క గోడపై పనిచేసింది. నెమ్మదిగా, చాలా నెమ్మదిగా, ఒక కన్ను పరిణామం చెందింది. క్రమంగా అన్ని ఇంద్రియాలు లోపలి నుండి మరియు బయట ఉండి జీవునికి కర్తవ్య బోధ చేసాయి. జీవుడు వాటన్నింటినీ తనకు సరిపోయేలా తీర్చిదిద్దుకున్నాడు, తద్వారా అతను బాహ్య ప్రపంచంలో తన శక్తులను ఉపయోగించుకొన్నాడు. దేవతలు జీవునికి అవయవ నిర్మాణాలకు సరిపోయే పదార్థాలను ఇచ్చి అతనికి సహాయం చేసారు.

జీవుడు ఏదయినా చూడటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అగ్ని అతనికి తనకు సంబంధించిన – కాంతి కిరణాలతో తాకినప్పుడు కంపించే మందుతున్న పదార్థాన్ని ఇచ్చాడు. అతను రుచి చూడాలనుకున్నప్పుడు, వరుణుడు అతనికి రుచి చూడటానికి

సాధ్యమయ్యే తన స్వంత నీటి పదార్థాన్ని ఇచ్చాడు. ఈ విధంగానే మిగతా దేవతలు కూడా జీవునికి సహకరించారు. ఈ రకంగా దేవతల సహాయం ద్వారా జీవుడు తన శరీరాన్ని నిర్మించుకొన్నాడు. అతను తనకు వీలైన విధంగా శరీరాకృతిని తయారుచేసుకోగలిగాడు. ఉపయోగకరంగా లేనప్పుడు, జీవుడు ఆ పదార్థాన్ని విసిరివేసి మరొకదాన్ని తయారు చేసుకొన్నాడు. ఈ రకంగా అతను పరిణామ క్రమంలో ముందుకు సాగుతున్న కొద్దీ తన శక్తుల ద్వారా వేగాతివేగంగా అభివృద్ధి చెందాడు. జీవుని శక్తులు మునుపటి దశల్లో (వృక్ష, జంతు దశల్లో) కంటే చాలా త్వరగా ఫలితాలను తీసుకువచ్చి మరింత స్వేచ్ఛగా పనిచేసాయి.

ఇది జీవుని పరిణామం యొక్క సాధారణ ప్రక్రియ. విద్యార్థి ప్రధాన ఆలోచనను గ్రహించేందుకు వీలుగా, జీవుని వారసత్వం విచ్ఛిన్నం కానిదిగా ఇప్పటిదాకా చెప్పబడింది. కానీ, ప్రకృతిలో, సాధారణ ప్రయాణం కొనసాగుతుండగా, అనేక చిన్న మలుపులు మరియు కొద్దిదూరం ప్రయాణించుటకు వీలయిన పక్క రోడ్లు ఉంటుంటాయి. ఇది జీవ పరిణామానికి కూడా అన్వయిస్తుంది. ఉన్నట్టుండి జీవుడు కొంత కాలం మళ్లీ వెనుకటి దశలలోకి జారిపోవచ్చు. అతను చాలా కాలము క్రితం తాను వదిలివేసిన దశలో కొంత కాలం ఉండవచ్చు. అతనిలో పూర్తిగా నేర్చుకోని శక్తి నిగూఢంగా ఉండవచ్చు. కొంత శక్తి అతనిలో అంతగా పరిణామం చెంది ఉ ండకపోవచ్చు. పాఠశాలలో ఒక బాలుడు చదవకుండా ఉంటే, తిరిగి దిగువ తరగతికి చేర్చు పద్ధతిలో జీవుడు మళ్లీ దిగువ దశకు పడిపోయి ఉండవచ్చు. దిగువ దశకు చేరుకున్న జీవుడు జంతువుతో లేదా మొక్కతో జతచేయబడవచ్చు. జీవుడు చాలా తామసికంగా ఉంటే, అతను మానవ రూపాన్ని బాగా ఉపయోగించడం నేర్చుకునే వరకు ఒక రాయితో కూడా అతను జతచేయబడవచ్చు.

ఆ స్థితిలో అతను ఒక జైలులో ఉన్న వ్యక్తిలా ఉంటాడు, మానవ సమాజం నుండి వెలివేయబడతాడు. మరియు స్వేచ్ఛ కోసం తన మానవ శక్తులను ఉపయోగించలేడు. కాని జీవుడు ఎప్పటికీ జనన మరణాల చక్రంతో ముడిపడి ఉండకూడదు. జీవుని కోరికలే ఈ జనన మరణాల చక్రానికి అతన్ని కట్టివేసే తాళ్లు. మానవుడు ఈ భూమికి సంబంధించిన వస్తువులను కోరుకున్నంత కాలం, ఈ వస్తువులను పొందటానికి మరియు ఆనందించడానికి అతను ఈ భూమికి మళ్ళీ రావాలి. కనుక అతను ఈ భౌతిక వస్తువులను కోరుకోవడం మానేసినప్పుడు,

అతని బంధాలు తెగిపోతాయి. అప్పుడు అతను స్వేచ్ఛగా ఉంటాడు. అతనికి ఇకపై పుట్టాల్సిన అవసరం లేదు; అతను జనన మరణాలు లేని విముక్తి స్థానానికి చేరుకుంటాడు. ఈ స్థితిలో జీవుడిని ముక్తుడు, స్వేచ్ఛా జీవుడు అని పిలుస్తారు.

తరచుగా ముక్తులు (మోక్షమును పొందినవారు) ఇతర జీవుల అభివృద్ధికి సహాయపడటానికి ఈ ప్రపంచంలోనే ఉంటుంటారు. వారిద్వారా ఇతర జీవులు త్వరగా విముక్తి పొందవచ్చు. ఇటువంటి ముక్తుల గురించి మనం వేదాలు, పురాణాలు మరియు ఇతిహాసాల్లో చదువుతాము; కొన్నిసార్లు వారు గొప్ప ఋషులు లేదా రాజులుగా ఉంటారు. మరికొన్నిసార్లు వారు చాలా సాధారణ వ్యక్తులుగా ఉంటారు. వారు ముక్తులుగా బయటికి కనిపించినప్పటికీ, వారు స్వచ్ఛంగా, నిస్వార్థంగా మరియు ప్రశాంతంగా ఉంటారు. ఇతరులకు సహాయం చేయడానికి మాత్రమే వారు జీవిస్తారు. వారు లోక శ్రేయస్సు కోసం శ్రమించడంలో తృప్తి చెందుతారు. తాము ఈశ్వరునితో ఉన్నామని ఆ ముక్తులకు తెలుసు.

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥[2]

ఏ విధంగా అయితే దేహంలో ఉన్న జీవాత్మ వరుసగా బాల్యము, యౌవనం, ముసలితనముల గుండా సాగిపోతుందో, అదేవిధముగా మరణ సమయంలో, జీవాత్మ మరియొక దేహము (శరీరము) లోనికి ప్రవేశిస్తుంది. వివేకవంతులు ఈ విషయములో ఆందోళన పడరు.

అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥

ఈ భౌతిక శరీరము మాత్రమే నశిస్తుంది; కానీ అందున్న జీవాత్మ నాశనములేనిది, కొలవటానికి సాధ్యము కానిది మరియు సనాతనమైనది (నిత్యమై, ఏ నాటికీ మారనిది). కావున, ఓ భరత వంశీయుడా! యుద్ధం చేయుము.

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥

"ఆత్మ ఇతరులను చంపును" అని అనుకొనేవాడు, "ఆత్మ ఇతరులచే చంపబడేది" అనుకొనేవాడు ఇద్దరూ అజ్ఞానులే. నిజానికి ఆత్మ ఎవ్వరినీ చంపదు, ఎవ్వరిచేతనూ చంపబడదు.

న జాయతే మ్రియతే వా కదాచిత్
నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥

ఆత్మకి పుట్టుక లేదు. ఎన్నటికీ మరణం కూడా ఉండదు. ఒకప్పుడు ఉండి, ఇకముందు ఎప్పుడైనా ఉండకుండా ఉండదు. ఆత్మ జన్మ లేనిది, నిత్యమైనది, శాశ్వతమైనది మరియు వయస్సు లేనిది. శరీరం నశించిపోయినప్పుడు అది నశించదు.

వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥

ఓఅర్జునా ! "ఆత్మఎవరిచే నాశనం చేయబడదు. నిత్యమైనది, జనన–మరణములు లేనిది" అని తెలిసినవాడు, ఎవరినైనా ఎలా చంపించును? ఎలా చంపటానికి కారణం కాగలదు?

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥

ఎలాగైతే మానవుడు, చిరిగిన పాత బట్టలను వదిలి కొత్త బట్టలను ధరిస్తాడో, అదే విధముగా జీవాత్మ, మరణ సమయములో పాత శరీరమును వీడి కొత్త శరీరమును స్వీకరిస్తుంది.

దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥[3]

ఓ అర్జునా! శరీరములో ఉన్న ఆత్మ చావులేనిది; కాబట్టి ఏ ప్రాణి గురించి కూడా నీవు శోకించుట తగదు.

తద్యథా పేశస్కారీ పేశసో మాత్రాముపాదాయా
న్యన్నవతరం కల్యాణతరం రూపం తనుత
ఏవమేవాయమాత్మేదం శరీరం నిహత్యావిద్యాం
గమయిత్వా అన్యన్నవతరం కల్యాణతరం రూపం కురుతే॥ [4]

స్వర్ణకారుడు, ఒక బంగారు ముక్కను తీసుకొని, మరొక రూపాన్ని, కొత్తగా మరింత అందంగా తయారు చేస్తాడు. అలాగే ఈ ఆత్మ, ఈ శరీరాన్ని విడిచిపెట్టి, అవిద్యను విడిచిపెట్టి, మరొక కొత్త మరియు అందమైన రూపాన్ని పొందుతుంది.

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥

కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥

"సమస్త మమకార ఆసక్తులను వదిలివేసి, భగవంతునికే తమయొక్క అన్ని కర్మలను అంకితం చేయాలి. అప్పుడు అతనికి , తామరాకుపై నీటి బిందువులవలె పాపములు ఏవి అంటవు.

కేవలం ఆత్మ శుద్ధి కోసం మాత్రమే, యోగులు తమ మమకారాసక్తిని విడిచిపెట్టి, శరీరము, మనస్సు, ఇంద్రియములు, మనస్సులతో తమ కర్మలను ఆచరిస్తుంటారు.

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥[5]

అన్ని క్రియాకలాపాల ఫలితాలను భగవంతునికే అర్పితము చేసి, కర్మ యోగులు శాశ్వతమైన శాంతిని పొందుతారు. అదే సమయంలో, తమ కామముచే (కోరికలచే) ప్రేరేపింపబడి, స్వార్థ ప్రయోజనం కోసం పనులు చేసే వారు, కర్మ ఫలములపై ఆసక్తి కలిగి ఉంటారు కనుక, కర్మ బంధములలో చిక్కుకుంటారు."

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥

"నిజమైన పండితులు, విద్యావినయ సంపన్నుడయిన బ్రాహ్మణుని, ఆవుని, ఏనుగుని, కుక్కని, చండాలుడిని సమ-దృష్టితో చూస్తారు.

ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః ॥

సమభావముతో ఉన్న మనస్సు కలిగినవారు, ఈ జన్మ లోనే జన్మ-మరణ చక్రమును జయిస్తారు. వారు భగవంతుని యొక్క దోషరహిత గుణములను కలిగిఉంటారు కాబట్టి పరమ సత్యములోనే (పరమాత్మలోనే) స్థితులై ఉంటారు.

న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః ॥

భగవంతుని యందే మనస్సు పెట్టినవారయి, దివ్య ఆధ్యాత్మిక జ్ఞానములో ధృడమైన అవగాహన కలిగి ఉండి మరియు భ్రమకు లోనుకాకుండా ఉన్నవారు, ప్రియమైనవి జరిగితే/లభిస్తే పొంగిపోరు. అలాగే ఏవేనా అప్రియమైనవి జరిగితే క్రుంగిపోరు.

బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥[6]

బాహ్యమైన ఇంద్రియ సుఖాలపై మమకారాసక్తులు లేనివాడు, ఆత్మ యందే దివ్యానందాన్ని అనుభవిస్తాడు. యోగం ద్వారా భగవంతునితో ఐక్యమై, అంతులేని ఆనందాన్ని అనుభవిస్తాడు.'

యోఽ శీతః సుఖోఽ శీతరారామః తథాంతర్జ్యోతిరేవ యః ।
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽ ధిగచ్ఛతి ॥

"ఎవరైతే తమలో తాము ఆనందంగా (రమిస్తూ) ఉంటారో, తమ లోపలనున్న పరమాత్మ యొక్క ఆనందాన్ని ఆస్వాదిస్తూ , లోపల ఉన్న జ్ఞానపు వెలుగుతో ప్రకాశిస్తూ ఉంటారో, అటువంటి యోగులు, భగవంతునితో ఏకమవుతారు. (భగవంతునిలో లీనమవుతారు)

లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః ।
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥

ఎవరి పాపాలు నశిస్తాయో, ఎవరి సందేహములన్నీ నిర్మూలింపబడతాయో, ఎవరి మనస్సులు తమ అధీనములో ఉంటాయో, ఎవరైతే సమస్త ప్రాణుల క్షేమం కోసం ప్రయత్నిస్తుంటారో, అటువంటి పవిత్రమైన వ్యక్తులు, భగవంతునితో ఏకమవుతారు. (భగవంతునిలో లీనమవుతారు)

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥[7]

కామ-క్రోధములు లేనివారు, మనస్సుని నిగ్రహించుకొన్న వారు, తమను తాము తెలుసుకొన్న వారయిన సన్యాసులకు (ఆత్మ జ్ఞానం పొందిన సన్యాసులకు) అంతటా శాంతుడైన పరబ్రహ్మ పరమాత్మ కనిపిస్తాడు."

సూచికలు

1 శ్వేతాశ్వేతరోపనిషత్తు 01–09

2. భగవద్గీత 02 వ అధ్యాయము 13 వశ్లోకం

3. భగవద్గీత 02 వ అధ్యాయము 18 నుండి–22 శ్లోకాలు మరియు 30 వశ్లోకం

4. బృహదారణ్యకోపనిషత్ షష్ఠోధ్యాయము శారీరబ్రాహ్మణము 04 వమంత్రము

5. భగవద్గీత 05 వ అధ్యాయము 10 నుండి 12 శ్లోకాలు

6. భగవద్గీత 05 వ అధ్యాయము 18 నుండి 21 శ్లోకాలు

7. భగవద్గీత 05 వ అధ్యాయము 24 నుండి 26 శ్లోకాలు

అధ్యాయం 4

కర్మ

కర్మ అనేది సంస్కృత పదం. దీని అర్థం చర్య. కానీ ఇది సాధారణంగా ఇప్పుడు జరుగుతున్న దానికి మరియు భవిష్యత్తులో జరగబోయే వాటికి మధ్య ఒక నిర్దిష్టమైన సంబంధాన్ని సూచించే పదంగా వాడుకలో ఉంది. విషయాలు ప్రమాదవశాత్తు, అనుకోకుండా, క్రమరహితంగా జరగవు. అవి క్రమం తప్పకుండా జరుగుతాయి; కర్మలు ఒకదానికొకటి క్రమపద్ధతిలో అనుసరిస్తాయి.

ఒక విత్తనాన్ని భూమిలో నాటితే, అది కొద్దిగా కాండాన్ని పైకి పంపుతుంది. మరియు కాండం మీద ఆకులు పెరుగుతాయి. మరియు పువ్వులు వస్తాయి. ఆపైన పండ్లు వస్తాయి. పండ్లలో మళ్లీ విత్తనాలు ఉంటాయి. నాటిన ప్రతి ఒక్క విత్తనం మరలా వరుసగా కాండం, మరియు ఆకులు మరియు పువ్వులు మరియు పండ్లు మరియు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. ఒక రకానికి చెందిన విత్తనాలు అదే రకమైన మొక్కలను ఉత్పత్తి చేస్తాయి. వరి ధాన్యము వరిమొక్కలను ఉత్పత్తి చేస్తుంది; బార్లీ బార్లీని ఉత్పత్తి చేస్తుంది; గోధుమ గోధుమలను ఉత్పత్తి చేస్తుంది; కుసుమచెట్టు, (అనగా నిండా ముండ్లుకలిగిన ఒక చెట్టు, బ్రహ్మదండి అని మరొకపేరు. దీని పూలు పచ్చగా పెద్దవిగా ఉంటాయి) కుసుమచెట్టును ఉత్పత్తి చేస్తుంది; ముండ్లజెముదు ముండ్లజెముదును ఉత్పత్తి చేస్తుంది. ఒక వ్యక్తి కుసుమచెట్టును విత్తినట్లయితే, అతను తీపి ద్రాక్ష పంటను ఆశించకూడదు; అతను ముళ్లు కలిగిన ముండ్లజెముదును నాటి, రసము కలిగిన యాపిల్‌పండ్లను దానినుండి సేకరించాలని ఆశించకూడదు. ఇది కర్మ మరియు మనుష్యుల మధ్య ఉన్న సంబంధం. మనిషి ఈ బంధాన్ని తెలుసుకోవాలి. తాను ఫలితాన్ని ఆశించే దాని యొక్క విత్తనాన్ని మాత్రమే విత్తాలి. ఇది గుర్తుంచుకోవలసిన మొదటి విషయం.

ఒక చర్య మనకు కనిపించే విధంగా చాలా సులభంగా అర్థమయ్యే విషయం కాదు. ఈ విషయాన్ని ఉదాహరణతో ఇప్పుడు గమనిద్దాం. నేను ఒక వ్యక్తిని “మీరు పట్టణానికి ఎందుకు వెళుతున్నారు?” అని అడిగాననుకోండి. అతను ఇలా జవాబిస్తాడు: “నాకు ఒక జత బూట్లు కావాలి, నేను వాటిని అక్కడనుంచి తీసుకురావాలని అనుకొంటున్నాను;” లేదా: “నేను ఒక స్నేహితుడిని చూడాలను

కుంటున్నాను. అతను పట్టణంలో ఉన్నాడని నేను అనుకొంటున్నాను;" ఈ రకంగా అనేక విధాలుగా జవాబులు రావచ్చు. కానీ ఎల్లప్పుడూ : " నేను కోరుకుంటున్నాను, నేను అనుకొంటున్నాను కాబట్టి అలా నేను ప్రవర్తించాను." ఇలా ఈ మూడు భావాలు ఎప్పుడూ కలిసే ఉంటాయి.

ఇప్పుడు ఒక కోరికను విశ్లేషిద్దాం. దీనినే వాంఛ అని కూడా అంటారు; మనము ఏదైనా పొందాలని కోరుకుంటున్నాము – అది మొదటి దశ; అప్పుడు మనం దానిని ఎలా పొందాలో ఆలోచిస్తాము – అది రెండవ దశ; అప్పుడు మనం దానిని పొందే విధంగా వ్యవహరిస్తాము – అది మూడవ దశ. ఇది సాధారణ క్రమం; ప్రతి చర్య వెనుక ఒక ఆలోచన ఉంటుంది మరియు ప్రతి ఆలోచన వెనుక ఒక కోరిక ఉంటుంది.

చర్య, ఆలోచన, కోరిక అను ఈ మూడు విషయాలు – కర్మ అనే త్రాడులో మెలితిరిగిన మూడు దారాలు. వివిధ సందర్భాలలో మన చర్యలు మన చుట్టూ ఉన్న వ్యక్తులను సంతోషంగా లేదా సంతోషించకుండా ఉండేటట్లు చేస్తాయి; మన చర్యలతో ఎదుటివారిని సంతోషపరిస్తే, మనమెప్పుడో ఆనందాన్ని ఒక విత్తనంలాగా నాటామని, అది మనకు ఇప్పుడు ఆనందాన్ని కల్పిస్తూ పెరుగుతున్నదని భావించాలి; ఒకవేళ మనం తోటి వారిని సంతోషపెట్టకపోతే, వారి విషయంలో ఎప్పుడో మనం దుఃఖాన్ని ఒక విత్తనంలాగా నాటామని, అందుకే అది మన ద్వారా వారికి అసంతృప్తిగా మారుతున్నదని భావించాలి. ఒకవేళ తోటివారిపట్ల మనం క్రూరమైన పనులు చేస్తే, ఎప్పుడో క్రూరత్వాన్ని ఒక విత్తనంలాగా నాటామని, అది ఇప్పుడు మనలో పట్ల క్రూరత్వంగా పెరుగుతున్నదని భావించాలి.

మనం మంచి పనులు చేస్తే, మనం దయను విత్తనంలా పూర్వ జన్మలో నాటితే, అది ఈ జన్మలో మన పట్ల దయగా పెరుగుతుంది. మన చర్యల ద్వారా మనం ఏమి నాటుతున్నామో అదే మనకు తిరిగి వస్తుంది. ఇది కర్మ.

అయితే ప్రతి కర్మ వెనుక ఆలోచన ఉంటుంది. ఆలోచన అంటే పనికి సంబంధించిన మన పాత్ర అని పిలువవచ్చు. మనలో ఉన్న స్వభావం మరియు మనస్సును ఈ పాత్ర తెలియ చేస్తుంది. మనం ఒక విషయం గురించి గొప్పగా ఆలోచించినప్పుడు, మన మనస్సు ఆ విషయంలా మారుతుంది. మనం దయతో ఆలోచిస్తే, మనం దయతో ఉంటాము; మనం క్రూరంగా ఆలోచిస్తే, మనం క్రూరంగా

మారతాము; మనం మోసపూరితంగా ఆలోచిస్తే, మోసపూరితంగా మారతాము; మనం నిజాయితీగా ఆలోచిస్తే మనం నిజాయితీగా ఉంటాం.

ఈ విధంగా తదుపరి జన్మలోని మన పాత్ర ఈ జన్మలోని మన ఆలోచనల ద్వారా తయారవుతుంది. మనం మళ్ళీ జన్మ ఎత్తినప్పుడు, ఇప్పుడు మన ఆలోచనల ద్వారా తయారయిన పాత్రతో మనం పుడతాము. మన స్వభావం ప్రకారం మనం ప్రవర్తించినప్పుడు, దయగల వ్యక్తి దయగా ప్రవర్తించినప్పుడు, క్రూరమైన వ్యక్తి క్రూరంగా ప్రవర్తించినప్పుడు – ఇలా ఏ రకంగా ఉంటే ఆరకంగా – మన ప్రస్తుత జన్మలోని ఆలోచనలను అనుసరించి, మన తదుపరి జన్మలోని పుట్టుకల లేదా సంఘటనల ఫలితాలు ఉంటాయని సులభంగా చెప్పవచ్చు. ఇదే కర్మ.

కానీ ఆలోచన వెనుక కోరిక ఉంది. ఇప్పుడు మనం కోరుకునే కోరిక మనం కోరుకున్న వస్తువుని తరువాత జన్మలో తీసుకువస్తుంది. అయస్కాంతం మెత్తటి ఇనుమును ఆకర్షిస్తున్నట్లుగా, కోరిక వస్తువులను ఆకర్షిస్తుంది. మనం డబ్బును కోరుకుంటే, మరొక జీవితంలో మనం ధనవంతులమయ్యే అవకాశం ఉంటుంది. మనం విద్య నేర్చుకోవాలని కోరుకుంటే, మరొక జీవితంలో మనం బాగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. మనం ప్రేమను కోరుకుంటే, మనం ప్రేమించబడే అవకాశం ఉంటుంది. మనం అధికారాన్ని కోరుకుంటే, తరువాత జన్మలో మనము అధికారికంగా శక్తిమంతమయ్యే అవకాశం ఉంటుంది. ఇదే కర్మ.

విద్యార్థి దీనిని పూర్తిగా అర్థం చేసుకునే వరకు మళ్లీ మళ్లీ ఆలోచించాలి. అతను దీనిని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే, అతను కర్మ యొక్క మరింత క్లిష్టమైన సమస్యల గురించి బాగా ఆలోచించగలడు. కర్మను ఒకే వాక్యంలో ఇలా క్లుప్తంగా చెప్పవచ్చు: మనిషి ఈ జన్మలో ఏమి నాటుతాడో అదే ఫలితాన్ని తరువాతి జన్మలో పొందుతాము. (ఎవరు చేసిన కర్మ వారు తరువాతి జన్మలో అనుభవించక తప్పదు).

కానీ విద్యార్థి ఇలా అడగవచ్చు: “ఇప్పుడు నా చర్యలు నా గత ఆలోచనల ఫలితమైతే, నా గత ఆలోచనలు అంతకు ముందున్న నా గత కోరికల ఫలితమైతే, నేను నిస్సహాయంగా బంధించబడలేదా? నేను అనుకున్నట్లుగా ప్రవర్తించాలి. నేను కోరుకున్నట్లుగా నేను ఆలోచించగలగాలి. నన్ను ఏదీ బంధించకూడదు. “ఈ భావన నిజం. కానీ కొంత వరకు మాత్రమే; ఎందుకంటే కొత్త అనుభవాలను పొందుతున్నప్పుడు మనం నిరంతరం మారుతూ ఉంటాము. జీవుడు మరింత జ్ఞానాన్ని

పొందుతాడు. ఆ జ్ఞాన సహాయంతో తన కోరికల పద్ధతిని మార్చుకునే అవకాశం ఉన్నది. మరో మాటలో చెప్పాలంటే, మనం గతంలో ఒక నిర్దిష్ట మార్గంలో కోరుకుని ఆలోచించి ప్రవర్తించాము. ఆ మార్గం కాదనుకొని ఉత్తమమైన దానిని కోరుకునే కొత్త అవకాశం, వేరే విధంగా ఆలోచించే పద్ధతి కూడా ఆ గతంలో కూడా మనకు అందుబాటులో ఉంది; కొత్త అనుభవాల ద్వారా, మనం గతంలో చేసినట్లుగా వ్యవహరించడం వల్ల కలిగే చెడు పరిణామాలను మనం గ్రహించి ఆ పద్ధతులను మానేయకలగాలి. ఈ మార్పు తరువాతి జీవితంలో ఏ సమయంలోనైనా వాస్తవంగా మారవచ్చు. (అనగా మంచిచెడులను చూడకలిగే జ్ఞానం భగవంతుడు మనకు కల్పించాడు. ఆ జ్ఞానంతో ఈ జన్మలో మంచిని ఆచరించి తరువాత జీవితంలో ఉత్తమ ఫలితాలను పొందవచ్చని భావం).

తోటివారి పట్ల తాను క్రూరంగా ప్రవర్తించానని ఒక సందర్భంలో వ్యక్తి భావించాడనుకుందాం : తన యొక్క ఈ క్రూరమైన చర్య గతంలో తన క్రూరమైన ఆలోచనల వల్ల జరిగిందని అతను భావించాలి. క్రూరత్వం ద్వారా మాత్రమే వస్తువును పొందాలనే కోరికతో తనలో ఈ రకంగా క్రూరమైన ఆలోచనలు పెరిగాయని అతను గ్రహించగలగాలి.

తన క్రూరమైన చర్యలు తోటివారి దుఃఖానికి గురిచేస్తున్నాయని, తన క్రూరత్వానికి గురయిన వ్యక్తులు తనను ద్వేషిస్తున్నారని, తనకు ఇతరులు భయపడుతున్నారని గ్రహించినప్పుడు ఒక్కొక్కనికి తన ఏకాంతంలో సంతోషము పెరుగుతుంది. క్రమంగా అతను తన క్రూరచర్యల గురించి ఆలోచిస్తాడు. ఒక్కొక్కసారి అతను మారటానికి ప్రయత్నించినా తనకు సంబంధించిన పూర్వ జన్మలోని ఆలోచనలను మరియు కోరికల ఒత్తిడిని అడ్డుకోవడం అతనికి చాలా కష్టం.

క్రూరత్వం లేకుండా పొందలేని వస్తువులను పొందాలనే కోరిక ఉన్నప్పుడు, ఎవరయినా మొట్టమొదట కష్టాల మూలాన్ని ఆలోచించాలి. తన అంతరాత్మతో ఇలా సంభాషించకలగాలి: "నేను క్రూరమైన వాటిని కోరుకోను, మరియు నేను వాటిని కోరుకోవడం ప్రారంభించినప్పుడల్లా కోరిక కష్టాలను సృష్టిస్తుందని విషయాన్ని నేను గుర్తు పెట్టుకొంటాను."

కోరిక తన ఆలోచనపై పెత్తనంచేయకుండా ప్రయత్నించి, కోరికను విశ్లేషించటానికి తన ఆలోచనను ఉపయోగించాలి. అప్పుడు కోరికలు కళ్లెం లేకుండా

పారిపోతున్న గుర్రాల వలె అతనిని దూరంగా తీసుకువెళ్ళవు. అతను క్రమంగా ఆలోచనను ఒక కవచంలా ఉపయోగించగలగాలి. అప్పుడే కోరికలు అదుపులో ఉంటాయి. ఆనందం కలిగించే విషయాలు తనకు లభించినప్పుడు మాత్రమే వాటి వెంట పరుగెత్తడానికి కోరికలను అనుమతించకలగాలి.

నేటి కాలపు యువకులలో చాలామంది తమ కోరికలతో సమానంగా పరుగుపందెంలో పాల్గొంటూ, వాటిని దాటిపోలేక వాటిపై చాలా అసంతృప్తిని పొందుతున్నారు. సక్రమమయిన కోరికలను తెలివిగా నెరవేర్చుకొని పాతకాలంలోని పెద్దలు తెలివిగా ఎదిగారు. దుఃఖ కారకమైన గతపు ఆలోచనలు దురదృష్ట వాతావరణాన్ని కలిగిస్తాయి. చెడు కోరిక వలన గత కాలంలో పొందిన దుఃఖాన్ని గుర్తుంచుకుంటే, ఆ ఆలోచన కోరికను వెనక్కి లాగుతుంది.

ఇతరులకు మరియు తనకు సంతోషాన్ని కలిగించే కోరికలను విద్యార్థి బాగా పరిశీలించాలి. దీర్ఘకాలంలో ఏ వస్తువులు ఆనందాన్ని కలిగిస్తాయో, అలాగే ఏవి దుఃఖాన్ని కలిగిస్తాయో వాటిని బాగా అధ్యయనం చేయాలి. ఆపైన అందరితో కలిసి తన పూర్తి శక్తితో అందరికి ఆనందాన్ని కలిగించే కోరికలను నెరవేర్చటానికి ప్రయత్నించాలి.

జనన మరణచక్రం నుండి తప్పించుకోవడం అనేది ఏ ప్రత్యేక జీవన విధానం ద్వారా పొందబడదని గ్రహించడం చాలా ముఖ్యం. కానీ శ్రీ కృష్ణుడు చెప్పిన ఈ మాట ఈ సందర్భంలో స్మరించాలి. "నా యందే ఏకత్వంతో స్థితుడై ఉండి, (అనగా అన్నిచోట్ల భగవంతుడున్నాడని నమ్ముతూ, ఆయనకు తనకు భేదం లేదని అంతా ఒకటే అని భావించగలగటం) సమస్త చరాచర జీవులలోను నన్నే దర్శిస్తూ, నన్నే పరమాత్మగా ఆరాధించిన యోగి, లౌకికంగా అన్ని రకాల కార్య కలాపములు చేస్తున్నప్పటికీ, నా యందే నివసిస్తాడు.[1] (ఇలా భావించ కలిగినప్పుడు జనన మరణ చక్రం నుండి తప్పించుకోవడం జీవునికి సాధ్యమని భావం–) క్షత్రియ రాజయిన జనకుడు, వైశ్య వ్యాపారి అయిన తులాధరుడు మోక్షానికి సమానంగా అర్హులయ్యారు. వారు మోక్షం కోసం అడవికి పారిపోలేదు. ప్రపంచంలో జీవిస్తూనే ప్రాపంచిక వస్తువులపై కోరిక లేకపోవడం వల్ల జనకుడు, తులాధరుడు మోక్షము పొందారు.

దేహ సంబంధము లేనివాడయి (విదేహుడు) ఎప్పుడూ మనశ్శాంతితో ఉండే జనకుడు ఒకసారి ఇలా అన్నాడు. " నాకు దేనిమీదా కోరిక కలగదు కాబట్టి నాకు

ఎటువంటి సంపదా, ప్రయోజనము లేకపోవటము అనేది లేదు. అన్నీ ఉన్నట్లే ఉంటుంది. మిథిలానగరము తగలబడిపోతున్నా నా దృష్టిలో మాత్రం అందులో ఏ ఒక్క వస్తువు తగలబడదు. ఇది నిజం."[2]

కనుకనే జనకుడు మాండవ్యునితో పై విషయాన్ని మరలా ఇలా కొంత విస్తరించి చెప్పాడు. "సంపదలు దుఃఖ నిలయాలు. సమస్యలకు మూలాలు. నాకు దేనిపైనా ఆశలేదు. అందువలన మిథిలా నగరం తగలబడుతున్నా నాకు ఏమి తగులబడినట్లు లేదు. ఈ లోకంలో కోరికలు నెరవేర్చుకోవటం వలన లభించే తృప్తి, ఆ కోరిక అదృశ్యమయితే వచ్చే ఆనందంలో పదహారవ వంతుకూడా ఉండదు. ఆవుతో పాటుగా ఆవు కొమ్ములు ఎలా పెరుగుతాయో, సంపదతో పాటు కోరిక కూడా పెరుగుతుంది. సంపదను మంచికొరకు ఉపయోగించాలి. కోరిక దుఃఖాన్ని కలిగిస్తుంది. సమస్త ప్రాణులను తనలాగా చూసుకుంటే, జ్ఞాని అన్ని దుఃఖాలనుండి విముక్తి పొందుతాడు."[3]

యాజ్ఞవల్క్య మహర్షి బోధ ద్వారా, జనక రాజు ముక్తిజ్ఞానాన్ని పొందాడు. ఆ ముక్తిజ్ఞానము అన్ని దుఃఖాలను అధిగమింపచేస్తుంది . అన్నింటికి అతీతమైన ఆ బ్రహ్మాన్ని పొందగలిగేలా చేస్తుంది.[4] ఈ విధంగా ముక్తిజ్ఞానాన్ని నేర్చుకున్న తరువాత, జనకుడు కూడా గురువుగా మారాడు. వ్యాసుడు కూడా తన కుమారుడైన శుకుడిని ముక్తిజ్ఞానాన్ని నేర్చుకోవడానికి జనకుని వద్దకు పంపాడు.[5]

జాజలి అనే గొప్ప ముని తపస్సు చేసాడు. అతని తలమీద రెండు పిచ్చికలు గూడు కట్టాయి. గుడ్లు పెట్టాయి. గుడ్లు పిల్లలయాయి. వాటికి రెక్కలు వచ్చి, తిండికి ఎగిరి వెళ్ళి తిరిగి వచ్చేవి. పిచ్చిక దంపతులు పిల్లలతో అలా తన తల మీద గూటిలో ఉంటే, జాజలి వాటిని దయతో చూసి, వాటిని తరిమేవాడు కాదు. కొంతకాలం తరువాత తాను చాలా దయాశాలినని, తపశ్శాలినని జాజలికి గర్వం కలిగింది. ఒక రోజు అతను తనలో తాను ఇలా అనుకున్నాడు: "ఈ విస్తృత సముద్రం అంచుగా కలిగిన ఈ విశాలమైన భూమిలో నాలాంటి వారు ఎవరు?" అని తనలో తాను గర్వంగా అనుకొన్నాడు. అప్పుడు ఒక స్వరం అతనికి ఇలా వినిపించింది. –. "అలాంటి గర్వపు మాటలు అనవద్దు. ఎప్పుడూ కొనడంలోనూ, అమ్మడంలోనూ విశ్రాంతి లేకుండే ఉండే తులాధరుడనేవాడు నీలా మాట్లాడడు. అతనికి నువ్వు సమానం కాదు."

అప్పుడు బ్రాహ్మణుడు సన్యాసియయిన తనతో ఒక వ్యాపారిని పోల్చి, తనకంటే అతడు అధికుడని చెప్పిన ఆ ఆకాశవాణి మాటలు విని జాజలి చాలా ఆశ్చర్యపోయాడు. జాజలి తులాధరుని స్వయంగా చూసి, తన మనస్సులోని చిక్కును పరిష్కరించుకోవడానికి బయలుదేరాడు. వారణాసి నగరానికి చేరుకున్నాడు. అక్కడ ఎవరు వస్తే వారికి అన్ని రకాల వస్తువులను అమ్ముతున్న ఒక దుకాణదారుడయిన తులాధరుని జాజలి చూసాడు.

జాజలిని చూసిన వెంటనే తులాధరుడు లేచి నిలబడి, ఆ బ్రాహ్మణునికి తగినట్లుగా నమస్కరించాడు. "పిచ్చికలు తలమీద గూడు పెట్టాయా? అవీ, వాటి పిల్లలూ నీ తలమీద సుఖంగా బతుకుతున్నాయా? మనస్సులో వికారం లేకుండా చాలా గొప్పగా తపస్సు చేస్తున్నావు. మహాత్ముడివి నువ్వు" అని తులాధరుడు జాజలిని మెచ్చుకొన్నాడు." ఓ బ్రాహ్మణా! నువ్వు నా వద్దకు దయతో వచ్చావు; నేను నీకు ఏమి సేవ చేయగలను?" అని వినయంగా అడిగాడు. జాజలి తన గతం గురించి చెప్పిన ఈ వినయపూర్వకమైన వర్తకుని చూసి ఆశ్చర్యపోయాడు. "ఎలా నా గురించి తెలుసుకున్నాడితడు?" అంటూ ఆశ్చర్యపోయాడు. "వర్తకంలో మునిగిపోయిన నువ్వు నా ధర్మం గురించి తెలుసుకొనే మహిమను ఎలా పొందావో చెప్పు"మని తులాధరుని జాజలి అడిగాడు. ఆత్రుతగా వివరణ కోసం ఒత్తిడి చేసాడు.

అప్పుడు తులాధరుడు అతనికి అందరికీ తెలిసిన, చాలా తక్కువమంది మాత్రమే ఆచరించే ప్రాచీన నీతిని జాజలితో ఇలా చెప్పాడు –

"ఇందులో కొత్తగా చెప్పేదేముంది? కొనడంలోనూ, అమ్మడంలోనూ నేను ఎవరినీ మోసం చెయ్యను. తగినంత లాభమే తీసుకుంటాను. లాభనష్టాలు ఒకేలా చూసుకుంటాను. మట్టి పెళ్ళా, బంగారం ముక్కా ఒకటే నాకు. నిందా స్తుతీ ఒక్క టే. హింసా, ఆత్మప్రశంసా నా మనస్సులో లేవు. జీవులన్నిటినీ సమానంగా దయతో చూస్తాను. భోగమూ, కీర్తీ నేను కోరుకోను. ఎవరికైనా మేలు చేసి, ఎంతో చేసానని అనుకోను. దేనిమీదా మమత పెట్టుకోను. లోకమంతటిని చిత్రంగా చూస్తాను. తామరాకుమీద నీటి బొట్టులాగ నా మనస్సు దేనిమీదా అంటి పెట్టకుండా ఉంటుంది. ఎవరినీ పొగడను. అలాగే నిందించను. కన్నీళ్లు పెట్టుకోను. ఎవరికీ భయపడను. ఇలా ఎవరికీ తప్పుచేయకుండా జీవించినప్పుడు తప్పనిసరిగా అతడు బ్రహ్మను పొందుతాడు" (మోక్షానికి అర్హుడవుతాడు).

క్రూరప్రవృత్తి వల్ల జంతువులకు, మనుషులకు కలిగే గాయాలను గురించి, త్యాగం యొక్క స్వభావం మరియు నిజమైన తీర్థయాత్ర గురించి తులాధరుడు పై విధంగా చాలా అందంగా ప్రసంగించాడు. హానిచేయని స్వభావం ద్వారా మోక్షం ఎలా పొందవచ్చో నిరూపించాడు.[6]

కామమయ ఏవాయం పురుష ఇతి, స యథాకామో భవతి తత్క్రతుర్భవతి,
యత్క్రతు ర్భవతి తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభిసంపద్యతే ॥[7]

పురుషుడు కామమయుడు. అతనికి ఎటువంటి కామముంటుందో అటువంటి సంకల్పము ఉంటుంది. ఎటువంటి సంకల్పమో అటువంటి కర్మ ఉంటుంది. ఎటువంటి కర్మ ఉంటుందో అటువంటి ఫలితముంటుంది.

తద్ ఏవ సక్తః సహకర్మణా ఏతి, లింగం మనో యత్ర నిషక్తమస్య ॥[8]

జీవునియొక్క, లింగ శరీరమున ప్రధానమగు మనసు ఏఫలమునందు ఆసక్తి కలది యగునో, ఆ ఫలమునే తన కర్మచే జీవుడు పొందుచున్నాడు.

అథ ఖలు క్రతుమయః పురుషో యథా క్రతురస్మిన్‌ల్లోకే
పురుషో భవతిఽ తథేతః ప్రేత్య భవతి ॥[9]

పురుషుడు సంకల్ప మయుడు . అతని సంకల్పం ఎలా ఉంటే, అలా ఫలితం వస్తుంది. మరణానంతరం బ్రహ్మలోకం వెళతాడు. దీన్ని క్రమముక్తి అంటారు."

(పరమాత్మ యజ్ఞమయుడు. ఈ లోకములో మానవుడు ఎట్టి పుణ్యకర్మలు చేయునో, అందుకు తగిన పుణ్య లోకములను మరణానంతరము పొందుచున్నాడు అని ఈ మంత్రానికి వేరొక అనువాదము) .

న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥[10]

కర్మలు నన్ను అంటవు. నేను కర్మఫలములలో కూడా ఆసక్తుడను కాను. ఎవరైతే నన్ను ఈవిధంగా తెలుసుకుంటారో, వారు కర్మ బంధాలలో చిక్కుకోరు.

ఈ సత్యాన్ని తెలుసుకొని, ప్రాచీనులు (మోక్షము పొందిన వారు) తమ

కర్మలను ఆచరించారు. కాబట్టి, నువ్వు కూడా ఆ ప్రాచీనుల అడుగుజాడలలో నడుస్తూ, నీ కర్తవ్యాన్ని నిర్వహించు.

యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥

త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః ॥

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥

యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥

గతసంగస్య ముక్తస్య జ్ఞానవస్థితచేతసః ।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥[11]

ఎవరి యొక్క సమస్త కర్మలు భౌతిక సుఖాల వాంఛలకు అతీతంగా ఉంటాయో, మరియు ఎవరైతే తమ సమస్త కర్మల క్రియలను జ్ఞానాగ్నిలో భస్మం చేస్తారో, అట్టివారిని జ్ఞానులు , పండితులని పిలుస్తారు.

ఇటువంటి జనులు, తమ కర్మ ఫలములపై ఆసక్తిని (మమకారం) విడిచిన పిదప, ఎల్లప్పుడూ తృప్తి తో ఉంటారు. బాహ్య వస్తు విషయములపై ఆధారపడరు. వీరు కర్మలలో నిమగ్నమయి ఉన్నా, వారు ఏమి చేయనట్టే. (కర్తలు కారు)

ఆశ లేనివాడయి, ఏదీ నాది అన్న భావన లేకుండా, మనసు ఇంద్రియములు పూర్తి నియంత్రణలో ఉంచుకున్నవానికి, శరీరంతో కర్మలు చేస్తూనే ఉన్నా ఏ పాపము అతనికి అంటదు.

అప్రయత్నముగానే లభించిన దానితో సంతృప్తి చెంది, అసూయారహితులైన వారు జీవన ద్వంద్వములకు (సుఖ-దుఃఖాలు, లాభ-నష్టాలు వంటివి) అతీతులై ఉంటారు. అన్ని విధముల పనులు చేస్తూనే ఉన్నా, గెలుపు-ఓటమిలలో సమత్వ బుద్ధి తో ఉండి, వారు తమ కర్మలచే బంధింపబడరు. (ఈ శ్లోకానికి సంబంధించిన ఆంగ్లానువాదము మూలములో లేదు-)

ఆసక్తి, దేహాభిమానము, మమకారము లేనివారు, దివ్య ఆధ్యాత్మిక జ్ఞానంలోనే తమ బుద్ధిని ఉంచినవారికి, తాము చేసే ప్రతి పనిని యజ్ఞం (భగవత్ అర్పితము) గా చేసేవారికి అన్ని రకాల కర్మలు విలీనమవుతాయి. (ఎటువంటి బంధన శక్తి లేక పోవుటయే విలీనమని ఇక్కడ అర్థము).

యదా సర్వే ప్రముచ్యంతే కామా యేఽస్య హృది శ్రితాః ।
అథ మర్త్యోఽమృతో భవతి అత్ర బ్రహ్మ సమశ్నుతే ॥

మనసులో పుట్టే అన్ని కోరికలూ ఎప్పుడు తొలగిపోతాయో,అపుడు మనిషి అమరుడు అవుతాడు. అప్పుడే అతను బ్రహ్మ ప్రాప్తిని పొందుతాడు.[12]

ఆత్మానం రథనం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇన్ద్రియాణి హయానాహుర్విషయాంస్తే షు గోచరాన్ ।
ఆత్మేన్ద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ॥

యస్త్వ విజ్ఞానవాన్భవత్యయుక్తేన మనసా సదా ।
తస్యేన్ద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః ॥

యస్తు విజ్ఞానవాన్భవతి యుక్తేన మనసా సదా ।
తస్యేన్ద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః ॥

యస్త్వ విజ్ఞానవాన్భవత్యమనస్కః సదాఽశుచిః ।
న స తత్పదమాప్నోతి సంసారం చాధిగచ్ఛతి ॥[13]

జీవాత్మను రథము ఎక్కిన వానిగా తెలుసుకో. ఈ శరీరమే రథం. బుద్ధిని రథసారథిగా, మనసును పగ్గాలుగా తెలుసుకో.

ఇంద్రియాలు గుర్రాలు. విషయ వస్తువులు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు) ఆ గుర్రాలు వెళ్ళే మార్గాలు. శరీరం, ఇంద్రియాలు, మనస్సుతో కూడిన జీవుడు భోక్త అని మహాత్ములు చెబుతారు.

ఎవడు వివేకము (ఆత్మ జ్ఞానం) పొందడో, అదుపు తప్పిన మనసు గలవాడో, ఆ ఇంద్రియాలు, రథసారధికి అదుపులో లేని గుర్రాలలాగా అదుపు తప్పుతాయి.

ఎవడు వివేకము (ఆత్మ జ్ఞానం)పొందిన వాడో, నిగ్రహవంతమైన మనసు

కలవాడో, అతని ఇంద్రియాలు, రథసారధికి అదుపులో ఉన్న గుర్రాలలాగా, వశంలో ఉంటాయి.

ఎవడు వివేకము (ఆత్మ జ్ఞానం) పొందడో, అతడు తన మనసుని అదుపులో పెట్టలేడు. అతను బ్రాహ్మీస్థితిని (బ్రహ్మమయిన దైవంలో స్థాపించబడిన స్థితి) పొందలేడు. సంసారంలోకి పడిపోతాడు.

సూచికలు

1. భగవద్గీత 06 వ అధ్యాయము–31 వశ్లోకం.
2. మహాభారతం శాంతిపర్వం – 173 వశ్లోకం
3. మహాభారతం శాంతిపర్వం, 327వశ్లోకం
4. పూర్తి పాఠం కోసం యాజ్ఞవల్క్యుడు జనక రాజుతో చేసిన గొప్ప ఉపన్యాసం చూడండి మహాభారతం శాంతిపర్వం, 219– 313
5. పై పుస్తకంలోనే 326– 328
6. మహాభారతం శాంతిపర్వం 261
7. బృహదారణ్యకోపనిషత్ నాలుగవ అధ్యాయము – నాలుగవ బ్రాహ్మణకము– 04 వ మంత్రం.
8. పై పుస్తకంలోనే 06 వమంత్రం
9. ఛాందోగ్యోపనిషత్ – మూడవ అధ్యాయము– 14 వఖండము– 01వ మంత్రం
10. భగవద్గీత 04 వ అధ్యాయము–14, 15శ్లోకాలు
11. భగవద్గీత 04 వ అధ్యాయము–19 నుండి 23 శ్లోకాలవరకు
12. కఠోపనిషత్ అధ్యాయము 02 మంత్రం 14

13 కఠోపనిషత్ అధ్యాయము 01 03 వ వల్లీ 03,04, 05,06, 07 మంత్రాలు

అధ్యాయం 5

త్యాగం

"త్యాగాలు చేయడం" అనే ఆలోచన భారతదేశంలో చాలా సుపరిచితం. అయితే, త్యాగాలన్నింటికీ ఆధారమైన సూత్రాన్ని ఒక విద్యార్థి అర్థం చేసుకోవాలి. అప్పుడే ప్రతి ఒక్కరూ ఇతరుల మేలు కోసం తమను తాము త్యాగం చేసుకోవాలని, మరియు ఇతర వస్తువుల త్యాగాలన్నీ చివరికి ఒక వ్యక్తి తనను తాను ఎలా త్యాగం చేసుకోవాలో నేర్పడానికే ఉద్దేశించినవని అతను గ్రహించగలడు.

ఈ సృష్టి త్యాగంతో కూడుకొని ఉన్నదని విద్యార్థి మొదటగా గ్రహించవలసిన విషయం. ఈ అనంత ప్రకృతిలో ఈశ్వరుడు తనకు తాను హద్దు పెట్టుకుంటాడు. తనను తాను పరిమితం చేసుకుంటాడు. శ్రుతి మరియు స్మృతి కూడా ఈ సత్యాన్ని ప్రకటించాయి. ఋగ్వేదంలోని పురుష సూక్తంలో మరియు భగవద్గీతలో ఈ విషయాలు చర్చింపబడ్డాయి. జీవుల పుట్టుకకు కారణమయ్యే లాంఛనప్రాయమైన త్యాగాన్ని శ్రీ కృష్ణుడు భగవద్గీతలో సూచించాడు.[1]

పదార్థంలో లీనమవడాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో "మరణం" అంటారు. తనకు చెందిన అంశములు కలిగిన , అనంతమైన వివిధ రూపాలలో పదార్థంలో తన శక్తులన్నింటినీ అభివృద్ధి చేయకలిగిన జీవులను సృష్టించడానికి, ఈశ్వరుడు ఈ విధంగా త్యాగం చేసాడు. ఇది ప్రాథమిక త్యాగం. ఈ త్యాగ భావనపై ధర్మశాస్త్రమంతా ఆధారపడి ఉంటుంది. ఇతరుల ప్రయోజనం కోసం జీవితాన్ని ధారపోయడమే త్యాగమని, త్యాగం యొక్క అర్థాన్ని కూడా ధర్మశాస్త్రం వివరిస్తుంది.

త్యాగ నియమం – జీవుల జీవన నియమం

త్యాగ నియమం అనేది అన్ని జీవులకూ జీవన నియమం. వాటి ఎదుగుదల ప్రారంభ దశలలో, జీవులను బలవంతంగా త్యాగం చేస్తారు. తద్వారా అవి తమ ఇష్టానికి లేదా జ్ఞానానికి వ్యతిరేకంగా, అనివార్యంగా అభివృద్ధి చెందుతాయి. వాటి రూపాలు హింసాత్మకంగా విడదీయబడి, కొద్దిగా మరింత అభివృద్ధి చెందిన కొత్త రూపాలలోకి నెట్టబడతాయి.

ఈ విధంగా :

k ఖనిజ రాజ్యంలోని జీవులు తమ ఖనిజ శరీరాలు మొక్కల పోషణకు విచ్ఛిన్నం కావడంతో వృక్ష రాజ్యానికి వెళ్ళడానికి సిద్ధపడతాయి.

k వృక్ష రాజ్యంలోని జీవులు తమ వృక్ష శరీరాలు జంతువుల జీవితానికి మద్దతుగా విచ్ఛిన్నం కావడంతో జంతు రాజ్యానికి వెళ్ళడానికి సిద్ధపడతాయి.

k జంతు రాజ్యంలోని జీవులు తమ శరీరాలు ఇతర జంతువులకు, అనాగరికులకు మరియు కొన్ని రకాల మనుషులకు మద్దతుగా విచ్ఛిన్నం కావడంతో మానవ రాజ్యానికి వెళ్ళడానికి సిద్ధపడతాయి.

k మానవ రాజ్యంలోని జీవులు కూడా నరమాంస భక్షణ, యుద్ధం వంటి వాటిలో తమ మానవ శరీరాలు ఇతర మానవ జీవితాలకు మద్దతుగా విచ్ఛిన్నం కావడంతో ఉన్నత జాతులలోకి ఎదగడానికి సిద్ధపడతాయి.

"ఖనిజ రాజ్యంలోని జీవులు" అంటే ఖనిజాలలో లేదా రాళ్ళలో ఉండే జీవశక్తిని సూచిస్తుంది.

ఇక్కడ "జీవులు" అన్న పదం సాధారణంగా మనం అర్థం చేసుకునే కదిలే, శ్వాసించే ప్రాణుల వలె కాకుండా, ప్రాణం లేనివిగా కనిపించే ఖనిజ పదార్థాలలో కూడా ఉండే ఒక రకమైన అంతర్గత శక్తి లేదా స్పృహని తెలియజేస్తుంది. వేదాంతపరంగా, ప్రతి వస్తువులోనూ ఒక జీవశక్తి లేదా ఆత్మ ఉంటుందని భావిస్తారు. ఆ సిద్ధాంతం ప్రకారం, ఖనిజాలు కూడా ఒక జీవన దశలో ఉంటాయి. ఈ జీవశక్తి త్యాగం ద్వారా (అంటే ఖనిజాలు విచ్ఛిన్నమై మొక్కలకు పోషకాలుగా మారడం ద్వారా) ఉన్నత రూపాలైన వృక్షాలుగా మారుతుందని ఈ తత్వశాస్త్రం వివరిస్తుంది.)

(– అనువాద కర్త వివరణ)

పైన చెప్పిన అన్ని సందర్భాలలోను తమ అంగీకారం లేకుండానే జీవులు తమ శరీరాలను అసంకల్పితంగా ఇతరుల ప్రయోజనం కోసం త్యాగం చేసారు. ఆ తరువాత అసంఖ్యాక యుగాల తర్వాత త్యాగధర్మము యొక్క సార్వజనీనతను గుర్తించి, జీవుడు, తన చుట్టూ ఉన్నవారి మేలు కోసం ఉద్దేశపూర్వకంగా తన స్వంత ఉపాధిని (శరీరాన్ని) త్యాగం చేయడం ప్రారంభించాడు.

దీనిని ఆత్మత్యాగం అంటారు. ఈ ఆత్మత్యాగం జీవుని యొక్క దివ్యత్వాన్ని చూపిస్తుంది. జీవుడు ఈశ్వరుని దయా స్వభావానికి ఈ ఆత్మత్యాగం ద్వారా సాక్ష్యంగా నిలుస్తాడు.

మహాభారతంలో ఈ ఆత్మత్యాగం గురించి ఒక అద్భుతమైన కథ చెప్పబడింది.

ఒక ముని అయిన త్వష్ట ప్రజాపతి కుమారుడు విశ్వరూపుడు. ఇతనిని ఇంద్రుడు సంహరిస్తాడు. త్వష్ట ప్రజాపతి ఇంద్రుని సంహరించే కొడుకును కోరుకొని ఒక పెద్ద యజ్ఞం ప్రారంభించాడు. యజ్ఞపరిసమాప్తి సమయానికి యజ్ఞ గుండం నుండి ఒక పెద్దరూపం వచ్చి బ్రహ్మాండం అంతా వ్యాపించింది. ఆ భయంకర రాక్షస రూపానికి వృత్రాసురుడు అని నామకరణం చేసారు. రాక్షసులకు నాయకత్వం వహిస్తున్న వృత్రాసురుడు, ఇంద్రుడిని అతని సైన్యాన్ని యుద్ధంలో ఓడించి, అతనిని రాజధాని అమరావతి నుండి తరిమివేసి, అతని సార్వభౌమాధికారాన్ని తీసుకున్నాడు. దేవతల రాజయిన ఇంద్రుడు రాక్షసుడయిన వృత్రాసురుని వలన చాలా బాధపడ్డాడు. దేవతలు చాలా కాలం పాటు ప్రవాసంలో(పరదేశగమనం) తమ రాజు ఇంద్రునితో కలిసి తిరిగారు. తమ రాజధానిని తిరిగి పొందేందుకు దేవతలు పదే పదే ప్రయత్నించారు. కానీ మళ్లీ మళ్లీ ఓడిపోయారు. ఒక ఋషి యొక్క న్యాయమైన కోపాన్ని మరొక ఋషి యొక్క స్వచ్ఛంద స్వీయ త్యాగం మరియు జాలితో తప్ప తగ్గించలేమని చివరికి దేవతలు తెలుసుకున్నారు. పవిత్రమైన వ్యక్తి స్వీయ త్యాగంతో ఇచ్చిన తనశరీరపు ఎముకలతో చేసిన వజ్రాయుధంతో తప్ప మరే ఇతర ఆయుధం ద్వారా వృత్రాసురుని చంపలేమని దేవతలు తెలుసుకొన్నారు.

దేవతలు ఆత్రుతగా దధీచి ముని వద్దకు వెళ్లి తమ బాధాకరమైన గాథను అతనికి చెప్పారు. దధీచి వారి కథ విని జాలితో నిండిపోయాడు. “నా శరీరాన్ని మీకు నచ్చిన విధంగా ఉపయోగించుకోవడానికి నేను మీకు నా శరీరాన్ని ఇష్టపూర్వకంగా ఇస్తున్నాను.” అని వారితో దధీచి అన్నాడు : ఆ తరువాత దేవశిల్పి విశ్వకర్మ ఎముకలు తీసుకొనే ప్రయత్నంలో స్వచ్ఛత మరియు తపస్సుతో మెరుస్తున్న దధీచి శరీరంపై మొరటుగా బాధాకరంగా తన చేతిని వేయలేకపోయాడు. కుంచించుకుపోయాడు. అప్పుడు దధీచి చిరునవ్వుతో “ఈ శరీరాన్ని ఉప్పుతో కప్పండి; ఆవుల మందను ఇక్కడకు తీసుకురండి; అవి ఉప్పును నా మాంసంతో కలిసి తింటాయి; అప్పుడు మీకు అవసరమైన ఎముకలను మీరు తీసుకోండి; అప్పుడు ఈ శరీరంలో

ఏదీ వృథా చేయబడ"దన్నాడు : దధీచి చెప్పినట్లే జరిగింది. ఆ అద్భుతమైన దధీచి త్యాగశక్తి ముందు వృత్రాసురుని అమితమైన పరాక్రమం ఓడిపోయింది.[2]

మన భారతదేశంలో జీవుడు ఋషుల బోధల ద్వారా ఈ ఉత్తమోత్తమ త్యాగ దశ వరకు నడిపించబడ్డాడు. ఎవరయినా త్యాగం చేసిన వెంటనే దాని ఫలితం వెంటనే కనబడదు. ఒక వ్యక్తి ఇతరులకొరకు త్యాగం చేసినప్పుడు, భవిష్యత్తులో తాను త్యాగం చేసిన దానికంటె రెట్టింపు బహుమతులు రెట్టింపు పొందుతాడనే ఉత్తమ మార్గాన్ని ఋషులు మనకు బోధించారు. ఒక వ్యక్తి తన వస్తువులలో కొన్నింటిని త్యాగం చేసిన సందర్భంలో భౌతికంగా అవి తనకు దూరమయి కనిపించని వస్తువులుగా లెక్కించబడతాయి. కాని ఈ త్యాగపు చర్య – తాను ఇచ్చిన వానికంటే రెట్టింపు ప్రయోజనాలను. భవిష్యత్తులో ప్రసాదిస్తుందనే వాగ్దానాన్ని ఋషులు తెలియ చేసారు. మరణం తరువాత స్వర్గములో సుఖాలను పొందటానికి , ఇలాంటి త్యాగాలు చేయడం అవసరమని, అలాగే త్యాగబుద్ధితో స్వార్థాన్ని వీలయినంతగా తిరస్కరించాలని మహనీయుల జీవిత చరిత్రలు మనకు నేర్పుతున్నాయి. త్యాగం చేయడం ఈదేశంలో ఒక అలవాటుగా మారింది. ఇది గమనార్హం. ఇతరుల కోసం తన సంపదలను త్యాగం చేయాలని, , ఇతరుల సేవలో తనను తాను త్యాగం చేయడమే కర్తవ్యమని ఉత్తమ మానవుడు భావించాడు. ఆ సేవ చేయడం ద్వారా లభించే ఆనందమే తనకు లభించే ప్రతిఫలముగా మానవుడు కనుగొన్నాడు.

ఈ త్యాగాలలో బోధించబడిన మరొక పాఠం ఏమిటంటే, మానవునికి తన చుట్టూ ఉన్న అన్ని జీవులకు సంబంధం ఉన్నది; అతను ఒంటరివాడు కాదు. అతని జీవితం ఏకాంత జీవితం కాదు. అన్ని జీవితాలు పరస్పరం ఆధారపడి ఉంటాయని ఈ పరస్పర ఆధారపడటాన్ని జీవులు గుర్తించినప్పుడే శాశ్వతంగా అభివృద్ధి చెందగలరని తెలుసుకోవాలి. దేవతలకు, ఋషులకు, పూర్వీకులకు, మనుష్యులకు మరియు జంతువులకు ప్రతిరోజూ మానవుడు త్యాగం చేయాలని ఋషులు బోధించారు. (1. బ్రహ్మ యజ్ఞం –వేద పఠనం,2. దేవ యజ్ఞం –వైశ్వదేవం, 3. పితృ యజ్ఞం, 4. మనుష్య యజ్ఞం, 5. భూత యజ్ఞం అనువాటిని ఇక్కడ త్యాగాలుగా పేర్కొన్నారు–) తన జీవితాన్ని సుసంపన్నం చేయడానికి దేవతలకు, ఋషులు, పూర్వీకులు త్యాగం చేసినందున, అతను వారికి ఋణం తీర్చుకోవాలని పెద్దలు త్యాగ మార్గాలను చూపించారు. ఇతరుల శ్రమ ఫలితాలతో తాను సమాజంలో

జీవిస్తున్నందువలన, మానవుడు నిజాయితీతో, తాను కూడా ఇతరుల కోసం జీవించాలి. త్యాగమార్గం సరైనది. అది తప్పనిసరిగా ప్రతి వ్యక్తి ఆచరించవలసినది. ఇతరుల త్యాగానికి మానవుడు ఎప్పుడూ ఋణపడి ఉంటాడు.

తన గుర్తింపు తల్లిదండ్రులు, ఈశ్వరుడు, ప్రకృతి వలన కలిగినదని ఒక వ్యక్తి గుర్తించినప్పుడు, అతని త్యాగం ఆనందంగా మారుతుంది. ఇతరుల కోసం జీవితాన్ని ధారపోయడం అనేది తనలోని సహజమైన దైవిక శక్తుల యొక్క సంతోషకరమైన చర్యగా భావించబడుతుంది. "సమాజం నుంచి తాను ఎంత ఎక్కువ తీసుకోగలడు, ఎంత తక్కువ ఇవ్వగలడు" అని చూడకుండా, "ఎంత తక్కువ తీసుకోగలడు మరియు ఎంత ఎక్కువ ఇవ్వగలడు" అని ప్రతి మానవుడు ప్రయత్నించాలి. తన శరీర రక్షణ కొరకు సమాజం నుంచి ఏఏ జీవరూపాల మద్దతు తీసుకుంటున్నాడో ప్రతి వ్యక్తి చాలా జాగ్రత్తగా గమనించాలి. తన శరీర రక్షణ కొరకు తన కంటె బలహీనమయిన జీవ రూపాలను నాశనం చేసి వాటికి కలిగించే బాధలను అత్యల్ప స్థాయికి తగ్గించడానికి ప్రయత్నించాలి. తెలివికలిగిన జీవ రూపాలకు బాధ కలిగించే ఆహారాలు మరియు వినోదాలను ప్రతి వ్యక్తి విడిచిపెట్టగలగాలి. "సర్వ జీవులకు స్నేహితుడు" కావడానికి ప్రయత్నించాలి. ఇది త్యాగ పురుషుని మార్గం.

జంతువులను జంతువులు, మనుషులు మనుషులను వేటాడడం మరియు ఆహారం లేదా క్రీడ కోసం మనుషులచే జంతువులను వధించడం, జీవ పరిణామంలోని కొన్ని దశలలో అవసరమైన నైపుణ్యాలు మరియు శక్తుల అభివృద్ధికి అవసరమని మానవుడు గ్రహించాడు. మానవులు వీటి నుండి క్రమంగా అభివృద్ధి చెందాలి. మృదుత్వం, సానుభూతి మరియు సున్నితత్వం యొక్క సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. బలహీనమైన మనస్తత్వం కలవారిని వారికి ఆత్మ హత్య చేసుకొనే పరిస్థితులు రాకుండా, చిన్న వయస్సులోనే వారికి సహాయం చేయటానికి ప్రయత్నించాలి.

ఒక వ్యక్తి పరిపక్వం చెందని తన చిన్న వయస్సులో ఇతరులతో ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా కలిసి మెలిసి జీవిస్తాడు.ఇదే పద్ధతిలో అదే వ్యక్తి పెద్దవాడయిన తరువాత కూడా తన తోటివారితో కలిసి మెలిసి జీవిస్తే, ఆ ఐక్యతా ఆలోచనలలో జీవిస్తుంటే, విశ్వానికి తండ్రి అయిన ఈశ్వరుని నుండి ఆ వ్యక్తి నిజంగా వేరు కాదు. ఈశ్వరుడు అందరి కోసం వివిధ రూపాలలో సృష్టిలో

జీవిస్తున్నట్లుగా, తాను కూడా ఇతరుల కోసం జీవించడమే ఉత్తమమయిన పనిగా ప్రతి వ్యక్తి భావించాలి. తోటివారి కోసం జీవించే భగవంతుని గుణాలు ప్రవహించే మార్గంగా తన జీవితం మారడంలోనే నిజమైన ఆనందం ఉన్నదని, ఈశ్వరుని అభీష్టాన్ని నెరవేర్చే సాధనంగా తాను ఉన్నానని ప్రతి వ్యక్తి నెమ్మదిగా తెలుసుకోవాలి. అప్పుడు అతను చేసే ప్రతి కర్మ కూడా తాను ఈశ్వరునికి చేసే త్యాగమవుతుంది. ఇలా ప్రవర్తించే వ్యక్తి యొక్క కర్మఫలితాలు అతనిని బంధించవు. అందువలన త్యాగ మార్గమే, జన్మ బంధనాలనుంచి విముక్తి కలిగించే మోక్షమార్గంగా మారుతుంది.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వమేష వోఽ_స్త్విష్టకామధుక్ ॥

దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥

యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్ ॥

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః ।
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ ।
తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥[3]

సృష్టి ప్రారంభంలో, బ్రహ్మ దేవుడు, మానవజాతిని వాటి విధులతో పాటుగా సృష్టించి ఇలా చెప్పాడు, “ఈ యజ్ఞములను ఆచరించటం ద్వారా వృద్ధి చెందండి. ఇవే మీ సమస్త కోరికలను తీరుస్తాయి.”

మీ యజ్ఞముల ద్వారా దేవతలు ప్రీతి చెందుతారు. దేవతల, మనుష్యుల పరస్పర సహకారం వలన అందరికీ శ్రేయస్సు/సౌభాగ్యం కలుగుతుంది.

యజ్ఞములు చేయటము వలన తృప్తి చెందిన దేవతలు, మానవ జీవిత నిర్వహణకు అవసరమైన అన్నింటిని ప్రసాదిస్తారు. తమకు ఇవ్వబడిన దానిని, దేవతలకు తిరిగి నివేదించకుండా, తామే అనుభవించే వారు, నిజానికి దొంగలే.

యజ్ఞములో మొదట నివేదించగా మిగిలిన ఆహారమునే భుజించే, ఆధ్యాత్మిక మనసున్న సత్పురుషులు సర్వ పాపముల నుండి ముక్తులవుతారు. తమ భోగమునకే అన్నం వండుకునే వారు పాపమునే భుజింతురు.

ప్రాణులు అన్నీ ఆహారం వలననే జీవిస్తాయి. ఆహారం వర్షముల వలన పుడుతుంది. యజ్ఞములు చేయటం వలన వానలు కురుస్తాయి. నిర్దేశింపబడిన కర్తవ్యముల (విహిత కర్మలు) ఆచరణచే యజ్ఞము పుడుతుంది.

మానవులు చేయవలసిన విహిత కర్మలు (కర్తవ్యములు) వేదములలో చెప్పబడ్డాయి. వేదములు ఆ భగవంతుని నుండే వ్యక్తమయ్యాయి. కాబట్టి సర్వ వ్యాపి అయిన భగవంతుడు ఎప్పుడూ యజ్ఞ కార్యములలో స్థితుడై ఉంటాడు.

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥[4]

ఈ లోకంలో లౌకిక కర్మలలో విజయం కోసం కోరికతో ఉండేవారు దేవతలను పూజిస్తారు. అలా చేయటం వలన కర్మల వలన కలిగే సిద్ధులు వారికి త్వరగానే లభిస్తాయి.

ఆ వాం రాజానావధ్వరే వవృత్యాం హవ్యేభిరిన్ద్రావరుణా నమోభిః ।
అస్మే ఇన్ద్రావరుణా విశ్వవారం రయిం ధత్తం వసుమన్తం పురుక్షుమ్ ।
ఇయమిన్ద్రం వరుణమష్ట మే గీః ప్రావత్తోకే తనయే తూతుజానా ॥[5]

ఓ రాజయిన ఇంద్రుడా! వరుణుడా! ఈ యజ్ఞమందు హవ్యము (దేవతలకు ఈయదగిన అన్నము.) మరియు స్తుతులచే మీరు వల్లింపబడిరి. (మరలమరల పఠించబడిరి).

ఓ యింద్రావరుణులారా! మాకు అందరు కోరుకొనే చక్కని నివాసస్థానమును, పుష్కలమైన సంపదను, ఆహారమును, విశిష్ట ధనమును దీవెనలను ఇవ్వండి.

మా ఈ స్తుతి యింద్రావరుణులకు చేరును గాక! మేము పఠించిన యీ స్తుతి మా పుత్ర పౌత్రుల విషయములో మమ్ము రక్షించుగాక!

ఏతేషు యశ్చరతే భ్రాజమానేషు
యథాకాలం చాహుతయో హ్యాదదాయన్ ।
తం నయన్త్యేతాః సూర్యస్య రశ్మయో
యత్ర దేవానాం పతిరేకోఽధివాసః ॥

ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః
సూర్యస్య రశ్మిభిర్యజమానం వహన్తి ।
ప్రియాం వాచమభివదన్త్యోఽర్చయన్త్యః
ఏష వః పుణ్యః సుకృతో బ్రహ్మలోకః ॥[6]

ప్రజ్వలిస్తున్న అగ్నిలో సరియైన సమయంలో ఆహుతులు (=హోమము చేయునప్పుడు అగ్నిలో వేయు దేవతలకు ఇచ్చు హవ్యములు లేదా అన్నములు) ఎవరు వేస్తారో అతనిని ఆహుతిపొందిన కర్మదేవతలు సూర్యుని కిరణాల ద్వారా ఎక్కడ దేవతల నాయకుడు ఒక్కడే అయినవాడు – నివసిస్తాడో అక్కడికి తీసుకుపోతాయి. (ఎవరు ప్రజ్వలిస్తున్న అగ్నిలో సరియైన సమయంలో ఆహుతులు వేస్తారో, వాటిని ఆయా దేవతలు సూర్యమార్గం ద్వారా స్వర్గలోకానికి తీసుకువెళ్తాయని భావం–) ప్రకాశించే కర్మదేవతలు ఆ యజమానిని 'రండి, రండి,' అని ఆహ్వానించి, 'ఈ స్వర్గం మీరు చేసుకున్న సత్కర్మల ఫలితంగా లభించింది.' అని ప్రియవచనాలు పలికి, సూర్యుని కిరణాల ద్వారా అతనిని తీసుకువెళతారు.

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥[7]

ఓ కురు వంశ శ్రేష్ఠుడా! యజ్ఞము యొక్క రహస్యము తెలిసినవారు, దానిని ఆచరించి, అమృతతుల్యమైన దాని శేషము స్వీకరించి, పరమ సత్యం దిశగా పురోగమిస్తారు. ఏ విధమైన యజ్ఞము చేయని వారు, ఈ లోకంలో గాని, పరలోకంలో గాని ఎటువంటి సుఖమును పొందజాలరు.

గతసంగస్య ముక్తస్య జ్ఞానవస్థితచేతసః ।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥[8]

అటువంటి వారు ప్రాపంచిక అనుబంధాల నుండి విముక్తి చేయబడుతారు. మరియు వారి బుద్ధి దివ్య ఆధ్యాత్మిక జ్ఞానంలో ఉంటుంది. వారు చేసే ప్రతి పని, యజ్ఞం (భగవత్ అర్పితము) గా ఉంటుంది కాబట్టి వారు అన్ని రకాల కర్మ ప్రతిచర్య నుండి విముక్తి చేయబడుతారు.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥[9]

ఓ కుంతీ పుత్రుడా! నీవు ఏ పని చేసినా, నీవు ఏది తిన్నా, నీవు యజ్ఞములో అగ్నికి ఏది సమర్పించినా, నీవు ఏది బహుమతిగా దానం ఇచ్చినా, మరియు ఏ నిష్ఠలను ఆచరించినా వాటిని నాకు సమర్పించినట్టుగా చేయుము.

శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ॥[10]

అన్ని పనులను నాకే అర్పితం చేయటం ద్వారా, నీవు శుభ–అశుభ ఫలితముల బంధనముల నుండి విముక్తి చేయబడుతావు.

సూచికలు

1. భగవద్గీత 08 వ అధ్యాయము–03 వశ్లోకం.
2. ఉదాహరించబడిన భారత గ్రంథం వనపర్వం 100.
3. భగవద్గీత 03 వ అధ్యాయము–10నుండి 15 వశ్లోకం వరకు.
4. భగవద్గీత 04వ అధ్యాయము–12 వశ్లోకం.
5. ఋగ్వేదంలోని 7వ మండలం 84 వ సూక్తము లోని 01 వ మంత్రం, 04 వమంత్రం, 05 వమంత్రం.
6. ముండకోపనిషత్తు 01 వ ముండకం ద్వితీయ ఖండం 05 వమంత్రం, 06 వమంత్రం.
7. భగవద్గీత 04 వ అధ్యాయము–31 వశ్లోకం.
8. భగవద్గీత 04 వ అధ్యాయము–23 వశ్లోకం.
9. భగవద్గీత 09 వ అధ్యాయము–27 వశ్లోకం.
10. భగవద్గీత 09 వ అధ్యాయము–28 వశ్లోకం.

అధ్యాయం 6

కనిపించు మరియు కనిపించని ప్రపంచాలు

మన చుట్టూ ఉన్న ప్రపంచం మనందరికీ తెలుసు. మనం దాన్ని చూడగలం, వినగలం, తాకగలం, రుచి చూడగలం, వాసన చూడగలం. ఈ ప్రపంచంలో మన ఇంద్రియాలు గ్రహించలేని అనేక భాగాలు ఉన్నాయని సైన్స్ చెబుతుంది. మన కళ్ళకు కనిపించనంత చిన్నవిగా, మన ఇంద్రియాలకు అందనంత సూక్ష్మంగా ఉండేవి చాలా ఉన్నాయి. మనం చూడలేకపోయినా, సైన్స్ చెప్పే ఈ భాగాలు కూడా భౌతికంగానే ఉంటాయి, కాకపోతే మనకు కనిపించవు. ఇవి మన ప్రపంచంలో భాగమే. ఘనపదార్థాలు, ద్రవాలు, వాయువులు, మరియు ఈథర్‌లు అన్నీ ఒకే రకమైన పరమాణువులతో కూడి ఉన్న భౌతిక పదార్థంలో భాగం.

(అనువాద కర్త వివరణ)

"ఘనపదార్థాలు, ద్రవాలు, వాయువులు, మరియు ఈథర్‌లు అన్నీ ఒకే రకమైన పరమాణువులతో కూడి ఉన్న భౌతిక పదార్థంలో భాగం" అనే వాక్యం పదార్థం యొక్క ప్రాథమిక నిర్మాణాన్ని వివరిస్తుంది. దీనిని కొంచెం వివరంగా చూద్దాం :

పదార్థం యొక్క స్థితులు

మన చుట్టూ ఉన్న ప్రతిదీ పదార్థం (matter). ఈ పదార్థం సాధారణంగా నాలుగు ప్రధాన స్థితులలో ఉంటుంది:

1. **ఘనపదార్థాలు (Solids)** : ఇవి నిర్దిష్ట ఆకారం, పరిమాణం కలిగి ఉంటాయి. వీటిలోని పరమాణువులు లేదా అణువులు చాలా దగ్గరగా, నిర్దిష్ట అమరికలో బంధించబడి ఉంటాయి. ఉదాహరణకు, రాయి, ఇనుము, కలప.

2. **ద్రవాలు (Liquids) :** వీటికి నిర్దిష్ట ఆకారం ఉండదు, కానీ నిర్దిష్ట పరిమాణం ఉంటుంది. ఇవి ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర ఆకారాన్ని సంతరించుకుంటాయి. వీటిలోని పరమాణువులు లేదా అణువులు ఘనపదార్థాల కంటే కొంచెం వదులుగా, ఒకదానికొకటి జారుతూ ఉంటాయి. ఉదాహరణకు, నీరు, పాలు, నూనె.

3. **వాయువులు (Gases) :** వీటికి నిర్దిష్ట ఆకారం గానీ, పరిమాణం గానీ ఉండదు. ఇవి ఏ పాత్రలో ఉంచితే ఆ పాత్ర మొత్తాన్ని ఆక్రమిస్తాయి. వీటిలోని పరమాణువులు

లేదా అణువులు చాలా దూరంగా, వేగంగా కదులుతూ ఉంటాయి. ఉదాహరణకు, ఆక్సిజన్, గాలి, కార్బన్ డయాక్సైడ్.

4. **ఈథర్‌లు (Ethers) :** ఈ వాక్యంలో 'ఈథర్‌లు' అనే పదం ఆధునిక భౌతిక శాస్త్రంలో సాధారణంగా ఉపయోగించే 'ఈథర్' (ఒక రసాయన సమ్మేళనం) లేదా చారిత్రాత్మకంగా విశ్వాన్ని నింపే ఒక ఊహాత్మక మాధ్యమం (luminiferous aether) అనే అర్థంలో కాకుండా, పదార్థం యొక్క మరింత సూక్ష్మమైన లేదా ఉన్నతమైన స్థితిని సూచించడానికి వాడబడింది. ఇది ఘన, ద్రవ, వాయువుల కంటే కూడా సూక్ష్మమైన, ఇంద్రియాలకు గోచరం కాని ఒక స్థితి. కొన్ని ఆధ్యాత్మిక లేదా తాత్విక సందర్భాలలో 'ఆకాశం' లేదా 'ప్రాణశక్తి' వంటి వాటికి దగ్గరగా దీనిని ఉపయోగిస్తారు. ఇది మన భౌతిక ప్రపంచంలో కనిపించని, కానీ సైన్స్ ద్వారా గుర్తించబడే శక్తి క్షేత్రాలు లేదా కణాలు (ఉదాహరణకు, ప్లాస్మా లేదా బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ వంటి అత్యంత శక్తివంతమైన పదార్థ స్థితులు) లేదా ఇంకా సూక్ష్మమైన రూపాలను సూచిస్తుంది.

ఒకే రకమైన పరమాణువులతో కూడి ఉండటం

పైన పేర్కొన్న అన్ని పదార్థ స్థితులు ఘన, ద్రవ, వాయు, మరియు ఈథర్ (ఇక్కడ సూక్ష్మ స్థితిని సూచిస్తుంది) అన్నీ కూడా పరమాణువులతోనే (atoms) నిర్మితమై ఉంటాయి. ఈ పరమాణువులు అన్నిటికీ ప్రాథమిక నిర్మాణ విభాగాలు. ఉదాహరణకు, ఒక మంచు ముక్క (ఘన), నీరు (ద్రవం), మరియు నీటి ఆవిరి (వాయువు) అన్నీ కూడా ఒకే రకమైన హైడ్రోజన్ మరియు ఆక్సిజన్ పరమాణువులతో ($H2O$) ఏర్పడతాయి. వాటి మధ్య బంధాలు మరియు కణాల అమరికలో తేడా ఉండటం వల్ల అవి వేర్వేరు స్థితులలో ఉంటాయి.

ఈథర్ అనే భావన వచ్చినప్పుడు, అది కూడా ఈ ప్రాథమిక పరమాణు నిర్మాణాల నుండే ఉద్భవించిన లేదా వాటితో సంబంధం ఉన్న ఒక సూక్ష్మ రూపంగా పరిగణించబడుతుంది. అంటే, స్థూలంగా కనిపించే ఘనపదార్థం నుండి అత్యంత సూక్ష్మమైన ఈథర్ వరకు, పదార్థం యొక్క అన్ని రూపాలు అంతిమంగా ఒకే ప్రాథమిక నిర్మాణ యూనిట్, అంటే పరమాణువులచే నిర్మించబడతాయి.

సారాంశం : మనం చూసే, చూడలేని పదార్థం యొక్క అన్ని రూపాలు, వాటి స్థితులు వేరువేరుగా ఉన్నప్పటికీ, మూలతః అన్నీ పరమాణువులతోనే నిర్మితమై

ఉంటాయి. ఈ పరమాణువులు వివిధ స్థితులలో వేర్వేరుగా అమరి ఉండటం వల్ల పదార్థం ఘన, ద్రవ, వాయు, లేదా మరింత సూక్ష్మమైన "ఈథర్" వంటి రూపాలలో వ్యక్తమవుతుందని భావం)

ఈ ప్రపంచంలో భాగం కాని, మనకు కాని కొన్ని ఇతర ప్రపంచాలు ఉన్నాయని మనం పెద్దల ద్వారా విన్నాము, అవి చనిపోయిన తరువాత ఈ భూమి నుండి మానవులు వెళ్ళే లోకాలు. మనము త్రిలోకాల (మూడు లోకాలు) గురించి చదువుతాము. ప్రతి ఒక్కరూ వీటి గురించి కొంత తెలుసుకోవాలి. ఎందుకంటే ఈ మూడు లోకాలలో జీవుడు జనన మరణాల చక్రానికి కట్టుబడి ఉంటాడు. వీటిలో అతని పరిణామం కొనసాగుతుంది. ఈ మూడు ప్రపంచాలు బ్రహ్మ దినం అని పిలువబడే అపారమైన కాల ప్రారంభంలో తయారు చేయబడ్డాయి. బ్రహ్మదినపు ముగింపులో ఈ మూడు లోకాలు నశిస్తాయి. (పంద్రెండుమాసములు సంవత్సరము. ఇట్టి మూడువందలఅఱువది సంవత్సరములు ఒక దేవ సంవత్సరము. పన్నెండువేల దేవసంవత్సరములు ఒక చతుర్యుగము. అనగా కృతత్రేతద్వాపర కలియుగములు నాలుగు అగును. వేయిచతుర్యుగములు ఒక బ్రహ్మదినము. ఈ వివరణ బ్రహ్మ పురాణములో ఉన్నది.) బ్రహ్మాండాన్ని పూర్తి చేసే మరో నాలుగు గొప్ప లోకాలు లేదా ప్రపంచాలు బ్రహ్మ జీవితాంతం వరకు కొనసాగుతాయి. మేము ఇక్కడ వాటిని పేర్కొనటం లేదు. మహా లోకాలలో కొన్ని ఉపలోకాలు కూడా ఉన్నాయి. భువర్లోకంలో ప్రేతలోకం మరియు పితృలోకం, స్వర్గలోకంలో ఇంద్రలోకం మరియు సూర్యలోకం వంటివి ఉన్నాయి.

మనకు సంబంధించిన మూడు ముఖ్యమైన లోకాలు, అంటే త్రిలోకాలు, ఇవి:

- **భూర్లోకం (Bhûrloka) :** ఇది భౌతిక ప్రపంచం, లేదా భూమి.
- **భువర్లోకం (Bhuvarloka) :** ఇది భూమికి, స్వర్గానికి మధ్యలో ఉంటుంది.
- **స్వర్గలోకం (Svargaloka) :** ఇది స్వర్గలోకం.

ఈ మూడింటిలో, భూర్లోకం పాక్షికంగా మనకు కనిపిస్తుంది, పాక్షికంగా కనిపించదు. భువర్లోకం మరియు స్వర్గలోకం పూర్తిగా అదృశ్యంగా ఉంటాయి.

భూర్లోకంలో, అన్ని రూపాలకు పృథ్వీ తత్త్వం ఆధారం. ఇది ఏడు రకాలుగా ఉంటుంది: ఘన (solid), ద్రవ (liquid), వాయు (gaseous), తేజోమయం

(radiant), ఈథరిక్ (etheric), సూపర్–ఈథరిక్ (super-etheric), మరియు అణు (atomic). ఈ చివరి నాలుగు రకాలను "ఈథర్‌లు" అని పిలుస్తారు.

భువర్లోకంలో కూడా ఇలాంటి ఏడు రకాల రూపాలు ఉంటాయి, కానీ వాటికి ఆధారం అపస్ తత్త్వం. (నీటి తత్వం)

స్వర్గలోకంలో కూడా ఇలాంటి ఏడు రకాల రూపాలు ఉంటాయి, కానీ వాటికి ఆధారం అగ్ని తత్త్వం.

(అనువాద కర్త వివరణ

భూర్లోకం అంటే మనం నివసించే భౌతిక ప్రపంచం, అంటే భూమి. ఈ ప్రపంచంలో కనిపించే ప్రతి రూపానికి, అది రాయి కావచ్చు, నీరు కావచ్చు, గాలి కావచ్చు లేదా మన కంటికి కనిపించనిది కావచ్చు – అన్నిటికీ పృథ్వీ తత్త్వం (Earth Element) ఆధారం అని ఇక్కడ చెప్పబడుతోంది. సాధారణంగా, పంచభూతాలలో (భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం) పృథ్వీ తత్త్వం అంటే స్థూలమైన భూమి అని అర్థం చేసుకుంటాం. కానీ ఇక్కడ, పృథ్వీ తత్త్వం అనేది కేవలం మట్టిని మాత్రమే కాకుండా, భౌతిక పదార్థం యొక్క వివిధ స్థితులను సూచిస్తుంది.

ఈ పృథ్వీ తత్త్వం ఏడు రకాలుగా వ్యక్తమవుతుంది:

1. ఘన (Solid) : ఇది మనకు బాగా తెలిసిన పదార్థ స్థితి. రాయి, లోహాలు, చెట్లు, మనం కూర్చునే కుర్చీలు – ఇవన్నీ ఘన పదార్థాలే. వీటి అణువులు చాలా దగ్గరగా, స్థిరంగా బంధించబడి ఉంటాయి.

2. ద్రవ (Liquid) : నీరు, పాలు, నూనె వంటివి ద్రవాలు. వీటికి నిర్దిష్ట ఆకారం ఉండదు కానీ పరిమాణం ఉంటుంది. వీటి అణువులు ఘన పదార్థాల కంటే కొంచెం స్వేచ్ఛగా కదులుతాయి.

3. వాయు (Gaseous) : గాలి, ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ వంటివి వాయువులు. వీటికి నిర్దిష్ట ఆకారం గానీ, పరిమాణం గానీ ఉండవు. వీటి అణువులు చాలా దూరంగా, వేగంగా కదులుతాయి.

ఈ మొదటి మూడు స్థితులు మనకు సాధారణంగా కనిపించే భౌతిక రూపాలు. అయితే, తదుపరి నాలుగు స్థితులు మరింత సూక్ష్మమైనవి, వీటినే "ఈథర్‌లు" అని పిలుస్తారు :

4. తేజోమయం (Radiant) : దీన్నే ప్లాస్మా స్థితి అని కూడా అనొచ్చు. ఇది అత్యంత వేడిమి వల్ల ఏర్పడే పదార్థ స్థితి, దీనిలో పరమాణువులు అయాన్లుగా విడిపోతాయి (అంటే వాటిలోని ఎలక్ట్రాన్లు వేరుపడతాయి). సూర్యుడు, నక్షత్రాలు, మెరుపులు, నియాన్ లైట్లు – ఇవన్నీ ప్లాస్మా రూపంలో ఉంటాయి. ఇది ఒక రకమైన కాంతి లేదా శక్తి రూపంగా కూడా కనిపిస్తుంది.

5. ఈథరిక్ (Etheric) : ఇది తేజోమయం కంటే కూడా సూక్ష్మమైన స్థితి. దీనిని భౌతిక పదార్థానికి, మరింత సూక్ష్మమైన లోకాలకు మధ్య వారధిగా భావిస్తారు. మన నాడీ వ్యవస్థ, శక్తి కేంద్రాలు (చక్రాలు) వంటివి ఈ ఈథరిక్ స్థాయిలో ఉంటాయని ఆధ్యాత్మికంగా చెబుతారు. దీనిని సాధారణ ఇంద్రియాలతో గుర్తించడం కష్టం.

6. సూపర్–ఈథరిక్ (Super-etheric) : ఇది ఈథరిక్ కంటే కూడా ఉన్నతమైన, మరింత సూక్ష్మమైన స్థితి. దీనిని ప్రాణశక్తికి లేదా జీవశక్తికి సంబంధించిన సూక్ష్మ రూపంగా భావించవచ్చు. ఇది అత్యంత వేగవంతమైన కంపనాలతో (vibrations) ఉంటుంది.

7. అణు (Atomic) : ఇక్కడ "అణు" అంటే మనకు తెలిసిన పరమాణువుల కంటే కూడా అత్యంత సూక్ష్మమైన ప్రాథమిక కణాలను సూచిస్తుంది. ఇది పదార్థం యొక్క మూలకణాలు విడిపోయి, వాటి ప్రాథమిక శక్తి రూపంలో ఉన్న స్థితి. ఇది పదార్థం యొక్క అత్యంత సూక్ష్మమైన, అంతర్లీనమైన స్థితిగా పరిగణించబడుతుంది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ ఏడు రకాల పదార్థ స్థితులు అన్నీ ఒకే పృథ్వీ తత్త్వం నుండి ఉద్భవించినవని, మరియు అన్నీ భౌతిక ప్రపంచంలోనే (భూర్లోకంలో) విభిన్న స్థాయులలో వ్యక్తమవుతాయని ఈ సిద్ధాంతం చెబుతుంది. మన ఇంద్రియాలు మొదటి మూడు స్థితులను మాత్రమే గుర్తించగలిగినప్పటికీ, మిగిలిన నాలుగు "ఈథరిక్" స్థితులు కూడా భూర్లోకంలోనే ఉనికిలో ఉన్నాయని, కాకపోతే అవి మనకు కనిపించవని లేదా స్పృశించడానికి వీలు కావని ఇక్కడ వివరణ. ఇది స్థూలమైన పదార్థం నుండి సూక్ష్మమైన శక్తి రూపాల వరకు విస్తరించి ఉన్న ఒక విస్తృతమైన పదార్థ భావన.)

జీవుడు ఈ లోకాలకు అనుగుణమైన అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశమను మూడు కోశాలను కలిగి ఉన్నాడు– అన్నమయకోశ, లేదా

ఆహారపు తొడుగు – మనం తిన్న ఆహారం నుండి నిర్మించబడినందున–దీనిని అన్నమయ కోశంగా పిలుస్తారు. ఇది మనకు కనిపించే భూ భాగంతో సంబంధం కలిగి ఉంటుంది. ఇది, పృథివీ, జల, వాయువులతో కూడి ఉంటుంది. (1. స్త్రీ, పురుషుల సంయోగం వల్ల శుక్ల శోణితాలు కలసి, పిండమై, పెరిగి, వివిధ అవయవాలతో జన్మించి, ప్రారబ్ధ కర్మలను అనుభవించి, పంచభూతాలలో లయమయ్యే స్థూల రూపం అన్నమయకోశం. అన్న రసంతో వృద్ధి పొంది, అన్న రసమయమయిన పృథ్వియందు లయమయ్యే ఈ అన్న కోశమే స్థూల శరీరం. 2. అన్నం తాలూకు సూక్ష్మమైన రూపం మనస్సు. దానికి సంబంధించిన కోశం అన్నమయ కోశం. ఇలా పెద్దలు ఈ అన్నమయ కోశాన్ని నిర్వచించారు) .

D **ప్రాణమయకోశం లేదా ప్రాణశక్తి పొర :** ఇది భూమి యొక్క కనబడని భాగానికి (సూక్ష్మ శరీరానికి) అనుగుణంగా ఉంటుంది. ఇది ఈథర్‌లతో (ముందు వివరించిన సూక్ష్మమైన పదార్థ స్థితులు) నిర్మితమై ఉంటుంది. ప్రాణం అనేది జీవశక్తి. సైన్స్ అయస్కాంత మరియు విద్యుత్ శక్తులు అని పిలిచే అన్ని శక్తులను ఇది కలిగి ఉంటుంది, కానీ ప్రాణం వాటికంటే చాలా ఎక్కువ.

ఈ రెండు కోశాలు – అన్నమయకోశం మరియు ప్రాణమయకోశం – భూర్లోకంతో (భౌతిక ప్రపంచంతో) అనుసంధానించబడి ఉంటాయి. అంటే, మన భౌతిక శరీరం మరియు దానిలోని జీవశక్తి రెండూ ఈ భూమి లోకంలోనే ఉనికిలో ఉంటాయి.

మనోమయకోశము రెండు భాగాలను కలిగి ఉంటుంది; మొదటి భాగం దట్టమైన భాగం. ఈ భాగములో కోరికలు తమ స్థానాన్ని కలిగి ఉంటాయి. మనోమయకోశము భువర్లోకముతో అనుసంధానించబడి ఉంటుంది; భావోద్వేగాలు మరియు ఆలోచనలను పోషించే మరో చక్కటి భాగం స్వర్గలోకంతో ముడిపడి ఉంటుంది. ('జ్ఞానేంద్రియో స్సహ మనః మనోమయ కోశః' అని మనోమయ కోశానికి నిర్వచనం. జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, పంచ ప్రాణాలు, మనస్సు, బుద్ధి కలసి పదిహేడు అంగాలతో కూడినది సూక్ష్మ శరీరాన్ని మనోమయ కోశమంటారు. ఇది కంటికి కనిపించదు. తాకితే స్పర్శ తగలదు)

వర్గీకరణ చేయబడిన వస్తువును బట్టి ఈ కోశాలకు రకరకాల పేర్లు ఉపయోగించబడతాయి, విద్యార్థి వీటిని చూసి గందరగోళానికి గురికావలసిన

అవసరం లేదు. విద్యార్థి విజ్ఞాన మార్గంలో అభివృద్ధి చెందుతున్నప్పుడు, అతని పెరిగిన జ్ఞానం వీటిని బాగా అర్థం చేసుకోగలదు. మేము సాధారణంగా ఉపయోగించే మూడు కోశాల పేర్లు మాత్రమే గమనించి వివరించాము.

ఘనపదార్థాలు, ద్రవాలు మరియు వాయువులతో తయారు చేయబడిన అన్నమయకోశం వలె స్థూలశరీరము (లేదా ఘనాకృతి) ఉంటుంది. (మన ఇంద్రియాలకు ప్రత్యక్షంగా గోచరించే ఈ కరచరణాది అవయవాలతో కూడిన శరీరానికి స్థూల శరీరమని పేరు. ఇది బాహ్య ప్రపంచంతో జీవుడు వ్యవహరించటానికి ఏర్పడిన అధిష్ఠానం) సూక్ష్మశరీరము (లింగ శరీరం) ప్రాణమయ మనోమయకోశాలను కలిగి ఉంటుంది; (మనస్సు ప్రాణం కలిపితే సూక్ష్మశరీరము. మనస్సు, ప్రాణము అను రెండూ చలనాత్మకమైనా బాహ్యంగా మనకు మన ఇంద్రియాలకు ప్రత్యక్షమయ్యేవి కావు. పరోక్షమే. కనుకనే వీటికి సూక్ష్మశరీరమని పేరు వచ్చింది. లీనం గమయతి. గుప్తమైన ఆత్మతత్వాన్ని ఇవి ప్రకటన చేసి చూపుతాయి కాబట్టి లింగ శరీరమని కూడా సూక్ష్మశరీరానికి పేరు) వీటితో పాటు మరొక కోశము ఉన్నది. దానిపేరు విజ్ఞానమయకోశము. ఇది జీవుడిని మహర్లోకంతో కలుపుతుంది, త్రిలోకానికి మించిన ఈ మహర్లోకంలో (మరీచి మొదలైన మునులు ఉండే లోకం.) జీవుని యాత్ర కొనసాగుతుంది. ఇది నివాసయోగ్యం కాదు. బ్రహ్మ దినం ముగింపులోకూడా ఇది నాశనం చేయబడదు. సూక్ష్మశరీరములోని భాగమయిన , జ్ఞాన కోశం సాపేక్షంగా శాశ్వతమైనది. జనన మరణాల పరంపరలో ఇది కొనసాగుతుంది.

ఈ పట్టిక రెండింటి (స్థూల, సూక్ష్మ శరీర) వర్గీకరణలను మరియు లోకాలతో వాటికున్న సంబంధాన్ని స్పష్టం చేస్తుంది:

శరీరము	లోకము	కోశము
స్థూల	భూర్లోక	అన్నమయ
సూక్ష్మ	భూర్లోక	ప్రాణమయ
సూక్ష్మ	భువర్లోక	మనోమయ
సూక్ష్మ	స్వర్గలోకం	మనోమయ

ఇవి మరణ సమయంలో లేదా తరువాత నశిస్తాయి. మరియు తిరిగి పుట్టినప్పుడు పునరుద్ధరించబడతాయి.

సూక్ష్మ (కారణ) మహర్లోకము విజ్ఞానమయ

ఇది మరణించినప్పుడు లేదా తరువాత నశించదు. కాబట్టి పునర్జన్మలో పునరుద్ధరించబడదు.

స్థూలశరీరంలో కర్మేంద్రియాలు అని పిలువబడే చేతులు, పాదాలు మరియు వాక్కు, ఉత్పత్తి మరియు విసర్జనకు సంబంధించిన అవయవాలు ఉంటాయి; కానీ నిజమైన కర్మేంద్రియాలు, అవయవాలను నిర్దేశించే మరియు నియంత్రించే కేంద్రాలు సూక్ష్మశరీరములో ఉన్నాయి. అందువల్ల ఆనందం, దుఃఖం. లేదా ఏదైనా బలమైన భావోద్వేగం (చేతులు వణకడం, పాదాలు మెల్లగా కొట్టుకోవడం, చికాకులో ప్రసంగించి అడ్డుకోవడం మొదలైనవి.)సూక్ష్మశరీరములోని కేంద్రాలను ప్రభావితం చేస్తుంది.

. జ్ఞానేంద్రియాలని పిలువబడే స్థూలశరీరంలో ఉన్న కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు మరియు చర్మం అను అవయవాలకు సంబంధించిన కేంద్రాలు సూక్ష్మశరీరంలో కూడా ఉన్నాయి.

ఇప్పుడు మరణంలో ఏమి జరుగుతుందో చూద్దాం. మొదటగా, సూక్ష్మశరీరము స్థూలశరీరము నుండి వేరు చేయబడుతుంది. జీవుడు ప్రాణమయకోశము నుండి వేరుచేయబడతాడు. సూక్ష్మశరీరము స్థూలశరీరాన్ని "నిర్జీవమైన" పదార్థంగా వదిలివేస్తుంది; అంటే, సూక్ష్మ, స్థూల శరీరాలను కలిపి ఉంచిన ప్రాణం ఉపసంహరించబడుతుంది. శరీర కణాలలో చైతన్యం పుష్కలంగా మిగిలి ఉంటుంది కాని మరణ సమయంలో అవి ఒకదానితో ఒకటి విడిపోవటం ప్రారంభిస్తాయి. వీటన్నింటిని కలిపి ఉంచి వీటిని పాలించే ప్రాణము ఉండదు.

మరణం తరువాత జీవుడు తన సూక్ష్మశరీరములో ఉంటాడు. అతి త్వరగా తన ప్రాణమయ కోశాన్ని వదులుతాడు. ఆపై మనోమయకోశం యొక్క దట్టమైన భాగాన్ని తన బయటి వస్త్రంగా కలిగి ఉంటాడు. అప్పుడు అతన్ని ప్రేత అని పిలుస్తారు. అతడు ఇప్పుడు ప్రేతలోక నివాసి. అతను భూమిపై చాలా మంచి వ్యక్తి అయితే, అతను ఈ ప్రేత స్థితిలో ఉన్నప్పుడు సంతోషంగా కలలు కంటాడు; కానీ అతను చెడ్డ వ్యక్తి అయితే, అతను ప్రేతగా ఉన్నప్పుడు బాధపడతాడు. అతను ఇకపై పొందలేని భూలోక సంబంధమైన ఆనందాల కోసం ఆరాటపడతాడు.

ఈ భూలోక సంబంధమైన కోరికల బలాన్ని అనుసరించి, మనోమయ కోశంలోని దట్టమైన భాగం తననుంచి విడిపోవటానికి కావలసిన సమయం తీసుకొన్న

తర్వాత (అది ఎక్కువ కావచ్చు, తక్కువ కావచ్చు) జీవుడు పితృదేవతగా మారి పితృలోకానికి వెళతాడు. అక్కడ స్వర్గానికి పనికిరాని అన్ని మూలపదార్థాల నుండి తన మనోమయ కోశాన్ని శుద్ధి చేయడానికి తగినంత సమయాన్ని జీవుడు తీసుకొంటాడు. తరువాత శుద్ధి చేయబడిన మనోమయకోశంతో జీవుడు స్వర్గానికి వెళ్లి, అక్కడ తాను నిల్వ చేసుకొన్న కర్మ ఫలాలను అనుభవిస్తాడు.

పుణ్య కర్మ ఫలాలు పూర్తయిన తరువాత, స్వర్గం నుంది జీవుడు భూమికి తిరిగి వచ్చే సమయం వస్తుంది. శుద్ధి చేయబడిన జీవుని మనోమయ కోశం కరిగిపోతుంది. తన జీవాన్ని విజ్ఞానమయకోశంలో వదిలివేస్తాడు. అతను త్వరగా నూతన జన్మ వాహనాలను పొందడానికి కావలసిన శక్తిని వినియోగిస్తాడు. అధోలోకాలకు తగిన (1. అతలము, 2. వితలము, 3. సుతలము, 4. తలాతలము, 5. రసాతలము, 6. మహాతలము, 7. పాతాళము) తన రాబోయే జీవితానికి తగినవిధంగా నూతన మనోమయకోశాన్ని సృష్టించుకొంటాడు. అతని కర్మ ప్రకారం, దేవతలు అతని కోసం ఒక ప్రాణమయకోశం మరియు అన్నమయకోశం నిర్మిస్తారు. అతను మళ్లీ భూర్లోకంలో జన్మిస్తాడు.

ఇవి జీవుని యాత్రలో పునరావృత (తిరిగి వచ్చే) దశలు :

జీవితం, మరణం ఈ కనిపించే ప్రపంచంలో ఉంటాయి. అలాగే జీవితం, పునర్జన్మ అదృశ్య ప్రపంచాలలో ఉంటాయి. ఈ దశలు కాలానుగుణంగా, చేసుకొన్న కర్మ ఫలితాన్ని అనుసరించి మరలా మరలా పునరావృతమవుతుంటాయి. చివరకు, జీవుడు ఈ మూడు ప్రపంచాల (మానవ లోకం, పితృ లోకం, దేవ లోకం) గురించి విసిగిపోతాడు. ఉన్నతమైన, సూక్ష్మమైన అనుభవాలు కలిగిన మరింత విస్తరించిన జీవితం కోసం ఆశపడతాడు; క్రమంగా తనకు విస్తృతానుభవాలను అందించే ఈ ప్రపంచాల నుండి దూరంగా ఉంటాడు . ధ్యానంలో, ఆరాధనలో, బలహీనులకు కరుణతో సహాయం చేయడంలో ఆనందాన్ని పొందుతాడు; అతను క్రమంగా తన జన్మోపాధులను తనకు ఆనందాన్ని పొందేందుకు ఉపయోగించడు. ఇతరులకు సేవ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తాడు. అలా ఉపయోగించినట్లయితే, బంధనాలు అతన్ని ఇకపై జన్మల చెరసాలలో పెట్టలేవు. అతడు ఉన్నత లోకాలలో నివసిస్తూ, అధోలోకాలలో తన మిగిలిన జన్మలను తన సాధనలుగా నడిపిస్తూ, ఈశ్వరునితో సహచరునిగా ఉంటాడు. పరులసేవ కోసం తన జన్మలను నిలుపుకుంటాడు లేదా వాటిని వదిలివేసి బ్రహ్మములోకి ప్రవేశిస్తాడు.

అథ త్రయో వావ లోకా మనుష్యలోకః పితృలోకో దేవలోక ఇతి॥[1]

"ఇప్పుడు నిశ్చయంగా మూడు ప్రపంచాలు ఉన్నాయి. అవి మానవ లోకం, పితృ లోకం, దేవ లోకం"

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥

అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥[2]

పుట్టిన వానికి మరణం తప్పదు, మరణించినవానికి మరల పుట్టుక తప్పదు. కాబట్టి ఈ అనివార్యమైన దాని కోసం నీవు శోకించ వద్దు.

ఓ భరత వంశీయుడా! సృష్టింపబడిన ప్రాణులన్నీ పుట్టుక ముందు అవ్యక్తములు, జీవిత కాలంలో వ్యక్తములు, మరల మరణించిన పిదప అవ్యక్తములు. కావున శోకించుట ఎందులకు?

(భౌతిక జగత్తులో ప్రతి యొక్క జీవాత్మ స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం అను మూడు శరీరాలచే కట్టుబడి ఉంటుంది – 1. స్థూల శరీరమనగా భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశము అను పంచభూతములతో తయారు చేయబడినది. 2. సూక్ష్మ శరీరమనగా ఐదు ప్రాణవాయువులు, ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి, మరియు అహంకారం అను పద్దెనిమిది మూల–వస్తువులతో కూడినది 3. కారణ శరీరమనగా అంతులేని మునుపటి జీవితాల నుండి ఉన్న సంస్కారముల తో కూడి ఉన్నది.

మరణ సమయంలో, ఆత్మ, తన స్థూల శరీరాన్ని విడిచి పెట్టి, తనతో పాటు సూక్ష్మ, కారణ శరీరములను తీసుకొని వెళుతుంది. భగవంతుడు మరల ఆత్మకి మరియొక స్థూల శరీరాన్ని, దాని సూక్ష్మ, కారణ శరీరాల అనుగుణంగా ఇచ్చి, దానికి తగిన తల్లి గర్భం లోనికి తిరిగి ప్రవేశపెడతాడు. ఆత్మ ఒక స్థూల శరీరాన్ని వదిలి వేసిన తరువాత, వేరే స్థూల శరీరాన్ని గ్రహించే మధ్య కాలంలోని పరివర్తన దశ కొన్ని క్షణాల నుండి కొన్ని సంవత్సరాల వరకూ ఉండవచ్చు. కాబట్టి పుట్టుక ముందు, ఆత్మ అవ్యక్తమైన సూక్ష్మ, కారణ శరీరాలతో ఉంటుంది. మరణం తరువాత కూడా అది అవ్యక్త స్థితిలో ఉంటుంది. ఈ మధ్యలోనే అది వ్యక్తమవుతుంది

(ప్రకటితమవుతుంది). కాబట్టి శోకించటానికి మరణం కారణం కారాదని ఈ శ్లోక భావం).

సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః ।
రాత్రిం యుగసహస్రాంతాం తేఽ హోరాత్రవిదో జనాః ॥

వేయి చతుర్యుగము (మహాయుగము) ల కాలము, బ్రహ్మ దేవునికి ఒక రోజు (కల్పము) అవుతుంది. మరియు ఆయన ఒక రాత్రి కూడా అంతే సమయం ఉంటుంది. దీనిని అర్థం చేసుకున్న వివేకవంతులు పగలు రాత్రి యొక్క యదార్థాన్ని అర్థం చేసుకుంటారు.

(వేదముల ప్రకారం, ఇంద్రుడు, వరుణుడు వంటి దేవతల ఒక పగలు ఒక రాత్రి కలిపి భూలోకంలో ఒక సంవత్సరం అవుతుంది. దేవతల యొక్క ఒక సంవత్సరం భూలోకంలో 360 సంవత్సరాలకు సమానం. దేవతల 12,000 సంవత్సరాలు, భూలోకంలో ఒక మహాయుగం (నాలుగు యుగాల చక్రం) అవుతుంది; అంటే 4,320,000 సంవత్సరాలు. ఇటువంటి 1000 మహా యుగములు బ్రహ్మ దేవుడికి ఒక పగలు. దీనినే కల్పము అంటారు, ఇది కాలాన్ని కొలవటానికి ప్రపంచంలో ఉన్న అతి పెద్ద ప్రమాణం. బ్రహ్మ యొక్క ఒక రాత్రి కూడా ఇంతే సమయం ఉంటుంది. బ్రహ్మ దేవుడు 100 సంవత్సరాలు బతుకుతాడు. భూలోక లెక్క ప్రకారం ఇది 311 ట్రిలియన్ 40 బిలియన్ సంవత్సరాలు).

అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥[3]

బ్రహ్మ యొక్క పగలు ప్రారంభంకాగానే, సమస్త ప్రాణులు అవ్యక్త మూలం నుండి ఉద్భవిస్తాయి. మరియు ఆయన రాత్రి మొదలైనంతనే, అన్ని జీవాత్మలూ తమ అవ్యక్త రూపంలోకి లీనమై పోతాయి.

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।
తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్ అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।
ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే ॥[4]

"వేదములలో చెప్పబడిన సకామ కర్మకాండల పట్ల మొగ్గుచూపేవారు, నన్ను యజ్ఞ

యాగాదులచే పూజిస్తారు. యజ్ఞ శేషము అయిన సోమరసపానము చేయటం ద్వారా పాపాలన్నీ పోయి, పవిత్రులైన వీరు, స్వర్గ లోకాలకు పోవటానికి ఆశిస్తారు. వారి పుణ్య కర్మల ఫలంగా, వారు స్వర్గాధిపతి అయిన ఇంద్రుని లోకానికి వెళతారు, మరియు, దేవతల విలాసాల భోగాలన్నీ అనుభవిస్తారు.

స్వర్గలోకము యొక్క విశాలమైన భోగములు అనుభవించుటచే వారి పుణ్య ఫలము అంతా తరిగిపోయిన తరువాత వారు తిరిగి భూలోకానికి వస్తారు. ఈ విధంగా భోగ వస్తు ప్రాప్తికై వైదిక కర్మ కాండలను ఆచరించేవారు భూలోకానికి పదేపదే వచ్చి పోతుంటారు.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥[5]

ఎన్నో జన్మల ఆధ్యాత్మిక సాధన తరువాత, జ్ఞాన సంపన్నుడు, ఉన్నదంతా నేనే (వాసుదేవుడే) అని తెలుసుకొని, నాకు శరణాగతి చేస్తాడు. అటువంటి మహాత్ముడు నిజముగా చాలా అరుదు.

సూచికలు

1. బృహదారణ్యకోపనిషత్ ప్రథమోధ్యాయము పఞ్చమం బ్రాహ్మణమ్- 16 వమంత్రము
2. భగవద్గీత- 02 వ అధ్యాయము- 27, 28 వ శ్లోకాలు
3. పై పుస్తకంలో - 08 వ అధ్యాయము- 17, 18 వ శ్లోకాలు
4. భగవద్గీత - 09 వ అధ్యాయము- 20, 21 వ శ్లోకాలు
5. పై పుస్తకంలో 07 వ అధ్యాయము- 19వ శ్లోకము

సనాతన ధర్మము

రెండవ భాగము

సాధారణ హిందూ మతపరమైన ఆచారాలు మరియు సంస్కారాలు

అధ్యాయం 1

సంస్కారాలు

ప్రతి మతం తనను అనుసరించే వారికి అనేక వేడుకలను లేదా ఆచారాలను నిర్దేశిస్తుంది. ఈ ఆచారాల ఉపయోగం, సాధారణంగా చెప్పాలంటే ఇవి :

(1) జీవాత్మ తన యొక్క కోశాలను (అన్నమయ, మనోమయకోశాలు మొదలయినవి) జయించడానికి, మరియు వాటిని శుద్ధి చేసే కార్యక్రమంలో సహాయం చేయడం కొరకు; (2) దేవతలు మరియు ఋషులు వంటి ఉన్నతమైన మేదస్సులను జీవాత్మ సహాయానికి తీసుకురావడం కొరకు; (3) తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని మెరుగుపరచి జీవాత్మ మనస్సును స్థిరంగా మరియు ఏకాగ్రతగా ఉంచి జీవితాన్ని సులభతరం చేయడం కొరకు.

పై ఉపయోగాల కొరకు ఆచారాలలో వివిధ భౌతిక వస్తువులు, హావభావాలు, భంగిమలు మరియు శబ్దాలు ఉపయోగించబడతాయి. పై లక్ష్యాలను నెరవేర్చడానికి అన్ని ఆచార విధానాలు జాగ్రత్తగా ఏర్పాటు చేయబడ్డాయి.

ఆచారాలలో ఉపయోగించే వస్తువులు పైన చెప్పబడిన లక్ష్యాల ఆకర్షణశక్తి కోసం ఎంపిక చేయబడ్డాయి. అనేక ఆచార సందర్భాల్లో నిర్దిష్టమైన పువ్వులు మొదలయినవి ఒక నిర్దిష్ట దేవుడికి సమర్పించబడతాయి, ఎందుకంటే అవి ధ్యానం లేదా దైవము యొక్క ఆకర్షణశక్తిని పంచుకుంటాయి. ఆ దైవము మరియు భక్తునికి మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తాయి. అందువలననే తులసి పూసలతో కూడిన జపమాల శ్రీ కృష్ణుని పూజలో ఉపయోగించబడుతుంది; రుద్రాక్ష శివుని ఆరాధనలో వాడబడుతుంది.

పూజలలో వాడే సంజ్ఞలు మరియు భంగిమలు, చాలా వరకు, శరీరంలో ప్రసరించే ప్రాణ శ్వాస యొక్క ఉప-విభాగాలను ప్రభావితం చేస్తాయి; కొన్ని భంగిమలు, సంజ్ఞలు శరీరం యొక్క ఆకర్షణ శక్తిని చుట్టుపక్కల వాతావరణంలోకి ప్రసరించకుండా నిరోధిస్తాయి. మరియు ధ్యాన ప్రవాహాలను ప్రశాంతంగా మరియు నిశ్శబ్ద ఆలోచనకు తగిన విధంగా కదిలేలా ఈ సంజ్ఞలు మరియు భంగిమలు ఉపయోగపడతాయి.

పైన పేర్కొన్న మూడు ప్రయోజనాల కోసం కొన్ని శబ్దాలు కూడా ఆచారాలలో ఉపయోగించబడతాయి. అవి ప్రకంపనలకు దారితీస్తాయి. ఈ ప్రకంపనలు సక్రమంగా మరియు సమానంగా ఉంటాయి కాబట్టి, అవి సూక్ష్మశరీర కంపనాలను చాలా సున్నితంగా సులభంగా ప్రభావితం చేసేవిగా ఉండేలా పనిచేస్తాయి. సూక్ష్మశరీరము యొక్క ఈ ప్రకంపనలు జీవుని ఆలోచన మరియు అతని భక్తి యొక్క స్థిరత్వంలో చాలా సహాయపడతాయి. తగిన రకమైన శబ్దాలు ఋషులు మరియు దేవతల దృష్టిని ఆకర్షిస్తాయి. తద్వారా వారు అతనికి సహాయం చేస్తారు. ఇంకా, ఆచారాలలో తగిన విధంగా పలుకబడిన శబ్దాలు ప్రతికూల మేదస్సులను మరియు చెడు ఆకర్షణ శక్తుల ప్రభావాలను దూరం చేస్తాయి. మరియు వక్త యొక్క (శబ్దాలను పలికేవానియొక్క) పరిసరాలను మెరుగుపరుస్తాయి.

అలా ఉపయోగించే శబ్దాలను మంత్రాలు అంటారు. మంత్రం అనేది శబ్దాల పరంపర. శబ్దాలు ఒక నిర్దిష్ట క్రమంలో అమర్చబడి ఉంటాయి: శబ్దాలను మార్చినట్లయితే కంపనాలు మార్చబడతాయి . ఫలితాలు కూడా మారుతాయి. అందుకే మంత్రాన్ని అనువదించలేము. అనువదించబడిన మంత్రం ఒక వాక్యం లాంటిది. దీనిలో పదాల యొక్క అన్ని అక్షరాలు గందరగోళంగా ఉంటాయి మరియు ఏ అర్థాన్ని సరిగా తెలియజేయవు.

మంత్రాల గురించి గుర్తుంచుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఉంది: ఒక మంత్రాన్ని ఉచ్చరించే వ్యక్తి మంచి జీవితాన్ని గడపడానికి ప్రయత్నించకపోతే, ఆ మంత్రం యొక్క ప్రకంపనలు (vibrations) అతనికి మేలుకు బదులుగా హాని చేస్తాయి.

ఎందుకంటే, మంత్రం యొక్క ప్రకంపనలు అతని సూక్ష్మ శరీరానికి (Sukma-sarira) సంబంధించినవి. మంత్ర ప్రకంపనలు చెడు కోరికలకు, చెడు ఆలోచనలకు వ్యతిరేకంగా పనిచేసే శక్తిని సూక్ష్మ శరీరంపై ప్రయోగిస్తాయి. ఒకవేళ వ్యక్తి చెడు సంకల్పాలతో ఉంటే, అతని సూక్ష్మ శరీరం ఒక విధంగా ప్రకంపిస్తుంది. అదే సమయంలో మంత్రం యొక్క ప్రకంపనలు దానికి వ్యతిరేక దిశలో శరీరాన్ని కదిలిస్తాయి. దీనివల్ల సూక్ష్మ శరీరం తీవ్రంగా కదిలి, గాయపడి లేదా చీలిపోయే అవకాశం ఉంది.

అదే అతని సంకల్పాలు మంచివైతే, అవి మంత్రంతో కలిసి పనిచేసి ఎటువంటి సంఘర్షణనూ కలిగించవు. అతని సంకల్పాలు ఎంత బలహీనంగా ఉన్నప్పటికీ, అవి మంత్రానికి సహాయపడతాయి తప్ప అడ్డుకోవు.

(అనువాద కర్త వివరణ

సూక్ష్మ శరీరం అంటే ఏమిటి?

మనం కేవలం భౌతిక శరీరం మాత్రమే కాదు. ఆధ్యాత్మిక బోధనల ప్రకారం, మనకు కొన్ని సూక్ష్మ శరీరాలు (Sukma-sarira) కూడా ఉంటాయి. వీటిని కంటితో చూడలేం, తాకలేం. ప్రాణమయకోశం (శక్తి శరీరం), మనోమయకోశం (మనస్సు శరీరం) మరియు విజ్ఞానమయకోశం (జ్ఞాన శరీరం) వంటివి ఈ సూక్ష్మ శరీరాలలో భాగంగా ఉంటాయి. ఇవి మన ఆలోచనలు, భావోద్వేగాలు, సంకల్పాలను నిల్వ చేసుకుని, వాటి ప్రకంపనలకు ప్రతిస్పందిస్తాయి. ఈ సూక్ష్మ శరీరాలు స్థూల శరీరంలా గట్టిగా కాకుండా, శక్తితో కూడిన సూక్ష్మ తరంగాలతో నిర్మితమై ఉంటాయి.

మంత్రం మరియు సూక్ష్మ శరీరంపై దాని ప్రభావం

మంత్రాలు శక్తివంతమైన శబ్ద ప్రకంపనలు (sound vibrations). ప్రతి మంత్రానికి ఒక నిర్దిష్టమైన, పవిత్రమైన ప్రకంపన స్థాయి ఉంటుంది. వీటిని జపించినప్పుడు, ఆ శబ్ద తరంగాలు మన సూక్ష్మ శరీరాలపై ప్రభావం చూపుతాయి.

D మంచి సంకల్పాలు ఉన్నప్పుడు: మంత్రాన్ని జపించే వ్యక్తికి మంచి ఆలోచనలు, పవిత్రమైన ఉద్దేశాలు ఉంటే, అతని సూక్ష్మ శరీరం కూడా ఆ మంత్రం యొక్క ప్రకంపనలకు అనుగుణంగా ఉంటుంది. అప్పుడు మంత్రం ఒక సానుకూల శక్తిని సృష్టిస్తుంది, సూక్ష్మ శరీరంలోని శక్తి ప్రవాహాలను క్రమబద్ధీకరించి, దానిని బలోపేతం చేస్తుంది. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకు, అంతర్గత శాంతికి దారితీస్తుంది.

D చెడు సంకల్పాలు ఉన్నప్పుడు (సంఘర్షణ): ఒక వ్యక్తి చెడు కోరికలు, అసూయ, ద్వేషం లేదా స్వార్థపూరిత ఆలోచనలతో మంత్రాన్ని జపిస్తే, అతని సూక్ష్మ శరీరం ఆ ప్రతికూల భావాలకు అనుగుణంగా వేరే రీతిలో ప్రకంపిస్తుంది. ఈ స్థితిలో, మంత్రం యొక్క స్వచ్ఛమైన, పవిత్రమైన ప్రకంపనలు సూక్ష్మ శరీరం యొక్క ప్రతికూల ప్రకంపనలతో సంఘర్షణకు (conflict) గురవుతాయి.

ఈ సంఘర్షణ ఒక తాడును వ్యతిరేక దిశల్లో బలంగా లాగినట్లు ఉంటుంది. వ్యక్తి యొక్క చెడు సంకల్పాలు ఒకవైపు లాగితే, మంత్రం యొక్క శక్తి మరో వైపు లాగుతుంది. దీని ఫలితంగా:

D తీవ్రంగా కదలడం: సూక్ష్మ శరీరం అస్తవ్యస్తంగా, తీవ్రంగా కదులుతుంది. ఇది ఒక రకమైన అంతర్గత అలజడిని సృష్టిస్తుంది.

D గాయపడటం లేదా చీలిపోవడం: దీర్ఘకాలికంగా లేదా తీవ్రంగా ఈ సంఘర్షణ కొనసాగితే, సూక్ష్మ శరీరం యొక్క శక్తి క్షేత్రంలో "గాయాలు" లేదా "చీలికలు" ఏర్పడతాయి. ఇది సూక్ష్మ స్థాయిలో ఒక రకమైన నష్టాన్ని సూచిస్తుంది.

దీని పర్యవసానాలు

సూక్ష్మ శరీరానికి ఇలాంటి నష్టం జరిగితే, అది భౌతిక, మానసిక, మరియు ఆధ్యాత్మిక స్థాయిలో ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది:

D **మానసిక అశాంతి :** ఆందోళన, నిరాశ, కోపం వంటి ప్రతికూల భావోద్వేగాలు పెరుగుతాయి.

D **శారీరక సమస్యలు :** శక్తి ప్రవాహంలో లోపాల వల్ల అలసట, బలహీనత లేదా ఇతర శారీరక అనారోగ్యాలు కూడా దారితీయవచ్చు.

D **ఆధ్యాత్మిక పురోగతికి ఆటంకం :** మంత్రజపం ద్వారా పొందవలసిన సానుకూల ఫలితాలకు బదులుగా, ఇది ఆధ్యాత్మిక మార్గంలో అడ్డంకులను సృష్టిస్తుంది.

కాబట్టి, మంత్రాన్ని జపించేటప్పుడు శుద్ధమైన సంకల్పం మరియు మంచి జీవనం చాలా ముఖ్యం. అప్పుడే మంత్ర శక్తి నిజమైన ప్రయోజనాలను అందిస్తుందని సారాంశం.)

మంత్రాలను బిగ్గరగా పలకవలసిన అవసరం లేదు. వాటి నిశ్శబ్ద ఉచ్చారణ, నిజానికి, వినగలిగే పఠనం కంటే శక్తివంతమైనది. అవి దట్టమయిన పదార్థాల కంటే సూక్ష్మ పదార్థాలను ప్రభావితం చేస్తాయి.

హిందువుల జీవితంలోని అనేక వేడుకల్లో వారి జీవితంలోని ప్రధాన దశలను గుర్తించే కొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి; పాత రోజుల్లో ఇవి అనేకమున్నాయి. వాటిలో పది ముఖ్యమైనవిగా నిలిచాయి. కానీ ఈ పది సంస్కారాలలో ఇప్పుడు కొన్నిటిని

మాత్రమే ఆచరిస్తున్నారు. ఈ సంస్కారాలలో శిశు జీవితానికి మరియు బాల్యానికి సంబంధించినవి ఏడు ఉన్నవి. ఈ ఏడింటిలో ఆరవది అన్నప్రాశనం. పసి పిల్లలకు మొదటి సారిగా అన్నం తినిపించే వేడుక ఇది. ఇది విశ్వవ్యాప్తంగా అనుసరించబడింది; మరియు ఏడవది చూడాకరణం. అనగా పుట్టువెంట్రుకలు తియ్యడము. ఈ సంస్కారముతో చెవులు కుట్టడం కూడా దాదాపుగా విశ్వవ్యాప్తంగా జరిగే సంస్కారము. ఆ తర్వాత ముఖ్యమైన ఎనిమిదవ సంస్కారం ఉపనయనం. బ్రహ్మచారిని పవిత్రమైన దారాన్ని ఇచ్చే సంస్కారముతో గురువు వద్దకు వేదాధ్యయనం కొరకు తీసుకొని వెళ్లుటను ఉపనయనం అంటారు. ఈ ఉపనయన సంస్కారములో గాయత్రిని బోధిస్తారు. ఈ దీక్ష బ్రహ్మచారిని ద్విజునిగా చేస్తుంది. ద్విజ అనగా రెండుసార్లు పుట్టువాడు. (జన్మించిన పిదప ఉపనయనముచే రెండవ పుట్టుక వస్తుందని, అందుకే ద్విజుడంటారని భావం).

ఉపనయనం అనేది విద్యార్థి దశ జీవితానికి నాంది. ఈ సమయంలో బ్రహ్మచర్యం (గురుకులంలో వేదాధ్యయనం చేసే దీక్షాకాలం). పాటిస్తూ శ్రద్ధతో చదువుకోవడం కుర్రవాడి కర్తవ్యం. ఈ దశ అధికారికంగా ఇంటికి తిరిగి రావడం ద్వారా పూర్తవుతుంది. ఉపనయనం తరువాత జరిగే సంస్కారాన్ని సమావర్తన మంటారు. వేదాధ్యయనం ముగించుకొని, గృహస్థాశ్రమ స్వీకారం కోసం తిరిగి వెళ్లేటప్పుడు గురువు సమక్షంలో జరిపే వేడుక లేదా క్రతువును సమావర్తనమంటారు. సమావర్తనము తరువాత జీవితంలోని రెండవ దశలో అయిన గృహస్థాశ్రమంలో ప్రవేశించడానికి, గృహస్థుడు కావటానికి అర్హత కలిగి ఉంటాడు.

పదవ సంస్కారము వివాహం. అతను వ్యవహారదశలోనికి ప్రవేశించడాన్ని మరియు దాని బాధ్యతలను ఈ వివాహ దశ సూచిస్తుంది. ఆధునిక భారతదేశంలో, ఉపనయనం మరియు వివాహ సంస్కారాలు వేడుకలుగా నిర్వహించబడుతున్నప్పటికీ, ఆరోగ్యకరమైన నియమాలు వాడుకలో లేవు. విద్యార్థి జీవితం మధ్యలో వివాహం అసంబద్ధంగా అతని జీవితంలోకి నెట్టబడుతున్నది. యౌవనం మరియు బాల్యం యొక్క విధులు మిశ్రమమయి జీవితాన్ని గాయాలపాలుచేస్తున్నాయి. అందువలన విద్యార్జన, గృహస్థాశ్రమం విడివిడిగా ఉన్న సనాతన విధి త్వరగా పునరుద్ధరించబడాలి.

D D D

ఏకః శబ్దః సు ప్రయుక్తః స్వర్గే లోకే కామ ధుగ్భవతి.[1]

ఒక సుశబ్దాన్ని చక్కగా ప్రయోగిస్తే అది కామ ధేనువు వలె స్వర్గ లోకము నందును భూలోకము నందును అన్ని కోరికలను ఇస్తుంది. (అపశబ్ద ప్రయోగ నిషేధము యజ్ఞ సంబంధి అయినది. వ్యవహార విషయము కాదు).

"మంత్రో హీనః స్వరతో వర్ణతో వా మిథ్యా ప్రయుక్తో న తమర్థ మాహ,
సవాగ్వజ్రో యజమానం హినస్తి యథేన్ద్ర శత్రుః స్వరతోఽపరాధాత్."[2]

మంత్రంలో స్వర దోషమూ వర్ణ దోషమూ కలిస్తే అనుకొన్నదానికి విరుద్ధంగా ఫలితాన్ని కలిగిస్తుంది. అటువంటి నొక్కు వజ్రమై పలుకుతున్న వాడిని హింసిస్తుంది. ఇంద్రశత్రుః శబ్దాన్ని స్వరదోషంతో పలకడం వల్ల ఒకటనుకొంటే మరొకటి జరిగింది. మంత్రములో ఉన్న స్వరాపరాధం వల్ల అది అగ్ని జ్వాల అయిపోయింది.

విశ్వకర్మ కొడుకు త్వష్టృప్రజాపతి రాక్షసుడై ఇంద్రునిపట్ల శత్రుత్వం వహించి ఒక యజ్ఞం చేసాడు. అందులో "ఇంద్రుడనే శత్రువు హతమారుగాక" అనే అర్థంలో "ఇంద్రశత్రుర్వర్ధస్వ" అని పలికాడు (ఇంద్ర శత్రుః అనగా ఇంద్రునకు శత్రువు, శత్రువైన ఇంద్రుడు అను రెండు అర్థాలు).

ఇంద్రశత్రుః అన్నప్పుడు చివర ఉదాత్తస్వరం పలకాలి. కాని పొరబాటున యజమానుడు (యజ్ఞం చేసేవాడు, చేస్తున్నవాడు). ఆ స్వరాన్ని మొదట్లో పలికాడు. చివర ఉదాత్తస్వరం పలికితే "ఇంద్రునికి శత్రువయిన నువ్వు (త్వష్టృప్రజాపతి) వర్ధిల్లుగాక !" అని తత్పురుష సమాసములో అర్థం వస్తుంది.

అదే ఉదాత్త స్వరాన్ని యజమానుడు మొదట పలుకుటవలన "ఇంద్రునియొక్క శత్రువయిన త్వష్టృప్రజాపతి హతమారు గాక!" అని బహువ్రీహి సమాసములో అర్థం వచ్చి స్వరాపరాధం కలిగింది.

(1.ఉదాత్తము, 2. ఉదాత్తతరము, 3. అనుదాత్తము, 4. అనుదాత్తతరము, 5. స్వరితము, 6. స్వరితోదాత్తము, 7. ఏకశ్రుతి. అని ఏడురకాల స్వరభేదాలున్నాయని పతంజలి మహాభాష్యములో చెప్పారు. వీటిని గురు ముఖతః నేర్చుకోవాలి).

వైదికైః కర్మభిః పుణ్యైర్ని షేకాదిః ద్విజన్మనామ్ ।
కార్యః శరీరసంస్కారః పావనః ప్రేత్య చేహచ॥ [3]

ద్విజాతులైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు గర్భాధానం (శోభనము) మొదలైన శరీర సంస్కారాలన్నిటిని వేదమంత్రాలచే చెప్పబడిన వైదిక కార్యాలచే చేయవలెను. దానివలన అతడు ఇహపరలోకములలో పవిత్రుడౌతాడు.

చిత్రకర్మ యథాఽనేకైరాగైరున్మీల్యతే శనైః ।
బ్రాహ్మణ్యమపి తద్వత్స్యాత్సంస్కారైర్విధిపూర్వకైః ॥ [4]

ఒక చిత్రం యొక్క రూపురేఖలు అనేక రంగులతో (పూర్తిగా) మెల్లగా ప్రకాశింపబడినట్లుగా, బ్రాహ్మణుల ధర్మము కూడా అనేక గ్రంథ సంస్కారాలతో ఉంటుంది."

గర్భాధానం పుంసవనం సీమంతో జాతకర్మ చ ।
నామక్రియా నిష్క్రమోఽన్నప్రాశనం వపనక్రియా ।
కర్ణవేధో వ్రతాదేశో వేదారమ్భక్రియావిధిః ।
కేశాంతః స్నానముద్వాహో వివాహాగ్నిపరిగ్రహః ।
త్రేతాగ్నిసంగ్రహశ్చైవ సంస్కారాః షోడశ స్మృతాః ॥ [5]

షోడశ (పదహారు) సంస్కారములు ప్రతి హిందువు యొక్క జీవిత పర్యంతమూ వివిధ దశలలో జరుపబడతాయి.

1. **గర్భాధానం :–** చక్కటి సంతానాన్ని ఆశించి జరిపే దంపతులైన స్త్రీ పురుషుల యొక్క మొదటి కలయికకు సంబంధించిన సంస్కారం.

2. **పుంసవనం :–** స్త్రీ గర్భం ధరించినట్లు తెలిసిన తర్వాత ఆమెకు కొడుకు పుట్టాలని, చంద్రుడు పురుషరాశిలో ఉన్నప్పుడు జరిపే సంస్కారం.

3. **సీమంతం :–** తల్లి యొక్క సౌభాగ్యాన్ని, పుట్టబోయే బిడ్డ యొక్క ఆయుష్షును కోరుతూ చేసే సంస్కారం. సీమంతమనగా పాపిడి తీయడమని అర్థం. భర్త తన భార్యకు ఆప్యాయంగా సేవలుచేస్తూ సంరక్షించాలని ఈ సంస్కారములోని అంతరార్థం.

4. **జాతకర్మ :–** పుట్టినపుడు చేయు క్రియను జాతకర్మమంటారు. బొడ్డుత్రాడు కోసి, శిశువును శుభ్రము చేసి, చనుబాలు పట్టించుట ఈ జాతకర్మలో చేస్తారు.

5. **నామకరణం :–** నామకరణమనగా బిడ్డలకు పేరుపెట్టుట.

6. **నిష్క్రమణ :–** బిడ్డను మొదటిసారిగా ఇంటినుంచి బయటికి తీసుకువచ్చుట.

7. **అన్నప్రాశన :–** శిశువుకు ఆఅవనెలలోగాని, ఎనిమిదవనెలలోగాని బిడ్డలకు మొదట అన్నము తినిపించెడి సంస్కారము

8. **చూడాకరణము :–** శిశువుకు పుట్టువెంద్రుకలు తీయించడం.

9. కర్ణవేధ :– మంత్రోచ్చారణ జరుగుతుండగా చెవి కుట్టడమనే ఒక ఉపనయన సమయ వేడుక. ఒక చిన్న పరికరంతో చెవి కమ్మకు రంధ్రం వేయడం ఇందులో ముఖ్య ఘట్టం.

10. అక్షరాభ్యాసం :– తొలిసారిగా అక్షరములను నేర్చుకొనుట, బాలబాలికలకు బాల్యమున విద్యారంభము చేయు ఒక తంతు.

11. ఉపనయనం :– బాలుని గురుసమీపమును పొందించి వేదాధికారము గలుగుటకై చేయు సంస్కారవిశేషము.

12. వేదారంభం :– వేదాలను అధ్యయనం చేసే సంస్కారం. రెండు వేదాలను అధ్యయనం చేసినవారు ద్వివేది. మూడు వేదాలను అధ్యయనం చేసినవారు త్రివేది. నాలుగు వేదాలను అధ్యయనం చేసినవారు చతుర్వేదిగా పిలుస్తారు.

13. కేశాంతము :– పదహారేళ్ళ వయసొచ్చాక మొట్టమొదటిసారి గడ్డం చేసుకోవడానికి సంబంధించిన సంస్కారం. ఈ సంస్కారం చేసేటప్పుడు చివర్లో విద్యార్థి తన గురువుకు ఒక ఆవును దానంగా ఇవ్వటం వలన ఈ సంస్కారాన్ని గోదానమని కూడా అంటారు.

14. సమావర్తనము :– వేదాధ్యయనం ముగించుకొని, గృహస్థాశ్రమ స్వీకారం కోసం తిరిగి వెళ్లేటప్పుడు గురువు సమక్షంలో జరిపే వేడుక/ క్రతువు.

15. వివాహం :– విశిష్టం వహనం వరవధ్వోః వర–వధువులను పరస్పరంగా గ్రహించుటను వివాహమంటారు.

16. అంత్యేష్టి :– అంత్యక్రియ. మృత దేహాన్ని చితిపై ఉంచి మంత్రోక్తంగా దహనం చేయడం.

(ఆంగ్ల మూలములో శ్లోకాన్ని పేర్కొన్నారు కాని వివరణ లేదు. స్పష్టత కొరకు ఒక్కొక్క సంస్కారాన్ని వివరించాను. – అనువాదకుడు)

సూచికలు

1. పతంజలి మహాభాష్యము, vi, i–84.

2. పాణిని–శిక్ష, 52.

3. మనుస్మృతి, ii–26.
4. పరాశర–గృహ్య–సూత్ర, హరిహర భాష్య, పే. 260. (11. i.)
5. వ్యాస–స్మృతి పరాశర గృహ్య–సూత్రములలో ఉదహరించబడింది, పే. 269

అధ్యాయం 2

శ్రాద్ధము

మృత్యువు సమీపించిన సమయంలో కనిపించే దేహాన్ని విడిచిపెట్టిన జీవునికి, ఈ ప్రపంచంలో నివసించేవారు సహాయం చేయడానికి చేసే ఆచారకర్మము యొక్క పేరు శ్రాద్ధము. కనిపించే శరీరములో చైతన్యం లేని జీవాన్ని ప్రేత (= మరణించిన వాడు) అని పిలుస్తారు. ఈ దశలో చనిపోయినవానికి సహాయం చేయడానికి శ్రద్ధతో చేసే విధిని ప్రేతక్రియ (= శ్రాద్ధం) అంటారు.

కనిపించే శరీరాన్ని (అన్నమయకోశము) శ్మశానానికి తీసుకువెళతారు. అక్కడ అది వీలైనంత త్వరగా దానికి సంబంధించిన ప్రకృతి భాగాలలో కరిగిపోతుంది; కాలిన శరీరపు బూడిదను మూడవ రోజున ఒకచోట చేర్చి, ప్రవహించే నీటిలో – సాధారణంగా పవిత్రమైన ప్రవాహంలో – కలుపుతారు.

అన్నమయకోశం (=శరీరం) నాశనమైనప్పుడు, ప్రాణమయకోశం (=పంచ ప్రాణాలు) వేగంగా చెదిరిపోతుంది. దహన సమయంలో ఉపయోగించే కొన్ని మంత్రాల ద్వారా ఈ వ్యాప్తి వేగవంతమవుతుంది. మృతదేహాన్ని నాశనం చేయడానికి దహనం (=కాల్చుట) ఉత్తమ మార్గం. ఈ దహనక్రియ వెళ్లిపోయిన జీవునికి మరియు భూమిపై మిగిలిపోయిన వారికి ముఖ్యమైనది. శరీరం దహనం కానంత కాలం, ప్రాణమయకోశం తమ మధ్య ఉన్న అయస్కాంత ఆకర్షణ ఫలితంగా జీవుని నిర్జీవ శరీరం చుట్టూ తిరుగుతుంటుంది. అందువలన జీవుడు భూమితో సంబంధం తెంచుకు పోలేకపోతాడు. అలా కావటం ఆ జీవునికి హాని కలిగిస్తుంది. మరోవైపు, చనిపోయిన శరీరాన్ని దహనం చేయకపోతే శరీరం క్షీణిస్తుంది. పూడ్చి పెట్టిన పద్ధతిలో ఈ నిర్జీవ శరీరం ప్రకృతిలోకి విష వాయువులను పంపుతుంది. ఇది లోకంలో జీవించి ఉన్నవారికి హాని కలిగిస్తుంది.

దహనం తర్వాత చేసే శ్రాద్ధ కర్మలు –పాక్షికంగా ఉపయోగించిన వస్తువుల అయస్కాంత ప్రభావాల ద్వారా మరియు పాక్షికంగా మంత్రాల ద్వారా ఏర్పాటు చేయబడిన కంపనాల ద్వారా– మనోమయ కోశానికి (=జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, పంచ ప్రాణాలు, మనస్సు, బుద్ధి కలసి పదిహేడు అంగాలతో కూడిన సూక్ష్మ శరీరాన్ని మనోమయ కోశమంటారు) సంబంధించిన పదార్థాల

పునర్వ్యవస్థీకరణలో సహాయపడతాయి. ఒక నిర్దిష్ట సమయం తరువాత, చనిపోయిన జీవుని కొరకు సపిండీకరణ కార్యక్రమం (=పిండాలు పెట్టే శ్రాద్ధ కార్యక్రమం) నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం జీవుడు ప్రేతలోకం నుండి పితృలోకానికి వెళ్ళడానికి సహాయపడుతుంది. ఆపైన జీవుడు పితృదేవతలలో ఒకడిగా భువర్లోకంలోని సూక్ష్మ ప్రాంతాలలో నివసించే పూర్వీకుల మధ్య నమోదు చేయబడతాడు. భూర్లోకంలో ఒకటి, మరియు భువర్లోకంలో ఆరుగా ఉన్న ఏడు తరాలు ఒకదానికొకటి ప్రభావితం చేస్తాయి. జీవుడు స్వర్గానికి వెళ్ళినప్పుడు, అతనికి శ్రాద్ధ కార్యక్రమానికి సంబంధించిన సహాయం అవసరం లేదు.

దేశే కాలే చ పాత్రే చ శ్రద్ధయా విధినా చ యత్ ।
పితనుద్దిశ్య విప్రేభ్యో దానం శ్రాద్ధముదాహృతమ్ ॥[1]

“పితృదేవతలకు ప్రయోజనం చేకూర్చడం కోసం, తగిన సమయాలలో మరియు తగిన ప్రదేశాలలో విశ్వాసంతో అర్హులైన బ్రాహ్మణులకు దానాలు ఇవ్వడాన్ని శ్రాద్ధమని పిలుస్తారు.”

కుర్యాదహరహః శ్రాద్ధమన్నాద్యేనోదకేన చ ।
పయోమూలఫలైర్వాపి పితృభ్యః ప్రీతిమావహన్ ॥[2]

గృహస్థుడు ప్రతిరోజూ పితృదేవతలకు సంతృప్తి కలగటానికి అన్నాదులచే, ఉదక దానముచే, పాలు, దుంపలు, పండ్లు దానం చేస్తూ శ్రాద్ధాన్ని ఆచరించాలి.

పంచభ్య ఏవ మాత్రాభ్యః ప్రేత్య దుష్కృతినాం నృణామ్ ।
శరీరం యాతనార్థీయమన్యదుత్పద్యతే ధ్రువమ్ ।
తేనానుభూయ తా యామీః శరీరేణేహ యాతనాః ।
తాస్వేవ భూతమాత్రాసు ప్రలీయన్తే విభాగశః ।
యద్యాచరతి ధర్మే స ప్రాయశోఽధర్మమల్పశః ।
తైరేవ చావృతో భూతైః స్వర్గే సుఖముపాశ్నుతే ॥[3]

దేహి యాతనాశరీరంతో శబ్దస్పర్శాది విషయానుభవం వల్ల కలిగిన యమ బాధలనన్నీ అనుభవించి నరకానుభవం వల్ల పాపాలు పోగొట్టుకొని పంచ భూతములను తిరిగి పొందుచున్నాడు.

పాపం చేసేమానవులు నరకంలోని సమస్తబాధలనుభవించుటకై జరాయుజాది

దేహవ్యతిరిక్తమైన(గర్భస్థపిండమునకు రక్షకముగా మీద క్రమ్ముకొనియుండు తోలుసంచిని మావి లేదా జరాయువు అంటారు). యాతనాశరీరం (= పాపాలకు శిక్షించబడటానికి మరణం తర్వాత జీవాత్మకు కలిగే శరీరం). పరలోకంలో పంచ భూతాలవల్లనే కలుగుచున్నది.

ఆ జీవుడు భూలోకంలో ధర్మాన్ని అధికంగా అధర్మాన్ని తక్కువగా ఆచరించి ఉంటే, స్థూలశరీరరూపంలో పరిణమించిన పంచ భూతాలతో కలిసి స్వర్గసుఖాన్ని అనుభవిస్తున్నాడు.

చితామోక్షప్రభృతి చ ప్రేతత్వముపజాయతే ॥[4]

"దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత (జీవుడు) ప్రేతగా (=పీనుగుగా) మారతాడు.

వర్షే యావత్ ఖగశ్రేష్ఠ! మార్గే గచ్ఛతి మానవః ।
తతః పితృగణైః సార్ధం పితృలోకం స గచ్ఛతి ।
దత్తైః షోడశభిః శ్రాద్ధైః పితృభిః సహ మోదతే
పితుః పుత్రేణ కర్తవ్యం సపిండీకరణం సదా ॥[5]

"ఓ శ్రేష్ఠమైన పక్షీ! జీవుడు ఒక సంవత్సరం పాటు ప్రేతలోక మార్గంలో ఉంటాడు; తర్వాత అతను పితృలోకంలో ప్రవేశించి పితృదేవతలలో కలుస్తాడు.

"పదహారు శ్రాద్ధాలు చేయుట ద్వారా జీవుడు పితృదేవతలతో ఆనందంగా నివసించడానికి భూలోకంలోని కుమారాదులు సహాయం చేస్తారు. అందువల్ల కొడుకు తండ్రికి సపిండీకరణము తప్పక చేయాలి."

సూచికలు

1. బ్రహ్మాండ పురాణం.
2. మనుస్మృతి, iii-86.
3. మనుస్మృతి. xii. 16, 17, 20.
4. గరుడ పురాణం. II. v-36.
5. పై పుస్తకం II, xvi-6, 7.20.

అధ్యాయము 3

శౌచం

శారీరక స్వచ్ఛతను కాపాడుకోవడానికి నిర్దేశించిన నియమాలను శౌచం– కలిగి ఉంటుంది. (శుచి శబ్దం నుంచి వచ్చిన పదం శౌచం. స్వధర్మానుష్ఠానం, వైదిక కర్మకు యోగ్యత కలిగించే ఒక సంస్కారం, శుభ్రముగా నుండుట మొదలైన అర్థాలు కూడా ఈ శౌచ పదానికి ఉన్నాయి). శారీరక ఆరోగ్యం మరియు బలాన్ని శౌచం నిర్ధారిస్తుంది. వ్యాధి అనేది ప్రకృతి యొక్క కొన్ని నియమాలను జీవుడు విస్మరించాడనడానికి సంకేతం. ప్రకృతి ధర్మములు భగవంతుని యొక్క నియమము లను అనుసరించి ఉంటాయి. భగవంతుని యొక్క ఉనికికి వ్యక్తీకరణగా ప్రకృతి ధర్మములను భావించి, జీవుని ప్రకృతి పదార్థంతో కప్పబడిన దేవుని భాగముగా గ్రహించి మతపరమైన విధిగా ప్రకృతి నియమాలు తెలుసుకున్న ఋషులు వాటిపట్ల విధేయతతో వ్యవహరించారు.

లోపల ఉన్న దానికంటె (ప్రాణమయకోశం) రెట్టింపుగా ఉన్న ఈ కనిపించే శరీరం, పాంచభౌతిక (= పంచభూతాలతో నిర్మింపబడిన) పదార్థాలతో తయారు చేయబడింది. కనుక ఈ పాంచభౌతిక పదార్థాలను స్వచ్ఛంగా చేయడానికి మరియు వాటిని స్వచ్ఛంగా ఉంచడానికి భౌతిక మార్గాలను ఉపయోగించడం అవసరం. ఈ భౌతిక మార్గాలేమిటో, వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలంటే ముందుగా మనం వాటిని అర్థం చేసుకోవాలి.

మనం తినే ఆహారం, మనం త్రాగే ద్రవాలు, మనం పీల్చే గాలి నుండి తీసుకోబడిన కణములతో ఈ కనిపించే శరీరం (అన్నమయకోశం), కూడి ఉంటుంది. ఈ సూక్ష్మ కణాలు మనము చూడలేనంత చిన్నగా ఉంటాయి. ప్రజలు మరియు మన చుట్టూ ఉన్న వస్తువుల ప్రభావం నిరంతరం మనపై పడుతున్నది. ఈ చివరి ప్రకటన కొంచెం వింతగా అనిపించవచ్చు. కానీ ఇది నిజం.

మన శరీరాలు నిర్జీవ పదార్థంతో తయారైనవి కావు, ఎందుకంటే నిర్జీవ పదార్థం అంటూ ఏదీ లేదు.[1]

పదార్థం అణువులు అని పిలువబడే చిన్న జీవుల నుండి మరియు అణువుల సముదాయమైన ఇతర చిన్న జీవుల నుండి తయారవుతుంది. ధూళి రేణువు అనగా

అనేక చిన్న చిన్న జీవుల అసంఖ్యాకాల సమాహారం. సూక్ష్మజీవులు అని పిలువబడే వాటి జీవన పరిణామ దశలలో అనేక శ్రేణులు, ఉపశ్రేణులు ఉన్నాయి. వాటిని సూక్ష్మదర్శిని సహాయంతో మాత్రమే మనం చూడగలం.

ఇప్పుడు ఈ సూక్ష్మజీవులు మరియు ఇతర చిన్న జీవులు అన్నీ గాలిలో తేలుతుంటాయి. మరియు మన శరీరాలు మరియు అన్ని వస్తువులు వీటితో కలిసి ఉం టాయి. మన చుట్టూ ఉన్న రాళ్ళు, మొక్కలు, జంతువులు, మానవులు మరియు అన్ని తయారు చేయబడిన వస్తువులు, ఇళ్ళు, గృహోపకరణాలు, బట్టలు ఈ సూక్ష్మ జీవ కణాల గుంపులను నిరంతరం విడుదల చేస్తుంటాయి. మనకు సమీపంలో ఉన్న ప్రతిదీ, ఇంకా ఎక్కువగా మనం తాకిన ప్రతిదీ దానిలోని కొన్ని సూక్ష్మ జీవ కణాలను మనకు ఇస్తుంది .మనం కూడా మన శరీరం ద్వారా సూక్ష్మ జీవ కణాలకు సంబంధించిన మరి కొన్నింటిని వాటికి అందిస్తాము. మనం ఆరోగ్యంగా ఉండాలంటే, మనం స్వచ్ఛమైన జీవ కణాలు ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే మన శరీరంలోకి తీసుకోవాలి. శుభ్రంగా లేనివాటిని వదిలివేయాలి. శౌచ నియమాలు వీటిని ఎలా ఆచరించాలో చూపించడానికి ఉద్దేశించబడ్డాయి.

మనం తినే ఆహారం స్వచ్ఛంగా ఉండాలి. ఇప్పుడు అన్ని విషయాలు విశేషాలతో తెలుస్తున్నాయి. వాటిని గ్రహించి స్వచ్ఛమైన ఆహారం తీసుకోకపోతే మరణానికి దగ్గరగా వెళతాం; చక్కటి ఆహారంతో ఆరోగ్యకరమైన శరీరం నిర్మించబడుతుంది. అలా ఆహారాన్ని గ్రహించకపోతే నాశనం చేయబడుతుంది.

శుద్ధమైన ఆహారం అంటే ప్రాణం నిండినది, అది క్రమంగా వికసిస్తుంది. దాని తదుపరి సహజ దశ "ఉన్నత ఏకీకరణ" అంటే మరింత సంక్లిష్టంగా మారడం. తాజాగా ఉండే ఆకులు, పండ్లు, ధాన్యాలు, దుంపలు జీవశక్తితో నిండి ఉంటాయి. ఈ జీవశక్తిని మనం శరీరంలోకి తీసుకున్నప్పుడు, అది శరీరాన్ని నిర్మిస్తుంది.

అయితే, ఈ ఆహార పదార్థాలు నిల్వ ఉండిపోతే, అవి అశుద్ధంగా మారతాయి. ఎందుకంటే వాటిలోని జీవశక్తి తగ్గిపోయి, అవి మరణానికి చేరువలో ఉంటాయి. మాంసాహారం ఏదైనా సరే, అది ఎంతో కొంత అశుద్ధమైనదే. ఎందుకంటే దానిలో ఉన్న ప్రాణం ఇప్పటికే వెళ్ళిపోయింది, అది కుళ్లిపోవడానికి సిద్ధంగా ఉంటుంది. దాని తదుపరి సహజ దశ "విచ్ఛిన్నం" అంటే సరళమైన రూపాలుగా విడిపోవడం. మాంసాహారంతో నిర్మితమైన శరీరం మొక్కల ఉత్పత్తులతో నిర్మితమైన శరీరం కంటే

వ్యాధులకు ఎక్కువగా గురవుతుంది. గాయాలు త్వరగా మానవు, జ్వరాలు కూడా తీవ్రంగా ఉంటాయి.

ద్రవాలలో ఒకటయిన స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి అవసరం. టీ, కాఫీ మరియు కోకో వంటి మూలికల కషాయాలను మితంగా తీసుకుంటే హానిచేయవు. మరియు తరచుగా ఉపయోగకరంగా ఉంటాయి. పాలు స్వచ్ఛమైన ఆహారం మరియు పానీయం. మద్యం (ఆల్కహాల్) లోకి ప్రవేశించే ప్రతి పానీయం అపరిశుభ్రమైనది. అది శరీరానికి అత్యంత హానికరం. మద్యం(కల్లు) అంటే పులియబెట్టినది. కుళ్ళిన లక్షణాలు కలిగిన మద్యం శరీరంలోని కణజాలాలను గాయపరుస్తుంది. ఇది మెదడుకు ఒక ప్రత్యేకమైన విషంలా పనిచేస్తుంది. ముఖ్యంగా మద్యం వేడి వాతావరణంలో ప్రమాదకారిగా ఉంటుంది, అకాల క్షయం కలిగించి ముందస్తు మరణానికి దారితీస్తుంది. గంజాయి వంటి స్మృతి పోగొట్టు మందులలో (డ్రగ్స్‌లో) అశుద్ధమైన పానీయాలు కూడా ప్రవేశిస్తాయి. గంజాయి జనాదరణ పొందినప్పటికీ ఆరోగ్యాన్ని నాశనం చేసే మాదకద్రవ్యము(మత్తు కలిగించెడి పదార్థము).

ఆరోగ్యానికి స్వచ్ఛమైన ఆహారం ఎంత అవసరమో స్వచ్ఛమైన గాలి కూడా అంతే అవసరం. మనం ఊపిరి పీల్చుకున్నప్పుడు, కార్బన్ డయాక్సైడ్ అని పిలువబడే ఒక వాయువును మనం బయటకు పంపుతాము. ఇది అచేతన స్థితికి గురిచేస్తుంది. మనం ఒక పరిమిత ప్రదేశంలో ఉండి ఆ గదిని మూసివేసినట్లయితే, దానిలోని గాలి మొత్తం కార్బన్ డయాక్సైడ్‌తో నిండిపోతుంది. అది ఊపిరి పీల్చుకోవడానికి పనికిరాదు. ఆ సమయంలో స్వచ్ఛమైన గాలిని పీల్చుకోకపోతే దుష్పరిణామాలు జరుగుతాయి. విడిచిన కార్బన్ డయాక్సైడ్ ఊపిరితిత్తులలోకి మళ్లీ మళ్లీ పీల్చబడి మరియు వాటి ఊపిరితిత్తులు విషపూరితమవుతాయి.

మనం మన శరీరాల లోపలిభాగాలకు శుభ్రమైన పదార్థాలు అందించటమే కాకుండా, శరీరపు పై భాగాన్ని తరచుగా కడగడం మరియు స్నానం చేయడం ద్వారా శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా స్నానం చేయాలి. స్నానంలో శరీరాన్ని బాగా రుద్దాలి తద్వారా అన్ని వదులుగా ఉండే శరీరములోని సూక్ష్మాణువులు కడిగివేయబడతాయి. తద్వారా చర్మం శుభ్రంగా మరియు తాజాగా ఉంటుంది. శరీరంలోని ఏదైనా భాగం మురికిగా ఉంటే తక్షణం శుభ్రం చేయాలి. పాదాలు, చేతులు మొదలైనవి అపరిశుభ్రమయితే వాటిని ఎప్పటికప్పుడు కడుక్కోవాలి.

ఆహారానికి తీసుకోవటానికి ముందు అలాగే తరువాత పాదాలు, చేతులు కడగడం ఎప్పటికీ వదిలివేయకూడదు. కడగని చేతులతో దుమ్ము మరియు ఇతర హానికరమైన నలుసులతో ఆహారాన్ని తింటే – అది శరీరాన్ని కలుషితం చేసే ప్రమాదం ఉంది. ఆహారం తిన్న తర్వాత కాళ్లు చేతులు కడగటం చాలా అవసరం. శరీరం పై ఉన్న వస్త్రాలను కూడా రోజూ ఉతకాలి.

హిందువు, బాహ్య ప్రపంచాన్ని తన అంతరంగానికి చిహ్నంగా చూడటం అలవాటు చేసుకున్నాడు, తన బాహ్యశరీర ప్రక్షాళనలో అంతర్గత శుద్ధి ఆలోచనను చేర్చుకున్నాడు. అతను బయటి శరీరాన్ని కడుగుతున్నప్పుడు, అతను అంతర్గత శరీరాన్ని శుద్ధి చేయడానికి మంత్రాలను పఠిస్తాడు. తద్వారా తన మతాన్ని రోజువారీ జీవితంలోని సాధారణ సంఘటనలలోకి చేర్చాడు.

ఋషులు పరిశుభ్రత గురించి ఎందుకు ప్రత్యేకంగా చెప్పారో ఇప్పుడు విద్యార్థులు గమనించాలి. మురికి శరీరంతో లేదా మురికి బట్టలతో ఉన్న వ్యక్తి తన చుట్టూ ఉన్న గాలిని అపరిశుభ్రమైన నలుసులతో నింపి, తన చుట్టూ ఉన్న ప్రజలనుకూడా విషపూరితం చేస్తాడు. మనం శుభ్రంగా ఉండుట, మన కోసమే కాదు, మన చుట్టూ ఉన్న వారి కోసం కూడా. ఒక మురికి వ్యక్తి, మురికి బట్టలు, మురికి ఇళ్ళు ఇవన్నీ , విషం యొక్క కేంద్రాలు. ప్రజలకు ప్రమాదాలు.కలిగించేవి.

ప్రాణమయకోశ (=పంచ ప్రాణాలు) స్వచ్ఛత ఆకర్షణీయమైన అయస్కాంత ప్రవాహాలపై ఆధారపడి ఉంటుంది. చుట్టుపక్కల ఉన్న వస్తువుల ఆకర్షణీయ లక్షణాల ద్వారా ఈకోశం త్వరగా ప్రభావితమవుతుంది. కాబట్టి మనం ఈ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. ఈ విధంగా కొన్ని వృక్షాల ఉత్పత్తులు మరియు మొక్కలు, అన్నమయకోశానికి ఎటువంటి హాని చేయనప్పటికీ, ప్రాణమయకోశానికి చాలా హానికరం కలిగిస్తాయి. ఉదాహరణకి ఉల్లిపాయలు మరియు వెల్లుల్లి వంటివి. వీటి అయస్కాంతత్వం మాంసం కంటే అధ్వాన్నంగా ఉంటుంది. ఈ ప్రాణమయకోశం – మద్యపానంతో పాటు ఇతరుల ప్రాణమయకోశాల వల్ల కూడా చాలా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఇది గమనించవలసిన అంశం.

ఇంకా ముఖ్యమైనది ఏమిటంటే, ఆ ప్రాణమయ కోశం దాని స్వంత మనోమయకోశం ద్వారా ఇతరులచే కూడా ప్రభావితమవుతుంది. అందువల్ల చెడు సహవాసం యొక్క ప్రమాదాలు గమనించాలి. మనోమయకోశము (జ్ఞానేంద్రియాలు

ఐదు, కర్మేంద్రియాలు ఐదు, పంచ ప్రాణాలు, మనస్సు, బుద్ధి కలసి పదిహేడు అంగాలతో కూడినది సూక్ష్మ శరీరాన్ని మనోమయ కోశమంటారు) యొక్క స్వచ్ఛత దాని యజమాని యొక్క ఆలోచనలు మరియు కోరికల స్వచ్ఛతపై ఆధారపడి ఉంటుంది. అన్నమయ మరియు ప్రాణమయకోశాలకు సంబంధించిన అపరిశుభ్రత యొక్క అత్యంత సారవంతమైన మూలం ఈ మనోమయకోశంలో ఉంది. ఆలోచనలు మరియు కోరికలు అపరిశుభ్రంగా ఉంటే ఈ రెండు భౌతిక కోశాలు స్వచ్ఛంగా మరియు ఆరోగ్యంగా ఉండవు. ఒక వ్యక్తి శరీర పరంగా శౌచ నియమాలను చివరి వరకు కఠినంగా పాటించవచ్చు, కానీ అతను గర్వంగా, ఉద్వేగభరితంగా, కఠినంగా, వ్యర్థంగా, అనుమానాస్పదంగా ఉంటే, అలా జీవితంలో ప్రవర్తిస్తే అతను ఏ నియమాలు కడిగివేయలేనంత వేగంగా ఈ కోశాలలో అపరిశుభ్రతను కురిపిస్తాడు. ఋషుల దృష్టిలో మరియు దేవతల దృష్టిలో అటువంటివాడు ఎప్పుడూ అశుచి.

దూరాదావసథాన్మూత్రం దురాత్పాదావ సేవనమ్ ।
ఉచ్ఛిష్టాన్నం నిషేకం చ దూరాదేవ సమాచరేత్ ॥[2]

తన నివాసానికి దూరంగా మలమూత్రాలను, తన పాదాలు కడుక్కోవడానికి ఉ పయోగించే నీటిని, ఆహారము భుజించిన ఆకులను, స్నానపు నీటిని విడిచివేయాలి.

ఆచమ్య ప్రయతో నిత్య ముభే సంధ్యే సమాహితః ।
శుచౌ దేశే జపన్ జప్య ముపాసీత యథావిధి ॥[3]

ద్వి సంధ్యాకాలములలో ఆచమనము చేసి, పరిశుద్ధుడై, నిత్యము వేఱుచింత మాని, పరిశుద్ధ ప్రదేశములో కూర్చుని శాస్త్ర ప్రకారము గాయత్రీ మంత్రమును జపించాలి.

(దేని యందు బ్రాహ్మణులు ధ్యానింతురో దానిని సంధ్య అంటారు. ప్రొద్దు పొడుచుటకు ముందు అయిదుగడియలవరకు ప్రొద్దుగ్రుంకిన వెనుక మూడుగడియల వఱకును గల కాలమును సంధ్య అంటారు. గడియ అనగా ఇరువది నాలుగు నిమిషముల కాలము.

ఓం కేశవాయ స్వాహా, నారాయణాయ స్వాహా, మాధవాయ స్వాహా, అచ్యుతాయ నమః, అనంతాయ నమః, అచ్యుతానందగోవిందాయ నమః అనుచు మూడుమార్లు చూపుడువ్రేలు పొడవుగా నిలిపి పుడిసిట జలము పోసికొని మంత్రపూర్వకముగా పుచ్చుకొనుటను ఆచమనము అంటారు).

ఉపస్పృశ్య ద్విజో నిత్యమన్న మద్యాత్సమాహితః ।
భుక్త్వా చోపస్పృ శేత్సమ్యగద్భి: ఖానిచ సంస్పృశేత్ ॥[4]

ద్విజుడు (=జన్మించిన పిదప ఉపనయనముచే రెండవ పుట్టుక కలవాడు) ఆచమనం చేసిన తరువాత నియమంతో కూర్చొని ఆహారాన్ని తీసికొనవలెను. భోజనానంతరం కూడ ఆచమనం చేసి ముక్కు మొదలయిన ఇంద్రియములను స్పృశింపవలెను.

జ్ఞానం తపోఽగ్నిరాహారో మృన్మనో వార్యుపాఞ్జనమ్ ।
వాయుః కర్మార్కకాలౌ చ శుద్ధేః కర్తృణి దేహినామ్ ॥[5]

"జ్ఞానం, తపస్సు, అగ్ని, ఆహారం, భూమి, మనస్సు, నీరు, పూతపూయుట, గాలి, సంస్కారం, సూర్యుడు మరియు కాలం ప్రాణులను శుద్ధి చేస్తాయి."

అద్భిర్గాత్రాణి శుధ్యన్తి మనః సత్యేన శుధ్యతి ।
విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్జ్ఞానేన శుధ్యతి ॥[6]

"శరీరం నీటితో, మనస్సు సత్యంతో, జీవాత్మ బ్రహ్మజ్ఞానతపస్సులతో, బుద్ధి నిశ్చయ జ్ఞానంతో శుద్ధి చేయబడతాయి."

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ॥[7]

(దివ్య ఆధ్యాత్మిక) జ్ఞానం కంటే పవిత్రమొనర్చేది ఈ లోకంలో వేరే ఏమీ లేదు.

అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥[8]

పరమ పాపిష్ఠివారు అయినా సరే, నన్ను అనన్య భక్తి తో (ఏకాగ్ర భక్తితో) పూజిస్తే, వారిని ధర్మాత్ములుగానే పరిగణించాలి, ఎందుకంటే వారు సరియైన నిర్ణయం తీసుకున్నారు కాబట్టి.

ఓ కుంతీ పుత్రుడా! ఇలా త్వరితగతిన వారు ధర్మాత్ములుగా అవుతారు, మరియు శాశ్వతమైన శాంతిని పొందుతారు. నా భక్తుడు ఎన్నటికీ నష్టమునకు గురికాదు అని ధైర్యముగా ప్రకటించుము.

సూచికలు

1. ఇక్కడ నిర్జీవం అంటే ఏమిటి? ఒక శరీరాన్ని మొత్తంగా "నిర్జీవం" అని అంటారు, అది జీవుడిని వదిలిపెట్టినప్పుడు. అయినప్పటికీ, ఆ శరీరంలోని కణాలు మాత్రం సజీవంగానే ఉంటాయి. ఈ ''నిర్జీవ శరీరం'' కుళ్ళిపోయినప్పుడు, అందులోని సజీవ కణాలు విముక్తమవుతాయి.
2. మనుస్మృతి, vi - 151
3. పై పుస్తకంలోనే ii -222
4. పై పుస్తకంలోనే, ii -53
5. పై పుస్తకంలోనే, v -105
6. మనుస్మృతి, v -109
7. భగవద్గీత, iv -38
8. భగవద్గీత, 9-30, 31.

అధ్యాయం 4
రోజు చేసే పంచయజ్ఞములు

త్యాగమనే ఒక నియమము ఉందని, దానిని ఆచరించటమే మనిషికి కీర్తిదాయకమని మనం ఇదివరలో చదువుకొన్నాం. ఈ క్రమంలో సనాతన ధర్మం తనని అనుసరించేవారికి ఆ విషయంలో ఎలా శిక్షణ ఇస్తుందో గమనిద్దాం.

ప్రస్తుతకాలానుగుణంగా, పవిత్ర గ్రంథాలలో నిర్దేశించబడిన అనేక రకాల యజ్ఞాలను మనం విడిచిపెట్టవచ్చు. కాని ప్రతిరోజూ చేయవలసిన "గొప్ప యజ్ఞాల" గురించి మాత్రమే ఆలోచిద్దాం. అవి ఇవి

బ్రహ్మ యజ్ఞం (వేద పఠనం)

దేవ యజ్ఞం (వైశ్వదేవం)

పితృ యజ్ఞం

మనుష్య యజ్ఞం

భూత యజ్ఞం

వీటిలో ప్రతి ఒక్కటి బయటి రూపం మరియు అంతర్గతమయిన అర్థం కలిగి ఉన్నది. రెండోది (అంతర్గతమయిన అర్థం) యజ్ఞం చేసే వ్యక్తిని యజ్ఞమయమయిన జీవన విధానంలో నడిపిస్తుంది.. ఈరెండింటినీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

1. బ్రహ్మయజ్ఞం

ఋషులకు, లేదా వేదాలకొరకు చేసే బాహ్యయజ్ఞం బ్రహ్మ యజ్ఞం. అధ్యయనం మరియు బోధనలను బ్రహ్మయజ్ఞం అంటారు. ప్రతిరోజు ఒక వ్యక్తి ఏదో ఒక పవిత్ర గ్రంథాన్ని అధ్యయనం చేయాలి. తద్వారా క్రమంగా జ్ఞానాన్ని పొందాలి, అది లేకుండా అతను ఈలోకంలో తనను, తన స్థానాన్ని మరియు తన విధులను సరిగ్గా అర్థం చేసుకోలేడు. అతను ఈ జ్ఞానాన్ని తనకంటే ఎక్కువగా ఉన్న అజ్ఞానులతో పంచుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి: అందుకే మనువు, ఈ యాగాన్ని బోధన అని వర్ణిస్తాడు.[1]

బాలుడు ప్రతిరోజూ ఈ యాగం చేయాలి, భగవద్గీత, అనుగీత, హంసగీత లేదా ఇతర పవిత్రమైన గ్రంథాలలోని కొన్ని శ్లోకాలను చదివి, జాగ్రత్తగా వాటి గురించి ఆలోచించాలి. చదివిన సారాంశం కంటే చదివిన వాటి గురించి చేసే ఆలోచనా పరమైన శ్రద్ధ మరియు చేర్పు చాలా ముఖ్యం. అంతర్గత అర్థం ఏమిటంటే, మనం బోధించే క్రమంలో నేర్చుకొంటూ అన్ని అధ్యయనాలను యాగంగా మలుచుకోవాలి.

2. దేవ యజ్ఞం

దేవతలకు చేసే బాహ్య యజ్ఞం హెూమం. ప్రకృతిలో మనకు ఉపయోగపడే చురుకైన మేధ రావటానికి కారకులయిన దేవతలకు, వారి దయను చాటుతూ చేసే సేవ దేవ యజ్ఞం. ఈ లోకంలో మనకు రక్షణకల్పించి, మనకు ఆస్తులను ఇచ్చి మనలను ఋణగ్రస్తులుగా చేసిన వారందరినీ గుర్తించి వారి సేవ కోసం ఋణాన్ని తిరిగి చెల్లించడం కోసం చేసే సేవా కార్యక్రమం ఈ దేవ యజ్ఞం. దీనిలోని అంతర్గతమయిన అర్థం ఏమిటంటే, భౌతిక సూత్రాలకు లొంగని పై లోకాలతో మన సంబంధాలను పటిష్టపరుచుకోవటం మరియు పై లోకాలు– ఈ లోకం పరస్పర ఆధారపడేటట్లు చేయగలగటం. ఇలా మనం అన్ని జీవులకు అనుగుణంగా ఉండే ప్రకృతితో సామరస్యంగా ఉండటం నేర్చుకోవాలి.

3. పితృ యజ్ఞం

మన కుటుంబాలలోని పాత తరాలవారికి, (మన పూర్వీకులకు) ఈ పితృయజ్ఞంలో తర్పణాలు విడుచుట (జలమువిడిచి పితృదేవతలను తృప్తిపొందించుట) ఈ పితృయజ్ఞంలో బయటికి కనిపించే చర్య. మనకంటే ఈ భూమిలో ముందు జన్మించి మన కొరకు కష్టపడి, శ్రమించిన పూర్వీకులకు మనం ఋణపడి ఉన్నామని గుర్తించడమే ఈ పితృయజ్ఞంలోని అంతర్గత అర్థం. పూర్వీకులకు, గతానికి తాను ఋణపడి ఉన్నానని గుర్తించని మానవుడు నిజంగా మానవుడు కాడు.

4. మనుష్య యజ్ఞం

తోటి మానవుల కొరకు మనం చేసే బాహ్య యజ్ఞమే మనుష్య యజ్ఞం. అనగా ఆతిథ్యం. నిజమైన ఆర్యుడు (=1. వింధ్యమునకును హిమవంతమునకును మధ్య ఉన్న ఆర్యావర్త దేశానికి సంబంధించినవాడు, 2, గౌరవింపదగినవాడు)

ప్రతిరోజు తనకంటే పేదవారికి ఆహారం అందించాలి. తోటి మానవులకు సేవ చేయడం మరియు సహాయం చేయడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం, దుస్తులు లేనివారికి దుస్తులు అందించి ధరింపచేయడం, నిరాశ్రయులకు ఆశ్రయం ఇవ్వడం, దుఃఖితులను ఓదార్చడం ఈ మనుష్య యజ్ఞంలోని భాగాలు. మనుష్య యజ్ఞం యొక్క అంతరార్థమిదే. ధనవంతులు పేదలయొక్క పర్యవేక్షకులు. (=అన్ని పనులు చూచుటకు నియమింపబడినవారు). ఈ వాక్యం మరువకూడదు.

5. భూతయజ్ఞము

భూతాలకొరకు (ప్రాణులకొరకు) చేసే యజ్ఞం భూతయజ్ఞము. భూతయజ్ఞమంటే మనం భోజనం ప్రారంభించే ముందు నేలపై కొద్దిగా ఆహారాన్ని ఉంచడం. మన చుట్టూ ఉన్న కనిపించని సూక్ష్మ ప్రాణుల ఆహారం కోసం– మనం ఆహారం తీసుకొన్న తరువాత మిగిలిన అవశేషాలను సరియైన ప్రదేశంలో ఉంచాలి. మనతో పాటు మనుగడ సాగిస్తున్న జంతువులు, మానవులు మరియు దిగువ ప్రపంచాలలో ఉన్నవారిని రక్షించి , వారు మనకు కనబడకుండా చేస్తున్న సేవలను గుర్తించి, వారి ఋణాన్ని తీర్చుకొనే ప్రయత్నం చేస్తూ , తోటి జీవుల పట్ల దయ మరియు శ్రద్ధను పాటించాలనేది ఈ భూత యజ్ఞములోని అంతర్గత అర్థం.

ఈ విధంగా ప్రతిరోజు ఆచరించవలసిన పంచ యజ్ఞాలు మనిషికి తోటివారితో అతని సంబంధాలు ఎలా ఉండాలో తెలియచేస్తాయి. తన చుట్టూ ఉన్న వారితో, తన కన్నా పెద్దవారితో, తనతో సమానులవారితో, తన కన్నా తక్కువ వారితో ఎలా మెలగాలో బోధచేస్తాయి. ఈ అయిదు యజ్ఞాలు – కుటుంబాలు మరియు దేశాల ఆనందం మరియు శ్రేయస్సుపై ఆధారపడిన – పరస్పర సామరస్య సంబంధాలను బలపరుస్తాయి. ఇవి ఈశ్వరుని సంకల్పానికి అనుగుణంగా మానవ జీవిత చక్రాలను తిప్పుతూ, ప్రపంచ పరిణామాలకు సహాయం చేస్తాయి. ఈ అయిదు యజ్ఞాలు – ప్రతి వ్యక్తి – సమాజం నుంచి విడిగా ఉన్న వ్యక్తి కాదని, గొప్ప మొత్తంలో ఒక భాగమని, విశాలమైన శరీరంలోని ఒక కణమని బోధిస్తాయి : తోటివారికి సాధారణ ఆనందాన్ని అందచేయటానికి ప్రయత్నించి, వారికి చేతనయినంత సహాయం చేస్తేనే వ్యక్తి యొక్క ఆనందం మరియు పురోగతి అనేవి – సురక్షితంగా ఉంటాయని ఈ పంచయజ్ఞాలు బోధిస్తాయి.

అధ్యాపనం బ్రహ్మయజ్ఞః పితృయజ్ఞస్తు తర్పణం ।
హోమో దైవో బలిర్భౌతో నృయజ్ఞోఽతిథిపూజనమ్ ॥[2]

వేదాన్ని అధ్యయనం చేయుట, చేయించుట అనేది బ్రహ్మయజ్ఞం. పితృదేవతలకిచ్చు తర్పణము పితృయజ్ఞం. యజ్ఞయాగాది కార్యక్రమాలు చేయుట దైవ యజ్ఞం. భూతాలకొరకు (ప్రాణులకొరకు) చేసే యజ్ఞం భూత యజ్ఞం. ఇంటికి వచ్చిన అతిధులను గౌరవించుట అనునది మనుష్య యజ్ఞం.

స్వాధ్యాయే నిత్యయుక్తస్స్యాత్ దైవే చైవేహ కర్మణి ।
దైవే కర్మణి యుక్తో హి బిభర్తీదం చరాచరమ్ ॥[3]

దరిద్రం మొదలైన కారణాలవల్ల నిత్యం అతిధిపూజ చేయలేకపోయినా, ఒక వ్యక్తి ప్రతిరోజు వేదాధ్యయనములోను, దేవతార్చనలోను శ్రద్ధ కలిగియుంటే అతడు ఈ సమస్త ప్రపంచమునకు సహాయము చేయగలడు.

ఋషయః పితరో దేవా భూతాన్యతిథయస్తథా,
ఆశాసతే కుటుంబిభ్య స్తేభ్యః కార్యం విజానతా ।
స్వాధ్యాయేనార్చయేతర్షీన్ హోమైర్దేవాన్ యథావిధి,
పితన్ శ్రాద్ధేన నన్నైర్భూతాని బలికర్మణా ॥[4]

ఋషులు, పితృదేవతలు, దేవతలు, భూతాలు, అతిథులు మొదలగువారందరు గృహస్థుల నుండి పలు విషయాలను కోరుకొంటారు. కావున గృహస్థ ధర్మంలో ఉన్నవాడు వారి వారికి కావలసిన వాటిని తెలుసుకొని ఇవ్వవలెను.

ఎట్లనగా వేదాధ్యయనం చేత ఋషులను, యజ్ఞయాగాదులచేత దేవతలను, శ్రాద్ధతర్పణములచే పితృదేవతలను, గౌరవము మరియు సేవల చేత అతిథులను, అన్నము చేత ఆర్త జీవులను శాస్త్రప్రకారంగా పూజించాలి.

సూచికలు

1. మనుస్మృతి– 3–70 (అధ్యాపనం బ్రహ్మ యజ్ఞః – అధ్యాపనం అంటే వేదాన్ని బోధించడం. చదువు చెప్పడం అని సామాన్యార్థం)
2 మనుస్మృతి, iii – 70
3. పై గ్రంథములోనే iii – 75
4. పై గ్రంథములోనే, iii – 80, 81.

అధ్యాయం 5

ఆరాధన

పరస్పరము ఒకరిపై ఒకరు ఆధారపడే విశ్వంలో భాగంగా మానవుడు ప్రతిరోజు పంచయజ్ఞాలు చేయాలని చెప్పుకొన్నాం. అయితే ఇవి మాత్రమే మతాన్ని అనుసరించే వ్యక్తి యొక్క కోరికలను పూర్తిగా సంతృప్తి పరచదు. మానవుడు విశ్వ ప్రభువయిన ఈశ్వరునితో, తన స్వంత జీవితానికి సంబంధించిన చేతనా సంబంధం కావాలని కోరుకుంటాడు. మనిషి యొక్క ఈ అవసరం (చేతనా సంబంధం) దేవుని యొక్క ఆరాధనలో సంతృప్తిని పొందుతుంది.

పరబ్రహ్మ యొక్క అంతిమ సత్యాన్ని సాధికారికంగా తెలుసుకొన్న వ్యాసుడు, సర్వజీవుల మేలు కోసం నిరంతరం కృషి చేస్తూ, మానవులకు చక్కని ఉపదేశము అందిస్తూ మహాభారతం మరియు బ్రహ్మసూత్రాలను రచించాడు. ఇవి రచించిన తర్వాత కూడా , ఇంకా వ్యాసుడు మనశ్శాంతి పొందలేనప్పుడు, నారదుడు ఈశ్వరుని స్తుతించమని అతనికి సలహా ఇచ్చాడు; వెంటనే వ్యాసుడు ఆ స్తుతి కార్యక్రమాన్ని విష్ణు-భాగవతంలో చేసాడు. స్తుతితో నిండిన ఈ భాగవత రచన ద్వారా వ్యాసుడు ఇంతకు ముందు పొందని శాంతిని పొందాడు.[1]

ఆరాధన అంటే పరమాత్మ పట్ల ప్రేమ. ఆయన పట్ల భక్తి, స్పృహతో కూడిన సహవాసంలో ఆయనను చేరుకోవాలనే ఆకాంక్ష. స్వామితో ఐక్యంగా ఉండాలనే కోరిక. ఆరాధన అంటే ప్రత్యగాత్మ పరమాత్మతో వ్యక్తిగతంగా ఐక్యతను అనుభవించడం. (ప్రత్యగాత్మ అంటే రకరకాల నిర్వచనాలను పెద్దలు చెప్పారు. వాటిలో కొన్ని. 1. 'నేను' అనే పదాన్ని దేనిని ఉద్దేశించి వాడుతామో అది ప్రత్యగాత్మ. 2. బ్రహ్మంగా భావిస్తున్న చైతన్యం. 3. అంతఃకరణంలో ప్రతిబింబించే చైతన్యం. 4. శరీరంలో ఉండి కూడా మనస్సుతోగానీ, ఇంద్రియాలతో గానీ నిమిత్తం లేకుండా మనగలిగే పరబ్రహ్మ చైతన్యం. జీవసాక్షి అని కూడా అంటారు. అలాగే పరమాత్మ అనే పదానికి కూడా చాలా నిర్వచనాలున్నాయి. వాటిలో కొన్ని. 1. స్వయం ప్రకాశం కలిగి, జ్ఞానరూపమైన ఆత్మ. 2. కార్యకారణాలకంటే భిన్నమై, క్షరాక్షరాల కంటే కూడా వేరుదై, స్వాభావికంగా నిత్యమై, శుద్ధమై, బుద్ధమై, ముఖ్యమైన పదార్థం. 3. అవిద్య వల్ల ఆత్మగా తలచిన దేహం మొదలు బుద్ధివరకు ఉన్న తత్త్వాలకు అతీతమైనది.

సర్వోత్కృష్టమైనదీ, 4. మాయాశక్తికి ఆశ్రయమయినది. 5. సర్వానికి అధిష్ఠానమైనది. 6. పర దేవత. 7. దైవం/పరబ్రహ్మం).

ఆరాధనకు సంబంధించిన ప్రార్థనలో భక్తుడు పరిపూర్ణుడయిన భగవంతుని ప్రశంసిస్తాడు. తన అసంపూర్ణ భావనలో పాతుకుపోయిన విజ్ఞప్తిని భగవంతునిపై ప్రేమగా ఈ ప్రార్థనలో పరిణమింపచేస్తాడు. భగవంతుని శక్తిని గుర్తించడం, స్వామి స్వభావంపై ధ్యానం, స్వామి ఆవిష్కరణ కోసం తీవ్రమైన కోరిక– ఇలా అనేక భావనలు ఆరాధనకు సంబంధించిన ప్రార్థనలో ఉంటాయి. ఇలా ఆరాధన అనేది ఆరాధకుని యొక్క స్వభావం మరియు పరిణామ దశను అనుసరించి అనేక ఇతర రూపాలను తీసుకోవచ్చు.

ఆరాధన అనేది రైతులో లేదా తత్వవేత్తలో బ్రహ్మం మీద కోరిక యొక్క వ్యక్తీకరణతో ఉంటుంది. వ్యక్తీకరణము అనేది భావోద్వేగము మరియు మేధో పరిణామంతో విభిన్నంగా ఉండవచ్చు. కానీ మూలమైన వాంఛ మాత్రం ఆరాధనలో ఒకటే.

ఎప్పుడూ ఆరాధనకు సంబంధించిన వస్తువులన్నీ షరతులు లేనివి. ఆరాధనకు భగవంతుని గుణాలు ఆలంబనాలు కావాలి. ఆ భగవంతుని గుణాలపై భక్తుని మనస్సు స్థిరపడవచ్చు. లేదా ఆ గుణ ప్రస్తావన ద్వారా భక్తుని భావోద్వేగాలు కదిలింపబడవచ్చు. అన్ని ప్రార్థనలు మరియు స్తుతులు ఎవరికి చేరుకుంటాయో, ఎవరికొరకు అన్ని ధ్యానాలు నిర్దేశించబడతాయో ఆ సగుణ బ్రహ్మమయిన ఈశ్వరుడు, పూజకు సంబంధించిన ప్రధానమయిన వస్తువు. భగవంతుడనేవాడు– శివుడు, విష్ణువు, మహాదేవుడు, నారాయణుడు, దుర్గ, లక్ష్మి, గణేశుడు, ఇంద్రుడు, అగ్ని, సరస్వతి, లేదా అవతారాలయిన రాముడు, కృష్ణుడు లేదా బుద్ధుడు– ఇలా ఏ పేరుతో అయినా ఆరాధించబడవచ్చు; కానీ ఏ పేరుతో అయినా ఏ రూపంతో అయినా పూజింపబడేది మాత్రం ఈశ్వరుడే.

తరచుగా విద్యార్థులను ఒక విషయం అయోమయానికి గురిచేస్తుంది. కొన్నిసార్లు శివుడు, కొన్నిసార్లు విష్ణువును ఎందుకు పరమాత్మగా చెబుతారు? ఒక పురాణం ఒకరిని మరొక పురాణం ఇంకొకరిని ఎందుకు ఉన్నతునిగా ఎందుకు చేస్తుంది?

ఇవన్నీ దైవము యొక్క వివిధ రూపాలు; ఈశ్వరుడు మాత్రం ఒక్కడే. భక్తుడు తనకు బాగా ఇష్టపడే రూపంలో ఈశ్వరుని గురించి ఆలోచిస్తాడు. ఈశ్వరుని ఆరాధిస్తాడు. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి భక్తుడు రూపాన్ని పూజించడం లేదు. ఆ రూపంలో ఉన్న భగవంతుని ఆరాధిస్తున్నాడు. ఇది మనం గ్రహించాలి. భార్య తన భర్తను ప్రేమిస్తుంది. అతను ఇష్టపడి ప్రియంగా ధరించే దుస్తులను కాదు. ధరించిన భర్తని ప్రేమిస్తుంది. అలాగే భగవంతుని భక్తుడు ప్రేమిస్తాడు. ఆరాధిస్తాడు. భగవంతుడు తన వివిధ స్వరూపాలలో వెల్లడించిన ప్రేమను, అందాన్ని, శక్తిని గ్రహించి భక్తుడు ఆరాధిస్తాడు. సర్వత్రా వ్యాపించిన భగవంతుని వివిధ రూపాలలోని చేష్టలలోని ఆంతర్యాన్ని మనం కొద్దిగా మాత్రమే గ్రహించగలము. మన ఆరాధనా విధానాలలో ఒకే భగవానుని వివిధ రూపాలలో గ్రహిస్తాము.

అందుకే వివిధ మతాలు, ఒకే మతంలోని వివిధ వర్గాల గొడవలు చాలా మూర్ఖంగా, తెలివితక్కువగా అనిపిస్తాయి. అందరూ ఒకే ఈశ్వరుడిని ఆరాధిస్తున్నారు. భేదాలు నామ భేదాలు మాత్రమే. పూజించేవారిలోనే తేడాలున్నాయి. పూజింపదగిన వస్తువులో లేదు. అది ఒక్కటే.

పూజ అనేది ఒక సాధారణ ఆరాధనగా పిలువబడుతుంది. ఒక చిత్రం లేదా విగ్రహం దీనిలో ఉపయోగించబడుతుంది. పూజలో మంత్రాలు పఠించబడతాయి. పువ్వులు సమర్పించబడతాయి. నీళ్లు చల్లుతారు. ఈ బాహ్యపూజా విధానాలలో అంతర్గత ప్రేమ వ్యక్తీకరణను మనం కనుగొనాలి. దేవుని పట్ల ఉండే ఆ అంతర్గతమైన ప్రేమ పూజలోని ఉపయోగించే వస్తు సామగ్రి కంటే అధికమైన విలువ కలిగినది. ఎంపిక చేసుకొన్న భగవంతుని రూపాన్ని కొన్నిసార్లు ఇంటిదేవుడని (కులదైవమని) లేదా కొన్నిసార్లు ఇష్టదైవమని పిలుస్తారు. ఈ ఎంపిక చేసుకొన్న భగవంతుని రూపాన్ని భక్తుడు స్వయంగా ఎంచుకొంటాడు. లేదా అతని కోసం అతని గురువు ఎంపిక చేస్తాడు.

ఉపాసన (=దేవతలను పూజించుట) అనేది ధ్యానం మరియు రోజువారీ సంధ్యతో సహా అనేక రకాల ఆరాధనలను కలిగి ఉంటుంది. దీనిని సనాతన ధర్మాన్ని అనుసరించే వారందరూ ఆచరించాలి. సంధ్యావందనానికి (=దినపూర్వభాగము, పగటి మధ్యము, పగటిలో చివరభాగము అని మూడు సంధ్యలు. సంధ్య కాలంలో పాటించే ఆచారాన్ని సంధ్యావందనం అంటారు.) వైదికము (=వేదమునందు

చెప్పబడినది) మరియు తాంత్రికము (=తంత్రశాస్త్రములో చెప్పబడినది) అనే రెండు రూపాలు ఉన్నాయి. బాలుడు తన కులము మరియు కుటుంబ ఆచారాల ప్రకారం సంధ్యను నిర్వహించాలి. అతను దానిని సరైన అర్హత కలిగిన ఆచార్యుని నుండి నేర్చుకోవాలి. ప్రతిరోజూ దానిని అభ్యసించాలి. ధ్యానం, దాని నిర్దిష్ట దశలు, బాల్యానికి కాకుండా యౌవనానికి చెందినవి.

నై ష్కర్మ్య మప్యచ్యుతభావ వర్జితం న శోభతే జ్ఞానమలం నిరంజనమ్ ।
కుతః పున శ్శ శ్వ ద భద్రమీశ్వరే న చార్పితం కర్మ యదప్యకారణమ్ ॥[2]

గొప్పదయిన జీవన్ముక్తి సాధనమగు నిర్మల జ్ఞానముకూడా భగవంతునిపై భక్తి లేనిచో శోభించదు. అది జనన మరణరూప సంసారహేతువగుచున్నది. ఈశ్వరునికి అర్పించని నిత్యకర్మ గురించి కానీ, కామ్యకర్మల గురించి కానీ ఇక ప్రత్యేకంగా ఏమి చెప్పవలెను? (అవి వ్యర్థములని భావము) జ్ఞానులు కూడా భగవంతునిపై భక్తి కలిగియుంటేనే అపరోక్ష బ్రహ్మానుభూతి పొందుతారని భావము. భక్తి వలన జ్ఞాన, వైరాగ్యాలు వస్తాయని భాగవతము యొక్క బోధ. (భక్తిలేని కర్మ వ్యర్థమేనని కైముతిక న్యాయంతో – అనగా గొప్పవానికే దిక్కు లేనప్పుడు చిన్నవాని సంగతి అడగాల్సిన అవసరం లేనట్లు – ఈ శ్లోకంలో చెప్పారని పెద్దలు పేర్కొన్నారు).

యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే ।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥

క్లేశోఽ ధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥

యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥[3]

నాశరహితుడూ, అనిర్వచనీయమైన వాడు, అవ్యక్తమూ, సర్వవ్యాపి, మనోబుద్ధులకు అతీతుడు, అయిన పరమ సత్యము యొక్క నిరాకార తత్త్వాన్ని – సర్వభూతముల సంక్షేమం కోసం నిమగ్నమై – ఆరాధించేవారు నన్ను పొందుతారు.

మనస్సులో అవ్యక్తము పట్ల ఆసక్తి ఉన్నవారికి, ఆ మార్గము చేరుట కొరకు

చేయు సాధన చాలా కష్టములతో కూడుకున్నది. అవ్యక్తమును (ఆకారము లేని దైవాన్ని) పూజించటం అనేది శరీరము ధరించిన జీవులకు చాలా కష్టతరమైనది." (తల్లికోతి ఒక కొమ్మ నుండి ఇంకొక కొమ్మ మీదికి దూకినప్పుడు, తల్లికోతిని గట్టిగా పట్టుకునే ఉండే భాధ్యత పిల్లకోతిదే. ఒకవేళ అది అలా చేయలేకపోతే, అది పడిపోతుంది. ఈ మర్కట కిశోర న్యాయాన్ని ఈ అవ్యక్తోపాసనతో పెద్దలు పోల్చారు. ఆ మార్గంలో పురోగతి సాధించే భారాన్ని ఉపాసన చేసేవారే మోయవలసి ఉంటుంది, ఎందుకంటే నిర్గుణ బ్రహ్మము వారిమీద దయ చూపించలేదు; ఎందుకంటే అది నిరాకారమే కాదు, అది గుణరహితము కూడా. పిల్లిపిల్ల చాలా చిన్నగా, సున్నితముగా ఉంటుంది; తల్లిపిల్లి ఆ పిల్లను ఒక చోటి నుండి ఇంకొక చోటికి మార్చే బాధ్యత తనే తీసుకుంటుంది; అది జాగ్రత్తగా పిల్లిపిల్లను మెడ వెనుక నోటితో పట్టి లేపి తీసుకు వెళుతుంది. ఈ మార్జాల-కిశోర న్యాయముతో ఆకారోపాసనను పెద్దలు పోల్చారు. కనుక ఆకారము లేని దైవాన్ని (అవ్యక్తాన్ని) పూజించటం చాలా కష్టమని ఈ గీతాశ్లోకంలో చెప్పారు).

కానీ, తాము చేసే కర్మలన్నింటినీ నాకే సమర్పిస్తూ, నన్నే పరమ లక్ష్యముగా భావిస్తూ, నన్నే ఆరాధిస్తూ మరియు అనన్య భక్తితో నా మీదే ధ్యానం చేసే వారిని, ఓ పార్థా, నేను వారిని శీఘ్రముగానే ఈ మృత్యుసంసారసాగరము నుండి విముక్తి చేస్తాను, ఎందుకంటే వారి మనస్సు నా యందే ఏకమైపోయి స్థిరంగా ఉంటుంది.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥[4]

"ఓ అర్జునా, భగవంతుడు అన్ని ప్రాణుల హృదయాలలో నివసిస్తున్నాడు, తన భ్రమాత్మక శక్తితో శరీరరూప యంత్రములను అధిరోహించిన జీవులను వాటి వాటి కర్మల అనుగుణముగా చక్రముపై ఎక్కించినట్లుగా తిప్పుతున్నాడు.

"ఓ భారతా! సంపూర్ణ హృదయ పూర్వకముగా కేవలం ఆయననే శరణాగతి చేయుము; అతని కృపతో నీవు సర్వోన్నతమైన శాంతిని మరియు శాశ్వతమైన నివాసాన్ని పొందుతావు."

యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥[5]

ఓ అర్జునా! నన్ను ఏ ప్రకారంగా మనుజులు శరణాగతి చేస్తారో, నేను వారిని ఆ విధంగా అనుగ్రహిస్తాను. మనుష్యులందరూ వివిధ రీతులలో నా మార్గాన్ని అనుసరిస్తారు.

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥[6]

భక్తుడు విశ్వాసంతో ఏ ఏ దేవతా స్వరూపాన్ని ఆరాధించాలని కోరుకుంటాడో, ఆ భక్తుడికి ఆయా స్వరూపం మీదనే శ్రద్ధ నిలబడేటట్టు చేస్తాను.

సూచికలు

1. విష్ణుభాగవతం ప్రథమ స్కంధము, చతుర్థాధ్యాయము – 05వ శ్లోకం
2. విష్ణుభాగవతం ప్రథమ స్కంధము, చతుర్థాధ్యాయము – 12వ శ్లోకం
3. భగవద్గీత తొమ్మిదవ అధ్యాయము, 03 నుండి 7 శ్లోకాలు
4. అదే పుస్తకం పద్దెనిమిదవ అధ్యాయము, 61 మరియు 62 శ్లోకాలు
5. అదే పుస్తకం 04వ అధ్యాయము – 11వ శ్లోకం
6. అదే పుస్తకం 07వ అధ్యాయము – 21వ శ్లోకం.

అధ్యాయం 6

నాలుగు ఆశ్రమాలు

వ్యక్తులకున్నట్లే దేశాలకు కూడా కొన్ని లక్షణాలు ఉంటాయి. పాత రోజుల్లో హిందూ దేశం యొక్క లక్షణాలలో క్రమం మరియు సమతుల్యత ఉన్నాయి. సనాతన ధర్మం ఈ లక్షణాలను ప్రజల హృదయాలలో ముద్రించింది. తద్వారా చాలా గౌరవప్రదంగా, సమదృష్టి , సమతౌల్యముతో (=ఎటును మొగ్గుచూపకుండ సమముగా నుండుట.) మానవుడు అభివృద్ధి చెందాడు. సనాతన ధర్మమును అనుసరించే నిజమైన అనుచరుల యొక్క లక్షణాలు ఇలా చాలా ఉన్నాయి. శ్రీ కృష్ణుడు ఇలా చెప్పాడు : "గెలుపు-ఓటములలోసమముగా ఉండుటను సమదృష్టిని యోగము అంటారు.[1]

వేదాలలో జీవితానికి సంబంధించిన విశాల దృక్పథం ఈ సనాతన ధర్మ లక్షణాలకు మూలం. ఆత్మ, నేను, మరియు భగవత్సంకల్పం కోసం అన్నీ లక్షణాలు ఉన్నాయి. ఈ లక్షణాలు మానవుడు పొందవలసిన ఉదాత్త అనుభవాలకు కేవలం దారిని మాత్రమే చూపిస్తాయి. మానవుడు ఎప్పుడూ అంతర్గత పాలకుడు, అమరుడు. అందువలన తనకు దిగువగా ఉన్న ప్రపంచాలలో తన శక్తులను ప్రదర్శించడానికి మరియు అంతుబట్టక తనకు బయటగా కనిపించే ప్రకృతి ప్రాంతాలలో ఆత్మ చైతన్యంతోతాను పాలకుడు కావాలని కోరుకుంటాడు. పూర్వపు మానవుడు ఏ విషయంలోను ఆత్రుత పడలేదు. తాను అమరుడనని అతను గ్రహించాడు. అందువలన ప్రతి అనుభవాన్ని క్రమపద్ధతిలో తీసుకొని, తద్వారా సౌష్ఠవంగా మరియు సామరస్యపూర్వకంగా ప్రకృతి రహస్యాలను విప్పడం బాగా తెలుసుకొన్నాడు.

ఈ లక్షణాల క్రమాన్ని మన ప్రపంచంలోని దిగువ రాజ్యాలలో సర్వోన్నతుడైన ఈశ్వరుడే విధించాడు; విత్తనం, వేరు, కాండం, ఆకులు, పువ్వు, పండ్లు ఒకదానికొకటి తగిన క్రమంలో పరిణత విజయం సాధిస్తాయి. ప్రతి ఒక్కటి దానికి సంబంధించిన ఋతువులో దాని స్థానాన్ని మరియు అందాన్ని కలిగి ఉంటాయి; అలాగే భగవంతుడు మానవ జీవితములో పసితనం, బాల్యం, యవ్వనం, పరిపక్వత, వృద్ధాప్యం యొక్క దశలను కూడా విధించాడు. ఈ క్రమం నుండి మనిషి తప్పించుకోలేడు లేదా వాటిని మార్చలేడు; కానీ మనిషిలో ఆవిష్కృతమవుతున్న జీవాత్మ, మానవునిలో ఇంకా ప్రావీణ్యం పొందని విషయానికి చీకటి కప్పుతుంది. కామము ఆధిపత్యం

వహించిన మనస్సు నేతృత్వంలోని వివిధ దిశలలోకి క్రమరహితంగా ఆ జీవాత్మ మానవుని నెట్టివేస్తుంది. ఒక దశలో ఉన్నప్పుడు మరొక దశలో ఉన్న విషయాలను గ్రహించాలని కోరిక కలిగిస్తూ, ప్రతిదానిలో మానవుని పరిణామానికి జీవాత్మ ఆటంకం కలిగిస్తుంది. పిల్లవాడు బాల్యములో ఉండాలనుకుంటాడు. బాలకుడు యువకుడు కావాలని కోరుకొంటాడు; వృద్ధుడు తిరిగి యవ్వనపు ఆనందాన్ని గ్రహించాలని కోరుకుంటాడు. ఈ విధంగా జీవితంలోని ప్రశాంతతను జీవాత్మ దోచుకుంటుంది. తద్వారా జీవితం తన యొక్క సగం ఉపయోగాన్ని కోల్పోతుంది.

ఈ తప్పుడు అత్రుత ఒక క్రమంలో లేకపోవడాన్ని గమనించి ఈ కోరికను క్రమపరిణతితో ఎలాగయినా ఎదుర్కోవాలని మన ఋషులు భావించారు. అందుకోసం – ఆర్య జాతికి చెందిన మనదయిన పెద్ద కుటుంబము కొరకు – పుట్టుక నుండి మరణం వరకు జీవాత్మ తన సుదీర్ఘ జీవ పరిణామంలో అనేక జనన మరణాల చక్రాల ద్వారా పొందే నిర్ధారితమైన దశలను మరియు నిర్దిష్ట దశలను ఋషులు గుర్తించారు. ప్రతి సందర్భంలో ఈ దశలు నాలుగుగా చెప్పబడ్డాయి. ఒక జననం మరియు ఒక మరణం మధ్య జీవితంలో ఉన్న ఈ దశలను ఆశ్రమాలు, (విశ్రాంతిస్థలాల నివాసాలు) అంటారు: లెక్కలేనన్ని, జననాలు మరియు మరణాల గుండా సాగే జీవితంలో వీటిని వర్ణములు, లేదా కులాలు అంటారు.

మనము ఇప్పుడు ఆశ్రమాలతో సంబంధము కలిగిన విషయాలను ప్రస్తావించుకొందాం. మొదట మనం చెప్పుకొన్నట్లుగా, ఈ ఆశ్రమాలు నాలుగు : 1. బ్రహ్మచర్యం, విద్యార్థి దశ; 2. గార్హస్థ్యం, గృహస్థుల దశ; 3. వానప్రస్థ, అడవులలో – నివాస దశ, అనగా ఏకాంతం; 4. సన్యాసం, సంపూర్ణ పరిత్యాగ దశ, వైరాగ్యం.[2]

ఈ దశల్లో దేనిలోనూ మానవుడు ఇతర మూడు ఆశ్రమాల్లోను ప్రత్యేక విధులను గ్రహించకూడదు: విద్యార్థి గృహస్థుడు, ముని లేదా సన్యాసి కాకూడదు; గృహస్థుడు బ్రహ్మచారి, ముని లేదా సన్యాసి కాకూడదు; ముని తిరిగి ఇంటి ఆనందాన్ని వెతకకూడదు; లేదా సన్యాసి దీర్ఘకాలం తర్వాత గృహస్థు యొక్క నిశ్శబ్ద అనుబంధాలను కలిగి ఉండకూడదు. ప్రతి దశకు దాని స్వంత విధులు మరియు దాని స్వంత ఆనందాలు ఉంటాయి. ప్రతి ఆశ్రమానికి తన స్వంత దశలో విడుదలలు, ఆనందాలు ఉంటాయి. అవి జీవాత్మ యొక్క క్రమమైన ఆవిర్భావానికి దారితీస్తాయి. ఆశ్రమాలను జీవాత్మ విస్మరించినప్పుడు, అతని పరిణామం ఆలస్యం అవుతుంది.

ఇప్పుడు ఆధునిక జీవితాల్లో పురాతన ఆశ్రమ నియమాల ప్రకారం ఖచ్చితంగా జీవించుట కష్టం. పరిస్థితులు చాలా మారాయి; అయితే ప్రతి ఒక్కరికి ప్రతి ఆశ్రమంలోని ప్రాథమిక విధుల గురించి స్పష్టమైన అవగాహన లభిస్తే, మనం ఇప్పటికీ జీవితాన్ని క్రమబద్ధమైన అభివృద్ధి మార్గంగా మార్చుకోగలుగుతాము.

విద్యార్థి యొక్క జీవితం ఉపనయన కార్యక్రమంతో ప్రారంభమవుతుంది. ఇది అతని "రెండవ జన్మ". మరియు ఆ సమయం నుండి బాలుడు కొన్ని సద్గుణాల కోసం ప్రయత్నించాలి. అతను తన అలవాట్లలో కఠినంగా మరియు సరళంగా ఉండాలి; ఈ సద్గుణాలు అతని శరీరాన్ని బలంగా మరియు ఆరోగ్యంగా చేస్తాయి; అతను త్వరగా లేవడం, స్నానం చేయడం, సాధారణ ఆహారాన్ని మితంగా తినడం, పుష్కలంగా వ్యాయామం చేయడం, విలాసవంతంగా మరియు పనిలేకుండా విశ్రాంతి తీసుకోవడానికి తన శరీరాన్ని అనుమతించకపోవడం ద్వారా ఈ సద్గుణాలను అతడు పొందుతాడు.

ఈ విధంగా సద్గుణాలతో జీవించే బాలుని జీవితం – మంచం మీద ఆలస్యంగా పడుకుని, మిఠాయిలు (తీపి వస్తువులు)మరియు ఖరీదయిన వంటకాలను ఎక్కువగా తిని, తక్కువగా వ్యాయామం చేసే మరియు ఎక్కువ సమయం మెత్తని దిండ్లు వేసుకుని గడిపే బాలుని జీవితానికి – చాలా భిన్నంగా ఉంటుంది. ఒకరు అప్రమత్తంగా, దృఢంగా, గట్టి కండరాలతో, శక్తివంతంగా, చురుకైన వ్యక్తిగా బలమైన ఆరోగ్య వంతుడిగా ఉంటాడు: మరొకరు బరువైన, మందమైన, లావుగా, సోమరితనంతో చాలా సన్నగా మరియు బలహీనంగా ఉంటాడు. ఈ రెండవవాడు త్వరలో వ్యాధిగ్రస్తుడై బాధలు పడతాడు.

విద్యార్థి పరిశ్రమ, విధేయత, వినయం మరియు సేవాతత్పరత వంటి సద్గుణాల కోసం ప్రయత్నించాలి; యవ్వనం అనేది జీవితం యొక్క సన్నాహక సమయం. జ్ఞానాన్ని సంపాదించడానికి, శ్రమతో కూడిన అధ్యయనం ఉపయోగకరమైన యౌవనానికి ఖచ్చితంగా అవసరం; విధేయత అనేది అతని ప్రవర్తనకు మార్గనిర్దేశం చేస్తూ పెద్దల అనుభవాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియచేస్తూ జీవిత ప్రారంభ జీవితంలో మానవునికి ఎదురయ్యే అనేక ఇబ్బందులనుంచి రక్షిస్తుంది. విధేయత ఎలా పాటించాలో తెలిసిన వారు మాత్రమే రాబోయే జీవితంలో పాలనకు తగినవారు. వినయం మానవుని త్వరగా ఉద్ధరిస్తుంది. ఎందుకంటే అందరూ తమ వద్ద ఉన్నదాన్ని

వినయము కలవారితో పంచుకోవడానికి సిద్ధంగా ఉంటారు; కుటుంబం మరియు పాఠశాలలకు సంబంధించిన ఇరుకైన పరిస్థితులలో కూడా – సేవాభావం అనేది మానవాళికి సేవ చేసే స్వభావాన్ని నిర్మిస్తుంది.

విద్యార్థి తన ఆలోచన మరియు చర్యలో పవిత్రంగా ఉండాలి. మనస్సు మరియు శరీరంలో కూడా బ్రహ్మచారిగా ఉండాలి. అతను తన ఆలోచనలను కాపాడుకోవాలి. ఎందుకంటే అపవిత్రత గురించి ఆలోచించని బాలుడు అపవిత్రంగా వ్యవహరించడు. అతను కామాన్ని గురించి ఆలోచించకూడదు, లేదా పగటి కలలు కనకూడదు. ఆలోచనలో మరియు శరీరంలోని స్వచ్ఛంగా ఉన్న వ్యక్తి మాత్రమే సంతోషకరమైన గృహ జీవితంలోకి కలుషితం కాకుండా వెళ్ళగలడు. విద్యార్థి నిజమైన పేరు బ్రహ్మచారి. బ్రహ్మచారి అనగా ఈరోజులో పెండ్లికానివాడని అర్థం. (బ్రహ్మచారి అంటే వివాహం చేసుకొనక పోవడమేగాక, లైంగిక సంపర్కాన్ని పూర్తిగా విడిచినవాడు) మన ప్రాచీన సంప్రదాయ నియమానికి వ్యతిరేకంగా విద్యాభ్యాసం పూర్తి కాకుండా, విద్యాభ్యాస సమయంలో వివాహం చేసుకొంటే అకాల వయస్సు, బలహీనత, వ్యాధి, జాతి–క్షయం మొదలైనవి సంభవిస్తాయి.

యువకుడు తన పాఠశాల మరియు కళాశాలలో చదువును పూర్తి చేసి, – గృహజీవితానికి సంబంధించిన విధులు మరియు బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు– వివాహము చేసుకొని గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తాడు. అన్ని ఆశ్రమాలలో ఇది చాలా ముఖ్యమైనది. ఎందుకంటే గృహస్థాశ్రమం ఇతరులందరికీ మద్దతు ఇస్తుంది.[3] కుటుంబం మరియు దేశం యొక్క సంక్షేమం ఒక విధంగా ఇంటి యజమానిపై ఆధారపడి ఉంటుంది. మరియు దేశప్రజల ఆనందం మరియు శ్రేయస్సు అతని చేతుల్లో ఉన్నాయి.

మంచి భర్తగా, మంచి తండ్రిగా, మంచి యజమానిగా, మంచి పౌరునిగా ఉండేవాడు పురుషులలో శ్రేష్ఠుడు. ఇల్లు అనేది– నిస్వార్థం, కరుణ, సున్నితత్వం, నిగ్రహం, స్వచ్ఛత, సహాయకత్వం, వివేకం, పరిశ్రమ, సరైన తీర్పు, దాతృత్వాలకు సంబంధించిన పాఠశాల. ఇంట్లో మరియు తన ఉనికిలో ఉత్తమమైన తన నడవడిక యొక్క ముద్రను చూపినప్పుడు ఎవరయినా చక్కని గృహస్థుడు కాగలడు. ఈ ఉత్తమ నడవడిక తరువాతి ఆశ్రమములోని ఋషి మరియు సన్యాసిగా చేసే లక్షణాలకు పునాది వేస్తుంది. కానీ గృహస్థుని ఆదర్శం యొక్క అధఃపతనం – ఆధునిక

జీవితాన్ని సంకుచితంగా మరియు నీచంగా మార్చింది. చదువు పూర్తి కాకుండా (అనగా బ్రహ్మ చర్యాశ్రమం పూర్తి కాకుండా) గృహస్థాశ్రమములో సగం ప్రవేశం చేయటం వల్ల విద్యార్థికి దాని విధుల విషయంలో గందరగోళం ఏర్పడింది. సమాజంలో విద్యార్థి-వివాహం అనే ఆధునిక దుర్మార్గపు ఆలోచన కారణంగా - పూర్తి ప్రవేశార్హత లేకుండా విద్యార్థి గృహస్థాశ్రమములో ప్రవేశించుట వలన, గృహస్థాశ్రమము యొక్క పురాతన గంభీరత మరియు గౌరవం నేడు సడలుతున్నది. పండని పండ్లను తెంపడం మరియు తినడం వల్ల తినేవారికి దాని పూర్తి తీపి తెలియదు.

ఉత్తమమయిన జన్మ ఎత్తినప్పటికీ సరియైన ఆలోచన లేని కొంతమంది బ్రాహ్మణ యువకులు నిర్ణీత సమయానికి ముందే తమ ఇళ్లను విడిచిపెట్టి, సన్యాస జీవితాన్ని గడపడానికి అడవులకు వెళ్లారు. ఇంద్రుడు వారిపై జాలిపడి, బంగారు పక్షి రూపాన్ని ధరించి, వారికి ఇలా బోధించాడు: "గృహ జీవితాన్ని అనుసరించండి! ఇది పుణ్యాల పెంపకానికి క్షేత్రం. ఇది పవిత్రమైనది. దేవతలను ఆరాధించడం, చదువు, కుటుంబాన్ని పోషించడం ద్వారా పితృ రుణం తీర్చుకోవడం ఈ గృహస్థాశ్రమంలో జరుగుతుంది. గృహస్థునిగా కొత్త జీవితాలకు సహాయం చేయడం ద్వారా మనం ఎదుగుతాము. ఇవి అత్యంత పవిత్రమైన తపస్సులు. ఇంటి బాధ్యతల భారాన్ని భరించండి! తమ పని నుండి పారిపోయిన వారు పాపంలో పడిపోతారు. పేదలకు సహాయం చేసిన తర్వాత మిగిలిపోయిన ఆహారం తినడం అంటే త్యాగం యొక్క నిజమైన శేషాన్ని తినడం వంటిది.

తన కుమారులు తమ విధులను పూర్తిగా మోయగలరని గమనించినప్పుడు, ముసలి వయస్సు సంకేతాలు కనిపించినప్పుడు తన పిల్లల పిల్లలు (మనవళ్ళు, మనవరాళ్ళు) తన చుట్టూ ఉన్నప్పుడు, గృహస్థునికి, అతని భార్యకి ఇంటి ప్రధాన బాధ్యతను కుమారులకు అప్పగించవలసిన సమయం ఆసన్నమైనదని గ్రహించాలి. క్రియాశీలకమయిన సంసారజీవితంనుండి మరియు సాంసారికమైన బాధ్యతలనుండి పక్కకు తొలగాలి. ప్రశాంతమైన ఏకాంత జీవితం కొరకు, నిర్దిష్టమయిన పుస్తక పఠనం కొరకు, ఇతరుల మేలు కోసం చేసే ఆత్మత్యాగాచరణకు, చిన్నవాళ్ళకు సలహా ఇవ్వటం వరకు పరిమితం కావటానికి- మనకు సంబంధించిన ఆధునిక కాలంలో- మూడవ ఆశ్రమాన్ని పెద్దలు స్వీకరించాలి.

చివరగా, వృద్ధాప్యంలో ఏ వ్యక్తి అయినా సన్యాసులకు సంబంధించిన నాల్గవ ఆశ్రమంలోకి ప్రవేశించవచ్చు. ధ్యానం మరియు ఆరాధనలో తన చివరి రోజులను గడుపుతూ, తన ఇష్టపూర్వకంగా మరణానికి తరువాతి జీవితంలోకి ప్రవేశించే వరకు, ఇంతవరకు చక్కగా గడిపిన ఐహిక జీవిత ఫలాలను పొందడం కోసం, తదుపరి ఉత్తమ జన్మ పరిణామం పొంది భూమిపై తిరిగి రావడానికి నాల్గవ ఆశ్రమంలోకి ప్రవేశించాలి.

బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థీ యతిస్తథా ।
ఏతే గృహస్థప్రభవావాశ్చత్వారః పృథగాశ్రమాః ॥

బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి అని వేఱు వేఱుగా ఏ ఆశ్రమములు చెప్పబడినచో, అవి నాలుగు కూడా గృహస్థాశ్రమమువలన ఏర్పడ్డాయి.

వేదానధీత్య వేదౌ వా వేదం వాపి యథాక్రమమ్ ।
అవిప్లుతబ్రహ్మచర్యో గృహస్థాశ్రమమావసేత్ ॥

గృహస్థస్తు యదా పశ్యేద్వలీపలితమాత్మనః ।
అపత్యస్య తథాపత్యం తదారణ్యం సమాశ్రయేత్ ॥

వనేషు తు విహృత్యైవం తృతీయం భాగమాయుషః ।
చతుర్థమాయుషో భాగం త్యక్త్వా సంగాన్ పరివ్రజేత్ ॥[6]

మూడు వేదములను గాని, రెండువేదములను గాని, తుదకు తన శాఖకు సంబంధించిన ఒక వేదమునుగాని, గురుని దగ్గర బ్రహ్మ చర్యమును పాటిస్తూ అభ్యసించి తరువాత గృహస్థాశ్రమములో ప్రవేశించాలి.

“గృహస్థుడు తన చర్మంపై ముడుతలను, తన జుట్టులో తెల్లదనాన్ని, తన సంతానం యొక్క సంతానాన్ని చూసినప్పుడు, అతను అడవికి (వానప్రస్థాశ్రమానికి) వెళ్ళాలి.

ఈ విధముగా ఆశ్రమాలలో ఆయువులోని మూడవభాగమును గడపి, పుత్రుడు, భార్య అను సంబంధములను విడిచి ఆయువులో నాలుగవభాగములో సన్యాసమును స్వీకరించాలి.”

అనధీత్య ద్విజో వేదాననుత్పాద్య తథా ప్రజామ్ ।
అనిష్ట్వా చైవ యజ్ఞైశ్చ మోక్షమిచ్ఛన్ వ్రజత్యధః ॥[7]

"వేదాలను అభ్యసించకుండా, సంతానం పొందకుండా, యాగాలు చేయకుండా ద్విజుడు (రెండు జన్మలు కలవాడు) మోక్షాన్ని కోరుకుంటే అతడు భ్రష్టుడవుతాడు. "(నరకకూపమున పడతాడు)

అనారోగ్యమనాయుష్యమస్వర్గ్యే చాతిభోజనమ్ ।
అపుణ్యం లోకవిద్విష్టం తస్మాత్తత్పరివర్జయేత్ ॥[8]

అతిగా భోజనము చేస్తే అనారోగ్యము కలుగుతుంది. ఆయుస్సు తరిగిపోతుంది. అనారోగ్యం వల్ల స్వర్గకారణమైన యాగాదులను చేయలేడు. అందువలన స్వర్గానికి దూరమవుతాడు. దూరుడౌతాడు. పుణ్యహీనుడౌతాడు. అతిగా తినే వానిని జనాలు దూషిస్తారు. కనుక అతి భోజనాన్ని వదిలిపెట్టాలి.

నోదితో గురుణా నిత్యమప్రణోదిత ఏవ వా ।
కుర్యాదధ్యయనే యత్నమాచార్యస్య హితేషు చ ।
వర్జయేన్మధు మాంసం చ గంధం మాల్యం రసాన్స్త్రియః ।
శుక్తాని చైవ సర్వాణి ప్రాణినాం చైవ హింసనమ్ ।
కామం క్రోధం చ లోభం చ నర్తన గీతవాదనమ్ ।
ద్యూతంచ జనవాదం చపరివాదం తథానృతమ్ ।
ఏకః శయీత సర్వత్ర న రేతః స్కందయేత్ క్వచిత్ ।
కామాద్ధి స్కందయన్ రేతో హినస్తి వ్రతమాత్మనః ॥[9]

ఉపాధ్యాయుడు నిత్యము చెప్పినా, చెప్పకున్నా, విద్యార్థి ఎప్పుడూ చదువులో నిమగ్నమై ఉండాలి. మరియు అతని గురువుకు సేవలు చేయాలి.

విద్యార్థి, తేనె, మాంసము తినకూడదు. సుగంధ ద్రవ్యాలు ముట్టకూడదు.. మాలలు ధరింపకూడదు. స్త్రీ సంపర్కము చేయరాదు. స్వభావముచే మధురమైన వానిని, పులిసిన పదార్థములను స్వీకరింపరాదు. అట్లే ప్రాణిహింస చేయకూడదు.

కామ, క్రోధ, లోభాలను వదిలిపెట్టాలి. నాట్యం చేయుట, పాటపాడుట, వాద్యములు మ్రోగించుట చేయకూడదు. అట్లే జూదమాడుట, ఇతరులతో వ్యర్థముగా కలహమునకు దిగుట, ఇతరులు నిందించుట, అబద్ధము చెప్పుట చేయకూడదు.

విద్యార్థి ఎప్పుడూ ఎచ్చటనైన ఒంటరిగానే పడుకోవాలి. కామముతో తన రేతఃస్థలనము చేయరాదు. అట్లు చేసినచో తన బ్రహ్మచర్య వ్రతాన్ని పోగొట్టుకొన్న వాడవుతాడు.

యథా వాయుం సమాశ్రిత్య సర్వే జీవన్తి జన్తవః ।
తథా గృహస్థమాశ్రిత్య వర్తన్త ఇతరాశ్రమాః ।
సర్వేషామపి చైతేషాం వేదశ్రుతివిధానతః ।
గృహస్థ ఉచ్యతే శ్రేష్ఠః స త్రీనేతాన్ బిభర్తి హి ।
యథా నదీనదాః సర్వే సముద్రే యాన్తి సంస్థితిమ్ ।
తథైవాశ్రమిణాః సర్వే గృహస్థే యాన్తి సంస్థితిమ్ ॥[10]

ప్రాణవాయువును ఆశ్రయించి సమస్త జీవులు బ్రతుకుతున్నట్లుగా, మిగిలిన ఆశ్రమాలందున్నవారు (బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు) గృహస్థును ఆశ్రయించుకొని జీవిస్తున్నారు.

శ్రుతి స్మృతులలో చెప్పబడినట్టు ఈ అన్ని ఆశ్రమాల్లో గృహస్థుడే శ్రేష్ఠుడని చెప్పబడుచున్నాడు. తక్కిన మూడు ఆశ్రమాలవారిని ఇతడే భరిస్తున్నాడు.

నదీనదాలన్నీ సముద్రాన్ని ఎలా చేరుతున్నాయో, అలా తక్కిన ఆశ్రమాలవారు గృహస్థునిపై ఆధారపడి ఉన్నారు కనుక, అతనిని చేరుచున్నారు.

అనాశ్రితః కర్మఫలం కార్య కర్మ కరోతి యః ।
స సంన్యాసీ స యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః ॥[11]

ఫలాపేక్ష లేకుండా కర్తవ్య కర్మలను (చేయవలసిన విధులను), చేసిన వారే నిజమైన సన్యాసులు, యోగులు. అంతేకాని, కేవలం అగ్ని హోత్ర యజ్ఞం వంటివి చేయటం ఆపివేసిన వారు లేదా శారీరిక క్రియలు త్యజించినవారు కాదు.

సూచికలు

1. భగవద్గీత 02 వ అధ్యాయము- 48 వశ్లోకం
2. చూడు - మనుస్మృతి 06 వ అధ్యాయం- 87 వశ్లోకం
3. మనుస్మృతి 03 వ అధ్యాయం- 77, 89, 90 శ్లోకాలు
4. మహాభారతం శాంతి పర్వం 11వ అధ్యాయము
5. మనుస్మృతి 06 వ అధ్యాయం - 87వ శ్లోకం
6. మనుస్మృతి 03 వ అధ్యాయం - 2వ శ్లోకం - 06 వ అధ్యాయం 02, 33. శ్లోకాలు

7. మనుస్మృతి 06 వ అధ్యాయం - 37వ శ్లోకం
8. మనుస్మృతి 02 వ అధ్యాయం - 57వ శ్లోకం
9. మనుస్మృతి 02 వ అధ్యాయం 191వ శ్లోకం -177 నుండి 180 శ్లోకాలు.
10. మనుస్మృతి 02 వ అధ్యాయం 77వ శ్లోకం - 06 వ అధ్యాయం, 89- నుండి 90 శ్లోకాలు
11. భగవద్గీత 06 వ అధ్యాయం 1వ శ్లోకం.

సనాతన ధర్మము

మూడవ భాగము

నైతిక బోధనలు

అధ్యాయం 1

నైతిక విజ్ఞానం - అది ఏమిటి?

శాస్త్రము అనేది ఒకదానికొకటి సంబంధించిన వాస్తవాలతో ఖచ్చితంగా ఏర్పాటు చేయబడిన జ్ఞానం. వాస్తవాల సేకరణ శాస్త్రాన్ని తయారు చేయదు; వాస్తవాలు ఒకదానికొకటి తగిన సంబంధాలలో క్రమపద్ధతిలో అమర్చబడి ఉండాలి. సేకరణను శాస్త్రము అని పిలవడానికి ముందు ఈ సంబంధాలలో ఉన్న సూత్రాలను తెలుసుకోవాలి. నైతికత అంటే ప్రవర్తనకు సంబంధించినది. హేతుబద్ధమైన జీవనంలో జీవులు పరస్పరం ప్రవర్తించుకొనే విధానానికి– అలాగే– ఇతర జీవుల పట్ల ప్రవర్తించే విధానానికి సంబంధించినది. కాబట్టి, నైతిక విజ్ఞానం గురించి మాట్లాడేటప్పుడు, మేము సద్గుణాలు మరియు దుర్గుణాలకు సంబంధించిన జాబితాను ఉద్దేశించము. మేము కేవలం జీవులలో ఒకరిపట్ల ఒకరు ప్రవర్తించవలసిన సంబంధాల గురించి చెబుతాం. అలాగే ఈ సంబంధాలకు సంబంధించి ఖచ్చితమైన మరియు క్రమపద్ధతిలో అమర్చబడిన అంతర్లీన సూత్రాలలో ఉన్న ప్రవర్తనకు సంబంధించిన వాస్తవాల వరుసను సూచిస్తాము.

నీతిశాస్త్రానికి మరో పర్యాయ పదం సరైన నైతిక ప్రవర్తన. ఏది సరైనదో తెలుసుకోవాలంటే మనిషి మరియు అతని పరిసరాల గురించి మనం కొంత అర్థం చేసుకోవాలి.

నైతికత యొక్క లక్ష్యం అన్ని జీవుల సంక్షేమాన్ని సురక్షితం చేయడం. ఇది ప్రవర్తనా శాస్త్రం ద్వారా, మనుషులు, ఒకరికొకరు మరియు వారి పరిసరాలతో ఎలా సామరస్యంగా జీవించాలో చూపడం ద్వారా జరుగుతుంది. ఈశ్వరుడు ప్రేమ స్వరూపం. దేవుడు విశ్వం యొక్క ఆనందాన్ని కోరుకుంటాడు. క్రమంగా విశ్వవ్యాప్త ఆనందాన్ని తీసుకువస్తుంటాడు.

దీని అర్థం సరైన విషయం ఎల్లప్పుడూ ఆహ్లాదకరంగా ఉంటుందని, చెడు విషయం ఎల్లప్పుడూ అసహ్యకరముగా ఉంటుందని కాదు. ఈశ్వరునితో ఐక్యమయ్యే శాశ్వతమైన ఆనందానికి, లేదా మోక్షానికి దారితీసే ప్రవర్తన మంచిదని అర్థం.

“బండి చక్రాలు ఎద్దును వెంబడించినట్లే దుఃఖం పాపాన్ని అనుసరిస్తుంది”.

అలాగే సంతోషం కూడా ధర్మాన్ని అనుసరిస్తుంది. పాపము అనే ఫలం తినటానికి తీపిగా ఉంటుంది. కానీ పాపమనేది విష సదృశమైనది. రాను రాను కష్టాల చేదు బాధను తెస్తుంది. కొన్నిసార్లు ఆ పాపఫలం దీర్ఘకాలిక వ్యాధి రూపంలో ఉంటుంది.

చిన్నపాటి సుఖం కోసం తప్పు చేసే పిల్లవాడు, సాయంత్రానికల్లా భయంకరమైన నొప్పిని కలిగించే తీయని, రంగురంగుల విషపు పండ్లను కోసి తినే అమాయక పిల్లవాడితో సమానం. శిష్యునికి ప్రతి పాపాన్ని విషంగా గుర్తింపచేసే నైతికబోధన గురువు యొక్క విధి."

ఆచారలక్షణో ధర్మః సన్తస్త్వాచారలక్షణాః ।
ఆగమానాం హి సర్వేషామాచారః శ్రేష్ఠ ఉచ్యతే ।
ఆచారప్రభవో ధర్మో ధర్మాదాయుర్వివర్ధతే ॥

ఆచారాల్లభతే హ్యాయురాచారాల్లభతే శ్రియమ్ ।
ఆచారాత్కీర్తిమాప్నోతి పురుషః ప్రేత్య చేహ చ ॥[1]

ధర్మము యొక్క లక్షణమే ఆచారము. మంచి అన్న దానికి లక్షణమూ ఆచారమే. అన్ని బోధనలకంటే ఆచారము శ్రేష్ఠము. ఆచారమే ధర్మమూలం. అక్కడనుండే ధర్మము పుట్టింది. ధర్మము ఆయుష్షుని అభివృద్ధి చేస్తుంది. ఆ ఆచారం వలన మానవునికి ఆయుష్షు సిరిసంపదలు లభిస్తాయి.ఆచారాల ద్వారా అతను ఈ లోకంలోను, పై లోకంలోను కీర్తిని పొందుతాడు.

ఆచారః పరమో ధర్మశ్రుత్యుక్తః స్మార్త ఏవ చ ।
తస్మాదస్మిన్ సదాయుక్తో నిత్యం స్యాదాత్మవాన్ ద్విజః ॥

ఏవ మాచారతో దృష్ట్వా ధర్మస్య మునయో గతిమ్ ।
సర్వస్య తపసో మూల మాచారం జగృహుః పరమ్ ॥[2]

వేదాలు, స్మృతులలో చెప్పబడ్డ శ్రేష్ఠ ధర్మాలు కలిగిన ఆచారాలు చాలా గొప్పవి. అందువల్ల ఈ ఆచారాన్ని నియమంతో బ్రాహ్మణుడు పాటించాలి.

మంచి ఆచారాన్ని పాటించుట ధర్మ ప్రాప్తికి మూలమని, తపస్సుకు కూడ మూల కారణమని మహర్షులు చెప్పారు.

ప్రభవార్థాయ భూతానాం ధర్మప్రవచనం కృతం ।
యః స్యాత్ ప్రభవసంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః ॥

ధారణాద్ధర్మమిత్యాహుర్ధర్మేణ విధృతాః ప్రజాః ।
యత్స్యాదహింసాసంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః ।
అహింసార్థాయ భూతానాం ధర్మప్రవచనం కృతం ।
యః స్యాదహింసయాయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః ॥[3]

సర్వేషాం యః సుహృన్నిత్యం సర్వేషాం చ హితే రతః ।
కర్మణా మనసా వాచా స ధర్మం వేద జాజలే ॥[4]

సర్వప్రాణుల క్షేమం కోసం ధర్మం ప్రకటించబడింది. ఏది శ్రేయస్సును అందిస్తుందో అదే ధర్మం. ఇది ధర్మవేత్తల యొక్క ఖచ్చితమయిన అభిప్రాయం.

జగత్తును ధరించునట్టిది (కాపాడునట్టిది) కావున దానికి ధర్మమని పేరు. చరాచర ప్రాణులతో గూడిన ముల్లోకములను కాపాడునది గావున ధర్మమే ప్రజలు సురక్షితులుగా ఉండుటకు మూలమయినది.

మనస్సు, వాక్కు, చేతల ద్వారా ఏ ప్రకారముగాకూడ ప్రాణిహింస కాకూడదను ఉద్దేశ్యముతో ధర్మోపదేశము చేయబడినది. ఇందువలన ఏది అహింసాయుక్తమో, అదే ధర్మమని ధర్మవేత్తల యొక్క నిశ్చయము.

ఎవడు సర్వజీవులకు మిత్రుడై ఉంటాడో, మనస్సు, వాక్కు, చేతల ద్వారా అందరియొక్క మేలు కోరతాడో, అటువంటి వాడే వాస్తవముగ ధర్మము తెలుసు కొంటున్నాడు.

న కుర్యాత్కర్హిచిత్సంగం తమస్తీవ్రం తితీరిషుః ।
ధర్మార్థకామమోక్షాణాం యదత్యన్తవిఘాతకమ్ ॥

తత్రాపి మోక్ష ఏవార్థ మాత్యన్తికతయేష్యతే ।
త్రైవర్గ్యోఽర్థో యతో నిత్య కృతాన్తభయసంయుతః ॥[5]

"ఈ గంభీరమైన చీకటిని (సంసారాన్ని) దాటాలనుకునేవాడు, దేనితోనూ తనను తాను ఎక్కువగా కలుపుకోకూడదు. అనగా ఆసక్తిని పెంచుకోకూడదు. ఎందుకంటే అటువంటి అనుబంధం ధర్మ, అర్థ (సంపద), కామ (ఆనందం) మరియు మోక్షాలను నిష్ఫలం చేస్తుంది.

"వీటిలో (ధర్మార్థ కామమోక్షాలలో) కూడా, మోక్షమే నిజమైన అంతిమపు ముగింపు, ఎందుకంటే మిగిలిన మూడు మృత్యువు భయంతో వెంటాడబడతాయి.

ధర్మే చార్థే చ కామం చ యథావద్వదతాం వర ।
విభజ్య కాలే కాలజ్ఞః సర్వాన్ సేవేత పణ్డితః ।
మోక్షో వా మరణం శ్రేయ ఏషాం రాజన్సుఖార్థినామ్ ॥[6]

జ్ఞానులు (ఉత్తమ వక్తలు), సరైన సమయాలను తెలుసుకుని, ధర్మము, అర్థము మరియు కామము మూడింటినీ సమానంగా సేవిస్తూ, వాటి మధ్య తన సమయాన్ని ప్రవృత్తి మార్గంలో పంచుకుంటాడు. (ప్రవృత్తి అంటే ప్రవర్తన అని అర్థం. అంటే ఎవరైతే లోకంలో ప్రవర్తిస్తూ జీవిస్తూ వుంటాడో వాడికి పనికివచ్చే మార్గం ప్రవృత్తి మార్గం).

"కానీ, రాజా, అన్ని జీవులు ఆనందాన్ని కోరుకుంటాయి. మరియు మోక్షం వారికి బాగా మేలు చేస్తుంది." (మోక్షం నివృత్తి మార్గానికి చెందినది. లౌకిక విషయము లన్నీ అనిత్యములు అని తెలుసుకొని నిత్యమైన బ్రహ్మమే శాశ్వతమని తెలుసుకొని అఖండ వైరాగ్యాన్ని అవలంబించి ఎవరైతే వుంటారో వారికి నివృత్తి మార్గము.)

సూచికలు

1. మహాభారతం అనుశాసన పర్వం 104 శ్లోకం
2. మనుస్మృతి ప్రథమ అధ్యాయము 108-110 శ్లోకాలు
3. మహాభారతం శాంతిపర్వం 199 శ్లోకం
4. అదే పుస్తకం 88 వశ్లోకం
5. విష్ణుభాగవతం IVవ స్కంధం, 22 వ అధ్యాయం, 34, 35 శ్లోకాలు
6. మహాభారతం వనపర్వం 33వ అధ్యాయము - 41, 42 శ్లోకాలు

అధ్యాయం 2

మతం నిర్దేశించిన నీతిశాస్త్రపు పునాది

మతం యొక్క మొదటి ప్రకటన "ఆత్మ ఒక్కటే" అని మనం ఇప్పటికే గమనించాం. వాస్తవానికి చాలా మంది వ్యక్తులు కనిపిస్తారు, కానీ అవన్నీ ఒక ఆత్మయొక్క భాగాలు లేదా ప్రతిబింబాలు. వారు వ్యక్తులుగా విడిపోవడం తాత్కాలికం, కాని వారి ఐక్యత శాశ్వతం. చాలా కుండలను చెరువులో ముంచవచ్చు, కానీ ప్రతి ఒక్క కుండలో నింపే నీరు అదే చెరువు నీరు. అనేక ఉపాధులు అస్తిత్వ సాగరంలో మునిగిపోతుంటాయి. కానీ ప్రతి ఒక్క ఉపాధిలో నింపబడే జీవితం ఒకే జీవితం. మతం యొక్క ఈ ప్రాథమిక సత్యం నైతికతకు పునాది.

అలాంటప్పుడు, మన నైతిక శాస్త్రంలో ఆత్మ యొక్క ఐక్యతను మనం గుర్తించాలి. కానీ ఇది సరిపోదు, ఎందుకంటే ఐక్యతలో "నేను" లేదా "మీరు" అనేవి లేవు. మన శాస్త్రం "నేను" మరియు "మీ" మధ్య సంబంధాలతో వ్యవహరిస్తుందని మనము చూసాము. కాబట్టి మనం "అనాత్మ (Not-Self) యొక్క వైవిధ్యాన్ని" కూడా గుర్తించాలి; అంటే పదార్థానికి అనేక ఉపాధులు ఉన్నాయి. మరియు ప్రతి ప్రత్యేక ఉపాధిలో ఒక నేను యొక్క ఒక భాగం లేదా ప్రతిబింబం ఉంటుంది. అసంఖ్యాకమైన శరీరాలు, అసంఖ్యాకమైన మనస్సులు ఉన్నాయి. మరియు ఈ శరీరాలు మరియు మనస్సులు ఒకదానితో ఒకటి సంబంధంలోకి వస్తాయి.

తామందరూ ఒకే మూలము కలిగి ఉన్నామని, అందరికీ సహాయం చేసే మనస్తత్వం తనకి సహాయపడుతుందని, ఒకరిని గాయపరిచే విషయం అందరినీ గాయపరుస్తుందనే సూత్రం అందరికి తెలియాలి. ప్రతి మనస్సు మరియు శరీరం ఇతర మనస్సులతో, శరీరాలతో సరిగా వ్యవహరించే వరకు వ్యక్తుల మధ్య సరైన సంబంధాలు ఉండవు. నిజానికి మరొకరిని బాధపెట్టడమంటే మనలని మనం బాధించుకోవటమని తెలియాలి. ఒకచేయి తన శరీరానికి చెందిన పాదాన్ని కత్తిరించినట్లయితే, రక్తం పాదం నుండి ప్రవహిస్తుంది. చేతి నుండి కాదు; కానీ చేయి బలహీనంగా మారుతుంది. ఎందుకంటే రక్తం మొత్తం శరీరంలో తిరుగుతుంది మరియు శరీరంలోని అన్ని భాగాలకు రక్త సరఫరా ఒకటే రకంగా ఉంటుంది. అలాగే మానవులకు కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. ఒక వ్యక్తి మరొకరిని

గాయపరచినట్లయితే, గాయపడిన వ్యక్తి గాయపడిన ప్రదేశంలో నొప్పి తగ్గేవరకు గాయపు బాధను అనుభవిస్తాడు. కాని గాయపు తాలుకు బాధ వ్యక్తి మనస్సులో అనుభూతిగా మారి, ఎక్కువ సమయం తీసుకొంటుంది.

పై కారణం ద్వారా గమనించినట్లుగా ఇది (పైన చెప్పిన సార్వజనీన సూత్రం) మానవుని సరైన ప్రవర్తనకు పునాది. కనుక శాస్త్రాలలో బోధించిన విషయాల ఆధారంగా మహా ఋషులు మరియు సాధువులు చెప్పిన ప్రమాణాల నుండి బాలురు మొదట నైతిక సూత్రాలను యథాతథంగా గ్రహించాలి. ఎందుకంటే వాటి తార్కికత గురించి ఆలోచించే విజ్ఞాన శక్తి లేదా సమయం బాలురకు లేదు. కానీ బాలురకు రాబోయే యౌవన దశలో తమ వివేచనను సనాతన ధర్మంలో ఇవ్వబడిన ఈ నైతిక సూత్రాలకు వర్తింపజేయడం ద్వారా వాటిలోని యుక్తాయుక్తతలను ధృవీకరించు కోవచ్చు.

ఒకే" నేను" అన్ని జీవులలోను ఉంది; ప్రతి జీవాత్మ ఒక "నేను" యొక్క ఒక భాగం లేదా ప్రతిబింబం. ఈ సూత్రం ప్రతి హృదయంలో గాఢంగా నాటుకోవాలి. మరొకరిని గాయపరిచేవాడు తనను తాను గాయపరచుకుంటాడని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. శ్రీ కృష్ణుడు ఇలా అంటాడు: " ఓ గుడాకేశా !(అర్జునా, నిద్రను జయించిన వాడా) నేను సర్వ భూతముల హృదయములలో కూర్చుని ఉన్నాను. నేనే సర్వ ప్రాణుల యొక్క ఆది, మధ్యము మరియు అంత్యము."[1]

ఏకో దేవః సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాన్తరాత్మా ।
కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ ॥[2]

"ఒక దేవుడు అన్ని జీవులలో దాగి ఉన్నాడు. అతను అన్నింటిలోనూ వ్యాపించి ఉన్నాడు. అతను అన్ని జీవుల అంతర్భాగం. అతను అన్ని చర్యలను పర్యవేక్షిస్తాడు. అతను అన్ని జీవులకు విశ్రాంతి స్థలం. అతను సాక్షి, చైతన్యం మరియు పరిమితులు మరియు గుణాలకు అతీతుడు. ."

"ఏకస్తథా సర్వభూతాంతరాత్మా రూపం రూపం ప్రతిరూపోబభూవ"[3]

ఒకే ఒక అగ్ని ప్రపంచంలో ప్రవేశించి, అది మండించే పదార్థాన్ని పోలిన రూపాలనే ధరించినట్లు, అన్ని జీవులలోనూ ఉన్న ఒకే ఒక ఆత్మ తాను ప్రవేశించిన ఆయా వస్తువుల రూపాలనే ధరించి కనిపిస్తుంది.

యస్తు సర్వాణి భూతాన్యాత్మ న్యేవాను పశ్యతి
సర్వభూతేషు చాత్మానం తతోన విజుగుప్సతే ।
యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః
తత్రకో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః ।।[4]

ఎవరైతే అన్ని జీవులను ఆత్మలోనూ, ఆత్మను అన్ని జీవులలోనూ చూస్తాడో అతడు ఎవరినీ ద్వేషించడు.

ఆత్మే అన్ని జీవరాశులుగా ఉన్నదని గ్రహించిన వ్యక్తికి మోహం, శోకం ఎలా ఉంటాయి? (ఉండవని భావం)

మనకు ఇష్టం లేనిదాన్ని మనం ద్వేషిస్తాం. విపరీత ఆకర్షణ వలన మనకు ఒక వస్తువుపై మోహం కలుగుతుంది. మనకు ఇష్టం లేనిది జరిగినప్పుడు మనకు బాధ కలుగుతుంది. కాని ఆత్మానుభూతి పొందిన వ్యక్తి విశ్వాన్ని అంతటినీ ఆత్మస్వరూపంగా లేక భగవంతుడిగా చూస్తాడు. అలాంటప్పుడు అతనికి ఆత్మ తప్ప ప్రపంచములో వేరేది కనిపించదు. ఏదైనా రెండవ వస్తువు ఉన్నప్పుడు మాత్రమే కదా మనకు దానిపైన మనసు పోయేది. అంతా ఒకటే అయినప్పుడు మనసు ఎక్కడకు పోగలదు. ఒక్కచోటే ఉంటుంది. అందువలన బాధ గాని, ఆకర్షణ లేక మోహం కాని, ద్వేషం కాని ఎలా ఉంటాయి. ఇవన్నీ ఆత్మానుభూతి పొందిన వాడి లక్షణాలు. ఆత్మానుభూతి, ఆత్మసాక్షాత్కారం మొదలగునవి ఆంతరంగిక అనుభవాలు. బయటి ప్రపంచం ముందులానే ఉంటుంది. కాని చూసేవాడి మనసును బట్టి వ్యక్తివ్యక్తికీ ప్రపంచస్వభావం వేరేలా ఉంటుంది. ఒక యువకుడికి ఏదైనా సాధించగలననే విశ్వాసం ఉంటుంది. అదే ఒక ముసలివ్యక్తికి అంతా అయిపోయిందనే భావన ఉంటుంది. ప్రపంచం ఏమీ మారలేదు. మార్పు అంతా చూసేవాడిని బట్టే. అలానే ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తికి రెండు కొమ్ములు ఏమీ రావు. అతని మనసు విశాలమై విశ్వమంతటితోనూ ఏకం అవుతుంది. అని పెద్దలు ఈ శ్లోకాలను వివరించారు.

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ।।[5]

నిజమైన యోగులు, అంతర్బుద్ధిని భగవంతుని లోనే ఏకం చేసి, సర్వ భూతములను భగవంతుని లోను మరియు భగవంతుడిని సర్వ భూతములలోను దర్శిస్తారు.

సూచికలు

1. భగవద్గీత 10 వ అధ్యాయము - 20 వ శ్లోకం
2. శ్వేతాశ్వేతరోపనిషత్ - 07 - 02
3. కఠోపనిషత్ - 5 -10
4. ఈశోపనిషత్ - 6, 7
5. భగవద్గీత - 6 -29.

అధ్యాయం 3

మంచి, చెడు

మంచి, చెడు అను ఈ రెండు పదాలు, ప్రతి ఒక్కరి నోళ్లలో ఉంటాయి, కానీ ఎవరైనా మంచి, చెడు అనేదానికి తను ఏ రకంగా అర్థం చేసుకొన్నాడో ఖచ్చితంగా చెప్పలేదు. మనం ఇప్పుడూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

మనకు ప్రత్యేకంగా మూడు ప్రపంచాలు, త్రిలోకాలతో సంబంధం ఉందని మనము గమనించాము. త్రిలోకాలు బ్రహ్మచే సృష్టించబడతాయని, విష్ణువుచే కొనసాగించబడి రక్షించబడతాయని మరియు శివునిచే నశింపచేయబడతాయని మనకు తెలుసు. మనం కొత్త త్రిలోకాల గురించి ఆలోచిద్దాం. ఈ విషయంలో మనం ముందుకు సాగుదాం; ఈ లోకాలలోని జీవులు అనేక రూపాలుగా కనిపిస్తారు; జీవులు అభివృద్ధి చెందుతూ విభిన్నంగా మారతారు; తాము తెలుసుకున్న అనుభవాల ద్వారా జీవులు పెరుగుతారు; అనుభవాలను గ్రహించడం ద్వారా తమ శరీరాలను మరియు మనస్సులను అభివృద్ధి చేసుకొంటారు; ఈ లోకాలలోని జీవులు బాహ్యంగా, మరియూ ఆంతరంగికంగా తమలో తాము పని చేస్తాయి. దీనిని ప్రవృత్తి మార్గము అని అంటారు. ('ప్రవృత్తి' అంటే మనసును బాహ్యప్రపంచం వైపునకు మరల్చడం. బహిర్ముఖమై వివిధ కర్మల్ని నిర్వర్తించటం) ఇది ముందుకు వెళ్ళే మార్గం. జీవాత్మ తనను తాను ఒక ప్రత్యేక వ్యక్తిగా నిర్మించుకుంటూ, బయటి నుండి తాను స్వీకరించటానికి వీలయినంత తీసుకొని, బలమైన తెలివినిపొంది, శక్తివంతమైన "నేను"గా తయారు చేయబడతాడు. నేను సంపూర్ణంగా పూర్తయినప్పుడు, జీవాత్మ తాను చాలా గొప్పవాడయిన ఈశ్వరుని యొక్క ఒక భాగం లేదా ప్రతిబింబం మాత్రమే అని తెలుసుకొంటాడు. తన శక్తులన్నీ ఆ గొప్పవాడయిన "నేను" (ఈశ్వరుడు) యొక్క భాగంగా ఉపయోగించినట్లయితే ఆనందాన్ని ఇస్తాయని జీవాత్మ తెలుసుకోవాలి.

అప్పుడు జీవాత్మ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడటం ప్రారంభిస్తాడు. పరమాత్మను తనలోకి గ్రహించడం కోసం జీవాత్మ తన స్వభావానికి దూరంగా ఉంటాడు; అతను తనకంటే బలహీనమైన వారందరికీ శక్తిని ఇవ్వడానికి ప్రయత్నిస్తాడు, అతను తాను స్వయంగా సేకరించిన శక్తులను ఇతర శరీరాలు మరియు మనస్సులతో

పంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. దీనిని నివృత్తి మార్గమని అంటారు. తిరిగి వచ్చే మార్గం. జీవాత్మ తన వద్ద ఉన్నదంతా అవసరమైన వారితో పంచుకోవడం ద్వారా తనను తాను అందరితో ఒకటిగా గుర్తించబడాలని ఈ మార్గంలో కోరుకుంటాడు. (తాబేలు కాళ్లను లోనికి ముడుచుకోవటం లాంటిది నివృత్తి మార్గం. అంటే మనలోకి మనం చూసుకోవటం, మనలోకి మనం ప్రయాణం చేయటం నివృత్తి. 'అంతర్ముఖుడు' కావటం నివృత్తి– తపస్సు, శమం (అంతరింద్రియ నిగ్రహం), దమం (బాహ్యేంద్రియ నిగ్రహం) వంటివి ఇందులోని కర్మలు).

ఈ రెండు మార్గాలు పరిణామం అని పిలువబడతాయి. ఈ పరిణామ మార్గంలో విష్ణువుకు సంబంధించిన జీవాంశతో కలిసిన ఈశ్వరుని యొక్క సంకల్పం విశ్వములో మార్గనిర్దేశాన్ని జీవునికి కల్పిస్తుంది. ఈ సంకల్పంతో పని చేయడం సరైనది; దానికి వ్యతిరేకంగా పని చేయడం తప్పు.

ఇప్పుడు ప్రపంచం మొత్తంగా, ప్రవృత్తి మార్గాన్ని నివృత్తి మార్గానికి మార్చే మలుపులో ఉంది. చాలా మంది వ్యక్తులు ఇప్పటికీ ప్రవృత్తి మార్గంలో ఉన్నారు, కానీ వారి ముందుకు వెళ్లే మార్గం, వారి ఉన్నత మానసిక పరిణామంతో, నివృత్తి మార్గానికి సన్నిహితంగా ఉంది. అందువల్ల సరైన ప్రవర్తన అనేది నివృత్తి మార్గాన్ని నడపడానికి తనకు మరియు ఇతరులకు సహాయపడే కోరికలు, ఆలోచనలు మరియు చర్యలను కలిగి ఉంటుంది. అది ఏకీభావానికి దారితీస్తుంది. మనం మన ప్రత్యేకతను తగ్గించుకొని, ఐక్యతను పెంచడం లక్ష్యంగా పెట్టుకోవాలి; భిన్నమైన పాఠాలున్నప్పటికీ ఐక్యత వైపు నడిపించేవన్నీ సరైనవే. భిన్నత్వాన్ని పెంచి ఐక్యత నుండి దూరం చేసేవన్నీ తప్పు.

కానీ జంతువులు, క్రూరులు మరియు వెనుకబడిన, అభివృద్ధి చెందని జీవాత్మలకు సంబంధించిన వ్యక్తిత్వం ఇప్పటికీ చాలా బలహీనంగా ఉంది. వారికి ప్రత్యేకత ఇంకా ఒక లక్ష్యంగా చేయవలసి ఉంటుంది. అభివృద్ధి చెందిన వారికి ఏది ఒప్పు లేదా తప్పుగా చెప్పబడుతుందో – అది ఈ అభివృద్ధి చెందని వారికి ఇంకా ఒప్పు లేదా తప్పు కాదు. నైతికత సాపేక్షం (సంబంధితమైనది) అని చెప్పడం అంటే ఇదే. ఈ నైతికత జీవన పరిణామంలో మన స్థానానికి, మనం నడుస్తున్న మార్గానికి సంబంధించినది అని గ్రహించాలి.

"నీతి చాలా సూక్ష్మ"మని భీష్ముడు యుధిష్ఠిరునితో చెప్పాడు. "నేను నీకు కేవలం వేదాక్షరం ద్వారా మాత్రమే కాదు, జ్ఞానం మరియు అనుభవం ద్వారా వివరించబడిన వేదం ద్వారా నీకు ఉపదేశిస్తున్నాను. ఎవరూ ఏకపక్షమైన నైతికతా సహాయంతో ప్రపంచంలోని తన గమనాన్ని సరిగ్గా సాధించలేరు. గ్రంథంలో చెప్పబడిన వచనాన్ని జాగ్రత్తగా తీర్పుతో అన్వయించుకోవాలి, లేకుంటే ఘోరంగా విఫలమవుతుంది, హేతు పరీక్షలో నిలబడలేకపోతే లేఖనాలు గ్రంథాలు కావు అను సత్యాన్ని పురాతన కాలంలో చెప్పారు. సందేహాలతో కూడిన జ్ఞానం ఉండటం – లేకపోవడం కంటే మంచిది కాదు. (రెండూ ఒకటేనని, సందేహాలతో కూడిన జ్ఞానం – జ్ఞానం లేనిదానితో సమానమని భావం).

ప్రత్యేక పరిస్థితులతో సంబంధం లేకుండా పదాలపై ఆధారపడిన నైతికత లోపానికి దారితీస్తుంది. సుదీర్ఘమైన కరువు సమయంలో, విశ్వామిత్రుడను ఒక ఋషి ఒక చండాలుని నుండి నిషేధించబడిన మాంసాన్ని తీసుకున్నాడు. దేవతలను కూడా బలిగా సమర్పించిన అదే మాంసం నుండి వారి యజ్ఞపు వాటాను తీసుకోవాలని బలవంతం చేసాడు. తద్వారా అతని చర్యను సమర్థించుకొన్నాడు.

క్షమార్పణ అనే గుణం సన్యాసికి తగినది; ఇది ఎల్లప్పుడూ రాజుకు సరిపోదు. రాజు తనకు వ్యక్తిగతంగా జరిగిన అవమానాల గాయాలను క్షమించవచ్చు. కాని అతను తనకు మరియు తన దేశానికి క్షేమం కావాలని కోరుకుంటే, అధమ వ్యక్తులు చేసిన దేశద్రోహానికి సంబంధించిన చిన్న తప్పును కూడా ఉపేక్షించకూడదు.

రాజు తన ఏలుబడిలోని ప్రజలందరికి వారి సంబంధిత విధులను ఎప్పుడూ దృఢంగా, తీవ్రతతో ఖచ్చితంగా చెప్పాలి. వారు ఆచరించేటట్లు చూడాలి. అతను అలా చేయకపోతే ప్రజల్లో కొందరు తోడేళ్ళలాగా మారి బలహీనులను చంపడం మరియు ఒకరినొకరు మింగేసుకోవడం వంటి దుష్ట చేష్టలతో నియంత్రణ లేకుండా తిరుగుతారు. ప్రసిద్ధి కలిగిన ఒక మాట ఇలా ఉంది : ఆహ్లాదకరంగా మాట్లాడేదే భార్య. తన తండ్రిని సంతోషపెట్టే వాడే కొడుకు. సురక్షితంగా విశ్వసించబడేవాడే స్నేహితుడు. నిశ్చయంగా, జీవనము కలిగించేదే మాతృభూమి అణచివేత లేకుండా కఠినంగా పరిపాలించేవాడు, తన భూభాగంలో నీతిమంతులకు భయం తొలగించినవాడు, పేదలను ఆదరించేవాడు మరియు దుర్మార్గులను శిక్షించేవాడు మాత్రమే రాజు.[1]

ఆశ్రమాలు మరియు వర్ణాలు అనేవి – ప్రజలు ఎలాంటి సద్గుణాలను లక్ష్యంగా చేసుకోవాలో చూపడానికి, ఒక నిర్దిష్ట ప్రదేశంలో మరియు సమయంలో ఎలా వ్యవహరించాలో తెలియచేయటానికి, మరియు వారి క్రమమైన పరిణామానికి సహాయపడటానికి చేయబడ్డాయని గ్రహించాలి.

మనుషులందరికీ ఈశ్వరుని సంకల్పం గురించి తెలుసుకునే శక్తి లేదా సమయం లేనందున, శాస్త్రాలు మనకు ఆ సంకల్పాన్ని తెలియజేయడానికి మరియు తప్పు మరియు ఒప్పుల మధ్య తేడాను గుర్తించడంలో సహాయపడతాయి. అయితే ఆ వివరాలు స్పష్టంగా లేదా నిర్దిష్టంగా లేని సందర్భాల్లో అన్వయం కోసం, వ్యాసుడు మరియు ఇతరుల ద్వారా పవిత్ర గ్రంథాలలో కొన్ని సాధారణ నియమాలు కూడా నిర్దేశించబడ్డాయి. అందుచేత శాస్త్రాలలో ఇవ్వబడిన ప్రత్యేక నియమాలు వ్యాసాదుల ప్రబోధాల ద్వారా నిత్య జీవన విధానంలో సులభముగా అన్వయమవుతాయి. అటువంటివి :

"మరొకరికి సంతోషాన్ని ఇవ్వడం ధర్మం; బాధని కలిగించడం పాపం."

"ఇతరులు ఏది చేస్తే మన మనస్సుకు బాధ కలుగుతుందో, అవి ఇతరులకు మనం చేయకూడదు. తన క్షేమం కోసం తాను ఏది చేయాలనుకొంటాడో అది ఇతరులకు తాను చేయాలి."

"ఎవరూ మరొకరికి హాని కలిగించే పనిని చేయకూడదు. ఆ పనిని చేయడానికి అవమానంగా భావించాలి."

"తనకు మంచిది కానిదానిని మరొకరికి చేయకూడదు."

h h h

సుఖాభ్యుదాయికం చైవ నైశ్రేయసికమేవ చ ।
ప్రవృత్తం చ నివృత్తం చ ద్వివిధం కర్మ వైదికమ్ ॥
ఇహ చాముత్ర వా కామ్యం ప్రవృత్తం కర్మ కీర్త్యతే ।
నిష్కామం జ్ఞానపూర్వం తు నివృత్తముపదిశ్యతే ॥
ప్రవృత్తం కర్మ సంసేవ్య దేవానామేతి సామ్యతామ్ ।
నివృత్తం సేవమానస్తు భూతాన్యత్యేతి పంచ వై ॥[2]

ఈ ప్రతి కర్మ – స్వర్గము మొదలయిన సుఖములను కలిగించు జన్మప్రాప్తికి కారణమైన ప్రవృత్తి కర్మగా, జన్మలను పోగొట్టి శాశ్వతానందదాయకమయిన నివృత్తి కర్మగా రెండు విధములుగా ప్రసిద్ధి చెందినది.

ఈ లోకంలో పరలోకంలోను కోరికలను తీర్చునది ప్రవృత్తికర్మ. నిష్కామమైనది, జ్ఞానపూర్వమైనది అగు కర్మ నివృత్తి కర్మ.

ప్రవృత్తికర్మను చక్కగా నిర్వర్తించినచో దేవలోకాన్ని పొందవచ్చు. అట్లే నివృత్తికర్మను ఎల్లప్పుడు అభ్యసించి పంచభూతాత్మమైన సంసారాన్ని దాటి మోక్షమును పొందుచున్నాడు.

అన్యే కృతయుగే ధర్మా స్త్రేతాయాం ద్వాపరేఽ పరే ।
అన్యే కలియుగే నృణాం యుగాహ్రాసానురూపతః ॥[3]

"కృతయుగంలో ధర్మాలు వేరు; త్రేత మరియు ద్వాపర యుగాలలో ధర్మాలు వేరు; కలియుగంలో మానవుల ధర్మాలువేరు; ధర్మాలు యుగాల మార్పుల ప్రకారం మారుతూ ఉంటాయి."

యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽ ర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥[4]

సమస్త ప్రాణుల ఉత్పత్తి పరమేశ్వరునినుండియే జరిగినది. సమస్తజగత్తులో అతడు వ్యాపించియున్నాడు. అట్టి పరమేశ్వరుని తన కర్తవ్య కర్మాచరణము ద్వారా పూజించి, మానవుడు పరమసిద్ధిని పొందుతాడు.

ఇతరుల ధర్మమును సరిగ్గా చేయుటకంటే కూడా–సరిగా చేయలేకపోయినా సరే–తన స్వ–ధర్మము చేయుటయే వ్యక్తికి శ్రేష్ఠమయినది. తన స్వభావమును అనుసరించి కర్మలను చేయు వ్యక్తికి పాపము అంటదు.

పరమేశ్వరుడు సమస్త ప్రాణుల హృదయములలో అంతర్యామిగా ఉంటాడు. ఓ అర్జునా! భౌతిక శక్తిచే తయారు చేయబడిన శరీర రూపయంత్రమును అధిరోహించి ఉన్న జీవాత్మల గతిని, వాటి వాటి కర్మల అనుగుణముగా, తన మాయ చేత ఆయన భ్రమింపచేస్తూ ఉంటాడు.

సంపూర్ణ హృదయ పూర్వకముగా కేవలం ఆయనకే శరణాగతి చేయుము, ఓ భారతా!(అర్జునా) ఆయన దయచే, నీవు పరమ శాంతిని మరియు నిత్యశాశ్వత ధామమును పొందుతావు.

వేదోఽఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్ ।
ఆచారశ్చైవ సాధూనా మాత్మన స్తుష్టి రేవ చ ॥[5]

ధర్మానికి వేదాలు ప్రమాణాలు. వేదానికి విరుద్ధంకాని స్మృతులు, వేదవేదాంగాలు తెలిసిన, సత్పురుషుల ప్రవర్తనకూడా ధర్మ విషయంలో ప్రమాణమౌతున్నవి. ఇంకా ధర్మాధర్మ విచక్షణ కలిగినప్పుడు సత్పురుషుల మనస్సు కూడా (వారు ఆలోచించి తగిన నిర్ణయాన్ని చేస్తారు కావున) ప్రమాణమౌతున్నది.

అష్టాదశపురాణేషు వ్యాసస్య వచనద్వయమ్ ।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ।
యదన్యైర్విహితం నేచ్ఛేదాత్మనః కర్మ పూరుషః ।
న తత్పరేషు కుర్వీత జానన్నప్రియమాత్మనః ।
యద్యదాత్మని చేచ్ఛేత తత్పరస్యాపి చిన్తయేత్ ॥ [6]

h h h

యదన్యేషాం హితం న స్యాదాత్మనః కర్మ పౌరుషమ్ ।
అపత్రపేత వా యేన న తత్కుర్యాత్కథ్చన ॥[7]

h h h

అతో యదాత్మనోఽపథ్యం పరేషాం న తదాచరేత్ ॥[8]

[ఈ శ్లోకాల అనువాదాలు ఇంతకు ముందు ఇవ్వబడ్డాయి.]

సూచికలు

1. మహాభారతం శాంతిపర్వం 132, 141, 142 అధ్యాయాలు
2. మనుస్మృతి 12 వ అధ్యాయం 88,89, 90 శ్లోకాలు
3. మహాభారతం శాంతిపర్వం 231 -27
4. భగవద్గీత 46,47, 61,62 శ్లోకాలు
5. మనుస్మృతి 02 వ అధ్యాయం 06వ శ్లోకం
6. మహాభారతం శాంతిపర్వం
7. అదేపుస్తకం 124 -67, 260-20, 21, 23
8. యాజ్ఞవల్క్య స్మృతి -03-65.

అధ్యాయం 4
నైతిక శాస్త్ర ప్రమాణం

జీవన పరిణామం యొక్క ప్రస్తుత దశలో చర్యలను అంచనా వేయవలసిన సాధారణ ప్రమాణాన్ని ఐకమత్యమంటారని మనము గమనించాము. అయినప్పటికీ చాలామంది మానవులు ఈ ఐకమత్య దశలోకి రాలేదు. సంఖ్యాబలం కోసం మనము మానవుని యొక్క ప్రతి చర్యను ప్రశ్నించడం ద్వారా పరీక్షించవచ్చు: ఇది(ఈ చర్య) తోటిమానవులతో ఐక్యతను ప్రోత్సహిస్తుందా? ఇది తోటిమానవులతో విభజనను ప్రోత్సహిస్తుందా? మొదటి ప్రశ్నకు సమాధానం "అవును" అయితే, మానవుని చర్య సరైనది; రెండవ ప్రశ్నకు సమాధానం "అవును" అయితే, మానవుని చర్య తప్పు. అందుకే 01వ అధ్యాయం నైతికత మానవులకు "ఒకరితో ఒకరు మరియు వారి పరిసరాలతో ఎలా సామరస్యంగా జీవించాలో" చూపిస్తుంది అని చెప్పబడింది. సామరస్యంగా జీవించడం అంటే ఐక్యతను పెంపొందించుకోవడం.

అలాగే శ్రీ కృష్ణుడు దైవిక మరియు ఆసుర (రాక్షస) లక్షణాల గురించి మాట్లాడుతున్నప్పుడు, అతను ఐక్యతను ప్రోత్సహించే వాటిని దైవలక్షణాలుగా మరియు విభజనను ప్రోత్సహించే వారిని ఆసురులు(రాక్షసులుగా) వర్గీకరిస్తున్నట్లు మనము చూడవచ్చు. "నిర్భయత్వము, కల్మషం లేని మనస్సు, ఆధ్యాత్మిక జ్ఞానములో ధృఢసంకల్పము, దానము, ఇంద్రియ నిగ్రహము, యజ్ఞములను చేయుట, పవిత్ర గ్రంథ పఠనం, తపస్సు మరియు నిష్కాపట్యం; అహింస, సత్య సంధత, క్రోధము లేకుండుట, త్యాగము, శాంతి, ఇతరుల దోషములు వెతకకుండా ఉండుట, సర్వ ప్రాణులపట్ల దయ, దురాశ లేకుండుట, సౌమ్యత, అణుకువ, మరియు నిశ్చలత్వము; బలము, క్షమాగుణము, మనఃస్థైర్యము, పరిశుభ్రత, ఎవరిపట్లా శత్రుత్వం లేకుండుట, మరియు దురభిమానం లేకుండుట"ఇలాంటి సద్గుణాలు మనుష్యులను ఏకతాటిపైకి తీసుకువస్తాయి మరియు అందరూ ఒక్కటే అనే జ్ఞానంపై ఆధారపడి ఉంటాయి.[1]

మరోవైపు, అతనిని సమాజం రాక్షసునిగా గుర్తించే లక్షణాలను మనిషితనం నుంచి వేరు చేసే గుణ విభజనలు చూడండి: "కపటత్వం, దురహంకారము, గర్వము, క్రోధము, మొరటుతనము, మరియు అజ్ఞానము" ఇవి రాక్షస లక్షణాలు.[2] ఈ రాక్షస లక్షణాల వివరణ అహంకారం మరియు స్వార్థంతో నిండిన వ్యక్తిని మనకు చూపుతుంది.[3]

యువ విద్యార్థి ఈ ఒప్పు మరియు తప్పుల మధ్య ఉన్న (అనగా దైవిక, రాక్షస ప్రవృత్తుల మధ్య ఉన్న) ఈ తేడాని దృఢంగా గ్రహించి, తన ప్రవర్తన యొక్క మార్గదర్శకత్వానికి దీనిని అన్వయింపచేసుకోవాలి. భవిష్యత్తులో తదుపరి విజ్ఞాన సముపార్జనలో విద్యార్థికి ఈ ఒప్పు మరియు తప్పులపై చేయబోయే విశ్లేషణాత్మకమైన ఆలోచనలకు ఈ ప్రాథమిక విజ్ఞానం జతపడుతుంది. భవిష్యత్తులో అతను అనేక వివరాలను నేర్చుకొంటాడు. అనేక సంక్లిష్టతలను పరిష్కరించుకొంటాడు; కానీ జీవన పరిణామముపై ఆధారపడి – ఈశ్వరుని చిత్తానికి అనుగుణంగా ఉన్న ఈ ఒప్పు మరియు తప్పుల మధ్య ఉన్న ప్రాథమిక ప్రమాణం జీవితంలో ఎప్పటికీ మారకుండా ఉంటుంది.

సర్వేషామపి చై తేషామాత్మజ్ఞానం వరం స్మృతమ్ ।
తద్ధ్యగ్యం సర్వవిద్యానాం ప్రాప్యతే హ్యమృతం తతః ॥

సర్వమాత్మని సంపశ్యేత్సచ్చాసచ్చ సమాహితః ।
సర్వం హ్యాత్మని సంపశ్యన్నాధర్మే కురుతే మనః ॥

ఆత్మైవ దేవతాస్సర్వాస్సర్వమాత్మన్యవ్యవస్థితమ్ ।
ఏవం యస్సర్వభూతేషు పశ్యత్యాత్మానమాత్మనా ।
స సర్వసమతా మేత్య బ్రహ్మాభ్యేతి పరం పదమ్ ॥[4]

వేదాభ్యాసాదులన్నింటిలో బ్రహ్మను గురించిన జ్ఞానమే శ్రేష్ఠమయినది. ఆ జ్ఞానము వలననే మోక్షము కలుగుచున్నది కావున అన్ని విద్యలలోను ఇది ప్రధానమైనది. మరియు సంపాదించవలసినది.

సత్పదార్థమును, అసత్పదార్థమును తెలుసుకొని అదంతా బ్రహ్మస్వరూపమని, పరమాత్మస్వరూపమగు తనలో అదంతా ఉన్నదని తెలుసుకొన్నవాడయి ఆ ఆత్మ స్వరూపాన్ని ప్రత్యక్షము చేసికోవాలి. తనను తాను తెలుసుకోవాలని తాత్పర్యం. అలా తనను తాను తెలుసుకొన్నవాడు అసత్కర్మము(అధర్మము) చేయుటలో మనస్సును ఎప్పుడు ఉంచడు.

ఇంద్రాది దేవతలందరును పరమాత్మయే. ఆసర్వమును పరమాత్మ స్వరూపుడయిన తనయందే ఉన్నది.

ఎవడు ఈవిధంగా సర్వభూతములలో ఉన్న ఆత్మను బ్రహ్మజ్ఞానముతో చూస్తాడో, అతడు ఆ బ్రహ్మసాక్షాత్కారమువలన ఉత్తమస్థానమయిన బ్రహ్మమును పొందుచున్నాడు. అనగా ఆ బ్రహ్మములో లీనుడై ముక్తి పొందుచున్నాడని భావము.

సూచికలు

1. భగవద్గీత 16వ అధ్యాయము: దైవాసుర సంపద్విభాగ యోగము 01-03 శ్లోకాలు
2. అదే పుస్తకంలో 04వ శ్లోకం
3. అదే పుస్తకం 07 -18 (మూలంలో పేర్కొన్న ఈ అధ్యాయములోని ఈశ్లోకంతో చెప్పబడిన భావం సరిపోవటం లేదు).
4. మనుస్మృతి 12 వ అధ్యాయము 85,118,119,125 శ్లోకాలు.

అధ్యాయం 5

సద్గుణాలు మరియు వాటి పునాది

పరస్పర సేవకు మరొక పేరయిన పరస్పర త్యాగం, సనాతన ధర్మం ద్వారా నియమించబడిందని మనం ఇప్పటికే చూసాము. త్యాగగుణం ఐక్యతను ప్రోత్సహిస్తుంది కాబట్టి దీనిని ధర్మకోణంలో చూడటం సులభం. ఈ విధంగా పంచయజ్ఞాలు (1.బ్రహ్మ యజ్ఞం (వేద పఠనం), 2.దేవ యజ్ఞం (వైశ్వదేవం), 3.పితృ యజ్ఞం, 4.మనుష్య యజ్ఞం, 5.భూత యజ్ఞం.) త్యాగం చేసే వ్యక్తికి మరియు ఋషులు, దేవతలు, పితృదేవతలు, మానవులు మరియు జంతువుల మధ్య ఐక్యతను ప్రోత్సహిస్తాయి. ఈ యజ్ఞాలనే సనాతన ధర్మం మనకు మరొక మార్గంలో మూడు ఋణాలుగా ఆవిష్కరించి వాటిని తీర్చుకొమ్మని మనకు చెబుతుంది. మనిషికి పుట్టుకతోనే మూడు ఋణాలు ఉంటాయని సనాతన ధర్మం వివరిస్తుంది. ఇవి వరుసగా 1.ఋషి ఋణము, 2. పితృఋణము, 3. దేవఋణము. మానవాళి శ్రేయస్సుకోసం శాస్త్రాది గ్రంథాలను ప్రసాదించిన ఋషుల ఋణం బ్రహ్మచర్య ఆశ్రమంలో అధ్యయనం వల్లా, గురువుల సేవవలన తీరుతుంది. గృహస్థాశ్రమంలో – జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు, సేవచేయడం వల్లా, సంతానాన్ని కని వంశం కొన సాగేటందుకు దోహదపడినందు వల్లా పితృఋణం తీరుతుంది. వానప్రస్థాశ్రమంలో చేసే యజ్ఞాదులవల్ల, ధ్యానాదుల వలన దేవఋణం తీరుతుంది.

ఋణం అనేది మనం ఇవ్వవలసి ఉన్న విషయం; (ఋణపడిఉన్నది) మనము ఏది అందుకున్నామో దానిని తిరిగి చెల్లించాలి. ఈఋణ చెల్లింపును, మనం విధిని నిర్వర్తించడం అని పిలుస్తారు. ఈ విధి నిర్వహణను తప్పనిసరిగా మనం నిర్వర్తించాలి. ఈ విధి నిర్వహణను ధర్మం అంటారు. విధిని నిర్వర్తించకపోవడాన్ని పాపమంటారు. ఒక సద్గుణసంపన్నుడు తన విధులను, తన బాధ్యతలను గుర్తించి, వాటిని నెరవేరుస్తాడు; ఒక దుర్మార్గుడు వాటిని గుర్తించడు. వాటిని నెరవేర్చడు.

సద్గుణాలను భీష్ముడు "సత్య రూపాలు"[1] అని కూడా పిలిచాడు. ఎందుకంటే సత్యం అనేది నిజమైనది. భీష్ముడు చెప్పినట్లుగా అది "శాశ్వతమైన బ్రహ్మం."[2] సత్యమనేది దైవిక స్వభావం. దీనిని మనం బాహ్య ప్రకృతి అని పిలిచే బ్రహ్మము యొక్క ప్రతిబింబంలో చూస్తాము.

ప్రకృతి యొక్క అన్ని నియమాలు సత్యం యొక్క వ్యక్తీకరణలు. ఇవి సంపూర్ణమైన యథార్థతతో మార్పు లేకుండా పని చేస్తాయి. ఇంతకు ముందు చెప్పినట్లుగా, ఇప్పుడు అన్నింటికంటే గొప్ప సత్యం ఏమిటంటే, భిన్నత్వం అనే వైవిధ్యం మధ్య నేను అను ఏకత్వం. అన్ని ఇతర సత్యాలు మరియు నియమాలు భిన్నత్వంలో ఉన్న ఈ గొప్ప ఏకత్వానికి ప్రతిబింబాలు లేదా ప్రతిరూపాలు మాత్రమే.

నైతిక శాస్త్రంలో ఈ గొప్ప సత్యం పొందే రూపం ఏమిటంటే, మనలో ప్రతి ఒక్కరూ తన కోసం ఎలా అనుభూతి చెందుతాడో అలా ఇతరుల గురించి అనుభూతి చెందే భావన. తనను తాను ఇతరులతో సమానంగా లేదా కనీసం సారూప్యంగా అయినా ప్రతి ఒక్కరు భావించాలి. ఇలా మనం అనుభూతి చెందాలి. ఎల్లప్పుడూ నిజం చెప్పాలి. ఎందుకంటే మరొకరికి అబద్ధం చెప్పడం అంటే ఎదుటి వ్యక్తిని మనం అపనమ్మకంతో చూస్తున్నామని లెక్క. ఎదుటి వ్యక్తిని వేరుగా చూడటమంటే తనకు తాను వ్యతిరేకించడం అని చెప్పబడుతుంది. మనం అబద్ధం చెబుతున్నామంటే ఎదుటి వ్యక్తి యొక్క సాధారణ జ్ఞానాన్ని మనతో పంచుకోకుండా నిరోధించడమని గుర్తించాలి. అందరూ ఒకటే కనుక ఈ సాధారణ జ్ఞానం అందరికి సమానమని భావించాలి. .

తెలిసీ లేదా తెలియకుండా, అసత్యం మాట్లాడటం ద్వారా వేర్పాటువాదం వ్యాప్తి చెందుతుంది. ఈ వేర్పాటువాదం వలన అంతులేని హానికరమైన ఫలితాలు మరియు దుర్గుణాలు తలెత్తుతాయి. మన నీతి ప్రమాణాలకు అనుగుణంగా చెప్పబడిన సద్గుణాల స్వభావాన్ని – సత్యం యొక్క రూపాలుగా పేర్కొన్న వర్ణనను మనం మరలా మరలా స్మరించాలి. ఎందుకంటే నిజాయితీ వ్యక్తుల మధ్య ఐక్యతను ప్రోత్సహిస్తుంది. అసత్యం వ్యక్తుల మధ్య విభజనను పెంచుతుంది.

హిందూ సాహిత్యంలో వర్ణించబడిన గొప్ప పాత్రలలో సత్యసంధత అనేది ఎల్లప్పుడూ గుర్తించదగిన లక్షణం. "నా పెదవులు ఎప్పుడూ అసత్యాన్ని చెప్పలేదు" ఇది నాయకులకు ఇష్టమైన పదబంధం. శ్రీ కృష్ణుడు కురుక్షేత్రంలో ఆయుధాలు ధరించనని వాగ్దానం చేసాడు. కాని అర్జునునికి సహాయం చేయడానికి కొరడాతో భీష్ముడి వైపు పరిగెత్తినప్పుడు, కృష్ణుడు చేసిన వాగ్దానం కారణంగా (కురుక్షేత్రంలో ఆయుధాలు ధరించననే వాగ్దానం) అతని సహాయాన్ని అర్జునుడు తిరస్కరించాడు.[3]

యుధిష్ఠిరుడు కూడా కృష్ణుడు చేసిన అదే వాగ్దానం వల్ల (ఆయుధాలు ధరించననే వాగ్దానం) దాదాపు విజయంపై నిరాశకు లోనైనప్పటికీ కృష్ణుని సహాయం తీసుకోలేదు.[4] మరోవైపు యుధిష్ఠిరుడు తన అత్యంత క్లిష్ట సమయంలో ఒక క్షణం తన నిజాయితీని మరచిపోయి అబద్ధం చెప్పాడని మనం చదువుకొన్నాం. ద్రోణునితో చెప్పిన ఈ అబద్ధం వలన అతని యుద్ధ రథం భూమి నుండి పైకి లేచే శక్తిని కోల్పోయింది. మరియు అది భూమిలో క్రుంగిపోయింది.[5] పాండవులు ఇంకా అరణ్యంలో ఉన్నప్పుడు, శ్రీ కృష్ణుడు యుధిష్ఠిరునితో కౌరవులపై సైన్యాన్ని పంపవచ్చని సూచించాడు. వారు పదమూడు సంవత్సరాలు అజ్ఞాతవాసంలో ఉంటారనే వాగ్దాన స్ఫూర్తిని ఉల్లంఘించవచ్చని చెప్పాడు. కృష్ణుని మాటకు యుధిష్ఠిరుని సమాధానం ఇది: "పాండు కుమారులు సత్య మార్గం నుండి తిరుగుబాటు చేయరు."[6]

నష్టం జరిగినప్పుడు కూడా, ప్రతిజ్ఞ చేసిన మాట నిలబెట్టుకోవాలి. ప్రహ్లాదుడు ఇంద్రుని నుండి మూడు లోకాల సార్వభౌమాధికారాన్ని తీసుకున్న సమయంలో, ఇంద్రుడు బ్రాహ్మణ వేషం ధరించి అతనికి శిష్యునిగా సేవ చేసాడు. చివరికి ప్రహ్లాదుడు అతని ప్రవర్తనకు ఎంతగానో సంతోషించాడు, అతను ఏది అడిగినా ఇస్తానని కోరుకొమ్మన్నాడు. ఇంద్రుడు ప్రహ్లాదుని "శీలాన్ని" (పాత్ర, తీరు, ప్రవర్తనను) దానమడిగాడు. తాను నాశనమవుతానని భయపడినప్పటికీ సత్యాన్ని పాటించటానికి ప్రహ్లాదుడు దానిని (శీలాన్ని దానమివ్వటానికి) ఒప్పుకొన్నాడు.[7]

భీష్ముని వాగ్దానానికి విరుద్ధంగా సింహాసనాన్ని అధిష్ఠించి వివాహం చేసుకోమని అతని సవతి తల్లి సత్యవతి ప్రార్థించినప్పుడు భీష్ముని యొక్క అద్భుతమైన సమాధానాన్ని ఎవరు మరచిపోగలరు?" నేను మూడు లోకాలను, స్వర్గ సామ్రాజ్యాన్ని లేదా ఇంకా గొప్పగా ఉన్న దేనినైనా త్యజిస్తాను, కానీ నిజాన్ని ఎప్పటికీ నేను విడువను. భూమి తన సువాసనను విడువవచ్చు. నీరు తన తేమను విడువవచ్చు. కాంతి తన రూపాలను చూపించే శక్తిని విడువవచ్చు. గాలి తన స్పర్శను విడువవచ్చు. సూర్యుడు తన ప్రతాపాన్ని విడువవచ్చు. అగ్ని తన వేడిని విడువవచ్చు. చంద్రుడు తన చల్లని కిరణాలను, తన సామర్థ్యాన్ని ఖాళీ చేయవచ్చు. ఆకాశం తన శబ్దగుణాన్ని విడువవచ్చు. వృత్రాసురుని సంహరించిన ఇంద్రుడు తన పరాక్రమం విడువవచ్చు. న్యాయ దేవుడయిన యముడు తన నిష్పాక్షికత విడువవచ్చు. కానీ నేను సత్యాన్ని విడువను."[8]

నిప్పులాంటివాడు, గర్వం కలవాడు, ముక్కుసూటితనం ఉన్న కర్ణుడనేవాడు

ఏ ఆయుధాలు చీల్చుకోలేని సహజ కవచంతో పుట్టాడని ఒక ప్రాచీన కథ చెబుతున్నది. దేవతలు, పాండవుల విజయాన్ని ఆకాంక్షించే స్వభావం కలిగిన వారు. కర్ణునికి మరియు అర్జునునికి మధ్య జరగబోయే యుద్ధంలో, కర్ణుని వద్ద బలమైన కవచం ఉన్న కారణంగా అర్జునుడు ఓడిపోతాడేమోనని వారు చాలా ఆందోళనగా ఉన్నారు.

కర్ణుడు ప్రతిరోజూ తూర్పు ముఖంగా కూర్చుని, సూర్యుడు అస్తమించే సమయం వరకు వేదాలను అధ్యయనం చేసేవాడు. ఇది అతని నియమం. అతను తన వేదాధ్యయన కాలంలో బ్రాహ్మణుడు తనని ఏది అడిగినా ఇస్తానని ప్రతిజ్ఞ చేసాడు. ఒక రోజు దేవతల రాజు ఇంద్రుడు, వేరే మార్గం కనిపించక, ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపాన్ని పొందాడు. కర్ణుని ముందు కనిపించి, తనకు ఒక వరం కావాలని అడిగాడు. ఆ వరం తన శక్తికి లోబడి ఉంటే తప్పకుండా ఇస్తానని కర్ణుడు చెప్పాడు. "సహజంగా పుట్టుకతోనే నీ శరీరం ధరించిన ఈ కవచాన్ని నాకు ఇవ్వు." అని ఇంద్రుడు అడిగాడు. "ఇప్పుడు నువ్వు కపట బ్రాహ్మణుడని నాకు తెలుసు. కానీ దేవతల రాజు స్వయంగా పాండవులకు సహాయం చేయడానికి మారువేషంలో వచ్చాడని తెలుసు.

కానీ నేను ఇచ్చిన మాటలోని ప్రతి అక్షరాన్ని కూడా నేను గౌరవించాలి. నువ్వు అడిగినది తీసుకో, నీ కోరికను ఇవ్వడం ద్వారా నేను నా ప్రాణాన్ని ఇస్తున్నానని నాకు తెలుసు. ఇది నాకు ప్రాణం కంటే మించినది. యుద్ధంలో నా సైనికప్రత్యర్థి అయిన అర్జునుడిని జయించే ఏకైక అవకాశం!" అని చెబుతూ కర్ణుడు కవచాన్ని తన శరీరంపై తిరస్కరించాడు. స్వయంగా తన చేతితో మరియు ఖడ్గముతో తన సజీవ కవచపు మొత్తాన్ని ఒలిచి ఇంద్రునికి ఇచ్చాడు. తద్వారా– మాటపై నిలబడటం ద్వారా అతను అర్జునుడు తనను ఓడించిన దానికంటే ఎక్కువ పేరును గెలుచుకున్నాడు. మహనీయ జీవితాన్ని పొందాడు.[9]

ఒకసారి రాక్షసులతో జరిగే యుద్ధంలో సూర్యవంశానికి చెందిన దశరథుని సహాయాన్ని దేవతలు ప్రార్థించారు. క్షత్రియునిలా రాక్షసులతో దశరథుడు పోరాడాడు. అతని చిన్న భార్య, కైకేయి ఆ సమయంలో అతని యుద్ధ రథాన్ని నడిపింది. యుద్ధంలో గాయాల వలన రాజు మూర్ఛలో మునిగిపోయిన సందర్భంలో కైకేయి నేర్పుగా దశరథుని సురక్షితమైన ప్రదేశానికి తీసుకువెళ్లి అతని ప్రాణాలను కాపాడింది. ఆ పనికి సంతోషించి కృతజ్ఞతతో రాజు ఆమెకు రెండు వరాలను ఇస్తానని వాగ్దానం

చేసాడు. భవిష్యత్తులో తన అవసరాల కోసం ఆ రెండు వరాలు అడుగుతానని కైకేయి చెప్పింది.

చాలా కాలం తరువాత, రాజు తన వృద్ధాప్యంలో ఉన్నప్పుడు మరియు అతని పెద్ద కుమారుడు రాముని తన వారసునిగా సింహాసనంపై ప్రతిష్ఠించాలని కోరుకున్నాడు. ఆ సమయంలో భయంతో ఆమె వరాలను కోరింది. వాటిని ఇలా పేర్కొంది :" 1. వృద్ధుడైన రాజుకు అత్యంత ప్రియమైనవాడు , పురుషోత్తముడైన రాముడు, అడవులకు వెళ్ళాలి. 2. రాజ కిరీటాన్ని కైకేయి కుమారుడైన భరతుని తలపై ఉంచాలి."

దశరథునికి వరాలను ఇవ్వడం వలన తనకు మరణము కలుగుతుందని బాగా తెలుసు. అయినప్పటికీ వాటిని మంజూరు చేసి మరణించాడు. తన మాటను ఉల్లంఘించి, సత్యాన్ని చంపడం కంటే తాను చనిపోవడం చాలా మంచిది.[10]

బలి అను ఒక రాక్షసుల రాజు, స్వర్గాన్ని జయించి, మూడు లోకాలకు ఎదురు లేని పాలకుడయ్యాడు. విశేష ఆచారాలు కలిగిన పవిత్రమైన అశ్వమేధయాగం అతని ఆదేశంతోచేయబడింది.

(అశ్వమును పశువుగా ఏర్పఱిచి చేయుయాగమును అశ్వమేధ యాగమంటారని ఒక అర్థం. ఆ గుఱ్ఱమును దిగంతపర్యంతము పంపి అడ్డువచ్చినవారిని జయించిన సార్వభౌముడు చేసే యాగమిది. అశ్వ అనే పదము 'అశ్ భక్షణి' అనే ధాతువు నుండి వచ్చింది. అనగా , దారిని తినివేయునది. అని ఆ అర్థంలో సమన్వయం.

అయితే అశ్వమేధ యాగ పదానికి పెద్దలు ఇంకొక ఆంతరార్థం చెప్పారు. అది ఇది.

ఏదైతే ఇంకొకదానిని గ్రహించునో, అది అశ్వము.నీటిని గ్రహించే సూర్య కిరణము అశ్వమే. వెలుతురును గ్రహించే కన్నూ, శబ్దాన్ని గ్రహించే చెవీ, రుచిని గ్రహించే నాలుకా ... ఇవన్నీ అశ్వాలే. కాబట్టి ఇంద్రియాలను అశ్వములు అని పిలుస్తారు. శరీరాన్ని రథముతోనూ , రథము నడిపేవాణ్ణి ఆత్మతోనూ, ఇంద్రియాలను గుఱ్ఱాలతోనూ పోల్చే ప్రసిద్ధమైన శ్లోకాలు ఈ వైదిక అర్థముతో రాయబడినవే. సంస్కృతములో అశ్వము అంటే గుఱ్ఱమే. కానీ వేద శబ్దాలకు ఆ అర్థము లేదు. సందర్భాన్ని బట్టి ఎక్కడ ఏ అర్థము వస్తుందో చూడాలే గానీ అశ్వము వచ్చిన చోటంతా గుఱ్ఱము రాదు.

అశ్వానికి ఇంకో అర్థము కూడా ఉంది అ–శ్వః అంటే రేపు లేనిది. – నిరంతరంగా ఉండేది. అశ్వమితి రాష్ట్రము, దేశము ఎప్పుడూ నిరంతరంగా ఉంటుంది. వేదికను కూడా అశ్వము అంటారు. నటీనటులు వస్తూ పోతుంటారు, వేదిక నిరంతరముగా ఉంటుంది.

ఇక మేధ అనే శబ్దానికి రెండు ధాతువులున్నాయి. మేధృ – "సంప్రహ" మరియూ మేధృ– సంగమం.అశ్వమేధమంటే ఇంద్రియాలను సంగమములోకి అనగా స్వాధీనములోనికి తెచ్చుకొనుట. వేదములో చెప్పిన 'అశ్వ మేధ' పదానికి అర్థము ఇదే. రాష్ట్ర మేధృ రాష్ట్రాన్ని అనగా రాజ్యాన్ని అధీనములోకి తెచ్చుకొనుట. రాజ్య ఐక్యత. యూపము అంటే, గుర్రాన్ని కట్టివేయు కొయ్య స్తంభము కాదు. యూపమను పదాన్ని, ఇంద్రియాలను, మనసును అదుపులో ఉంచు విషయములో వాడతారే గానీ పశువును కట్టు గూటము అనే అర్థములో కాదు. కాబట్టి అశ్వ మేధములో గుర్రమూ లేదు, హింస అంతకన్నా లేదు. విభాత వీచికలు అను బ్లాగ్ సౌజన్యం).

విష్ణువు వామనావతారం (మరుగుజ్జు వేషం) ధరించి, యాగం వద్దకు వచ్చి మూడడుగులు వేయగలిగినంత భూమిని వరముగా ఇమ్మని వేడుకున్నాడు. వామనుడు విష్ణువు కాబట్టి బలి గురువైన శుక్రుడు వరాన్ని ఇవ్వవద్దని బలికి చెప్పాడు. అప్పుడు బలి ఇలా జవాబిచ్చాడు: "ప్రహ్లాదుని మనుమడు ఎప్పుడూ అసత్యం మాట్లాడడు. అతను విష్ణువు మరియు నాకు శత్రువు అయినప్పటికీ ఈ బ్రహ్మచారికి నేను వాగ్దానం చేస్తాను," ఆ తరువాత వామనుడు త్రిలోకాలను రెండు అడుగులతో ఆక్రమించి, మూడవ అడుగుకి స్థలాన్ని కోరినప్పుడు, బలి తన తలను సమర్పించాడు. తన రాజ్యాన్ని కోల్పోయాడు. అందుకు విష్ణువు అతనిని ఆశీర్వదించి ఇలా ప్రకటించాడు: "తన సంపద పోయింది, పదవి పోయింది, బంధించబడ్డాడు. ఓడిపోయాడు. స్నేహితులచే విడిచిపెట్టబడ్డాడు. తన స్వంత గురువయిన శుక్రునిచే దూషించబడ్డాడు .శపించబడ్డాడు ... కాని బలి సత్యాన్ని విడిచిపెట్టలేదు[11].

"ఇలాంటి సత్యమును పాటించి వాగ్దానం నెరవేర్చటం వలన, ప్రస్తుతము ఇంద్రపదవిలో ఉన్న పురందరుడు ఆ పదవిని ఖాళీ చేసిన తరువాత, విష్ణువు యొక్క ఆశీర్వాదంతో, బలి భవిష్యత్తులో ఇంద్రుడు అవుతాడని పురాణాలు చెబుతున్నాయి. (ఇంద్ర అనేది ఒక పదవి యొక్క పేరు. వ్యక్తిగతమయిన పేరు కాదు. స్వర్గాన్ని ఎవరు పారిపాలించినా అతనిని ఇంద్రుడని పిలుస్తారు. ఇంద్రపదవిలో ఉన్న వ్యక్తులు

మారుతుంటారు. వైవస్వత మన్వంతరములో ఇంద్ర పదవిలో ఉన్న వాని పేరు పురందరుడు. ఇది ఇంద్రునికి సామాన్య నామముగాను వాడుతారు. శత్రుపురముల నాశమొనర్చువాడు కనుక పురందరుడని పేరు వచ్చింది)

సత్యం బ్రహ్మం కాబట్టి, బ్రహ్మాన్ని కోరుకునే వారు సత్యవంతులుగా ఉండాలి. అన్నిటికీ మించినది బాలుడు ఎప్పుడూ నిజాయితీగా ఉండటానికి ప్రయత్నించాలి.

"జాయమానో వై బ్రాహ్మణ స్త్రిభిర్ ఋణైర్ ఋణవాన్ జాయతే యజ్ఞేన దేవేభ్యః ప్రజయా పితృభ్యః స్వాధ్యాయేన ఋషిభ్యః"

"బ్రాహ్మణుడు పుట్టుచునే మూడు ఋణములు కలవాడగుచున్నాడు. వేదాధ్యయనముతో ఋషులఋణమును, యజ్ఞముతో దేవతలఋణమును, సంతానముతో పితృదేవతల ఋణమును ఆ తీర్చుకొనవలయును.[12]

ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ॥
అనపాకృత్య మోక్షం తు సేవమానో వ్రజత్యధః ।

అధీత్య విధివద్వేదాన్ పుత్రాం శ్చోత్పాద్య ధర్మతః
ఇష్ట్వా శక్తితోయజ్ఞైర్మనో మోక్షే నివేశయేత్ ॥

ఋణములను మూడింటిని దీర్చి మనస్సును మోక్షమునందు ప్రవేశ పెట్టాలి. ఋణములను. దీర్చకుండ మోక్షమునకై సంన్యాసాశ్రమమును స్వీకరించువాడు నరకమును పొందుతాడు.. విధిపూర్వకముగా వేదాధ్యయనము చేసి, పుత్రులను పొంది, శక్తి కొలదిగా యజ్ఞమును చేసి ఆ తరువాత సన్యాసములో మనస్సు నిలపాలి.[13]

పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥[14]

h h h

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।
అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥[15]

దేవతల, మనుష్యుల పరస్పర సహకారం వలన అందరికీ శేయస్సు కలుగుతుంది.

ఓ పార్థా ! వేదములచే ఆదేశించబడిన ఈ యజ్ఞ చక్రములో తనబాధ్యతను

నెరవేర్చని వారు పాపులుగా లెక్కించబడతారు. వారు తమ ఇంద్రియ భోగముల కోసమే జీవిస్తారు; అట్టి వారి జీవితము వ్యర్థం.

సత్యం నామావ్యయం నిత్యమవికారి తథైవ చ ।
సర్వధర్మావిరుద్ధేన యోగేనైతదవాప్యతే ।
సత్యం చ సమతా చైవ దమశ్చైవ న సంశయః ।
అమాత్సర్యం క్షమా చైవ హ్రీస్తితిక్షాఽనసూయతా ।
త్యాగో ధ్యానమథార్యత్వం ధృతిశ్చ సతతం దయా ।
అహింసా చైవ రాజేంద్ర సత్యాకారాస్త్రయోదశ ॥ [16]

సత్యం అనేది ఎప్పుడూ మంచివారికి సంబంధించిన ఒకే ధర్మం.సత్యమే సనాతన ధర్మం. సత్యానికి మాత్రమే నమస్కరించండి. సత్యమే అంతిమ మార్గం. సత్యమే ధర్మం, సత్యమే తపస్సు. సత్యమే శాశ్వతమైన బ్రహ్మం.సత్యమే అత్యున్నతమైన త్యాగం, ఎందుకంటే అన్నీ సత్యం ద్వారా స్థాపించబడ్డాయి మరియు సమర్థించబడతాయి.

h h h

“సత్యం అనేది నశించనిది, మారనిది, శాశ్వతమైనది అని పేరు పొందింది. ఇది ఏ ధర్మాన్ని వ్యతిరేకించని యోగ–ధ్యానం ద్వారా సాధించబడుతుంది.

“నిజాయితీ, సమానత్వం (నిష్పాక్షికత) స్వీయ నియంత్రణ, అసూయపడే అనుకరణ లేకపోవడం, క్షమాపణ, వినయం, ఓర్పు, అసూయ లేకపోవడం, దాతృత్వం, ఆలోచనాశక్తి, నిస్వార్థమైన పరోపకారం, ఆత్మనిగ్రహం మరియు ఎడతెగని మరియు కరుణతో కూడిన అపకారం చేయని లక్షణం – ఇవి సత్యము యొక్క పదమూడు రూపాలు.”

చత్వార ఏకతో వేదాః సాంగోపాంగాః సవిస్తరాః ।
స్వధీతా మనుజవ్యాఘ్ర సత్యమేకం కిలైకతః ॥[17]

“త్రాసులో అంగాలు మరియు ఉపాంగాలన్నింటినీ కలిపి బాగా అధ్యయనం చేయబడిన నాలుగు వేదాలను ఒకవైపు, సత్యాన్ని మరోవైపు ఉంచితే సత్యము వైపు మాత్రమే ముల్లు చూపుతుంది.” (సత్యమే గొప్పదని భావం)

ఆత్మ న్యపి న విశ్వాస స్తథా భవతి సత్సు యః ।
తస్మాత్ సత్సు విశేషణ సర్వః ప్రణయమిచ్ఛతి ॥[18]

మనుష్యులకు మంచివారి మీద ఉన్నంతవిశ్వాసం వాళ్లమీద వాళ్లకు కూడా ఉండదు. అందువలననే ప్రజలందరూ మంచివారి మీద విశేషమైన ప్రేమ కలిగి ఉంటారు.

సతాం సదా శాశ్వతీ ధర్మవృత్తిః;
సంతో న సీదంతి న చ వ్యథంతి ।
సతాం సద్భిర్నాఫలః సంగమోఽస్తి;
సద్భ్యో భయం నానువర్తంతి సంతః ।
సంతో హి సత్యేన నయంతి సూర్యం;
సంతో భూమిం తపసా ధారయంతి ।
సంతో గతిర్భూతభవ్యస్య రాజ;
న్సతాం మధ్యే నావసీదంతి సంతః॥[19]

మంచివారి ప్రవృత్తి ఎల్లప్పుడూ ధర్మంలో నిమగ్నమై ఉంటుంది. గొప్ప వ్యక్తులు ఎప్పుడూ విచారంతో లేదా బాధతో ఉండరు. సత్పురుషుల కలయిక ఎప్పుడూ వ్యర్థం కాదు. సాధువులు సాధువులకు ఎప్పుడూ భయపడరు. సత్యం యొక్క శక్తితో మంచి వ్యక్తులు సూర్యుడిని కూడా తమ దగ్గరికి పిలుస్తారు.సత్పురుషులు భూమిని తమ తపస్సుతో ధరిస్తారు. ఓ రాజా! సత్యము భూత భవిష్యత్తులకు ఆధారము. మంచి పురుషులు సత్యముతో జీవిస్తున్నందుకు ఎప్పుడూ చింతించరు.

(యతః ప్రభవతి) క్రోధః కామో వా భరతర్షభ
శోకమోహౌ విధిత్సా చ పరాసుత్వం చ (తద్వద)
లోభో మాత్సర్య మీర్ష్యాచ కుత్సాఽసూయా కృపా భయమ్

h h h

త్రయోద శైతేఽతిబలాః శత్రవః ప్రాణినాం స్మృతాః ॥[20]

ఓ రాజా! కోపం, కామం, నిస్పృహ, భ్రమ, విరక్తి, తప్పుడు కార్యకలాపాలు, దురాశ, ఈర్ష్య, అసూయ, చిరాకుతో కూడిన చింత, ద్వేషం, అపహాస్యం మరియు భయం ఈ పదమూడు (అసత్యం యొక్క దుర్గుణస్వరూపాలు) జీవులకు శక్తివంతమైన శత్రువులు.

యస్య విద్వాన్ హి వదతః క్షేత్రజ్ఞో నాభిశంకతే,
తస్మాన్న దేవాః శ్రేయాంసం లోకేఽన్యం పురుషం విదుః.[21]

ఎవడు సాక్ష్యము ఇచ్చేటప్పుడు సర్వజ్ఞుడయిన అంతర్యామి ఇతడు సత్యము పలుకుచున్నాడా, అసత్యము పలుకుచున్నాడా అని సంశయము పొందకుండా ఉంటాడో, ఆ పురుషుడు ఉత్తముడు. అట్టివానికంటె ఇతరుని మహాపురుషుడని దేవతలు పలుకరు.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽ స్త్వకర్మణి॥[22]

శాస్త్రము చెప్పిన కర్తవ్య కర్మను ఆచరించుటలోనే నీకు అధికారము కలదు. కానీ ఆ కర్మ ఫలముల పైన నీకు హక్కు లేదు. నీవే కర్మ ఫలములకు హేతువు అని ఎప్పుడూ అనుకోకు. మరియు చేయవలసిన కర్మలు మానుటలో ఆసక్తి ఉండరాదు.

ఋతం సత్యం పరం బ్రహ్మ[23]

సర్వోన్నత బ్రహ్మమే సరైనది, సత్యమైనది."

(సత్యానికీ, ఋతానికీ మధ్య కొంత వ్యత్యాసం ఉంది. వేదమంత్రాలలో 'సత్యం వదిష్యామి, ఋతం వదిష్యామి ...' అంటున్నాము. అంటే సత్యానికీ, ఋతానికీ మధ్య వ్యత్యాసాన్ని గుర్తిస్తున్నట్టే. సత్యం అన్ని కాలాలలోనూ ఒక్కటే. అది మారదు. అందుకే అది త్రికాల ఆబాధితం అన్నారు. ఋతం కూడా సత్యమేగాని, అది కాలానుగుణంగా మారవచ్చు. ఉదాహరణకు అరణ్యంలో ఒక సాధుజంతువు ఒకానొక ముని ఆశ్రమానికి వచ్చి ప్రాణరక్షణకోసం దాగి ఉందనుకుందాము. దానిని తరుముకుంటూ వచ్చిన వేటగాడు అడిగితే ముని తనకు తెలియదని చెపితే అది ఋతంఅవుతుందా, అనృతం అవుతుందా? ఋతమే అవుతుంది. అనృతం కాదు. కాని, అది సత్యమా అంటే కాదు. సత్యానికీ, ఋతానికి ఇదీ తేడా. దేశ కాల పరిస్థితులను బట్టి ఋతం మారవచ్చు, సత్యం మారదు).

సూచికలు

1. మహాభారతం శాంతి పర్వం 162
2. అదే పుస్తకం 162
3. మహాభారతం, భీష్మ పర్వం 59
4. అదేపుస్తకం

5. అదేపుస్తకం

6. మహాభారతం ద్రోణపర్వం 203

7. మహాభారతం, వన పర్వం 180

8. మహాభారతం, ఆదిపర్వం 103

9. మహాభారతం, వన పర్వం 305-309

10. రామాయణం అయోధ్యకాండ

11. విష్ణుభాగవతం,8. 15-13

12. కులుకుడు తన మనుస్మృతి వ్యాఖ్యానంలో ఉదహరించిన వేద వచనం 06-36

13. మనుస్మృతి 06వ అధ్యాయం 35,36 శ్లోకాలు

14. భగవద్గీత 03-11

15. భగవద్గీత 03-16

16. మహాభారతం- అనుశాసన పర్వం 100- 62 (కుంభ కోణ మహాభారత ప్రతిలోని శాంతిపర్వంలో 12-160వ అధ్యాయం-8, 9,10 శ్లోకాలుగా ఇవి కనబడుతున్నాయి)

17. మహాభారతం- వన పర్వం 1-13

18. అదే పుస్తకం 1-291

19. అదే పుస్తకం వన పర్వం 281 వ అధ్యాయం 46, 47 శ్లోకాలు

20. మహాభారతం శాంతిపర్వం 33

21. మనుస్మృతి 08-96

22. భగవద్గీత 02-47

23. నృసింహోత్తర తపనీయ ఉపనిషత్ 01-06.

అధ్యాయం 6
ఆనందం మరియు భావోద్వేగాలు

ఈశ్వరుడు అంటే ఆలోచన, శక్తి మరియు ఆనందం అని మనం గమనించాము. మానవుడు కూడా అతని బిడ్డగా ఈ లక్షణాలను కలిగి ఉంటాడు. జీవాత్మ దట్టమైన పదార్ధంతో చుట్టబడినప్పుడు, అతని స్వభావమయిన ఆనందం, ఎల్లప్పుడూ సంతృప్తిని వెతుక్కుంటూ బయటికి వెళుతుంది. బాహ్య ప్రపంచంతో తనను తాను ఐక్యం చేసుకోవడం ద్వారా తనను తాను గ్రహించుకోవడానికి ప్రయత్నిస్తుంది. బాహ్య ప్రేరణలను కోరికలు అంటారు. కోరికలు జీవాత్మను తనకు ఆనందాన్ని ఇచ్చే వస్తువుతో ఏకం చేసినప్పుడు, అతను అలాంటి వస్తువుతో మళ్లీ ఐక్యం కావాలని కోరుకుంటే, ఫలితంగా వచ్చే భావోద్వేగాన్ని ప్రేమ లేదా ఇష్టం అంటారు.

దీనికి విరుద్ధంగా, వారు జీవాత్మను అతనికి బాధను కలిగించే ఒక వస్తువుతో ఏకం చేసినప్పుడు, అతను అలాంటి వస్తువుతో మళ్లీ కలయిక రాకూడదని కోరుకుంటే, ఫలితంగా వచ్చే భావోద్వేగాన్ని ద్వేషం లేదా అయిష్టం అంటారు. మొదటిది జీవాత్మ మరియు వస్తువు మధ్య ఆకర్షణను కలిగిస్తుంది; రెండవది వికర్షణ (నిరాకరణము) చేస్తుంది.

జీవాత్మ ఈ ఇష్టాలు మరియు అయిష్టాల గురించి ఆలోచిస్తాడు. క్రమంగా తన భావోద్వేగాలను సరిగ్గా నడిపించడానికి శిక్షణ పొందుతాడు; ఈశ్వరుని సంకల్పానికి అనుగుణంగా హేతువు ద్వారా మార్గనిర్దేశం చేయబడిన భావోద్వేగాలు సద్గుణాలుగా అతనిలో అభివృద్ధి చెందుతాయి. ఆ విధంగా భావోద్వేగాల సంస్కృతి మనిషి యొక్క నైతిక అభివృద్ధిని ఏర్పరుస్తుంది. అతను ప్రేమ అనే భావోద్వేగాన్ని పెంపొందించుకున్నప్పుడు, జీవులు, కుటుంబం, సమాజం, దేశం, జాతి యొక్క విస్తృతమైన వలయములో తాను కలిసిపోతాడు.. వాటిని తనలాగే ప్రేమిస్తాడు. ఈ ప్రేమ అతని స్వభావం యొక్క ఆనంద కోణానికి సంబంధించిన నిరంతరం పెరుగుతున్న వ్యక్తీకరణ అవుతుంది. ఈ ప్రేమ సమాజపు ఏకీభావంలో సంతృప్తిని పొందుతుంది.

ఇప్పుడు మానవ పరిణామం మనలను ఐక్యత వైపు నడిపిస్తోందని గమనించాం. మరో మాటలో చెప్పాలంటే, ఈశ్వరుని సంకల్పం విడిపోయిన వారిని

ఒకరితో ఒకరిగా మరియు తనతో (పరమేశ్వరునితో) ఐక్యం చేసే దిశగా నడిపిస్తున్నట్లు మనం చూసాము. ఈ కలయికలో ఆనందం ఉంది; అందువల్ల హక్కు మరియు సంతోషం విడదీయరానివి. పదే పదే సనాతన ధర్మం మనలను ఈ "బ్రహ్మమే పరమానందం" అను ఒక్క నిర్ణయము వైపుకి తీసుకువెళుతుంటుంది. కాబట్టి బ్రహ్మ స్వభావానికి చెందిన జీవాత్మ కూడా ఆనందస్వరూపుడని ఎప్పుడూ మరిచిపోకూడదు. పరిణామానికి వ్యతిరేకంగా, గొప్ప సంకల్పానికి వ్యతిరేకంగా వెళ్ళినప్పుడు మాత్రమే జీవునికి దుఃఖం పుడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తప్పు".

బ్రహ్మైవేదం సర్వం సచ్చిదానందరూపం
సచ్చిదానందరూపమిదం సర్వమ్॥[1]

"ఈ సమస్త చరాచరములలో వ్యాపించి ఉన్న బ్రహ్మమే (పరమాత్మ) – సచ్చిదానందము; సచ్చిదానందము అంటే ఈ సమస్తం."

(సత్ + చిత్ = ఆనందం. సత్యం, జ్ఞానం, ఆనందం కలసి పరమాత్మ స్వరూపం. భూత, భవిష్యత్, వర్తమానాల వల్ల మార్పు చెందనిదీ, ఎప్పుడూ ఒకే విధంగా ఉండేదీ సత్/ సత్తు. సచ్చిదానందంలో రెండవదైన చిత్/ చిత్తు అంటే ఎరుక. నిరుపాధికం, నిరతిశయం, నిరుపమానం అయి ఎప్పటికీ ఉండే సుఖానుభూతి ఆనందం. దీపానికి ఎరుపు తెలుపుల మిశ్రమ వర్ణం, వేడి, కాంతి ఎలా స్వాభావికంగా కలసి ఉంటాయో అలా సత్తు, చిత్తు, ఆనందం మిళితమై ఉంటాయి. అవి అభిన్నం).

పరాంచిఖాని వ్యతృణత్ స్వయంభూ
స్తస్మాత్ పరాఙ్ పశ్యతినాంతరాత్మన్ ॥[2]

(పరమేశ్వరుడు ఇంద్రియాలను బహిర్ముఖంగానే సృష్టించాడు. అందువలన, బాహ్యావిషయాలను గ్రహించే శక్తిమాత్రమే వాటికి ఉన్నది. అంతరాళములో ఉన్న ఆత్మను ఏ ఇంద్రియము గ్రహించలేదు.)

యదా వై సుఖం లభతేఽథ కరోతి నాసుఖం లబ్ధ్వా కరోతి సుఖమేవ లబ్ధ్వా కరోతి యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖమ్ ॥

యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమా అథ యత్రాఽన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పం యో వై భూమా తదమృతమథ యదల్పం తన్మర్త్యమ్ ॥[3]

ఎప్పుడైతే సాధకుడు(జీవుడు) సుఖం దొరికే అవకాశముందని గ్రహిస్తాడో, అప్పుడే కర్మ చేస్తాడు; అతను సుఖం పొందకుండా ఎప్పుడూ కర్మ చేయటానికి ఇష్టపడడు; సుఖం దొరకదని తెలిస్తే అతను కర్మ చేయడు. సుఖం దొరుకుతుందని తెలిస్తేనే కర్మ చేస్తాడు.

భూమా అంటే అనంతం. భూమ అంటే బ్రహ్మ. రెండింటి అర్థం ఒకటే. రెండూ అనంతాన్ని సూచిస్తాయి. అనంతమైన భూమయే సుఖం లేదా ఆనందం. పరిమితమైన వాటిలో, అల్పవిషయాల్లో ఆనందం లేదు. ఈ అనంతం మాత్రమే ఆనందం.

చూసే వ్యక్తి, చూడబడే వస్తువు అని రెండు లేవు. ఉన్నదొకటే బ్రహ్మ. అలాగే వినేవాడు, వినబడే వస్తువు అంటూ భిన్నంగా లేవు.తెలుసుకునే వ్యక్తి, తెలుసుకోబడే వస్తువు అంటూ రెండు భిన్నంగా లేవు. దీనినే- ఈ అద్వైత ఆనందాన్నే భూమ అంటారు. అయితే వ్యావహారిక ప్రపంచంలో చూసే వ్యక్తి వేరు, చూడబడే వస్తువు వేరు. వినేవ్యక్తి వేరు, వినబడే శబ్దం వేరు, నేర్చుకునే వ్యక్తి వేరు, నేర్చుకోబడే వస్తువు వేరు.ఇది పరిమితమైన జ్ఞానం. పరిమితమైనదాన్లో కొంచెం కూడా సుఖం లేదు. అనంతం మాత్రమే సుఖం. అంటే ఏదైతే భూమయో అది అమృతం. భూమకు భిన్నంగా, ఏదైతే అల్పంగా ఉందో అది శాశ్వతం కాదు.

సుఖచైతన్య స్వరూపోఽ పరిమితానన్ద సముద్రోఽ విశిష్టసుఖస్వరూపశ్చానన్ద ఇతి ॥[4]

ఆనందమనగా సుఖచైతన్య స్వరూపము. అది అపరిమితమయిన ఉత్సాహసముద్ర స్వరూపము. దాని కంటే గొప్పది ఇంకొకటి ఏది మిగిలి ఉండదో అది ఆనందం.

ఇష్టవిషయే బుద్ధిః సుఖబుద్ధిరనిష్టవిషయే బుద్ధిర్దుఃఖ బుద్ధిః॥[5]

ఇష్టమైన విషయములలో బుద్ధి నిలిస్తే అది సుఖమౌతుంది. ఇష్టం లేని విషయములలో బుద్ధి నిలిస్తే అది దుఃఖమౌతుంది.

సర్వాణి భూతాని సుఖే రమన్తే; సర్వాణి దుఃఖస్య భృశం త్రసన్తే ॥[6]

''అన్ని జీవులు సుఖంలో ఆనందిస్తాయి; అన్నిజీవులు బాధలలో బాగా క్రుంగిపోతాయి.''

ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత ।
సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప॥[7]

ఓ భరత వంశీకుడా! రాగ, ద్వేషములనే ద్వంద్వములు, మోహము (భ్రాంతి) నుంచి పుడుతున్నాయి. ఓ శత్రువులను జయించేవాడా! అర్జునా! ఈ భౌతిక జగత్తులో ఉన్న ప్రతి ప్రాణి కూడా పుట్టుక నుండే వీటిచే (రాగ, ద్వేషములచే) భ్రమింప జేయబడుచున్నది.

ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః ।
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥[8]

కోరిక మరియు ద్వేషము, సంతోషము మరియు దుఃఖము, శరీరము, చైతన్యము, మనోబలము - ఇవన్నీ కలిపి క్షేత్రము మరియు దాని మార్పులు (వికారములు) అను పేర్లతో పిలువబడతాయి. (ఈ శరీరమును క్షేత్రమని అనగా కార్యకలాపాలు జరిగే స్థానమని, ఆత్మ, పరమాత్మ క్షేత్రజ్ఞులని (క్షేత్రముతెలిసినవారు) తెలుసుకోవటమే, నిజమైన జ్ఞానముగా భగవద్గీతలో చెప్పబడిన విషయం ఇక్కడ స్మరణీయమైనది).

కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః॥[9]

రజోగుణము నుండి పుట్టు కామమే (కోరికలు, వాంఛలు), తరువాత క్రోధముగా పరిణామం చెందుతుంది.

ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ॥[10]

ఇంద్రియములు సహజంగానే ఇంద్రియ విషయములపై రాగ ద్వేషములు కలిగి ఉంటాయి, కానీ వాటికి వశము కాకూడదు. ఎందుకంటే ఇవే మనకు ప్రతిబంధకములు మరియు శత్రువులు.

రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి॥[11]

ఇంద్రియ విషయములలో ప్రవర్తించేటప్పుడు మనస్సుని నియంత్రించినవాడు, మమకార-ద్వేష రహితంగా ఉన్నవాడు భగవంతుని దయకు పాత్రుడవుతాడు. శాంతిని పొందుతాడు.

యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్॥[12]

ఎవరైతే శాస్త్రములో చెప్పబడిన ఆదేశములను లెక్కపెట్టక కోరికకు వశులై తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారో, వారు పరిపూర్ణ సిద్ధిని కానీ, సుఖాన్ని కానీ, చివరకి జీవితము యొక్క పరమ లక్ష్యమును కానీ సాధించలేరు.

ఏకో వశీ సర్వభూతాంతరాత్మా
ఏకం రూపం బహుధా యఃకరోతి
తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా
స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్॥[13]

ఎవడు సమస్త చరాచర జగత్తును నియంత్రిస్తున్నాడో, ఎవడు సర్వ పదార్థాలలో ఆత్మస్వరూపంగా ఉంటున్నాడో, ప్రకృతి రూపమైన ఒకే బీజాన్ని బహువిధాలుగా ఎవడు సృజిస్తున్నాడో, ఏ ధ్యానులు తమ ఆత్మలలో ఆ పరమాత్మను దర్శిస్తున్నారో వారికి మాత్రమే శాశ్వతానందం లభిస్తోంది.

సూచికలు

1. నృసింహోత్తర తాపిన్యుపనిషత్ 07
2. కఠోపనిషత్ 04-01
3. ఛాందోగ్యోపనిషత్ సప్తమాధ్యాయం 22-01, 23-01 , 24-01
4. సర్వసారోపనిషత్
5. సర్వసారోపనిషత్
6. మహాభారతం శాంతిపర్వం 231-227
7. భగవద్గీత 07-27
8. పై పుస్తకంలోనే 13-7
9. పై పుస్తకంలోనే 03-37
10. భగవద్గీత 3-34
11. భగవద్గీత 02-64
12. భగవద్గీత 16-23
13. కఠోపనిషత్ 05-12.

అధ్యాయం 7

ఆత్మ సంబంధమైన ధర్మాలు

జీవాత్మ తన చుట్టూ ఉన్నవాటితో సంబంధం కలిగి ఉందని, ఇతరులతో అతని సంబంధాలను సామరస్యపూర్వకంగా ఉండటానికి నీతి ఉపయోగపడుతుందని మనం చూసాము. కానీ అతను తన స్వంత కోశాలతో తనను అత్యంత సన్నిహితంగా ఐక్యం చేసుకున్న అనాత్మ (Not-Self)కు సంబంధించిన భాగాలతో చాలా దగ్గరి సంబంధం కలిగి ఉన్నాడని మనం మరిచిపోకూడదు. అతను వాటితో సామరస్య పూర్వకమైన సంబంధాలు కలిగి ఉండకపోతే, అతనికి దూరంగా ఉన్న శరీరాలతో సామరస్య సంబంధాలను అతను ఆశించలేడని మనం మరచిపోకూడదు.

జీవాత్మ యువకుడిగా ఉన్నప్పుడు, అతని యజమాని అయిన ఈ కోశాలు అతన్ని అన్ని రకాల ఇబ్బందుల్లోకి పడేటట్లు చేస్తాయి; అతను పెద్దయ్యాక, వాటిని తన అధీనంలోకి తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తాడు. అతను స్వీయ నియంత్రణ అనే గొప్ప ధర్మాన్ని అభివృద్ధి చేసే ముందు ఈ కోశాలతో చాలా కఠినమైన పోరాటాన్ని కలిగి ఉంటాడు. వివిధ జీవాత్మల మధ్య సంబంధాలతో సంబంధం లేకుండా, ఈ కోశాలకు చెందిన ధర్మాలను ఆధునిక వర్గీకరణలో ఆత్మ సంబంధమైన ధర్మాలు అని వీటిని పిలుస్తారు.

కానీ ఈ సద్గుణాలను కలిగి ఉన్న వ్యక్తి అవి లేని ఇతరులతో ఎక్కువ సామరస్య సంబంధాన్ని పెంచుకుంటాడని మనం గమనించవచ్చు.

గొప్ప న్యాయనిర్ణేత అయిన మనువు ఈ స్వీయ-నియంత్రణ ఆవశ్యకతకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చాడు. దానిని గురించి కొన్ని విలువైన సలహాలు ఇస్తాడు. చర్య వెనుక మూడు శక్తులు ఉన్నాయని, వీటిలో ప్రతి ఒక్కదానిపై పట్టు సాధించాలని ఆయన చెప్పాడు. "మనస్సు, వాక్కు మరియు శరీరం నుండి చర్య పుడుతుంది."[1]

భావోద్వేగాలతో కూడిన మనస్సును (మనోమయకోశం) జయించాలి. ఇది అన్నిటికంటే కష్టతరమైన పని. ఎందుకంటే మనస్సు కోరికల వస్తువుల వెంబడి పరుగెత్తుతుంది, ఆనందాన్ని ఇచ్చే వస్తువులను సొంతం చేసుకోవాలనే కోరికతో ఊగిపోతుంది. ఆ కోరికలతో నియంత్రించబడుతుంది. భావోద్వేగాలు ఎప్పుడూ

సంతృప్తిని కోరుకుంటాయి మనస్సు వాటిని సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తూ, వాటి బానిసగా మారుతుంది. జీవాత్మ మనస్సును ఈ బానిసత్వం నుండి విముక్తం చేసి, తన సేవ కోసం దానిని లొంగదీసుకుని, దానిని ఇంద్రియాలకు యజమానిగా మార్చాలి: మనువు చెప్పినట్లుగా: "దీనిని (మనస్సును) జయిస్తే రెండు జతల సమూహాలు జయించబడతాయి.[2] "రెండు జతల సమూహాలు అనగా మొత్తం పది ఇంద్రియాలు, అంటే ఐదు జ్ఞానేంద్రియాలు మరియు ఐదు కర్మేంద్రియాలు. (మనస్సును జయిస్తే ఐదు జ్ఞానేంద్రియాలను- చర్మం, కన్ను, ముక్కు, చెవి, నాలుక. అలాగే ఐదు కర్మేంద్రియాలను - నోరు, చేయి, పాదం, మలద్వారం, జననేంద్రియములను జయించినట్లని వివరణ).

విద్యార్థి తన మనస్సును పాలించడాన్ని లక్ష్యంగా పెట్టుకోనివ్వండి; మనస్సు చెడు విషయాల వైపు మళ్లితే దానిని తిరిగి మంచి వైపు మరలనివ్వండి; మంచి విషయాలపై మాత్రమే మనస్సును సరిదిద్దుకోవడానికి అనుమతించాలి. ఇది స్వీయ నియంత్రణలో మొదటిఅంశం. ఇది అత్యంత కష్టతరమైనది మరియు అత్యంత ముఖ్యమైన భాగం.

ప్రసంగం యొక్క నియంత్రణ తదుపరి దశ; మనం మాట్లాడే ముందు ఆలోచించాలి. తొందరపాటు మాటలు మనల్ని అంతులేని కష్టాల్లోకి నడిపిస్తాయి. అర్జునుడు తన ప్రసంగంలో చాలా తొందరపాటుగా మాట్లాడేవాడు. అందుకే చాలా కష్టాల్లో పడ్డాడు; సూర్యాస్తమయానికి ముందు తన కుమారుడిని సంహరించిన జయద్రథుడిని చంపకపోతే తనను తాను చంపుకుంటానని హడావిడి ప్రతిజ్ఞ చేసాడు. జయద్రథుడిని తన ఆశ్రయం నుండి బయటకు వచ్చేలా చేయడానికి సూర్యుడిని కప్పి ఉంచటానికి శ్రీ కృష్ణుని జోక్యం అవసరమయింది.[3]

అలా మళ్లీ యుధిష్ఠిరునితో వాగ్వాదం జరిగినప్పుడు, యుధిష్ఠిరుని వెక్కిరిస్తూ మాట్లాడిన ఇతర సందర్భాల్లోను[4] రెచ్చిపోయి, హడావుడిగా చేసిన ప్రతిజ్ఞను పాటించడంలో అర్జునుని వైఫల్యం అతని మరణానికి దారితీసింది: "అర్జునుడు మన శత్రువులందరినీ ఒకే రోజులో నాశనం చేస్తానని చెప్పాడు. అతను తన పరాక్రమంలో గర్వపడ్డాడు, కానీ అతను ప్రగల్భాలు పలికినట్లుగా చేయలేదు. అందుకే అతను పడిపోయాడు."[5] తన నాలుకను జయించినవాడు స్వీయ-జయానికి దగ్గరగా ఉంటాడు.

మూడవదిగా, భౌతిక శరీరం నియంత్రించబడాలి మరియు దాని తృప్తి కోసం మనల్ని పాపంలోకి నెట్టడానికి అనుమతించకూడదు. శ్రీ కృష్ణుడు ఇలా అంటాడు: "శుచి, నిష్కాపట్యము, బ్రహ్మచర్యం, అహింసలను ఆచరిస్తూ పరమేశ్వరుడు, బ్రాహ్మణులు, ఆధ్యాత్మిక గురువు, జ్ఞానులు మరియు పెద్దలను ఆరాధిస్తే అది శారీరిక తపస్సు అని చెప్పబడును."[6] యవ్వనం అనేది శరీరాన్ని జయించే సమయం. ఎందుకంటే శరీరం యవ్వన కాలంలో చాలా సులభంగా అణచివేయబడుతుంది. సరైన మార్గంలో అమర్చబడుతుంది. ఎందుకంటే శరీరం మొదట్లో గొప్ప శక్తితో జీవాత్మ యొక్క సంకల్పాన్ని అలవాట్లను వ్యతిరేకిస్తుంది. కొంచెం పట్టుదలతో ప్రయత్నిస్తే శరీరం దారికి వస్తుంది. ఆపైన అది పాత రహదారిని విడిచి కొత్త రహదారి వెంట సంతృప్తిగా మరియు సులభంగా వెళుతుంది. (ఇంద్రియ నిగ్రహం యవ్వన కాలంలో శరీరాన్ని జయిస్తుందని సారాంశం).

ఈ ఆత్మనిగ్రహం ద్వారా మనం విముక్తి పొందవలసిన చెడు మరియు దుఃఖం యొక్క మూలాలలో స్వార్థపూరితమయిన కోరిక ఉంది. ఎందుకంటే భౌతిక సంపద మరియు భౌతిక ఆనందాల కోసం తృప్తి చెందని కోరిక నుండి అనేక బాధలు పెరుగుతాయి. ఈ కోరికలు లేకపోవడం వల్ల శాంతి పుడుతుంది. కోరికల నిరంతర సంతృప్తితో శాంతి కలుగదు. దీనికి ఉదాహరణగా ఉండే మంకీ అను బ్రాహ్మణుని కథను పరిశీలిద్దాం. అతడు డబ్బు బాగా సంపాదించాలనుకొని తన ఆస్తి లో మిగిలిన భాగంతో నాగలి పెట్టి పొలం దున్నడానికి రెండు కోడెదూడలను కొన్నాడు. ఆ రెండు దూడల మెడలకు ఒకే తాడు కట్టాడు. ఒకసారి ఆ దూడలు రెండూ కలిసి పరుగెత్తాయి. త్రోవలో పడుకొని ఉన్న పెద్ద ఒంటెమీదుగా ఒంటెకు ఆటు ఒకటి ఇటు ఒకటిగా దాటబోయాయి. ఆ దూడల అలజడికి ఆ ఒంటె కూడా పైకి లేచి పరుగెత్తటం మొదలు పెట్టింది. ఆ ఎత్తైన ఒంటెకు ఇరువైపులా ఉన్న ఈ కోడెల జంట వాటి మెడకున్న త్రాటితో ఒకేసారి పైకి లేచింది. ఒకే తాడు కావటం వల్ల వాటి మెడకున్న పలుపే ఉరిగా మారి ఆ కోడెలు రెండూ చచ్చి వ్రేలాడాయి.

ఈ ఆఖరి దుర్ఘటన మంకీ హృదయాన్ని తెరిచింది. తద్వారా అతనిలోని కోరిక అపరిమితంగా పారిపోయింది.

ఆ పశ్చాత్తాపం మంకీ పాటలో ఇలా ప్రతిధ్వనించింది :

"సంతోషాన్ని కోరుకునేవాడు కోరికను త్యజించాలి. శుకుడు చాలా గొప్పగా చెప్పాడు. తాను కోరుకున్నవన్నీ పొందేవాడు ఒకడు. ప్రతి కోరికను త్రోసిపుచ్చి,

అన్నింటినీ త్యజించేవాడు రెండవవాడు. ఖచ్చితంగా ఈ ఇద్దరిలో మొదటివాని కంటే రెండవవాడు చాలా గొప్పవాడు. ఎందుకంటే ఎవరూ అన్ని కోరికల ముగింపును సాధించలేరు.

ఇంతకాలం దురాశకు బానిసైన నా ఆత్మా! ఒక్కసారి స్వేచ్ఛ మరియు ప్రశాంతత యొక్క ఆనందాన్ని రుచి చూడు. నేను చాలా కాలం నిద్రపోయాను, కానీ నేను ఇకపై నిద్రపోను; నేను మేల్కొంటాను. ఓ కోరికా! ఇక నువ్వు నన్ను మోసం చేయకు. నీవు నా హృదయాన్ని ఏ వస్తువుపై స్థిరపరచావో, దానిని అనుసరించమని నన్ను బలవంతం చేసావు. నిర్లక్ష్యంగా, దానిని పొందడం సులభమా లేదా అసాధ్యమా అని విచారించడానికి నాకు ఎప్పుడూ విరామం ఇవ్వలేదు. నీవు తెలివి లేనివాడివి. నువ్వు మూర్ఖుడివి.

ఓ కోరికా! నువ్వు ఎప్పుడూ తృప్తి చెందకుండా, నిప్పులా కాల్చేస్తావు. ఎప్పుడూ మరింత కావాలని శోకిస్తుంటావు. నువ్వు ఎంత వేగంగా ఆత్రుతగా కోరుకొంటావో అలా వాటిని పూరించడం అసాధ్యం. నీకున్న ఒకే ఒక్క కోరిక నన్ను దుఃఖంలో ముంచెత్తడమే. ఈ రోజునుండి మనం విడిపోతున్నాము. ఓ కోరికా! ఈ రోజు నుండి, నేను ఇకపై నీ సహవాసంలో నివసించను. నేను నీ గురించి లేదా నీ శిక్షణ గురించి ఆలోచించను. నా హృదయం యొక్క అన్ని మోహాలతో నేను నిన్ను విడిచిపెట్టాను. ఇంతకు ముందు నిరాశతో వేధించబడిన నేను నిన్ను విడిచిపెట్టిన తరువాత ఇప్పుడు సంపూర్ణ మనశ్శాంతిని పొందాను. హృదయం యొక్క పూర్తి సంతృప్తితో, ఇంద్రియాలు చాలా తేలికగా ఉంటాయి, నేను ఇక నుండి నాకు వచ్చిన దానితో జీవిస్తాను. నా శత్రువయిన కోరికా! నీ మనోభావాల సంతృప్తి కోసం ఇకపై శ్రమపడను. నిన్ను మరియు నీ శిక్షణ మొత్తాన్ని త్రోసివేయడం వలన, నేను ప్రశాంతత మరియు స్వీయనిగ్రహం , మన్నింపు గుణం కరుణ మరియు విముక్తిని ఒకేసారి పొందుతున్నాను." ఆ విధంగా ప్రార్థించిన మంకీ కొద్దిగా కోల్పోయాడు. అన్నింటిని పొందాడు.[7]

ఇదే సందర్భంలో క్రూరమైన కోరికతో వెర్రితలలు వేసిన యయాతి రాజు కథను కూడా తెలుసుకోవాలి. తన స్వంత కొడుకు నుండి తన అందమైన అద్భుతమైన యవ్వనాన్ని పొంది, తృప్తి చెందని కోరికను తృప్తిపరచడానికి ప్రయత్నిస్తాడు. అందుకే కథ ఇలా నడుస్తుంది.

చంద్ర వంశ రాజులకు చెందిన నహుషుని కుమారుడు యయాతి. అతడు ఇంద్రియ భోగములను అతిగా ఇష్టపడి పాపంలో పడ్డాడు. అతిగా ఉన్న యయాతి భోగవాంఛ అతని మామ , గొప్ప ఋషి, రాక్షసగురువయిన శుక్రునివలన శాపాన్ని పొందించేటట్లు చేసింది. శుక్రుని శాపం కారణంగా, యయాతి రాజు అకస్మాత్తుగా తన అద్భుతమైన యవ్వనాన్ని కోల్పోయాడు. కుంగిపోయే వణికే వృద్ధాప్యం పాలబడ్డాడు. వృద్ధాప్య శాపంతో భయపడిన యయాతి శుక్రుని శరణు వేడుకున్నాడు. శుక్రుడు అతనిపై జాలిపడ్డాడు. వేయి సంవత్సరాల పాటు యయాతి తన ముసలితనాన్ని తన కుమారులలో ఎవరికైనా ఇచ్చి ఆరోగ్యం మరియు యవ్వనాన్ని పొందవచ్చని శుక్రుడు శాపం సడలించాడు. అయితే కుమారులు వయస్సు మార్పిడికి ఇష్టపూర్వకంగా అంగీకరించాలని నియమం పెట్టాడు. యయాతి తన ఐదుగురు కుమారులను వరుసగా అడిగాడు; ఐదవ మరియు చిన్నకుమారుడయిన పురు అనేవాడు తండ్రిపై ఉన్న ప్రేమ మరియు గౌరవం కోసం, తన స్వంత యవ్వనాన్ని తండ్రికి ఇచ్చాడు. తండ్రి అయిన యయాతికి శాపం కారణంగా వచ్చిన ముసలి వయస్సును వేయి సంవత్సరాల పాటు గ్రహించాడు.

ఆ తరువాత చాలా కాలం పాటు, యయాతి మహారాజు ఇంద్రియాలకు సంబంధించిన ఆనందాలను వెంట పరిగెత్తుతూ, భౌతిక ప్రపంచంలోని భోగవిలాసాలన్నీ అనుభవించాలని తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ ఇంద్రియాలలో చురుకుతనం తగ్గినప్పుడు కూడా కోరిక మాత్రం పెరుగుతుందని అతను కనుగొన్నాడు. ఇంద్రియాలకు పరిపూర్ణ తృప్తి ఇవ్వాలని అతను వృధాగా ఆశపడ్డాడు.

బండి చక్రంలాంటిది కోరిక . చక్రం కింద ఉన్న అంచు పైకి వెళుతుంది. పైన ఉన్న అంచు కిందికి వస్తుంది. చక్రంలా కోరికకు ఒక చివర లేదు. ఆ కోరికల భ్రమణం అంతులేనిదని యయాతి గ్రహించాడు. చివరగా, వేయిసంవత్సరాలు ముగుస్తున్న సమయంలో, అతని మనస్సులో గొప్ప వైరాగ్యం కలిగింది. కోరిక సంతృప్తితో కాకుండా నిస్పృహతో మాత్రమే ఆగిపోతుందని అతను గ్రహించాడు. అతను తన కుమారుని పూరుని తన వద్దకు పిలిచి, తన వృద్ధాప్యాన్ని ఆనందంతో అతని వద్ద తిరిగి పొందాడు. పూరునికి రాజ్యంతో పాటు తన యవ్వనాన్ని తిరిగి యయాతి అందించాడు. తన జీవితానుభవాన్ని క్లుప్తీకరించే పద్యం చదువుతూ అడవులకు వెళ్ళాడు:

"కోరిక దాని వస్తువులను ఆస్వాదించడం ద్వారా చల్లారదు; అగ్నిలో పోసిన నెయ్యిలాగా దానితో అనేక రెట్లు పెరుగుతుంది."[8]

శ్రీ కృష్ణుడు చెప్పిన మాటలలో , "అహింస" అనే పదము దగ్గర ఒక్క క్షణం ఆగుదాం. "అహింసయే అత్యున్నత ధర్మం" అని భీష్ముడు బోధించాడు. మనం మానసికంగా, శారీరకంగా ఎవరినీ గాయపరచకూడదు.

మన జీవితం ఇతరుల సహాయానికి మూలంగా ఉండాలి. ఎవరికీ హాని కలిగించకూడదు. శరీరం యొక్క నియంత్రణలో ఇతరులను గాయపరచకుండా ఉండటం కూడా ఒక భాగం. బృహస్పతి చెప్పినట్లుగా: " విశ్వజనీనమైన కరుణను ఆచరించే వ్యక్తి అత్యున్నతమైన మంచిని సాధిస్తాడు.... ఒక వ్యక్తి తనకు హాని కలిగించే పనిని మరొకరికి ఎప్పుడూ చేయకూడదు."[9] ఇది క్లుప్తంగా, ధర్మ నియమం.

ప్రజలు తరచుగా ఆలోచనా రహితంగా ఇతరులకు హాని కలిగిస్తారు. చాలా ఇబ్బందులకు గురవుతారు. యుధిష్ఠిరుడు (యుధి తిష్ఠతి యుద్ధంలో ఉండువాడు కనుక ధర్మరాజునకు యుధిష్ఠిరుడనిపేరు) దుర్యోధనుడు(దుఃఖేన యుధ్యతే అసౌ వీనితో పోట్లాడుట కష్టముకనుక దుర్యోధనుడనిపేరు), వారి సోదరులు బాల్యంలో అందరూ కలిసి జీవించేవారు. కలిసి చదువుకున్నారు. వారందరిలో బలవంతుడైన భీముడు తరచుగా ఇతరులతో ఎగతాళి మాటలు మాట్లాడుతుండేవాడు. మోటు సరసాలు ఆడుతుండే వాడు. తనకంటె చిన్నతనంలో ఉన్నవారిపై మరియు బలహీనమైన సోదరులపై ఆలోచనా రహితంగా తన గొప్ప బలాన్ని ప్రయోగించేవాడు. ఒకసారి పండ్లను కోయడానికి సోదరులలో చాలామంది చెట్టుపైకి ఎక్కినప్పుడు, అతను తన చేతులతో చెట్టుబోదెను ఊపాడు. పండిన పండ్లలా చెట్టుపై ఉన్న సోదరులు కింద పడిపోయే వరకు చెట్టును కదిలించాడు.

భీముడు ఇదొక గొప్ప సరదా అనుకొని నవ్వాడు; కానీ కిందపడ్డ వారిలో కొంతమంది శారీరకంగా గాయపడ్డారు. అంతకంటే అధ్వాన్నంగా మనస్సులో గాయపడ్డారు. ఇంకోసారి వారు హస్తినాపురపు గోడల క్రింద ప్రవహించే నదిలో స్నానం చేసి, ఈత కొడుతున్నప్పుడు, భీముడు సోదరులతో కలిసి ఈత కొట్టాడు. ఆ సమయంలో వారిలో చాలా మందిని పట్టుకుని, వారిని నీటి అడుగుకు ముంచి గట్టిగా పట్టుకొనేవాడు. సోదరులు మునిగిపోయి విపరీతంగా బాధపడేవారు. అయితే భీముని ఊపిరితిత్తుల సామర్థ్యం మునిగే బాధల నుండి సమర్ధవంతంగా అతనికి

సహాయపడేది. (అనగా ఊపిరితిత్తుల సామర్థ్యం వలన ఇతర సోదరులవలె మునిగినా బాధపడేవాడు కాదని భావం)

భీముడు ఈ విషయంలో సంతోషించాడు, కానీ ఇతరులు బాధపడ్డారు. పర్యవసానమేంటి? వికర్షణ (ఓటమి) మరియు అయిష్టత యొక్క మండుతున్న అగ్ని. అది తరువాత ద్వేషం యొక్క మండుతున్న అగ్నిగా పెరిగింది. అది కౌరవ పాండవులను ఒకేలా దహించింది. భీముని యొక్క బాల్యములో ఆలోచనా రాహిత్యం మహాయుద్ధానికి ప్రధాన కారణాలలో ఒకటి. మండే పదార్థాలు ఉంటే తప్ప, అగ్నికణము (స్పార్క్) ఇంధనాన్ని మండించదు అనేది నిజం. కణజాలం కలుషితమైతే తప్ప, సూక్ష్మజీవి వ్యాధిని అభివృద్ధి చేయదు. ఇప్పటికీ వీలైనంతవరకు అటువంటి విధ్వంసక అగ్నికణము నుండి, అటువంటి మరణాన్ని తెచ్చే సూక్ష్మజీవి నుండి, మనలను మనం కాపాడుకోవడం మన కర్తవ్యం. ప్రతీకారం తీర్చుకోలేని బలహీనులను ఆలోచనా రహితంగా బాధపెడితే, వారిలో పుట్టే కోపం, ద్వేషం ధిక్కారంగా రూపాంతరం చెందుతుంది.

ఇతరులను అణచివేస్తుంటే దానిని చూస్తూ తన రహస్య మనస్సుతో ఆ పీడించే వారి వైపు మొగ్గు చూపే వ్యక్తి యొక్క బాహ్య దృష్టికి, అలాంటి అణచివేత చర్యలు దోషరహితంగా లేదా అద్భుతంగా కనిపిస్తాయి. కానీ నిజమైన శౌర్యం కలవారి కంటికి ఆ పీడించే వారు ఎప్పుడూ నీచత్వం మరియు దౌర్జన్యం యొక్క నిజమైన పాత్రలలో కనిపిస్తారు.

మరియు గొప్ప చరిత్రను జాగ్రత్తగా అధ్యయనం చేసే వ్యక్తికి, పాండవులందరినీ ప్రశంసించాల్సిన అవసరం లేదని, అలాగే కౌరవులందరినీ నిందించవలసిన అవసరం లేదని బాగా తెలుసు.

మనస్సు, మాట మరియు శరీరం అను మూడింటి యొక్క నియంత్రణ ధర్మానికి దారితీస్తుంది. సరైన ప్రవర్తన సరైన మార్గదర్శకత్వంలో ఈ ధర్మం వ్యక్తమవుతుంది. పాశ్చాత్యుల నైతిక సంబంధమయిన పుస్తకాల ప్రకారం "స్వీయసంబంధమైనవి" లేదా "తనకు సంబంధించినవి"గా వర్గీకరించబడిన సద్గుణాలను పాక్షికంగా (అసంపూర్ణంగా) సంపాదించిన వ్యక్తి– తన భావోద్వేగాలను, మనస్సును మరియు శరీరాన్ని తనకు దగ్గరగా ఉన్న విషయాలకు అనుగుణంగా స్పందింపచేసి వాటితో సరైన సంబంధాలను ఏర్పరచుకున్నాడు. అందులో "పరోపకారం" ఒకటి. ఇతర

జీవులకు సంబంధించి ఉపకారం కలిగించేవాటిని ప్రభావవంతంగా ఆచరించడమే పరోపకారం.

మనం ఇప్పుడు మానవుల మధ్య సంబంధాలలో ఉత్పన్నమయ్యే సుగుణాలు మరియు దుర్గుణాలను అధ్యయనం చేయవలసి ఉన్నది. ఇవి మూడు శీర్షికల క్రింద ఉత్తమంగా వర్గీకరించబడ్డాయి:

1. ఉన్నత వ్యక్తులతో సంబంధించి కలిగే సుగుణాలు మరియు దుర్గుణాలు.
2. సమానులకు సంబంధించి కలిగే సుగుణాలు మరియు దుర్గుణాలు.
3. అధములకు సంబంధించి కలిగే సుగుణాలు మరియు దుర్గుణాలు.

ఈ విధంగా, మన చుట్టూ ఉన్న వారితో మన సంబంధాలను సామరస్యంగా చేసే సద్గుణాల యొక్క స్పష్టమైన మరియు సరళమైన వర్గీకరణను మనం పొందాము. వీటిని స్పష్టంగా చూడటం ద్వారా వాటిని సాధించడానికి మనం కృషి చేయవలసి ఉన్నది.

అసమానతను కలిగించే దుర్గుణాలను కూడా మనం స్పష్టంగా చూస్తాము. వాటిని నివారించడానికి మనం ప్రయత్నించాలి. అన్ని సద్గుణాలు స్వచ్ఛమైన ప్రేమ మూలాన్ని కలిగి ఉన్నాయి, మరియు ఆనందాన్ని ఫలంగా కలిగి ఉంటాయి; అన్ని దుర్గుణాలు వ్యక్తిగత ద్వేషంలో ఉంటాయి. వాటి ఫలం దుఃఖం.

h h h

శుభాశుభఫలం కర్మ మనోవాగ్దేహసంభవమ్
కర్మజా గతయో నణాముత్తమాధమమధ్యమాః.
మానసం మన సైవాయముపభుజే శుభాశుభమ్
వాచా వాచాకృతం కర్మ కాయేనైవ చ కాయికమ్.
వాగ్దణ్డోఽథ మనోదండ: కాయదండ స్తథైవ చ,
యస్యైతే నిహితా బుద్ధి త్రిదండీతి స ఉచ్యతే.
త్రిదండమేతన్నిక్షిప్య సర్వభూతేషు మానవః,
కామక్రోధౌ తు సంయమ్య తతస్సిద్ధిం నిగచ్ఛతి॥[10]

మనస్సు, వాక్కు దేహం ఈ మూడు చేసే కర్మ శుభాశుభఫలములను కలిగిస్తోంది.. ఈ కర్మవల్లనే జీవులకు ఉత్తమ, మధ్యమ అధమ జన్మలు ఏర్పడుతున్నాయి.

ఉత్తమకర్మముచేత దేవత్వము, మధ్యమకర్మముచే మనుష్యమును, అధమకర్మముచేత పశుపక్ష్యాది జన్మమును కలుగుతాయి.

జీవుడు తన మనస్సు చేత చేసే శుభాశుభకర్మము, సుఖదుఃఖరూపమగు ఫలితాలను తన మనస్సుచేత అనుభవించును. అలాగే తన వాక్కుతో చేసే శుభాశభకర పుణ్యాపాపఫలాలను – వాక్కు చేత మధురమయిన అవ్యక్త అవ్యక్త శబ్దములు మాటలచేత జీవుడు అనుభవించును. తన శరీరముతో చేసిన శుభాశుభకరమైన చర్యలు తత్ఫలితములగు సుఖదుఃఖాలను శరీరము చేతనే–పూవుల దండలు ధరించుట మొదలగు వాని చేత, వ్యాధి బాధల చేత అమభవించును.

మూడు విధాలైన దోషాలు పొందకుండ చెడు మాటలు పలుకకున్నందువలన వాగ్దండాన్ని, చెడు ఆలోచనలు లేక మనోదండాన్ని, చెడ్డపనులు చేయక కాయదండాన్ని కలిగి ఉంటే అతనిని త్రిదండి అని అనవచ్చును.

ఈ విధంగా వాగ్దండము (చెడు మాటలు పలుకకుండుట) మొదలగునవి సర్వభూతాలకు సంబంధపడినవి కనుక, ఈ వాగ్దండ, మనోదండ, కాయదండములను అణచివేసి, వీనికి కారణమయిన కామక్రోధములను విడిచిపెట్టిన పిదప, చివరకు మోక్షప్రాప్తి అను సిద్ధిని మనుష్యుడు పొందుచున్నాడు.[10]

దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ ।
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥
అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥
మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।
భావసంశుద్ధిరిత్యేతత్ తపో మానసముచ్యతే ॥

శుచి, నిష్కాపట్యము, బ్రహ్మచర్యం, అహింసలను ఆచరిస్తూ పరమేశ్వరుడు, బ్రాహ్మణులు, ఆధ్యాత్మిక గురువులు, జ్ఞానులు మరియు పెద్దల ఆరాధనను చేస్తే – అది శారీరిక తపస్సు అని చెబుతారు.

ఉద్వేగమును కలిగించనివి, సత్యములయినవి , కోపము పుట్టించనివి, ప్రయోజనకరమైనవి అగు మాటలు మరియు నిత్య వేద శాస్త్రముల పఠనము – ఇవి వాక్కుకు సంబంధించిన తపస్సు అని చెప్పబడుతున్నది.

ఆలోచనలో ప్రశాంతత, మృదుత్వము, మౌనము, ఆత్మనిగ్రహము మరియు ఉద్దేశ్యములలో పవిత్రత – ఇవన్నీ మనస్సు యొక్క తపస్సు అని చెప్పబడ్డాయి.

న జాతు కామః కామానాం ఉపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణ–వర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥[12]

"ఎలాగైతే నేతిని వేయటం వల్ల, అగ్ని ఆరిపోకపోవటమే కాక, ఇంకా ఎక్కువ ఎగసి పడుతుందో, అలా ఇంద్రియ వాంఛలను తీర్చటం ద్వారా ఆ కోరికలు చల్లారిపోవు."

(ఇంద్రియములు కోరుకునే భోగ వస్తు, విషయములను పదే పదే ప్రయత్నించటం ఎలాంటిదంటే నేతిని పోసి మంటను ఆపటానికి ప్రయత్నించటము వంటిది. నేతిని పోసిన తరువాత క్షణకాలం నిప్పు కొద్దిగా తగ్గినట్టు అనిపిస్తుంది. కాని రెండింతల వేగంతో మంట మళ్ళీ పైకి లేస్తుంది. కనుక కోరికలు అనేవి నెరవేరిన కొద్దీ , మరింత ప్రబలంగా పుడుతుంటాయి.)

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥
యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరం ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్॥[13]

శ్రీ కృష్ణ పరమాత్మ అన్నాడు: ఓ మహా బాహువులుకల కుంతీ పుత్రుడా! నీవు చెప్పింది నిజమే; మనస్సు అనేది నిగ్రహించటానికి నిజముగా చాలా కష్టమైనది. కానీ, అభ్యాసము మరియు వైరాగ్యములచే ఆ మనస్సును నిగ్రహించవచ్చు.

ఎప్పుడెప్పుడైతే ఎక్కడెక్కడికైతే ఈ చంచలమైన నిలకడ లేని మనస్సు తిరుగుతుంటుందో, దానిని తిరిగి స్వాధీనంలోనికి తెచ్చుకొని నిరంతరం భగవంతుని మీదనే కేంద్రీకరించాలి.

అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।
మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి॥[14]

నన్ను భక్తితో స్మరించే అభ్యాసం నువ్వు చేయలేకపోతే నాకోసమే పనులు చేయటానికి ప్రయత్నం చేయవలసినది. ఈ విధంగా భక్తితో కూడిన సేవ చేయటం వలన నువ్వు పరిపూర్ణ స్థాయికి చేరుకొంటావు.

నిత్యో- నిత్యానాం చేతనశ్చేతనానా
మేకో బహూనాం యో విదధాతి కామాన్
తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా
స్తేషాం శాంతిః శాశ్వతీ నేతరేషామ్॥[15]

"ఏది శాశ్వతమైనదో, అదే సర్వజీవులకు ప్రాణం. అది ఒక్కటే అనేకులకు చైతన్యాన్ని కలిగిస్తుంది - ఆత్మస్థితుడై ఉన్న శాశ్వతమై ఉన్న ఆ దైవాన్ని ఏ ధీరులు దర్శిస్తారో వారికి మాత్రమే అఖండానందం లభిస్తోంది. ఇంకెవరికీ లభించదు."

గోత్రజః సహజశత్రురిత్యసౌ
నీతిరస్తు ధనలోభదుర్ధియామ్ ।
వృద్ధతుల్యలఘుపుంవృతం జగద-
ధీధనస్య పితృమిత్రపుత్రవత్॥[16]

ఐశ్వర్యం యొక్క దురాశతో మనస్సుకు గ్రుడ్డితనం వచ్చినవారికి ప్రతి బంధువు పుట్టుకతో వచ్చిన శత్రువులా అనిపిస్తాడు. కానీ జ్ఞానసంపద కలవానికి ఈ ప్రపంచంలోని పెద్దవారంతా తల్లిదండ్రులుగా, సమానులు స్నేహితులుగా తనకంటె చిన్నవారు పిల్లలులా అనిపిస్తారు.

అవిజిత్య య ఆత్మాన మమాత్యాన్ విజిగీషతే ।
అమిత్రాన్ వాఽజితామాత్యః సోఽవశః పరిహీయతే ॥
ఆత్మాన మేవ ప్రథమం ద్వేష్యరూపేణ యోజయేత్ ।
తతోఽమాత్యా సమిత్రాంశ్చ న మోఘం విజిగీషతే॥[17]

"తనను తాను జయించకుండా అనగా తన మనస్సును గెలువకుండా తన మంత్రులను జయించాలని కోరుకునేవాడు, లేదా తన మంత్రులను జయించకుండా, తన శత్రువులను జయించాలని కోరుకునేవాడు, పట్టు తప్పి భ్రష్టుడవుతాడు.

"అయితే తన స్వంత శత్రువుగా మొదట తనను తాను జయించుకొని, ఆ తర్వాత తన మంత్రులను మరియు తన శత్రువులను జయించినవాని ప్రయత్నం వ్యర్థం కాదు." (మొట్టమొదట తన మనస్సే ద్వేషింపదగినదిగా భావింపవలయును. అటుపై తనవారిని, పగవారిని గెలువగోరినచో అది వ్యర్థము కాదు. మనస్సుపై అధికారము పొందినవాడే తక్కినవారిని గెలువగలడని భావము).

ధర్మస్య విధయో నైకే తేతే ప్రోక్తా మహర్షిభిః ।
స్వంస్వం విజ్ఞానమాశ్రిత్య దమస్తేషాం పరాయణం ॥12-158-6

మహర్షులు వారివారి జ్ఞానము ననుసరించి ధర్మమునకు అనేక విధులను చెప్పారు. కాని వాని అన్నిటికి దమమే (ఇంద్రియ నిగ్రహమే) ఆధారముగా ఉన్నది.

దమం నిఃశ్రేయసం ప్రాహుర్వృద్ధా నిశ్చితదర్శినః ।
బ్రాహ్మణస్య విశేషేణ దమో ధర్మః సనాతనః ।
అదాంతః పురుషః క్లేశమభీక్ష్ణం ప్రతిపద్యతే ।
అనర్థాంశ్చ బహూనన్యాన్ ప్రసృజత్యాత్మదోషజాన్ ।
ఆశ్రమేషు చతుర్ష్వాహుర్దమమేవోత్తమం వ్రతం ।
తస్య లింగాని వక్ష్యామి యేషాం సముదయో దమః ।
క్షమా ధృతిరహింసా చ సమతా సత్యమార్జవం ।
ఇంద్రియాభిజయో దాక్ష్యం మార్దవం హ్రీరచాపలం ।
అకార్పణ్యమసంరంభః సంతోషః ప్రియవాదితా ।
అవిహింసాఽనసూయా చాప్యేషాం సముదయో దమః॥[18]

"పెద్దలు, నిశ్చయ దార్శనికులు, (సందేహములు లేని దర్శనములుగల జ్ఞానవృద్ధులు) దమము అనునది అత్యున్నతమైన స్థితికి దారితీస్తుందని, ప్రత్యేకించి బ్రాహ్మణునికి ఇంద్రియ నిగ్రహము (సంపూర్ణముగా) సనాతన ధర్మమని ప్రకటించారు.

"స్వీయ నియంత్రణ (ఇంద్రియనిగ్రహం) లేని మనిషి ప్రతిచోటా బాధలను ఎదుర్కొంటాడు; మరియు అతను తన స్వంత లోపాల వల్ల ఉత్పన్నమయ్యే అనేక ఇబ్బందులను కలిగి పొందుతాడు.

"నాలుగు ఆశ్రమాలలోను దమమే అత్యున్నతమైన వ్రతము. దమమునకు మూలమైన వాటి లక్షణాలను నేను మీకు తెలియజేస్తాను :

క్షమ, ధీరత్వము, అహింస, సమత్వము, సత్యవాదిత్వము, సరళత్వము, ఇంద్రియ విజయము, దక్షత్వము, కోమలత్వము, లజ్జ, స్థిరత్వము, ఉదారత్వము, క్రోధరాహిత్యము, సంతృప్తి, ప్రియ వచనములను మాట్లాడు స్వభావము, ఏ ప్రాణికిని కష్టము కలుగజేయకుండుట, ఇతరుల దోషములను చూడకుండుట ఈ సద్గుణముల సముదాయమే దమమని చెప్పబడును.

ధృతిః క్షమా దమోఽస్తేయం, శౌచమింద్రియ నిగ్రహః ।
హ్రీర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మ లక్షణమ్ ॥[19]

"1. ధృతి (దుఃఖ సమయంలో క్రుంగిపోకుండా ఉండటం) 2. ఓర్పు –3. దమం (తపస్సు వల్లనో, సాధనలో మరేదైనా పద్ధతి వల్లనో కలిగే క్లేశాన్ని సహించడం). 4. అస్తేయం (ఇతరుల సొమ్ముకు ఎట్టి పరిస్థితులలోనూ ఆశపడకపోవడం. దొంగిలించక పోవడమే కాదు అలాంటి ఆలోచనలను మనస్సులోకి రానివ్వక పోవడం.) 5. శౌచం (శుచి శబ్దం నుంచి వచ్చిన పదం. స్వధర్మానుష్ఠానం, వైదిక కర్మకు యోగ్యత కలిగించే ఒక సంస్కారం మొదలైన అర్థాలను సంతరించుకొన్న శబ్దం) బాహ్య శౌచమనీ, అంతర శౌచమనీ ఇది రెండు విధాలు.) 6. ఇంద్రియ నిగ్రహం. 7. సిగ్గు, 8. విద్య, 9. సత్యం, 10. కోపం లేకపోవడం", ఈ పది ధర్మము యొక్క లక్షణాలని శాస్త్రం చెబుతోంది.

అహింసా సత్యమస్తేయం శౌచమింద్రియనిగ్రహః ।
ఏతం సామాసికం ధర్మం చాతుర్వర్ణ్యేఽ బ్రవీన్మనుః॥[20]

అహింసను ఆచరించుట, సత్యంపలుకుట, దొంగతనం చేయకుండుట, శుచిగా ఉండుట, ఇంద్రియాలను నిగ్రహించుకొనుట అనేవి అన్నికులాలవారికి ఉండవలసిన ధర్మాలు.

సత్యమస్తేయమక్రోధో హ్రీః శౌచం ధీధృతిర్దమః ।
సంయతేన్ద్రియతా విద్యా ధర్మః సర్వ ఉదహృతః॥[21]

"సత్యం, అస్తేయం (ఇతరుల సొమ్ముకు ఎట్టి పరిస్థితుల లోనూ ఆశపడకపోవడం. దొంగిలించక పోవడమే కాదు అలాంటి ఆలోచనలను మనస్సులోకి రానివ్వక పోవడం.) కోపం లేకపోవడం, సిగ్గు, శౌచం (శుచి శబ్దం నుంచి వచ్చిన పదం. స్వధర్మానుష్ఠానం, వైదికకర్మకు యోగ్యత కలిగించే ఒక సంస్కారం మొదలైన అర్థాలను సంతరించుకొన్న శబ్దం) ధీగుణం (దీనితో చింతన చేయుదురు. బుద్ధి; జ్ఞానము ధృతి (దుఃఖ సమయంలో క్రుంగిపోకుండా ఉండటం), దమం (తపస్సు వల్లనో, సాధనలో మరేదైనా పద్ధతి వల్లనో కలిగే క్లేశాన్ని సహించడం), ఇంద్రియ నిగ్రహం, వీటిని అలవర్చుకోవడం మొత్తం ధర్మంగా ప్రకటించబడింది."

సూచికలు

1. loc. cit. 09– పేజీ నంబర్‌తో సహా అన్ని వివరాలు ఒకే విధంగా ఉన్నప్పుడు, ఇప్పటికే సూచించబడిన పుస్తకం లేదా కథనం యొక్క వివరాలను పునరావృతం చేయకుండా ఉండటానికి రచయితలు ఉపయోగించే పదం loc. cit. ఈ పదము అధోసూచికలో మూలంలో వాడబడినది. (166) 11–13

2. loc. cit. 02–92

3. మహాభారతం ద్రోణ పర్వం

4. పై పుస్తకం కర్ణపర్వం 70 –ixx

5 మహాప్రస్థానిక పర్వం

6. భగవద్గీత 17–14

7. మహాభారతం శాంతిపర్వం 178

8. మహాభారతం అనుశాసన పర్వం 116- 37

9. పై పుస్తకంలో 113.

10. మనుస్మృతి xii 3, 4, 8, 10, 11

11. భగవద్గీత xvii 14, 15, 16

12. మహాభారతం అనుశాసన పర్వం cxvi 37

13. భగవద్గీత, 06–35, 26.

14. పై పుస్తకంలోనే xii- 10

15. కఠోపనిషత్ – v- 13.

16. మహాభారతం ఉద్యోగ పర్వం ii 17

17. పై పుస్తకంలోనే cxxviii, 29 –30

18. మహాభారతం శాంతి పర్వం 158–6, 7, 13,14,15,16

19. మనుస్మృతి 06–91

20. పై పుస్తకంలోనే 10–63

21. యాజ్ఞవల్క్యస్మృతి iii – 66.

అధ్యాయం 8

మన కంటె పెద్దలకు సంబంధించి మనం పెంచుకొనవలసిన సద్గుణాలు, విడువవలసిన దుర్గుణాలు

ఇతరుల కోసం త్యాగాలు చేయడానికి మరియు సర్వ సాధారణమయిన మంచి కోసం మనల్ని మనం నిగ్రహించుకోవడానికి నిస్వార్థమైన ప్రేమ ప్రేరేపిస్తుంది; కాబట్టి అలాంటి ప్రేమ సద్గుణాలను, ఐక్యతను ప్రోత్సహించే లక్షణాలకు మూలం. అయితే ద్వేషగుణం ఇతరుల నుండి అన్నీ తీసుకోమని, ఇతరులకు హాని కలిగించేలా మన ప్రత్యేక ఆనందం కోసం కావాలసిన అన్ని విషయాలను గ్రహించమని ప్రేరేపిస్తుంది; అందువల్ల ద్వేషం అనేది దుర్గుణాలకు, వేర్పాటును ప్రోత్సహించే లక్షణాలకు మూలమని గ్రహించాలి.

అంతేకాదు, మనం ప్రేమించే వ్యక్తి కోసం త్యాగం చేసినప్పుడు, అలా చేయడంలో మనకు ఆనందం కలుగుతుంది. తద్వారా జీవాత్మ యొక్క లోతైన ఆనందం, నిజమైన ఆనందం ఇవ్వడంలో ఉందని, శరీరాలకు ఆనందం కల్గించే విషయాలను గ్రహించడంలో లేదని గ్రహించాలి.

ఇప్పుడు తాను గౌరవించి , అభిమానించే శ్రేష్ఠులైన పెద్దలకు సంబంధించి – ప్రేమ మనిషిని ఎలా ప్రేరేపిస్తుందో చూద్దాం –

మనిషికి సంబంధించి ఉన్నతులు వీరు– ఉన్నతాధికారులు: దేవుడు, శ్రేష్ఠుడు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు వృద్ధులు.

మానవుడు భగవంతుని పట్ల చూపించే ప్రేమ గౌరవాన్ని, భక్తిని, ఆరాధనని, సమర్పణను నిరూపిస్తుంది. భగవంతుని భక్తులందరూ ఈ సద్గుణాలను కనబరుస్తారని మనం గుర్తించాము. భీష్ముడు విష్ణువు యొక్క అవతారమయిన శ్రీ కృష్ణుని ఎలా ఆరాధిస్తాడో చూడండి: యుధిష్ఠిరుడు(యుధి తిష్ఠతి యుద్ధంలో ఉండువాడు కనుక ధర్మరాజునకు యుధిష్ఠిరుడనిపేరు) రాజసూయయాగంలో (ఒకరాజు తక్కిన రాజులను జయించి చేసెడి యజ్ఞము) కృష్ణునికి మొదటి అర్ఘ్యాన్ని(పూజకొరకైన జలములు.) అందించమని భీష్ముని కోరాడు. అప్పుడు నారదుడు ఇలా ప్రకటించాడు, “విశ్వంలో అత్యంత ప్రాచీనుడైన కృష్ణునికి సమర్పించే పూజను ఆమోదించనివాడు, మృదువైన

మాటలకు లేదా శ్రద్ధకు అర్హుడు కాదు.పద్మముల వంటి కన్నులు కలిగిన కృష్ణుని పూజించని వారు జీవచ్ఛవాలుగా(బ్రతికియుండు శవములుగా) పరిగణించబడాలి. "[1]అలాగే, తాను మరణిస్తున్నప్పుడు, "కృష్ణుని మనస్సు, మాట మరియు చర్య"లను ఆలోచిస్తూ, అతని ఆశీర్వాదం పొందాలనేది భీష్ముని యొక్క ఒక ఆలోచన;[2] భీష్ముని కోరిక ఫలించి వాసుదేవుని యొక్క వేయి నామాలను (విష్ణు సహస్రనామాలను) చదువుతూ లోకానికి ఒక గొప్ప ఉపదేశాన్ని అతడు అనుగ్రహించాడు. లోకంలో అందరికి వీడ్కోలు పలకడానికి ముందు,(చనిపోవటానికి ముందు) భీష్ముడు శ్రీ కృష్ణుని అనుమతి కోసం ప్రార్థించాడు. ఈ అనుమతి కోరే మాటలే భీష్ముని చివరి మాటలు.[3]

రాక్షసరాజు హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదునిలో, భక్తికి సంబంధించిన అత్యంత ప్రసిద్ధ ఉదాహరణ ఒకటి మనకు లభిస్తుంది. ప్రహ్లాదుని గురువులు చెప్పగలిగినదంతా చెప్పినప్పటికీ, అతను స్థిరంగా హరిని ప్రార్థించాడు. స్తుతించాడు. ప్రహ్లాదుని తండ్రి అతనిని బెదిరించి చంపడానికి ప్రయత్నించాడు; కానీ ప్రహ్లాదుని అచంచల భక్తి వలన అతనిని తొక్కాల్సిన అడవి ఏనుగు అతనిని గాయపరచడంలో విఫలమైంది; అతనిని నలిపివేయవలసిన రాళ్ళు అతని వక్షస్థలం మీద తేలికయ్యాయి;

అతని నరకవలసిన కత్తి అతని మెడపైన మొద్దుబారిపోయింది; (పదునులేనిదయింది). అతని నరములలో మరణాన్ని ప్రవహింపచేయవలసిన విషం ప్రమాదకరం కాని నీటిలా మారింది; చివరగా స్తంభం పగిలిపోయి దానినుండి నరసింహ అవతారం వెలువడి హరి సేవకుని చంపాలని ప్రయత్నించిన నిరంకుశుని వధించింది.[4]

ధ్రువుడు ఉత్తానపాదునికి సునీతియందు పుట్టిన కొడుకు. ఒకనాడు ఉత్తానపాదుడు సింహాసనముమీద కూర్చుండి తన రెండవభార్య అగు సురుచియొక్క బిడ్డను తొడమీద కూర్చుండ బెట్టుకొన్నాడు. అది ధ్రువుడు చూచి బాల్యచాపల్యముచేత తానును తండ్రితొడ ఎక్కాలనుకొన్నాడు. అతని సవతి తల్లి సురుచి ఆధ్రువుని అభిప్రాయము ఎఱిగి కడు అహంకారముతో "తండ్రితొడ ఎక్కవలెనను అపేక్ష ఉంటే నీవు ఎందుకు సునీతి కడుపులో పుట్టావు?" అని అవమానించింది. ఆమాట ధ్రువుడు విని తన హృదయమునకు అది బాణమువలె నాటగా ఆవృత్తాంతము తల్లికి చెప్పి ఆమె ఆజ్ఞపొంది నారద మహర్షి యొక్క ఉపదేశముతో మిక్కిలి ఉగ్రమైన తపస్సు చేసి విష్ణువును ప్రత్యక్షముచేసికొన్నాడు. హరి అతనికి కనిపించి, మూడు లోకాలకంటే

ఉన్నతమైన ధ్రువ నక్షత్రాన్ని అతనికి సింహాసనంగా ఇచ్చాడు. ధ్రువుడు అక్కడి నుండియే తన పరిపాలనను కొనసాగిస్తున్నాడు.[5]

శ్రీరామచంద్రుని యొక్క పరిపూర్ణ మానవ పాత్రలో దైవ సంకల్పానికి అనుగుణమైన అచంచలమైన సమర్పణ కంటే మరేదీ అధికంగా గుర్తించబడలేదు. సింహాసనం నుండి అతని ఆకస్మికంగా తొలగించిన సుడిగుండం వంటి పరిస్థితిలో కూడా పదే పదే, అతను తన చుట్టూ ఉన్నవారిని శాంతింపజేస్తాడు. జరిగేదంతా దైవానుగుణమైన మంచి చట్టం ద్వారా మాత్రమే జరిగిందని వివరిస్తాడు. అతను పరిస్థితుల తుఫానుకు పూర్తిగా కదలకుండా ప్రశాంతంగా ఉండి ఆదర్శ నీయుడయ్యాడు. మారుతున్న అవాస్తవాల మధ్య నిజమైన వాస్తవాన్ని తెలుసుకున్న పరిపూర్ణ మానవుడు రాముడు.

మరోవైపు, భగవంతుడిని గౌరవించని వారి అవమానంలేదా పరాజయం గురించి మనం నిరంతరం చదువుతాము. లంకలో చక్రవర్తిగా ఉన్న రావణుని వంటి శక్తివంతమైన పాలకులు తమను తాము భగవంతుని ప్రత్యర్థులుగా భావించి, లోకుల పట్ల భగవంతుని ప్రేమపూర్వక సంకల్పానికి వ్యతిరేకంగా తమను తాము ఏర్పాటు చేసుకున్నందున పతనమయ్యారు.[6]

మగధ రాజు అయిన జరాసంధుడు తాను బంధించిన రాజులను విడుదల చేయమని శ్రీ కృష్ణుడు కోరినప్పటికీ వినలేదు. అనంతర పరిణామాలలో భీమునిచే చంపబడ్డాడు;[7] తలపొగరుతో శిశుపాలుడు భగవంతుని తిరస్కరించిన ఫలితంగా శ్రీ కృష్ణుని చక్ర ప్రభావంతో తల పోగొట్టుకున్నాడు.[8] దుర్యోధనుడు శ్రీ కృష్ణుని సలహాలను నిరంతరం తిరస్కరించినందుకు అతని స్నేహితులు మరియు అనుచరులతో కలిసి నశించాడు;[9] ఇలా ఈ జాబితాను అనేక పుటలకు పొడిగించవచ్చు. వీటన్నింటి లోను ఈశ్వరునిపై ద్వేషం చూపే వారు నశించిపోతారనే హెచ్చరిక ప్రకాశిస్తుంది.

ప్రత్యక్ష ఆదేశం ద్వారా మాత్రమే కాకుండా ఉదాహరణ ద్వారా, ఇతర మానవులకువలెనె దేశాధినేతకు కూడా విధేయత అవసరమని శాస్త్రాలలో సమానంగా నొక్కిచెప్పబడింది. యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థములో రాజుగా ఉన్నప్పుడు, అతని నలుగురు సోదరులు యుద్ధానికి బయలుదేరి, వారు సంపాదించిన సంపదనంతా అతని పాదాల వద్దకు తీసుకువస్తారు; వారు తమ కోసం కాకుండా తమ రాజు కోసం పోరాడారు.[10] యుధిష్ఠిరుడు జూదం తర్వాత దేశం నుండి బహిష్కరించబడిన

సమయంలో, ప్రజలు ధృతరాష్ట్రునిపైగల విధేయతను విడిచిపెట్టి ధర్మరాజును అనుసరించటానికి ఇష్టపడ్డారు. కాని విశ్వాసపాత్రుడైన యువరాజయిన ధర్మరాజు వారిని హస్తినాపురానికి తిరిగి వెళ్ళాలని, వారు సాధారణమైన అభ్యుదయాన్ని పొందటానికి వారి పాలకునియెడల విశ్వాసం చూపించాలని ఆదేశించాడు.[11]

ఈ విధేయత – ఆదర్శయుతంగా రాజ్యాధికారం సాగిస్తున్న కర్తవ్య పాలన కల రాజుపై భక్తితో, ప్రజలలో పెంపొందించబడింది. ఆంగిరస వంశములో జన్మించిన ఉతథ్యుడనే మహర్షి, యువనాశ్వ కుమారుడైన మాంధాత మహారాజుకు ఉపదేశిస్తూ ఇలా అన్నాడు: "ఒకడు ధర్మాన్ని నిలబెట్టడం కోసమే రాజు కావాలి. అంతేకాని తన మోజుకు అనుగుణంగా ప్రవర్తించడం కోసం కాదు. రాజు ప్రపంచానికి రక్షకుడు, ఓ మాంధాతా! రాజు ధర్మంగా ప్రవర్తిస్తే, భూమిపై అచ్చమైన దేవుని గౌరవాన్ని పొందుతాడు. కానీ అతను అధర్మం చేస్తే నరకంలో మునిగిపోతాడు. అన్ని జీవులు ధర్మంపై ఆధారపడి ఉంటాయి. ధర్మం రాజుపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. కనుక ధర్మాన్ని నిలబెట్టే రాజు, అధర్మాన్ని శిక్షించడంలో విఫలమైతే, దేవతలు అతని భవనాలను విడిచిపెడతారు. అతను మనుష్యుల మధ్య ద్వేషాన్ని పొందుతాడు."

దేశభక్తి, తన దేశం పట్ల ప్రేమ, ప్రజాస్ఫూర్తి, తన కంటే దేశం పట్ల శ్రద్ధ వహించడం, విధేయతకు చాలా దగ్గరగా ఉండే సద్గుణాలు. ప్రజలు వీటి నుండి ఎప్పటికీ విడిపోకూడదు. "రాజు మరియు దేశం" నిజమైన విధేయత యొక్క వస్తువు. ఈ దేశ ప్రేమతో తన మాతృభూమి కోసం తనను తాను త్యాగం చేయడానికి సంసిద్ధత లేకుండా ఏ మనిషి ఉండకూడదు; (దేశంకోసం త్యాగ భావనతో ఉండాలని భావం) దేశభక్తి మరియు ప్రజా స్ఫూర్తి లేకుండా జాతి గొప్పతనం లేదు. జాతి గొప్పతనం అంటే దీర్ఘకాలంలో కుటుంబం మరియు వ్యక్తిగత శ్రేయస్సుగా పరిణమిస్తుంది: వీటిలో మొత్తంనుంచి (జాతి అనే మొత్తం భావన నుంచి) భాగాన్ని (వ్యక్తి అనే భాగాన్నీ) వేరు చేయలేము. ప్రజాస్ఫూర్తి అనే భావన ఒక వ్యక్తి తన దేశం యొక్క విజయాలు మరియు బాధలను తన సొంతం అని భావించేలా చేస్తుంది. బలహీనులను అన్యాయం నుండి రక్షించడానికి, తప్పును ప్రతిఘటించడానికి, చట్టాన్ని నిలబెట్టడానికి, న్యాయం కోసం నిలబడడానికి, సమాజపు ఖర్చుతో అన్యాయమైన లాభం పొందేందుకు నిరాకరించడానికి లేదా తనకు రావాలిసిన దాన్ని ఎగ్గొట్టి మోసం చేసే విధానాన్ని నిరోధించటానికి వ్యక్తి ప్రయత్నించేలా ప్రజాస్ఫూర్తి అనే భావన పని చేస్తుంది. ప్రాచీన భారతదేశం యొక్క వీరులు నిరంతరం "ఇతరుల

సంక్షేమం కోసం ఉద్దేశించబడ్డారు;" శ్రీ కృష్ణుడు అర్జునునికి "జనుల రక్షణ కోసం, మానవజాతి నిర్వహణ కోసం ప్రయత్నించ"మని ఆజ్ఞాపించాడు.[13] తన గురించి మరియు తన కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తి హ్రస్వదృష్టి గలవాడు. నిజం చెప్పాలంటే ఇలా హ్రస్వదృష్టితో ఉండే వ్యక్తి తన వారి భవిష్యత్తుకు సంబంధించిన ఆనందాన్ని దెబ్బతీస్తున్నాడు.

తల్లిదండ్రులకు కుమారులు ఎప్పుడూ అత్యంత పూర్తి విధేయతతో ఉండాలి. ఇది సనాతన ధర్మంలో చాలా తరచుగా పునరావృతమయ్యే ఆదేశాలలో ఒకటి. దీనికి గొప్ప ఉదాహరణ అయిన రామచంద్రుడు తన తండ్రిమాటకి ఎలా కట్టుబడి ఉన్నాడో చూడండి. దశరథుడు రాముని వనవాసపు వరాన్ని తెలియ చేయటానికి బాధపడుతున్నప్పుడు, కైకేయి తన తండ్రి తన ఇష్టాన్ని చెప్పడానికి భయపడుతున్నాడని కొడుకు రామునితో చెప్పినప్పుడు శ్రీ రాముని సత్వర సమాధానం ఇది : "ఓ గౌరవనీయురాలైన తల్లీ, రాజు కోరికను చెప్పు. నేను దానిని నెరవేరుస్తాను. తండ్రి సేవ కంటే, అతని మాటలను అమలు చేయడం కంటే గొప్ప సేవ లేదు.

మరియు తనను ప్రలోభపెట్టే అన్ని వాదనలను సలహా సమావేశాలను ప్రతిఘటిస్తూ, శ్రీరాముడు ఇలా దృఢమైన సమాధానం ఇస్తాడు: "నా తండ్రి ఆజ్ఞను అతిక్రమించే శక్తి నాలో లేదు … నేను నా తండ్రి ఆజ్ఞలకు కట్టుబడి ఉంటాను."[14] ఆ తరువాత, తమ తండ్రి దశరథుడు చనిపోయినప్పుడు రాజ్యపాలనకు ఇష్టపడని రాజప్రతినిధి అయిన భరతుడు , రాజకిరీటాన్ని స్వీకరించటానికి నిరాకరించాడు. శ్రీరాముడు సింహాసనాన్ని అధిరోహించాలని ఉద్వేగభరితముగా అభ్యర్థించాడు. ఆ అభ్యర్థనలకు శ్రీరాముని సమాధానం ఇది – "తండ్రి నన్ను అడవికి పంపాడు. భరతుని సింహాసనంపై ఉంచాడు; తండ్రి మాట ప్రకారం ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి. నా తండ్రి ఆజ్ఞాపించిన విషయాన్ని అసత్యం చేయకూడదు.[15]"

మనం మళ్ళీ మహాభారతంలోని కౌశిక ముని కథ చదువుకొందాం. తన దగ్గర జ్ఞానం నేర్చుకోవడానికి వచ్చిన కౌశిక మునిని ధర్మవ్యాధుడు అనేవాడు (ఒక వేటగాని యొక్క అపవిత్రమైన శరీరంలో కప్పబడి ఉన్నవాడు) తన తల్లిదండ్రుల దగ్గరకు తీసుకువెళ్ళాడు. పుత్రయోగ్యమైన పెద్దల బాధ్యతకు సంబంధించిన ధర్మాన్ని నెరవేరుస్తూ ఉండటమే తన సంతోషకరమైన జ్ఞానానికి శాంతి స్థితికి మూల కారణమని కౌశికునితో ధర్మవ్యాధుడు చెబుతూ, తన వృద్ధ తల్లిదండ్రులను ఉంచిన

అందమైన గదులకు కౌశికుని తీసుకెళ్లాడు; తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి, వారికి తన అతిథిని పరిచయం చేసి, కౌశికునితో ధర్మవ్యాధుడు ఇలా అన్నాడు: "వీరే నా తల్లిదండ్రులు. నిత్యం నేను పూజించే పూజనీయవ్యక్తులు; దేవతలకు ఏవి చేయాలో అవన్నీ నా తల్లిదండ్రులకు చేస్తాను... నాకు వారు శాస్త్రాలు చెప్పిన మూడు పవిత్రమైన అగ్నులవంటివారు; (గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని అను మూడగ్నులు.) ఓ బ్రాహ్మణా! నా తల్లిదండ్రులు నాకు యాగాలు లేదా నాలుగు వేదాల వంటివారు. ఓ బ్రాహ్మణా! నా ఇద్దరు తల్లిదండ్రులు, పవిత్రమైన అగ్ని, ఆత్మ మరియు గురువు – ఈ ఐదుగురు, అత్యంత గౌరవానికి అర్హులుగా నేను భావిస్తాను."

అప్పుడు ధర్మవ్యాధుడు కౌశికునితో "వేదాలు నేర్చుకోవాలనే ఆత్రుతలో తల్లిదండ్రులను విడిచిపెట్టి తప్పుగా ప్రవర్తించావు. వారి వద్దకు తిరిగి వెళ్లి వారిని ఓదార్చ"మని చెప్పాడు: "నీ తండ్రి మరియు తల్లి వైపు మనస్సు పెట్టి, వారిని గౌరవించడంలో శ్రద్ధ వహించండి. ఇంతకంటే ఉన్నతమైన ధర్మం ఏదైనా ఉంటుందో లేదో నాకు తెలియదు."[16]

భీష్ముడు తాను అనుమతించే వరకు మృత్యువు తనను తాకకూడదనే వరాన్ని ఎలా పొందాడో ప్రసిద్ధమైనది. సింహాసనానికి రాజీనామా చేసి, రాజ్యాధికారాన్ని వదులుకొని, ఆత్రుతగా ఉన్న తన తండ్రి వివాహపు ఉద్దేశ్యాన్ని గెలిపించి, తండ్రి హృదయాన్ని భీష్ముడు గెలుచుకొన్నాడు. చంద్ర వంశానికి చెందిన శంతనుడు, అందమైన సత్యవతిని వివాహం చేసుకోవాలనుకున్నాడు. కానీ తన కుమారుడు భీష్ముని కోసం తనతో తనే పోరాడాడు. "ఒక సవతి తల్లి, తన ప్రియమైన కుమారుని పట్ల దయ చూపకపోవచ్చు" అని అతను భావించాడు.

ఆలోచనల పోరాటంలో పుట్టిన కుమారునిపై శ్రద్ధ విచారంగా శంతన మహారాజు ముఖంలో కనిపించింది. భీష్ముడు మంత్రులతో చర్చించి తండ్రి విచారానికి కారణం తెలుసుకున్నాడు. తండ్రి ఇష్టపడిన సత్యవతి తండ్రి వద్దకు వెళ్లి శంతన మహారాజుతో వివాహం చేయమని కోరాడు. సత్యవతి తండ్రి "రాజు వృద్ధుడయ్యాడు; అతని స్థానంలో నీవు త్వరలో రాజ్యపాలన చేస్తావు. నేను నా కుమార్తెను నీకు ఇచ్చి వివాహం చేస్తాను." అని అన్నాడు: కానీ భీష్ముడు ఇలా జవాబిచ్చాడు: "అలాంటిది చెప్పకండి. నా తండ్రి ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నప్పుడు, ఆమె నా తల్లిగా

మారింది; ఆమెను శంతన మహారాజుకు ఇచ్చి వివాహం చేయండి." అప్పుడు సత్యవతి తండ్రి ఇలా అన్నాడు : "అయితే సత్యవతి కుమారుడు శంతన మహారాజు తర్వాత సార్వభౌముడయితే, నేను అలా చేస్తాను.

భీష్ముడు వెంటనే ఇలా అన్నాడు: "నేను నా జన్మహక్కును వదులుకుంటానని వాగ్దానం చేస్తున్నాను. ఆ పుట్టబోయే నా తమ్ముడిని నేను సింహాసనం మీద కూర్చోబెడతాను." కానీ సత్యవతి తండ్రి మళ్ళీ ఇలా అన్నాడు: " నువ్వు ఒకసారి ఇచ్చిన మాట తప్పవని మాకు తెలుసు. అయితే నీ కుమారులు తమ రాజ్యపు హక్కును కోరకుండా ఏది బంధిస్తుంది? (తమ తండ్రికి అన్యాయం జరిగిందని భావించి భీష్ముని కుమారులు రాజ్యాధికారం కోరుకొంటారని సత్యవతి తండ్రి మాటల్లోని భావం–)" అప్పుడు భీష్ముడు ఇలా అన్నాడు:

"నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని వాగ్దానం చేస్తున్నాను; కాబట్టి వారి బాబాయి హక్కును వివాదాస్పదం చేసే కొడుకులు నాకు ఉండరు. ఇప్పుడు మీరు నా తండ్రి కోరికను తీర్చండి." అతని భయంకరమైన ప్రతిజ్ఞల కారణంగా దేవతలు అనందంతో కరతాళ ధ్వనులు చేసారు. వారి శరీరం లేని స్వరం(ఆకాశవాణి) ఇలా వినబడింది. "ఇతను చాలా కాలంగా దేవవ్రతుడు అని పిలువబడ్డాడు; భీష్మ ప్రతిజ్ఞ (కఠినమైన నియమములతో చేసిన భయంకరమైన ప్రతిజ్ఞ; తిరుగులేని ప్రమాణము) చేసాడు కనుక అతను ఇప్పుడు భీష్ముడు (=భయపెట్టువాడు) అని పిలవబడతాడు" భయంకరమైన ప్రతిజ్ఞ చేసినందువలన తనకు తానుగా ఖచ్చితంగా భయంకరమైనవాడే కానీ నిజమైన హిందువుల హృదయాలందరికీ భీష్ముడు అత్యంత ప్రియమైనవాడు.

రాజు శంతనుడు భీష్ముడు ప్రమాణాలు చేసాడని, వాటిని కుమారుడు తిరిగి తీసుకోవటం అసాధ్యమని గ్రహించి, సత్యవతిని తన భార్యగా చేసుకొన్నాడు; కానీ తన తండ్రి ప్రేమ యొక్క సంపూర్ణత శంతనునిలో వెల్లి విరిసింది. భీష్మునికి స్వచ్ఛంద మరణాన్ని బహుమతిగా ఇచ్చాడు. ఈ విధంగా కోరిక ప్రబలంగా ఉండి, తమ ధైర్యాన్ని సంపూర్ణంగా కాపాడుకోగలిగిన మానవులు తమకు నచ్చినంత కాలం మృత్యు శక్తికి వ్యతిరేకంగా విజయం సాధించవచ్చు.[17]

మరోవైపు, దుర్యోధనుడు మొండిగా వ్యవహరించడం వలన మరియు అతని తల్లిదండ్రుల పట్ల అవిధేయతగా ఉండుట వలన యుద్ధంలో అతని ఇల్లు సర్వనాశన మయింది.[18] పాండవుల న్యాయమైన హక్కుల కోరికలను (డిమాండ్) అంగీకరించి,

వారి పూర్వీకుల ఆస్తిలో వారికి వాటా ఇవ్వాలని, పదే పదే అతని తండ్రి అతనిని వేడుకొన్నాడు. కానీ దుర్యోధనుడు తండ్రి ప్రార్థనలను ధిక్కరించి తనదైన రీతిలో వ్యవహరించాడు. అతని తల్లి గాంధారి తన తండ్రిపట్ల విధేయత చూపాలని మరియు తన కర్తవ్యాన్ని గౌరవించమని బహిరంగ సభలో వేడుకున్నప్పుడు కూడా, దుర్యోధనుడు ఆమె పట్ల కఠినంగా మరియు అగౌరవంగా ప్రవర్తించాడు. మృత్యువును కొని తెచ్చుకొన్నాడు. అవిధేయతతో లేదా అగౌరవంతో తన తండ్రిని లేదా తల్లిని బాధపెట్టే ఏ కొడుకు విజయం సాధించలేదు.

సనాతన ధర్మంలో గౌరవం మరియు సేవ చేయవలసిన వ్యక్తులలో తల్లిదండ్రుల తర్వాత గురువును మూడవస్థానంలో చేర్చారు. హిందూ బాలురందరికీ ఆదర్శంగా ఉండవలసిన ప్రాచీన వీరులలో కూడా ఈ సద్గుణాన్ని మనం చూస్తాము. పాండవులు భీష్ముని పట్ల, ద్రోణుని పట్ల చూపిన ప్రేమ ఎంతో గాఢమైనది. అచంచలమైన గౌరవంతో కూడుకొన్నది. గురువులతో పోరాడవలసి వచ్చిన సందర్భంలో – కురుక్షేత్రంలో యుద్ధం జరగడానికి ముందు – పాండవులు తమ గురువుల పాదాలకు నమస్కరించడం గమనించవచ్చు.[19] ధృష్టద్యుమ్నుడు (=ధృష్టం ప్రాగల్భ్యం ద్యుమ్నం బలం చ యస్య చాతుర్యము, బలము కలవాడు. ధృష్టద్యుమ్నుడు.) ద్రోణుని తెల్లని జుట్టు పట్టుకొని అతనిని చంపబోతున్నప్పుడు , అర్జునుని యొక్క వేదనతో కూడిన ఈ కేకలు వినండి: "గురువును సజీవంగా తీసుకురండి! అతనిని చంపవద్దు! అతనిని చంపవద్దు!" మరియు నేరం పూర్తి అయినప్పుడు(ద్రోణుడు మరణించినప్పుడు) అతని గుండె పగిలిన ఏడుపు ఇది : "నేను నరకంలో మునిగిపోయాను, అవమానంతో ఓడగొట్టబడ్డాను."[20]

సనాతన ధర్మంలో గురువుకు సంబంధించిన అవిధేయతను ప్రదర్శించే ఏకైక కారణం అబద్ధమాడుట. ధర్మానికి ఉదాహరణగా నిలిచిన భీష్ముడు తన జీవిత గమనంలో దీనికి అద్భుతమైన దృష్టాంతాన్ని ఇచ్చాడు. తన తండ్రి శంతనుడు మరణించిన తరువాత, భీష్ముడు తన ప్రతిజ్ఞ ప్రకారం, తన తమ్ముడు చిత్రాంగదుని సింహాసనంపై కూర్చోబెట్టాడు. చిత్రాంగదుడు యుద్ధంలో చంపబడినప్పుడు, అతను రెండవ సోదరుడు విచిత్రవీర్యుని హస్తినాపుర సింహాసనంపై ఉంచాడు. విచిత్రవీర్యునికి తగిన భార్యల కోసం వెతుకుతున్న భీష్ముడు కాశీరాజు తన ముగ్గురు కుమార్తెలకు స్వయంవరాన్ని నిర్వహించబోతున్నాడని ఆ ముగ్గురు కుమార్తెలు తన సోదరునితో వివాహానికి అన్ని విధాలుగా అర్హులని విన్నాడు. వెంటనే అతను కాశీకి వెళ్ళాడు.

యుద్ధంలో తన శక్తి సామర్థ్యాలు ప్రదర్శించి స్వయంవరం కోసం సమావేశమైన రాజకుమారుల మధ్య నుండి కాశీరాజు ముగ్గురు కుమార్తెలను తనవెంట తీసుకువెళ్లాడు.

భీష్ముడు వారిని హస్తినాపురానికి తీసుకువచ్చినప్పుడు, చిన్నవారయిన అంబిక మరియు అంబాలిక, విచిత్రవీర్యుని వివాహం చేసుకోవడానికి ఇష్టపూర్వకంగా అంగీకరించారు; కానీ పెద్దదయిన అంబ, చాలా కాలం క్రితం తాను భర్తగా ఎంపిక చేసుకున్న మరొక దేశానికి రాజు అయిన సాల్వుడిని వివాహం చేసుకోవాలనుకుంటున్నట్లు చెప్పింది.[21] భీష్ముడు ఆమెను అన్ని గౌరవాలతో సాల్వరాజు వద్దకు పంపాడు; కానీ అంబ భీష్మునితో తాను చేసిన యుద్ధంలో గెలిచిందని బహుమతిగా ఆమెను తిరిగి తీసుకోలేనని చెప్పి ఆమెను సాల్వరాజు వెనక్కి పంపాడు. అప్పుడు అంబ భీష్మునితో "సాల్వరాజు నన్ను వివాహం చేసుకోకపోతే, యుద్ధంలో అతనిపై మీరు గెలిచారు కనుక, మీరే నన్ను వివాహం చేసుకోవాలి." అని చెప్పింది: భీష్ముడు ఆమె ప్రస్తుత స్థితికి చాలా బాధపడ్డాడు. కానీ తన జీవితకాల బ్రహ్మచర్య ప్రతిజ్ఞను దృష్టిలో ఉంచుకుని ఆమె కోరికను సమ్మతించలేకపోయాడు.

అప్పుడు అంబ చాలా కోపించి భీష్ముని గురువైన పరశురాముని వద్దకు వెళ్ళింది; పరశురాముడు (పరశునా రామ రమణం యస్య గొడ్డలిచే ఆనందపడు వానిని పరశురాముడు అంటారు). ఆమె పక్షాన నిలిచాడు. అంబను వివాహం చేసుకోమని భీష్ముని ఆదేశించాడు. కానీ అతను నిరాకరించాడు. దోష విధానంలో తన గురువుకు విధేయత చూపడం కంటే తన ప్రతిజ్ఞను పాటించడం ఉన్నతమైన బాధ్యతగా భీష్ముడు భావించాడు. చివరకు పరశురాముడు మరియు భీష్ముని మధ్య గొప్ప యుద్ధం జరిగింది. చాలా రోజుల పాటు ఒకే విధమైన పోరాటం కొనసాగింది. ఇద్దరికీ అనేక గాయాలయ్యాయి; వారు అలసటతో రక్తాన్ని కోల్పోయి తీవ్రమైన గాయాలతో కలతచెందారు: కానీ మళ్లీ పుంజుకుని, ఇరవై ఎనిమిదవ రోజు వరకు పోరాడారు. చివరకు వృద్ధుడైన పరశురాముడు తాను ఇక యుద్ధం చేయలేనని అంగీకరించే వరకు పోరాటాన్ని జరిపారు; చివరకు భీష్ముడు తన లక్ష్యాన్ని (బ్రహ్మ చర్య ప్రతిజ్ఞాపాలనను) గెలుచుకున్నాడు. అయినప్పటికీ, తాను ఇష్టపడకుండా, అంబకు చాలా దుఃఖాన్ని కలిగించాడు కనుక, కర్మ అతని మరణానికి మార్గాన్ని వేసింది.(రెండవ జన్మములో అంబ శిఖండిగ ద్రుపదరాజునకు పుట్టి భీష్ముని భారతయుద్ధమున పడవేసింది. దీనిని కర్మ అని పేర్కొనుట జరిగింది).

వృద్ధుల పట్ల గౌరవ భావము లేకుండా ఉండటమనేది మన లోకంలో నిత్యం జరిపే వ్యవహారాలలో పుష్పించవలసిన ఉత్తమ గుణాల జాబితాను మూసివేస్తుంది. ఇది ప్రాచీన హిందువుల యొక్క గుర్తించదగిన ఉత్తమ లక్షణాలలో ఒకటి. (అనగా వృద్ధుల పట్ల గౌరవము అను లక్షణంతో– హిందువుల శీల నిర్మాణానికి సంబంధించిన ఉత్తమ గుణాలపట్టిక పూర్తవుతుందని , వృద్ధుల పట్ల గౌరవమనేది ఉత్తమోత్తమమైన గుణమని భావం–) సుదీర్ఘ అనుభవము కలిగిన ఫలప్రదమైన జ్ఞానం వృద్ధుల ఆధీనంలో ఉన్న అమూల్యమైన నిధి. బోధించదగిన, లలితమైన, గౌరవప్రదమైన ఈ అనుభవ జ్ఞానాన్ని యువత ప్రయోజనం కోసం వృద్ధులు ఇష్టపూర్వకంగా వినియోగిస్తారు. ఆధునిక జీవితం యొక్క ఆత్రుతలో, అనుభవప్రపూర్ణులైన వృద్ధులకు ఇవ్వవలసిన గౌరవాన్ని పాదాల కింద తొక్కడం సముచితం కాదు. వృద్ధులకు ఇవ్వవలసిన గౌరవాన్ని పెంపొందించడానికి యువత శ్రద్ధ వహించడం మరింత అవసరం.

న యుజ్యమానయా భక్త్యా భగవత్యఖిలాత్మని ।
సదృశోఽస్తి శివః పంథా యోగినాం బ్రహ్మసిద్ధయే ।
జ్ఞాన వైరాగ్యయుక్తేన భక్తియుక్తేన చాత్మనా ।
పరిపశ్యత్యుదాసీనం ప్రకృతిం చ హతౌజసమ్ ।
సతాం ప్రసంగాన్మమ వీర్య సంవిదో
భవంతి హృత్కర్ణ రసాయనాః కథాః ।
తజ్జోషణాదాశ్వపవర్గ వర్త్మని
శ్రద్ధా రతిర్భక్తిరను క్రమిష్యతి ।
భక్త్యా పుమాన్ జాతవిరాగ ఐంద్రియాత్
దృష్ట శ్రుతాన్మదచనాను చింతయా ।
చిత్తస్య యత్తో గ్రహణే యోగయుక్తో
యతిష్యతే ఋజుభిర్యోగమార్గైః ।
ఆసేవయాయం ప్రకృతేర్గుణానాం
జ్ఞానేన వైరాగ్య విజృంభితేన ।
యోగేన మయ్యర్పితయా చ భక్త్యా
మాం ప్రత్యగాత్మానమిహావరుంధే ॥[22]

“అత్యంత ప్రీతికరమైన, బ్రహ్మప్రాప్తి(మోక్షప్రాప్తి) కొరకు అందరికీ ఆత్మయైన భగవంతుని పట్ల శుద్ధమైన మనస్సుతో, భక్తిభావము కలిగియుండాలి. దీనితో సమానమైన, మరొక మార్గం యోగులకు లేదు. (మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ అనే శంకర భగవత్పాదుల మాట ఇక్కడ స్మరించాలి).

“తన మనస్సులో వివేకం, వైరాగ్యం మరియు భక్తి నిండినప్పుడు, ప్రకృతి క్రమక్రమంగా తన శక్తిని కోల్పోవడాన్నిగమనిస్తూ ఆ దివ్య పురుషుడిని నిర్మలంగా భక్తుడు చూస్తాడు.

సత్సంగం చేస్తే (మంచివారితో కలిసి కాలం గడుపుతుంటే) నా (భగవంతుని) పరాక్రమము యొక్క యథార్ధ జ్ఞానము కలుగుతుంది. ఈ యథార్ధ జ్ఞానమువలన నా కథలను వినుట సంభవిస్తుంది.. ఈ కథాశ్రవణము వల్ల మోక్ష మార్గములో శ్రద్ధ, ప్రేమ, భక్తి క్రమముగా వికసించి వేగంగా మోక్షమార్గం వైపు భక్తుడు మరలుతాడు. (భగవంతుని కథా శ్రవణము వల్ల, అవిద్య తొలగిపోవటం వల్ల శ్రీహరిపై మొదట శ్రద్ధ, ఆపైన ప్రేమ, అటు పిమ్మట భక్తి పెరుగుతాయని అంతరార్థం).

మానవుడు నా సృష్టిలీలలను స్మరించుట వల్ల, వినుటవల్ల నాపై భక్తి కలుగుతుంది. అదెలాగంటే నా కథలను వినుటవల్ల మొదటగా ఇహ లోక, పరలోక ఇంద్రియసుఖములపై విరక్తి పుడుతుంది. తరువాత మనో నిగ్రహానికి ప్రయత్నించుట మొదలుపెడతాడు. ఆ పిమ్మట భక్తి ప్రధానమైన, సులభమయిన యోగమార్గమును అలవర్చుకొంటాడు.

విషయభోగములు సత్వ రజస్తమోగుణాత్మకమైన ప్రకృతికి సంబంధించినవి. ఈ విషయభోగములను సేవింపకుండవలెను. జ్ఞానమునకు వైరాగ్యము గట్టిగా తోడుకావలెను. యోగసాధన గట్టిగా చేయవలెను. భగవంతుడనయిన నా యందే మనస్సును అర్పించ వలెను. ఇట్లు చేసిన మానవుడు ఈ దేహమునందే ప్రత్యగాత్మ అయిన నన్ను పొందును?

(పరమాత్మకు వలెనే ఈ ప్రత్యగాత్మ అనే పదానికీ అనేకానేక నిర్వచనాలు పెద్దలు చెప్పారు. అందులో కొన్ని : 1. ‘నేను’ అనే పదాన్ని దేనిని ఉద్దేశించి వాడుతామో ఆ ఆత్మ. 2. అసత్తు, జడం, దుఃఖాత్మకమైన దృశ్య వర్గాని కంటే విలక్షణమైనది. 2. సత్తు, చిత్తు, సుఖం– వీటితో కూడినది. 3. స్వస్వరూపం. 4. బ్రహ్మంగా భావిస్తున్న చైతన్యం. 5. అంతఃకరణంలో ప్రతిబింబించే చైతన్యం. 6.

శరీరంలో ఉండి కూడా మనస్సుతోగానీ, ఇంద్రియాలతో గానీ నిమిత్తం లేకుండా మనగలిగే పరబ్రహ్మ చైతన్యం. దీనికే జీవసాక్షి అని కూడా మరోపేరు).[22]

స్వభావమేకే కవయో వదంతి
కాలం తథాऽన్యే పరిముహ్యమానాః
దేవస్యైష మహిమా తు లోకే
యేనేదం భ్రామ్యతే బ్రహ్మచక్రమ్
తమీశ్వరాణాం పరమం మహేశ్వరం
తం దేవతానాం పరమం చ దైవతమ్,
పతిం పతీనాం పరమం పరస్తాత్
విదామ దేవం భువనేశమీడ్యమ్
న తస్య కార్యం కరణంచ విద్యతే
న తత్సమశ్చాభ్యాధికశ్చ దృశ్యతే,
పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే
స్వాభావికీ జ్ఞానబల క్రియాచ
న తస్య కశ్చిత్పతిరస్తి లోకే
న చేశితా నైవ చ తస్య లింగమ్,
స కారణం కరణాధిపాధిపో
న చాస్య కశ్చిజ్జనితాన చాధిపః
ఏకో వశీ నిష్క్రియాణాం బహూనా
మేకం బీజం బహుధా యః కరోతి,
తమాత్మస్థం యేऽనుపశ్యన్తి ధీరా
స్తేషాం సుఖం శాశ్వతం నేత రేషామ్.
నిత్యో నిత్యానాం చేతన శ్చేతనానా
మేకో బహూనాం యో విదధాతి కామాన్
తత్కారణం సాంఖ్యయోగాధిగమ్యం
జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః."[23]

h h h

లోకములో ఉన్న విద్వాంసులలో కొందరు జగత్తు యొక్క కారణము స్వభావమని చెబుతున్నారు. మరికొందఱు విద్వాంసులు కాలమే జగత్కారణమని

పలుకుచున్నారు. కాని పైరెండూ సిద్ధాంతములు కావు. ఈ బ్రహ్మచక్రమంతా ఈవిధముగా సంచరించుచుండుటకు మూల కారణము ఈశ్వరునియొక్క సామర్థ్యమే గాని మరొకటికాదు.

ఆపరమేశ్వరుడు యముడు మున్నగు వారికంటె గొప్పవానిగా, ఇంద్రాది దేవతలలోపల శ్రేష్ఠమయిన దైవతముగా, సృష్టి కర్తలగు ప్రజాపతులలోపల శ్రేష్ఠుడయిన ప్రజాపతిగా, అక్షరస్వరూపుని కంటె శ్రేష్ఠునిగ, ప్రకాశస్వరూపునిగా, లోకేశునిగా కొనియాడదగిన వానిగా తెలిసికొనుచున్నామని విద్వాంసులయినవాళ్ళు తమ స్వానుభవమును తెలిపారు.

ఆపరమేశ్వరునకు ఏ సాధనం అవసరం లేదు (అనగా కన్ను మొదలయిన ఇంద్రియముల అవసరంలేదు) ఆపరమేశ్వరునితో సముడు కాని అధికుడు కాని ఎవ్వడు కనబడడు. ఆపరమేశ్వరునియొక్క శ్రేష్ఠమయినశక్తి నానావిధములుగ ఉంటుందని వేదాలు ప్రతిపాదిస్తున్నాయి. ఆ ఈశ్వరశక్తి స్వాభావికమయినది మరియు జ్ఞాన క్రియ బలక్రియ కలిగినది. (జ్ఞాన క్రియ అనగా సర్వవిషయజ్ఞాన ప్రవృత్తిగలది. బలక్రియ అనగా తన సన్నిధి మాత్రముచేత సర్వమును స్వాధీనము చేసికొని నియ మించేది)."

ఈ పరమేశ్వరునికి ప్రభువుగాని నియంతగాని లేదు. ఇతడిలాంటివాడని ఊహించుటకు గుర్తుగా చెప్పే చిహ్నము లేదు. ఇతడే సర్వకారణకారకుడు. ఇతడే ఇంద్రియాల పాలకులయిన సూర్యాది దేవతలకు ప్రభువు. ఇతనికి జనకుడు గాని, ఇతనికంటె ఆధికుడుగాని మరొకడు లేడు.

ఆ పరమేశ్వరుడు క్రియారహితులయిన అనేకులలో స్వతంత్రుడు. (జీవుల యొక్క సకలకర్మలు ఆత్మలో లేవు. క్రియలన్నీ దేహానికి సంబంధించిన ఇంద్రియాలలో ఉన్నాయి. అందుకే ఆత్మ అయిన పరమేశ్వరుడు క్రియారహితుడు) అద్వితీయుడు. ఆ పరమేశ్వరుడు ఒకటి అయిన బీజస్థానీయమయిన భూత సూక్ష్మమును అనేక విధములుగా చేయుచున్నాడు. అలా బుద్ధిలో ఉన్న ఆ ఈశ్వరుని ఏ విద్వాంసులు చూస్తున్నారో, అట్టివారికే శాశ్వతమయిన సుఖము లభిస్తుంది. ఇతరులకు లభించదు.

నిత్యులగు జీవులలోపల లేక భూమి మొదలగు పంచమహాభూతముల లోపల నిత్యుడును, ప్రమాతలయిన (బుద్ధి వృత్తులకు సాక్షిగా నిలిచే ఆత్మను ప్రమాత అంటారు. అనగా ఎరుక కలిగినవాడు, ప్రమ అంటే యథార్థం తెలిసి ఉండటం,

జ్ఞానం) చేతనులలోపల చేతనుడును, తానొక్కడే అయినప్పటికీ అనేకులకు కోరికలను ప్రసాదించువాడును, సర్వ కారణుడును, జ్ఞానయోగముచేత పొందదగిన వాడును అయిన దేవుని తెలిసినవాడు అవిద్యా (మాయ.) పాశముల చేత విముక్తుడగుచున్నాడు.

అరాజకే హి లోకేఽ స్మిన్ సర్వతో విద్రుతే భయాత్ ।
రక్షార్థమస్య సర్వస్య రాజానమసృజత్ ప్రభుః ।
ఇన్ద్రానిలయ మార్కాణామగ్నేశ్చ వరుణస్య చ ।
చన్ద్రవిత్తేశయోశ్చైవ మాత్రా నిర్హృత్య శాశ్వతీః ॥

h h h

తదర్థం సర్వభూతానాం గోప్తారం ధర్మ్మమాత్మజమ్ ।
బ్రహ్మతేజోమయం దణ్డమసృజత్పూర్వమీశ్వరః ॥

h h h

దణ్డః శాస్తి ప్రజాస్సర్వా దణ్డ ఏవాభిరక్షతి ।
దణ్డః సుప్తేషు జాగర్తి దణ్డం ధర్మం విదుర్బుధాః ॥

h h h

తస్యాహుః సంప్రణేతారం రాజానం సత్యవాదినమ్ ।
సమీక్ష్యకారిణం ప్రాజ్ఞం ధర్మకామార్థకోవిదమ్ ।
తం రాజా ప్రణయన్సమ్యగ్త్రివర్గణాభివర్ధతే ।
కామాత్మా విషమః క్షుద్రో దణ్డేనైవ నిహన్యతే ।
దణ్డో హి సుమహత్తేజో దుర్ధరశ్చాకృతాత్మభిః ।
ధర్మాద్విచలితం హన్తి నృపమేవ సబాన్ధవమ్ ॥[24]

"రాజులేని ప్రజలు భయంతో చెల్లాచెదురుగా ఉన్నప్పుడు ప్రపంచం మొత్తం రక్షణ కోసం బ్రహ్మదేవుడు రాజును సృష్టించాడు.

"ఇంద్రుడు, వాయువు, యముడు, సూర్యుడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు మరియు కుబేరునినుండి అంశములను గ్రహించి బ్రహ్మ రాజును సృష్టించాడు.

h h h

"ఆ రాజు కార్య సిద్ధి కోసం బ్రహ్మ అన్ని జీవుల రక్షకుడయిన ధర్మమను తన పుత్రుని సృష్టించాడు. బ్రహ్మ-తేజస్సు కలిగిన దండమును కూడా బ్రహ్మ సృష్టించాడు.

h h h

"దండము ప్రజలందరినీ పరిపాలిస్తుంది, దండము రాజువలె ప్రజలను రక్షిస్తుంది; రక్షకులు నిద్రిస్తున్నప్పుడు, దండము మేల్కొని కావలి కాస్తుంది. దండమే ధర్మహేతువు కనుక దానిని ధర్మమని పెద్దలు చెబుతారు.

h h h

"ఆ విధంగా దండమును జరుపువాడగు రాజును సత్యం మాట్లాడేవానిగా, ఆలోచించిన తర్వాత ప్రవర్తించేవానిగా, తెలివైనవానిగా, ధర్మము, కామము తెలిసినవానిగా మనువు మున్నగువారు చెప్పుచున్నారు.

"రాజు ఆదండాన్ని నీతిగా ప్రయోగిస్తే ధర్మార్థ కామాలను సక్రమంగా పొందుతాడు. అలాకాకుండా విషయాభిలాషతో పక్షపాత వైఖరితో ఉండి నీచముగా ప్రవర్తిస్తే, ఆ దండము చేతనే చంపబడతాడు.

"దండమనునది గొప్పవెలుగు రూపంలో ఉంటుంది. అసమర్థులయినవారు దానిని ధరించలేరు. ధర్మాన్ని విడిచిపెట్టిన రాజును, అతని బంధుపుత్ర మిత్రాదులతో కలిపి దండం నాశనం చేస్తుంది."

తేన ధర్మోత్తరశ్చాయం కృతో లోకో మహాత్మనా ।
రంజితాశ్చ ప్రజాః సర్వాస్తేన రాజేతి శబ్ద్యతే॥ [25]

"మహానుభావుడైన రాజు ద్వారా ఈ ప్రపంచం ధర్మమార్గాన సాగుతుంది. ప్రజలందరూ సంతోషిస్తారు. రంజింపచేయువాడు (సంతోషము కలుగజేయువాడు) కనుకనే రాజు అని పిలుస్తారు."

రాజా ప్రజానాం హృదయం గరీయో
గతిః ప్రతిష్ఠా సుఖముత్తమం చ ।
సమాశ్రితా లోకమిమం పరం చ
జయన్తి సమ్యక్పురుషా నరేంద్ర ।
నరాధిపశ్చాప్యనుశిష్య మేదినీం
దమేన సత్యేన చ సౌహృదేన ।
మహద్భిరిష్ట్వా క్రతుభిర్మహాయశా
స్త్రివిష్టపే స్థానముపైతి శాశ్వతం ॥ [26]

"రాజు తన ప్రజలయొక్క హృదయం. వారి ఆశ్రయం. వారి గౌరవం. మరియు ప్రజల యొక్క అత్యున్నతమయిన ఆనందం; రాజుపై ఆధారపడి ప్రజలు ఈ ప్రపంచాన్ని మరియు తదుపరి ప్రపంచాన్ని ధర్మబద్ధంగా జయిస్తారు.

"రాజు కూడా భూమిని ఆత్మనిగ్రహంతో, సత్యంతో, కరుణా హృదయంతో పరిపాలించాలి. ప్రజలకు ఉపయోగపడే అనేక యాగాలు చేసి, శాశ్వతమైన కీర్తిని మరియు స్వర్గములో శాశ్వతమైన స్థానాన్ని పొందుతాడు."

ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా ।
సహస్రం తు పితన్ మాతా గౌరవేణాతిరిచ్యతే ॥[27]

పదిమంది ఉపాధ్యాయులకంటె ఒక ఆచార్యుడు ఎక్కువ.వందమంది ఆచార్యులకంటే ఒక తండ్రి గొప్ప. వేయిమంది తండ్రులకంటె ఒక తల్లి గౌరవమున ఎక్కు వ.

ఆచార్యశ్చ పితా చైవ మాతా భ్రాతా చ పూర్వజః ।
నా ర్తేనాప్యవమంతవ్యా బ్రాహ్మణేన విశేషతః ॥

h h h

తేషాం త్రయాణాం శుశ్రూషా పరమం తప ఉచ్యతే ॥

h h h

త ఏవ హి త్రయో లోకా స్త ఏవ త్రయ ఆశ్రమాః ।
త ఏవ హి త్రయో వేదాస్త ఏవోక్తాస్త్రయోఽగ్నయః ॥

h h h

సర్వే తస్యాదృతా ధరా యస్యైతే త్రయ ఆదృతాః ।
అనాదృతా స్తు యస్యైతే సర్వాస్తస్యాఫలాః క్రియాః॥[28]

h h h

ఆచార్యుడు, తల్లిదండ్రులు, అన్న వీరిచేత తానెంత బాధపడినప్పటికీ వారిపట్ల అగౌరవంగా ప్రవర్తించకూడదు. అందులోను వారిలో ముఖ్యముగా బ్రాహ్మణుని పట్ల అగౌరవంగా ప్రవర్తించకూడదు.

పైన చెప్పిన ముగ్గురికి శుశ్రూష చేయుటయే ఉత్తమమయిన తపస్సుగా చెప్పబడినది.

వారు ముగ్గురే త్రిలోకములు. (1. భూలోకము, 2. స్వర్గలోకము, 3. పాతాళ లోకము. లేదా 1. మనుష్య లోకము, 2. పితృలోకము, 3. దేవలోకము) వారే 03 ఆశ్రమములు. (1. బ్రహ్మచర్యము, 2. గార్హస్థ్యము, 3. వానప్రస్థము) వారే వేదత్రయఫలప్రాప్తి కారణభూతులు కనుక వారే వేదములు. (1. ఋగ్వేదము, 2. యజుర్వేదము, 3. సామవేదము) వారే యజ్ఞాదిఫల దాతలు కనుక త్రేతాగ్నులు (గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని)

ఎవడు తల్లి దండ్రులు గురువు అను ముగ్గురిని ఆదరించునో వానికి సంబంధించిన అన్ని విధులు నెరవేరుతాయి; ఎవడు ఈ ముగ్గురిని తిరస్కరిస్తాడో అతడు చేసే అన్ని కర్మలు ఫలించవు."

ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రామన్తి యూనః స్థవిర ఆయతి,
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే
అభివాదనశీలస్య నిత్యం వృద్ధోప సేవినః
చత్వారి తస్య వర్ధన్త ఆయుః ప్రజ్ఞా యశో బలమ్॥[29]

పెద్దలు వచ్చినప్పుడు భయంతో చిన్నవారి ప్రాణాలు పైకి పోవుటకు సిద్ధముగా ఉంటాయి. కావున వెంటనే లేచి వారికి నమస్కరిస్తే ఆ ప్రాణాలు పైకి పోకుండ స్థిరంగా ఉంటాయి.

పెద్దలకు నమస్కరించే స్వభావం కలిగినవారికి, వారిని సేవించే వారికి ఆయుస్సు, విద్య, కీర్తి, బలం అనేవి అభివృద్ధి చెందుతాయి.

సూచికలు

1. మహాభారతం, సభాపర్వం, xxxviii-8
2. అదే పుస్తకం శాంతిపర్వం
3. అదే పుస్తకం అనుశాసనపర్వం-cxlix
4. విష్ణుపురాణం I, xvi- xx
5. అదే పుస్తకం, I, xi -xii
6. రామాయణం యుద్ధకాండం

7. మహాభారతం శల్యపర్వం xx
8. అదే పుస్తకం, XL
9. అదే పుస్తకం, శల్య మరియు సౌప్తిక పర్వాలు మరియు పూర్వం
10. అదే పుస్తకం సభాపర్వం xxv xxxiii
11. అదే పుస్తకం వనపర్వం, i
12. మహాభారతం శాంతిపర్వం, xc
13. భగవద్గీత 03వ అధ్యాయము
14. రామాయణం అయోధ్యాకాండ, xv- xxx
15. అదే పుస్తకం, xc
16. మహాభారతం, వనపర్వం, ccxiii ccxv
17. మహాభారతం, ఆదిపర్వం c
18. అదే పుస్తకం, ఉద్యోగ పర్వం cxxx
19. మహాభారతం, భీష్మపర్వం xliii
20. అదే పుస్తకం ద్రోణపర్వం cxciii cxoiv
21. మహాభారతం, ఆదిపర్వం cii
22. విష్ణుభాగవతము. Ill స్కంధం - xiv అధ్యాయం 18,19,25,27 శ్లోకాలు
23. శ్వేతాశ్వతరోపనిషత్, vi - 1,7,8,9,12,13 మంత్రములు
24. మనుస్మృతి vii- 3, 4. 14, 18, 26 -28.
25. మహాభారతం, శాంతి పర్వం 12-58-133
26. అదే పుస్తకం 12-67 అధ్యాయం -60, 61శ్లోకాలు
27. మనుస్మృతి 02-145
28. మనుస్మృతి, ii, 225, 229, 230, 234.
29. మనుస్మృతి, ii, 120-121.

అధ్యాయం 9

మన సమానులకు సంబంధించి మనం పెంచుకొనవలసిన సద్గుణాలు, విడువవలసిన దుర్గుణాలు

మన ఇంటిని మరియు మన బాహ్య సంబంధాలను సామరస్యంగా మరియు సంతోషంగా ఉంచడానికి, ప్రతి సందర్భంలోనూ మన చుట్టూ ఉన్న సమానులతో మన సంబంధాలను లెక్కపెట్టాలి. ఇందుకొరకు ఏ ధర్మాలను అభివృద్ధి చేయాలి? ఏ దుర్గుణాలను నివారించాలి? అనే విషయాలు మొదటగా మనకు తెలియాలి. మనం మొదట మన ఇంట్లో వారి గురించి ఆలోచిద్దాం. ఎందుకంటే గృహ సంబంధాలు ప్రాథమిక ప్రాముఖ్యత కలిగి ఉంటాయి; కుటుంబ ధర్మాలను పాటించే స్వచ్ఛమైన మరియు సంతోషకరమైన గృహాలు, శ్రేయస్కరమైన రాష్ట్రాలకు, విజయవంతమైన దేశాలకు పునాది వేస్తాయి.

తల్లిదండ్రులు మరియు పిల్లల మధ్య ఉండవలసిన సంబంధాలను మనం చూసాము. ఇప్పుడు మనం భార్యాభర్తల మధ్య, సోదరులు మరియు సోదరీమణుల మధ్య ఉండవలసిన సంబంధాలను అధ్యయనం చేద్దాం.

హిందూ పుస్తకాలు భార్యాభర్తలు తమలో ఒకరొకరిని బంధించే ప్రేమ లేదా దాంపత్య ప్రేమ కథలతో నిండి ఉన్నాయి. "భార్యాభర్తలు ఒకటే" అని మనువు చెప్పాడు.[1] భార్యాభర్తలు ఒకటే. రెండు కాదు; ప్రేమ ఇద్దరిని ఒక ప్రేమగా చేస్తుంది. భర్త వైపు ఉన్న రక్షణ, ఆశ్రయం, మృదుత్వం; భార్య వైపు ఉన్న ప్రేమ, తీపి, అంకితభావం.

"భార్యాభర్తల మధ్య మరణం వరకు పరస్పర విశ్వాసం కొనసాగాలి."[2] సీతారామచంద్రులు ఆదర్శవంతమైన దంపతులు; వారు జీవితములోని అన్ని సుఖాలను కలిసి ఆనందిస్తారు. జీవితపు దుఃఖాలను కలిసి అనుభవిస్తారు; వారు అన్ని గందరగోళాలలో ఒకరి సలహా మరొకరు తీసుకుంటారు. అన్ని కష్టాలను కలిసి పంచుకుంటారు.

మనము వారిని ముందుగా నిర్మలమైన ఆనందపు వాతావరణంలో గమనిస్తాము. పట్టాభిషేక సందర్భంలో యువరాజు మరియు యువరాణులుగా

అలంకరించినప్పుడు ఇద్దరూ రోజంతా సంతోషంగా ఉన్నారు; రామచంద్రుని పట్టాభిషేక సమయం సమీపిస్తున్నప్పుడు, వారు కలిసి ఉపవాసం మరియు ప్రార్థన చేయడం మనం చూస్తాము; శ్రీరామునికి వనవాస బహిష్కరణ శిక్ష యొక్క కలత వచ్చినప్పుడు, సీత దానిని జాగ్రత్తగా అంగీకరించింది. భర్తతో పాటు తాను కూడా కలిసి ఉండాలనుకొంది. ఆమె అతనితో కలిసి అడవులకు వెళ్లింది. " స్వామీ! నా హృదయములో నిన్నే పూర్తిగా నిలుపుకొనియున్నాను. నీయందే అనురాగము కలిగినదానిని. నీవు నాకు దూరమైతే నేను మరణించుట తథ్యము. నాప్రార్థనను మన్నించి, నన్ను నీవెంట తీసికొనిపోవలసినది" అని సీత రాముని ప్రార్థించింది. "భర్త పక్కన ఉన్నంత వరకు భార్యకు ముళ్ళు మెత్తని నారలాగా చర్మాన్ని తాకుతాయి. దుమ్ము గంధపు పొడిలా ఉంటుంది, గడ్డి దుప్పటిలా ఉంటుంది. వేర్లు మరియు ఆకులు ఆహ్లాదకరమైన ఆహారంగా మారతా"యని చెప్పింది.

"ఓ రామా, నీ సహవాసం స్వర్గం, నీతో లేకపోవడం నరకం." అని సీత రామునికి చెప్పింది. శ్రీరాముడు ఆమెను అయోధ్యలో ఉండమని వేడుకున్నప్పుడు మాత్రమే ఆమె హృదయం గాయపడింది. శ్రీరాముడు ఆమెను తనతో రమ్మని కోరినప్పుడు స్త్రీలు బాగా ప్రేమించే ఖరీదైన వస్త్రాలు మరియు అమూల్యమైన ఆభరణాలన్నింటినీ తన పరిచారకులకు ఎటువంటి బాధాకరమైన నిట్టూర్పు లేకుండా ఉల్లాసంగా ఇచ్చింది. శ్రీరాముని వనవాస బహిష్కరణ తమ భార్యాభర్తలను వేరు చేయలేదనే సంతోషకరమైన వాస్తవంలో ఆమె పొంగిపోయింది.

రాత్రీ పగలు రాముడి పక్కనే ఉన్నందున, ఒక స్త్రీగా సంతోషపడిన సీత, కోల్పోయిన రాజ వైభవాన్ని పట్టించుకోలేదు. దుఃఖాన్ని పట్టించుకోకుండా అడవిలో చెట్లు లేకుండ ఖాళీగా ఉన్న స్థలములలో ఆడుకుంది. ఆమె చాలా తెలివైనది. శ్రీరాముడు దండకారణ్యపు పొలిమేరలలో తిరుగుతున్నప్పుడు ఆలోచనాత్మకమైన మాటలతో తన భర్తకు ఇచ్చిన సలహాలు కూడా మనం వినవచ్చు. సీత బలవంతుడైన రాక్షసుడు రావణుడిచే తీసుకువెళ్ళబడినప్పుడు, ఆమెపై భర్త రామునికి ఉన్న ప్రేమ – సుదీర్ఘమైన అన్వేషణలో, వ్యాకులమైన(కలతనొందిన) విలాపంలో "సీతా ! సీతా!" అంటూ బాధాకరంగా బయటపడింది. శ్రీ రాముడు ఆమె కోసం వెతుకుతూ బాధలో "నువ్వు దాక్కున్నావా? ఆడుకుంటున్నావా ? ఎక్కడున్నావ్? అయ్యో ! ఇంత సుదీర్ఘంగా దాక్కొనే ఆట ఆడకు. అలాంటి ఆట నాకు మరణం." అని విలపిస్తాడు. రావణుడు నమ్మకద్రోహంతో ప్రలోభానికి, భయంకరమైన క్రూరమైన బెదిరింపులకు సీతను

గురిచేస్తాడు. "భర్తకు విధేయురాలినయిన నేను అతనికి ఎప్పటికీ పాపం చేయను. సిరిసంపదలతో నీవు నన్ను ప్రలోభపెట్టలేవు. సూర్యకిరణాలు సూర్యుని స్వంతం. అలాగే నేను రాఘవుని స్వంతం"[3] అని స్థిరంగా సీత రావణునితో చెప్పింది.

మరియు మృత్యు దేవత యముని పట్టు నుండి తన భర్తను గెలుచుకున్న సావిత్రి కథను వినండి.

మద్ర దేశానికి చెందిన రాజు అశ్వపతి. అతడు దేవతలను దీర్ఘకాలంగా పూజించడం ద్వారా ఒక కుమార్తెను పొందాడు. ఆమెను సావిత్రి అని పిలిచేవారు. ఆమె బంగారు రంగుతో అందంగా ఉండేది. మల్లెపువ్వులా మధురంగా ఉండేది. ప్రజలు ఆమెను దేవిగా పూజించేవారు. వారి మంచి పనులు నెరవేరటము కోసం సలహాల కోసం ఆమె వద్దకు వచ్చేవారు. ఆమెకు యుక్తవయస్సు వచ్చినప్పుడు, ఆమె తండ్రి ఆమెతో "నీకు తగిన భర్తను నువ్వే ఎన్నుకో." అని అన్నాడు: ఆమె రాజ పరివారంతో వరాన్వేషణకు బయలుదేరింది. చాలా నెలలు గడిచిన తర్వాత, ఆమె తిరిగి వచ్చినప్పుడు, నారద ఋషి ఆమె తండ్రి వద్దే ఉన్నాడు. నారద సమక్షంలో ఆమె తను చేసిన ఎంపికను ఇలా ప్రకటించింది. "సాల్వ దేశానికి చెందిన రాజు ద్యుమత్సేనుడు. అతడు వృద్ధుడు మరియు అంధుడు. ప్రస్తుతం అతను తన దేశం నుండి శత్రువులచే తరిమివేయబడి, అడవిలో నివసిస్తున్నాడు, సన్యాసి జీవితాన్ని గడుపుతున్నాడు. అతని కుమారుడు, సత్యవంతుడు. అతనిని నేను నా జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకున్నాను."

అప్పుడు నారదుడు ఇలా అన్నాడు: "అయ్యో! రాజా! అమాయకురాలు సావిత్రి కష్టాలు కొనితెచ్చుకొనే పని చేసింది."

"అతను సావిత్రికి తగిన సహచరుడు కాదా?" అని రాజు నారదుని అడిగాడు. "అతను మానసికంగా లేదా శారీరకంగా బలహీనంగా ఉన్నాడా? క్షమకు అర్హుడా? లేదా ధైర్యవంతుడా?" అను రాజు ప్రశ్నకు నారదుడు ఇలా జవాబు చెప్పాడు : "మహారాజా!సత్యవంతుడు ఏదీ కోరుకోడు. సత్యవంతుడు సూర్యుని వలె బలమైన మరియు ప్రకాశవంతమైనవాడు. అతడు దానగుణములో రంతిదేవుడి వంటి ఉదారుడు. శిబి వలె అద్భుతమైనవాడు. యయాతి, మరియు చంద్రునిలా అందమయినవాడు. అయితే ఈ సద్గుణాల సంపద అంతా ఒక సంవత్సరంలోపు భూమి నుండి అతనికి దూరమవుతుంది. అతని ఆయుర్దాయం చాలా తక్కువ."

కుంగిపోయిన హృదయంతో సావిత్రి ఋషి మాటలు విని, ఇలా చెప్పింది: "ఒకవ్యక్తి ఒకేసారి హృదయాన్ని ఇతరులకు అర్పించగలదు. నన్ను నేను సత్యవంతునికి అప్పగించుకొన్నాను. నేను మళ్ళీ ఇంకొకరిని ఎన్నుకోలేను."

నారదుడు ఇలా అన్నాడు: "నీ కూతురు నా మాటలు విన్న తరువాత కూడా (ఆయుర్దాయం చాలా తక్కువ అను మాటలు) వివాహానికి సంకోచించటం లేదు. కనుక ఓ రాజా! నేను వివాహానికి నా ఆశీర్వాదం ఇస్తున్నాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

వేగముగా ప్రయాణం చేసి దూతలు అశ్వపతి దగ్గరినుండి సత్యవంతుని తండ్రి అయిన ద్యుమత్సేనుని వద్దకు వెళ్ళారు. దూతల సందేశం విన్నతరువాత ద్యుమత్సేనుడు అశ్వపతికి ఇలా కబురు పంపాడు: "నేను ఒకప్పుడు నీతో మైత్రిని కోరుకున్నాను. కానీ నేను ఓడిపోయిన ప్రస్తుత స్థితిలో దానిని ఎలా అడగాలో తెలియలేదు. అయితే దైవాశీర్వాదంతో ఇప్పుడు ఆశీర్వదింపబడిన సావిత్రి తన ఇష్టానుసారం మా ఇంటికి వస్తోంది. లక్ష్మీదేవి మా ప్రాచీనకాలపు ఇంటికి తిరిగి వస్తోందని నాకు ఖచ్చితంగా తెలుసు." అలా సావిత్రి సత్యవంతులకు పెళ్లి కుదిరింది.

ఆనందంగా సావిత్రి తన రాజభవనాల నుండి సన్యాసి కుటీరానికి వెళ్ళింది. వృద్ధాప్యంలో ఉన్న తన మామగారి మరియు అత్తగారి కనీస అవసరాలను తీర్చడానికి సేవ చేయటానికి ఆమె ఆత్రుతపడేది. ఇంటిలో అత్యంత నిరాడంబరమైన విధులను నిర్వర్తించడంలో ఆమె ఆనందంగా ఉండేది. తన సున్నితమైన నడవడికతో, ప్రేమ పూర్వక మాటలతో తన భర్త హృదయాన్ని లోబరచుకొంది. కానీ వీటన్నింటితోపాటు, నారదుడి మాటలచే వెలిగించబడిన రహస్య వేదన యొక్క అగ్ని ఎప్పుడూ ఆమె ఆత్మలో మండేది; తన భర్త ఆయుర్దాయానికి నిర్దేశించిన సంవత్సరంలోని రోజులను లెక్కించేది.

చివరకు సత్యవంతుని మరణానికి నియమించబడిన సమయం కేవలం నాలుగు రోజుల దూరంలో ఉందని ఆమె గ్రహించింది. అప్పుడు ఆమె ఉపవాసం మరియు ప్రార్థనల ద్వారా దేవతల సహాయం కోరాలని నిర్ణయించుకుంది. ఆమె మూడు రోజులూ ఒక చుక్క నీరు తీసుకోకుండా ఉపవాసం చేసింది. సత్యవంతునికి మరణం నిర్ణీతమయిన రోజున తెల్లవారుజామున ఆమె లేచి, ప్రాతఃకాల కర్మలను ముగించి, తన పెద్దల పాదాలకు నమస్కరించింది.

ఆ అడవిలో నివసించే తపస్వులందరూ ఆ రోజు ఆమెకు వైధవ్యం యొక్క బాధలు తెలియకూడదని ఆశీర్వదించారు. ఆ రోజున సత్యవంతుడు గొడ్డలిని భుజంపై వేసుకుని పని కోసం అడవిలోకి వెళ్ళే సమయం వచ్చినప్పుడు, ఆమె తన హృదయాన్ని దృఢంగా చేసుకొని అతనిని అనుసరించింది. సత్యవంతుడు ఎందుకని ఆశ్చర్యంగా అడిగాడు; కానీ ఆమె ఆ రోజు అతనితో రావాలని కోరుకుంటున్నట్లు చెప్పింది; వారిద్దరూ కొండల అందాలను, ప్రవాహాలను, అడవులను పక్షులను మరియు జంతువులను చూస్తూ వెళ్ళారు. అప్పుడు సత్యవంతుడు తన రోజువారీ పనులను ప్రారంభించాడు. తన సంచీని పండ్లతో నింపాడు . వంటచెరకు కోసం ఎండిన కొమ్మలను నరికాడు.

కానీ అకస్మాత్తుగా అతనికి మూర్ఛ వచ్చింది. తనకు బాగా తలనొప్పిగా ఉన్నదని సావిత్రితో చెప్పి పడుకున్నాడు. అప్పుడు సావిత్రి తన ఒడిలో అతని తలను ఉంచి, బాధాతప్త హృదయంతో, ఏమి తెలియనట్లుగా ఎదురుచూసింది. అంతలో ఆమె ఒక్కసారిగా గంభీరమైన మరియు విస్మయం కలిగించే ఒక రూపాన్ని చూసింది. చీకటిగా ఉన్నప్పటికీ మెరుస్తూ, ఎర్రటి దుస్తులు ధరించి, తన పక్కన నిలబడి, స్థిరమైన మెరుస్తున్న కళ్ళతో ఆ రూపం సత్యవంతుని వైపు చూస్తోంది. ఆమె మెల్లగా తన భర్త తలను నేలపై ఉంచి, లేచి నిలబడి ఆ రూపానికి నమస్కరించింది. ఆ రూపం సావిత్రితో ఇలా చెప్పింది: " సత్యవంతుని యొక్క రోజులు ముగిసాయి: నేను మృత్యువుకు ప్రభువును, యముడిని. సత్యవంతుడు చాలా ధర్మవంతుడు కాబట్టి, నా దూతలను పంపకుండా నేనే అతనిని తీసుకెళ్లడానికి వచ్చాను." అని చెప్పి యముడు సత్యవంతుని మాంస శరీరం నుండి సూక్ష్మ శరీరాన్ని బయటకు తీసి, దానితో దక్షిణం వైపుకు బయలుదేరాడు.

యముని సావిత్రి కూడా అనుసరించింది. అప్పుడు యముడు ఇలా అన్నాడు: "నాతో ప్రయాణాన్ని విరమించుకో, సావిత్రీ! తిరిగి వెళ్లి నీ భర్తకి అంత్యక్రియలు నిర్వహించు. నీవు నీ కర్తవ్యాన్ని నిర్వర్తించావు. మర్త్యుడు వెళ్ళగలిగినంత దూరం నీ భర్త వెనుకగా వచ్చావు. ఇక వెనక్కి వెళ్ళిపో" సావిత్రి ఇలా సమాధానమిచ్చింది: "యమా!నా భర్త ఎక్కడికి వెళ్తాడో, నేను అక్కడికి వస్తాను. ఇది భార్యాభర్తలకు శాశ్వతమైన చట్టం. నేను నా స్వామిని విడదీయలేని ప్రేమతో ప్రేమిస్తే, నా పెద్దలకు భక్తితో సేవ చేసినట్లయితే, తపస్సులలో ఏదైనా శక్తి ఉంటే, అప్పుడు నా మార్గానికి ఏది కూడా నీ అనుగ్రహం ద్వారా అడ్డురాకుండా ఉంటుంది" ఇలా అమాయకంగా

చిన్న పిల్లలా– ప్రేమగల పెద్దలు మరియు తన సున్నితమైన ఆత్మ తనకు నేర్పిన ధర్మ పాఠాలను –యముని దగ్గర సావిత్రి పునరావృతం చేసింది.

విశ్వసనీయమైన సేవ ద్వారా, ఇంటిని సక్రమంగా నడపటం ద్వారా, జ్ఞానాన్ని మరియు భక్తిపరమైన అర్హతను నేను గెలుచుకున్నాను. ఓ యమా! నువ్వు నడిచే ఈ నీ మార్గాలను నేను నడవనీయకుండా మూసివేసి , నాకు లభించిన అనుగ్రహ ఫలాలను కోల్పోయేటట్లు చేయకు." అని సావిత్రి ప్రార్థించగా, "నువ్వు తెలివైనదానివి. నీ మాటలు సహేతుకమైనవి, ఓ సావిత్రీ, నీ మాటలు మధురమైనవి. నీ భర్త ప్రాణము కాక , నేను నీకు ఏదైనా వరం ఇస్తాను కోరుకో ." అని యముడన్నాడు. "నా భర్త తండ్రి గుడ్డివాడు. చీకటిలో నివసిస్తున్నాడు. దయగల యమరాజా! నీ దయతో అతని కళ్ళు చూడనివ్వండి." అని సావిత్రి కోరింది. " భూలోకపు స్త్రీలలో అత్యంత సుందరీ ! సావిత్రీ ! నువ్వు కోరిన వరం నేను ఇస్తాను. ఇప్పుడు తిరిగి వెళ్ళిపో. భూమిపై నడవటానికి మాత్రమే సామర్థ్యం కలిగిన నీ పాదాలు, మృత్యువు యొక్క చీకటి మార్గములో నడవలేవు." అని యముడన్నాడు.

"నా భర్త ఎక్కడికి వెళ్తాడో, అక్కడిదాకా నేను అతనిని ఇంకా అనుసరించాలి. ఓ యమ ధర్మరాజా ! నీవంటి వారితో సహవాసము ఫలవంతమైనది. నీతియుక్తమైనది. మధురమైనది. ఎప్పుడూ నిష్ఫలము కాదు. నా మాటలలో న్యాయాన్ని ఎవరైనా ఋజువు చేయవచ్చు. ఇది సత్యం." అని సావిత్రి అన్నది.

"సాటిలేని స్త్రీ వయిన సావిత్రీ! నీమాటల ఫలముగా రెండవ వరం తీసుకో, కానీ నీ భర్త యొక్క ప్రాణాన్ని అడగవద్దు," అన్నాడు యముడు. " మర్త్య లోకాలకు రాజువయిన యమా ! దుష్టుల ద్వారా కోల్పోయిన తన రాజ్యాన్ని నా భర్త తండ్రికి తిరిగి ఇవ్వండి.." అని సావిత్రి అడిగింది. "అతను తన సింహాసనాన్ని తిరిగి పొందుతాడు," అని యముడు అనుగ్రహించి, "నీ భర్త తండ్రి (మామగారు) రాజ్యంతిరిగి పాలిస్తాడు. ఇప్పుడు వెనుకకు వెళ్ళు. ఇంకా నన్ను అనుసరించవద్దు." అని చెప్పాడు. కానీ మధురమైన మాటలతో మరియు మధురమైన ప్రశంసలతో, సావిత్రి మృత్యు ప్రభువును (యముని) అనుసరిస్తూనే ఉంది. అతని నుండి తన తండ్రికి వంద మంది కొడుకులను మరియు తనకు వంద మంది కొడుకులను మరో రెండు వరాలుగా సావిత్రి గెలుచుకుంది.

సావిత్రి యముని యొక్క ధర్మప్రవృత్తిని, కర్తవ్య నిర్వహణలోని గొప్పతనాన్ని

ప్రశంసిస్తూ మాట్లాడింది. నాల్గవ వరం అడగటంలో సావిత్రి తన వాగ్ధాటి మరియు వివేకమును ప్రదర్శించింది. ఆ గుణములకు యముడు ముగ్ధుడయ్యాడు. ఆమెకు మరో వరం అనుగ్రహించాడు. యముడు ఆమెకు వందమంది కుమారులను ప్రసాదించాడు కాబట్టి వెంటనే సావిత్రి తన భర్త ప్రాణాలను కోరుకుంది. తన భర్తకాక ఆ వందమంది కుమారులకు తండ్రి మరెవరైనా అయితే ధర్మానికి భంగం కలుగుతుంది. అందువలన ఇచ్చిన వరాన్ని నిలబెట్టుకోవటానికి యమునికి సావిత్రి భర్తను తిరిగి బతికించక తప్పలేదు. ఈ విధంగా విశ్వాసపాత్రమైన భార్య తన భర్తకు మరణంపై గెలుపును సాధించటానికి సహకరించింది. అతని కుటుంబానికి శ్రేయస్సు, సంపద మరియు దీర్ఘాయువును తెచ్చిపెట్టింది. మృత్యురాజయిన బలవంతుడయిన యముడు కూడా పతివ్రతయైన భార్య యొక్క నమ్మకమైన ప్రేమ కంటే బలహీనుడు.[4]

నలుని భార్య దమయంతి కథను ఏ హిందూ బాలుడు మరచిపోలేడు. వీరసేనుని కొడుకు నలుడు. అతడు నిషధ దేశపు రాజు విదర్భదేశ రాజయిన భీముని కుమార్తె దమయంతిని నలుడు ఇష్టపడ్డాడు. దమయంతి కూడా నలుడిని ప్రేమించింది. వారు ఒకరినొకరు కలుసుకోలేదు. కానీ ఆ ఇద్దరిలో ప్రతి ఒక్కరూ భూమిపై సాటిలేనివారు అని ఇంకొకరి గురించిన ప్రశంసలను విన్నారు. ఈ సందర్భంలో యువరాణి దమయంతి యొక్క స్వయంవరం ప్రకటించబడింది . అక్కడికి నల మహారాజు వెళ్ళాడు. దేవతలయిన ఇంద్రుడు, అగ్ని, వరుణుడు మరియు యముడు, స్వయం వరానికి వచ్చినప్పటికీ దమయంతి నలుని తన భర్తగా ఎంచుకున్నది. నలుడు మరియు దమయంతి పదకొండు సంతోషకరమైన సంవత్సరాలు పరస్పర ప్రేమతో కలిసి జీవించారు. వారికి ఇద్దరు పిల్లలు జన్మించారు.

పన్నెండవ సంవత్సరంలో పుష్కరుడు వచ్చి, పాచికలు ఆడమని నలరాజుతో సవాలు చేసాడు. నలుడు ఆడి, పదే పదే ఓడిపోయాడు. సుదీర్ఘకాలం వరకు కొనసాగిన ఆ పాచికలాటలో తన రాజ్యాన్ని మరియు తన సంపదను, తన వస్త్రాలను కూడా నలుడు కోల్పోయాడు. తన శరీరాన్ని సగం కప్పిన, ఒకే ఒక గుడ్డతో ప్రవాసానికి (=దూరదేశ వాసము.) నలుడు బయలుదేరాడు. అప్పుడు అతని భార్య దమయంతి తన పిల్లలను తన తండ్రి వద్దకు పంపింది. పాచికలాట ఎలా జరుగుతున్నదో పరిణామమేమిటో గమనించింది. నలుని వెంట తాను కూడా ఒకే గుడ్డ ధరించి అతనిని అనుగమించింది. వారు ఆకలితో మరియు దాహంతో నగర

శివార్లలో తిరిగారు. ఆకలి కష్టం పోగొట్టుకోవటానికి , ఆహారం కోసం కొన్ని పక్షులను పట్టుకునే ప్రయత్నంలో నలుడు తన శరీరముపై ఉన్న గుడ్డను పోగొట్టుకున్నాడు. నిస్సహాయంగా మరియు నిరాశతో, అతను దమయంతి ఆకలి బాధ నుండి బయటపడాలని కోరుకున్నాడు, ఆమె తండ్రి ఇంటికి వెళ్ళమని పదే పదే ఆమెకు నలుడు సూచించాడు.

కానీ దమయంతి, అతనిని అంటిపెట్టుకుని ఏడ్చింది. ఆమె అతన్ని విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళనని చెప్పింది. నలుడు అలసిపోయినప్పుడు తాను అతనిని ఓదారుస్తానని చెప్పింది. "అన్ని రోగాలలో గొప్పరోగం దుఃఖం. గొప్పదుఃఖమనే రోగంతో బాధపడుతున్న వానికి మంచిమందు భార్య . భార్యతో కలిసి ఉన్నవాడికి ఎంతటి కష్టాలైనా అనుభవిస్తున్నట్లు అనిపించవు. ఓ నలమహారాజా! విసిగిఉన్న సమయాలలో, బడలిపోయిన సమయాలలో, ఆకలి అయిన వేళలో, దాహం వేసినపుడు, మగవాడికి ప్రేమతో తోడ్పడి, భార్యయే అతడి మనస్సులోని దుఃఖాలను పోగొడుతుం"దని దమయంతి నలునికి వివరించింది. ఒకరోజు శ్రమతో బాగా అలసిపోయి, ఆమె నేలపై పడుకుని గాఢంగా నిద్రపోతోంది. నిదుర రాని నలుడు ఆమెను అలా చూస్తూ తనతో దమయంతి బాధపడటం సహించలేకపోయాడు.

"నేను దమయంతి బాధను ఓర్చుకోలేకపోతున్నాను. కాబట్టి ఎక్కడికైనా వెళతాను. నేను వెళ్ళిపోతే నేను కనబడక, చేసేది లేక తన బంధువుల దగ్గరకు వెళ్ళిపోతుంది. ఆ విధంగా ఆవిడకు నాతో అడవిలో పడే బాధలు తగ్గుతాయి'– అని నలుడు ఆలోచించి, తన దగ్గర ఉన్న కత్తితో, ఆమె కట్టుకున్న గుడ్డలో సగం విడిచిపెట్టి, సగానికి కత్తిరించాడు; మరియు కత్తిరించిన సగాన్ని చుట్టుకొని, అతను ఆమె నుండి దుఃఖంతో, కలిప్రభావంతో ఆమెను విడిచి వెళ్లిపోయాడు.

నిస్సహాయయైన దమయంతి మేల్కొన్నది. నలుడు లేక తాను ఒంటరిగా ఉన్నట్టు గమనించింది. తాను ఒంటరినయ్యాననే తన స్వంత బాధ కంటే నలుడు ఒంటరిగా ఉన్నాడనే భావన. ఆమె దుఃఖాన్ని మరింత పెంచింది. ఆమె తన భర్తకోసం ఆత్రంగా వెతికింది. కానీ అతనికి బదులుగా ఒక పెద్ద పాము (కొండచిలువ) కనిపించింది. అది ఆమెను గట్టిగా చుట్టేసింది. ఆ తరువాత ఆమె కొండచిలువనుండి ఎలా తప్పించుకుంది మరియు ఆమె చేది దేశంలోని రాజ మాతకు ఆశ్రయం పొందే వరకు ఆమెకు ఎలాంటి తాజా ప్రమాదాలు ఎదురయ్యాయి అనేది

నలోపాఖ్యానంలో సుదీర్ఘంగా చెప్పబడింది. ఇంతలో నలుడు దావాగ్నితో చుట్టుముట్టిన ఒక పామును (కర్కోటకుడు) రక్షించాడు. తరువాత పాము యొక్క మాయాజాలంతో (కాటుతో) నలుని రూపం గుర్తు పట్టలేనంతగా మారిపోయింది.ఆ తరువాత ఆ కర్కోటకుని మాటలను అనుసరించి నలుడు ఋతుపర్ణ మహారాజు నగరానికి చేరుకొని, అతని రథ సారధి అయ్యాడు.

ఒకరినొకరు ఎంతో బాగా ప్రేమించే భార్యాభర్తలు ఆ విధంగా విడిపోయారు. విదర్భరాజు భీముడు నలదమయంతులను వెతకడానికి బ్రాహ్మణులను పంపాడు. వారిలో ఒకరైన సుదేవుడు, చేదిరాజు రాజధానికి చేరి అక్కడ అంతః పురంలో దమయంతిని గుర్తించాడు. రాజమాతకు దమయంతి యొక్క దయనీయమైన కథను సుదేవుడు చెప్పాడు. రాజమాత ఆనందంతో నిండిన హృదయంతో దమయంతిని కౌగిలించుకొని "నేనూ, నీతల్లీ దశార్ణరాజు పుత్రికలం. నీ తల్లి విదర్భ రాజు భార్య కాగా నేను వీరబాహుని భార్యను అయ్యాను'- అని చెప్పగా దమయంతి ఆమె పాదాలకు నమస్కరించింది.

అప్పుడు దమయంతి, చేది రాజ్యంలో ఉత్తేజకరమయిన ఆతిథ్యం పొందుతున్నప్పటికీ, తన తండ్రి ఇంటికి బయలుదేరింది. భీమరాజు నలుని వెతకడానికి మళ్లీ దూతలను పంపాడు. తన భర్తని వెదకటానికై వెళ్ళే బ్రాహ్మణులతో దమయంతి ఇలా నలునికి మాత్రమే అర్థమయ్యే సూచనలు చేసింది.

"నలుడు ప్రస్తుతం పదవిని కోల్పోయాడు కాబట్టి ఇతరులు తనను గుర్తించకుండ అజ్ఞాతవాసం చేస్తూ ఉంటాడు. మీరు పలుదేశాలకు వెళ్ళినపుడు అక్కడి సభలలో ఈవిధంగా పలకండి.

'నీవు నిత్యసత్యవ్రతుడివి. నీభార్యను మోసంచేసి అమెచీరను సగం చింపి నీవు కట్టుబట్టగా చేసికొని. పోవటం నీకు న్యాయమా? నీవు ఇటువంటి దయలేని కఠినమైన బుద్ధిని చూపుట తగునా? అటువంటి పతివ్రతా శిరోమణి పట్ల దయ చూపించు అని అన్ని చోట్ల చెప్పండి. ఎవరైన ఆ మాటలు విని రోషం చెంది ఎదురు సమాధానం చెబుతారో అతనిని నలునిగా గుర్తించి, అతడికి నా విషయం తెలిపి అతడిని ఇక్కడికి తీసుకొని రండి. ఒకవేళ అతడు ఇంటికి రాకపోతే ఆ వ్యక్తిని గుర్తుపెట్టుకొని మీరు తిరిగి రండి'."

దమయంతి సూచనలు అనుసరిస్తూ బ్రాహ్మణ దూతలు చాలా కాలం నలునికోసం వెతికారు. తిరిగివచ్చిన దూతలలో ఒకడయిన పర్ణాదుడు అనే బ్రాహ్మణుడు దమయంతికి ఈ విధంగా చెప్పాడు:

'నేను అయోధ్యకు వెళ్లాను. అక్కడ ఋతుపర్ణుడి సభలో నీవు చెప్పిన మాటలు చెప్పాను. ఒక కురూపి, కురుచ చేతులవాడు, వంటలు చేయటంతో నేర్పు కలవాడు, వేగంగా ప్రయాణం చేయటంలో నేర్పు కలవాడు, బాహుకుడు అనే గుర్రాల శిక్షకుడు నా మాటలు విని, నన్ను రహస్యంగా కలిసికొని బాధతో నాతో ఈ విధంగా చెప్పాడు.

'భర్తలో తప్పులున్నాయని తెలిసి కూడ సహించే భార్య ఎప్పటికైనా ఈ లోకంలో భర్త నుండి తాను కోరిన సుఖాన్ని పొందుతుంది. ఆ సహించిన పుణ్యంవలన మరుజన్మలో ధర్మంపట్ల ప్రీతిని పొందుతుంది.'

దమయంతి ఈ మాటలు విని తన తెలివితేటలతో నలుని తన దగ్గరకు తీసుకురావడానికి ఒక మార్గాన్ని కనిపెట్టింది.

సుదేవుడను దూతతో దమయంతి ఇలా చెప్పింది.

"విదర్భ ప్రభువు భీముడు నలుడిని వెతకటానికి అనేకమందిని పంపాడు. ఎక్కడా అతడి జాడను తెలుసుకోలేక, దమయంతికి ద్వితీయ స్వయంవరాన్ని రేపు ఏర్పాటు చేసాడు. ఆ స్వయంవరానికి భూమండలంలోని రాజులందరూ వస్తున్నారు. "ఈ వార్త మిక్కిలి వేగంగా ఋతుపర్ణుడికి నివేదించుము' అని దమయంతి సుదేవునికి చెప్పి అతనిని పంపించింది.

ఎందుకంటే, నలుడు తప్ప మరెవరూ రథం అంత వేగంగా నడపలేరని, అయోధ్య నుండి తన తండ్రి రాజభవనానికి అంత తక్కువ సమయంలో చేరుకోలేరని ఆమెకు తెలుసు. ఆమె అనుకున్నట్లుగానే జరిగింది. సుదేవుడు అయోధ్యాపురికి వెళ్ళి చేరి ఋతుపర్ణుడిని కలిసి విదర్భానగరములో దమయంతి ద్వితీయస్వయంవరం మరునాడు జరుగుతుందని చెప్పాడు. ఋతుపర్ణుడు బాహుకుడిని పిలిచి తనకు దమయంతీ స్వయంవరం చూడాలని ఉన్నదని, అయితే, ఒక రోజులో మనం విదర్భ చేరవలసి ఉన్నదని నలుని చాతుర్యం, అశ్వనైపుణ్యం చూపమని చెప్పగా బాహుకుడు అట్లాగే చేస్తానని చెప్పి, తన మనస్సులో బాగా బాధపడ్డాడు. వాయువేగం

కలిగిన గుర్రాలను ఎంచుకుని, వాటిని రథానికి కట్టి బాహుకుడు రథాన్ని నడిపాడు. అతను మాత్రమే అంతవేగంగా రథాన్ని నడపగలడు. పొద్దుకుంకే వేళకు విదర్భ నగరానికి చేరుకున్నారు.

సాయంత్రం, దమయంతి యుక్తిగా నలుడా కాదా అని నిర్ధారించుకోవటానికి కేశిని అనుదాసిని బాహుకుని దగ్గరకు పంపింది. తానెవరిని అని కేశిని అడిగిన ప్రశ్నకు “అయోధ్యనుండి నేరుగా ఇచటికి నూరు ఆమడల దూరం. (ఆమడ= 8 మైళ్ళు) అంత దూరమున్నా ఋతుపర్ణ మహారాజు ఒక రోజు ప్రయాణంలో వచ్చాడు కదా ! అతని రథసారథిని నేను. నేను గూడ అతనితోపాటు మనోవేగంతో వచ్చాను– అని వేరుగా చెప్పాలా?’ అని తాను నలుడిననే సంకేతాలు ఇస్తూ మాట్లాడాడు. (ఋతుపర్ణ మహారాజు రథసారథిని నేను అను మాట వాచ్యం. ఒక్కరోజులో నూరు అమడల దూరపు వేగంతో రథం నడుపగలవాడు నలుడు మాత్రమే. ఇది సంకేతార్థం) ఆ తరువాత కేశినిని తోడిచ్చి నలుని దగ్గరకు తన కొడుకును కూతురును దమయంతి పంపించింది. ఆమె అనుమానించినట్లుగానే పిల్లలని చూసి వశం తప్పి నలుడు కన్నీరు పెట్టుకొన్నాడు. వంట చేయటంలో బాహుకునిలో నల లక్షణాలను దమయంతి గ్రహించింది. తర్వాత దమయంతి తల్లి తన భర్త భీముని అనుమతి పొంది బాహుకుని దమయంతి దగ్గరకు తీసుకురావాలని సేవకులను ఆదేశించింది. భర్త మరియు సత్యవంతురాలయిన భార్య ఒకరినొకరు గుర్తు పట్టారు. చాలా కాలం తర్వాత వారు వివాహం చేసుకున్న ఆనందంలో జీవించారు. విరహతాపం పోయింది. వారి రాజ్యం వారికి తిరిగి వచ్చింది. వారి పిల్లలు వారి చుట్టూ చేరి ఆనందంగా గడిపారు.[5]

అంతేకాకుండా, తన భర్తను నిజంగా ప్రేమించే మరియు సేవచేసే భార్య దీర్ఘమైన తపస్సు మరియు బాధాకరమైన తపస్సుల ద్వారా పొందగలిగే దానికంటే ఎక్కువ అంతర్గత అభివృద్ధి మరియు జ్ఞానాన్ని పొందుతుంది. అందుకోసం మనం కౌశికునికి కోపం తెప్పించిన బ్రాహ్మణ భార్య కథ చదువుదాం.

బ్రాహ్మణ కౌశికుడు గొప్ప తపస్సు చేసాడు. ఒకరోజు అతను ఒక చెట్టు కింద ధ్యానంలో కూర్చున్నాడు, ఒక కొమ్మ మీద కూర్చున్న కొంగ అతనిపై రెట్టవేసి అతనిని కించపరిచింది.

అతను కళ్ళు తెరిచి కొంగ వైపు కోపంగా చూసాడు; తపస్సు ద్వారా కౌశికునిలో

నిక్షిప్తమైన ఆధ్యాత్మిక శక్తి అటువంటిది. ఆ కోపంతో కూడిన చూపుతో కొంగ పిడుగుపాటుకు గురైనట్లు చంపింది. కొంగ మరణించినందుకు కౌశికుడు విచారపడ్డాడు. అదే సమయంలో తాను మహా తపశ్శక్తిని కలిగి ఉన్నానని భావించి అది పరీక్షించిన గర్వము కూడా కలిగింది. అతను తన రోజువారీ భోజనం కోసం ఎప్పటిలాగే ఒక పొరుగు పట్టణంలోకి వెళ్ళాడు . భోజనం కోసం తనకు ఎదురైన మొదటి ఇంటిలోని ఉత్తమ గృహిణిని యాచించాడు. ఆమె అతనికి ఆహారం తీసుకువస్తుండగా, రోజువారీ పనితో అలసిపోయి, దుమ్ముతో కప్పబడిన ఆమె భర్త ఎదురయ్యాడు. కౌశికుని కొద్దిసేపు వేచి ఉండమని చెప్పి, ఆమె తన భర్తకు సేవ చేయటం ప్రారంభించింది. సమయం గడుస్తోంది. కౌశికునిలో అసహనం పెరిగింది.

ఆఖరికి చాలా సమయం తరువాత కౌశికునికి కావాలసిన ఆహారం తీసుకుని ఆమె తిరిగి వచ్చింది. కౌశికుడు కొంగను చూసినదానికంటే కోపంగా ఉన్న కళ్ళతో ఆ పతివ్రత వైపు చూసి, "ఇంతసేపు ఈ బ్రాహ్మణుని ఎలా నిర్లక్ష్యం చేసావు?" అని అడిగాడు. ఆ పతివ్రత సున్నితంగా సమాధానం చెప్పింది: "నీ కంటే నా భర్త పట్ల నా కర్తవ్యం చాలా అత్యవసరం. నీ కోపాన్ని అరికట్టుకొని క్షమాగుణం నేర్చుకో. బ్రాహ్మణా! కోపంతో నన్ను చూడకు; అది నిన్నే గాయపరుస్తుంది. నేను కొంగను కాదు!"

ఆమె ప్రశ్న కౌశికుని నెత్తిన పిడుగుపడినట్లయింది. ఆమెకు ఇంత శక్తి ఎలావచ్చిందని కౌశికుడు ప్రశ్నించాడు. ఆ పతివ్రత ఇలా సమాధానమిచ్చింది: "ఆధ్యాత్మిక తపశ్శక్తులను సేకరించేందుకు నేను ఎలాంటి తపస్సు చేయలేదు; నా భర్తకు ఏకాగ్రత కలిగిన మనస్సుతో మాత్రమే సేవ చేసాను. సాధారణ గృహ విధుల గురించి, ధర్మ సూక్ష్మాల గురించి మీరు ఇంకా ఎక్కువ నేర్చుకోవాలనుకొంటే, ఇక్కడ దూరముగా ఉన్న మిథిలలోని ధర్మవ్యాధుడు అను బోయవాని వద్దకు వెళ్లండి."

కౌశికుని వినయపూర్వకమైన మనస్సుతో మిథిలకు వెళ్ళాడు. అక్కడ పతివ్రత చెప్పిన ధర్మవ్యాధుని మాంసపు దుకాణం చుట్టూ పెద్ద సంఖ్యలో కొనుగోలుదార్లు ఉన్నారు. మాంస వాతావరణంలో కౌశికుడు ఇమడలేక ప్రక్కకు ఒదిగి ఒకచోట నిలబడి ఉన్నాడు. ధర్మవ్యాధుడు కౌశికుని చూసి, అతని వద్దకు వెళ్లి, నమస్కరించి ఇలా అన్నాడు: "విశ్వసనీయ పతివ్రత నిన్ను నా వద్దకు ఎందుకు పంపిందో నాకు తెలుసు! నీ సందేహాలను పరిష్కరించి, ఎందుకు నేను ఇలా విధులు నిర్వహిస్తానో(

మాంసము అమ్ముట మొదలైనవి) నీకు తెలియచేస్తాను."అంటూ కౌశికుని తన ఇంటికి తీసుకువెళ్ళి, ధర్మవ్యాధుడు ఇంతకు ముందే మనం చూసిన అతని వృద్ధ తల్లిదండ్రులను కౌశికునికి చూపించాడు.[6]

సోదరులు సోదర ప్రేమను ఎలా ప్రదర్శించాలో మనం రామాయణం మొత్తం కథలో చదువుతాము. లక్ష్మణుడు రామునికి జీవితంలాంటివాడని,అద్భుతమైన అనుబంధంలో చాలా ప్రియమైనవాడని తెలుసుకొంటాం. వారు విడిగా నిద్రపోరు. విడిగా ఆటలలో పాల్గొనరు; లక్ష్మణుడు రామచంద్రునితో అడవిలోకి అనుగమించాడు. రాముడు నిద్రిస్తున్నప్పుడు మేల్కొని ఉండడం మనం చూస్తాము; అతను సీత కోసం అన్వేషణలో పాలుపంచుకోవడం మనం చూస్తాము. సలహాలలో ఎప్పుడూ తెలివైన సలహాలిచ్చేవాడు. సహానుభూతితో ప్రేమించేవాడు; బలిష్ఠుడైన రావణుడు యుద్ధములో తన బల్లెముతో లక్ష్మణుని తీవ్రముగా దెబ్బతీయుటవలన ఆ శూరుడు రక్తసిక్తదేహుడై రణభూమియందు మూర్ఛపోయాడు. అప్పుడు, రాముని దయతో కూడిన మాటలు వినండి:

"ఇప్పుడు నా తమ్ముడు లక్ష్మణుడు యుద్ధభూమిలో ఇలా గాయపడి ఉన్నాడు. అయ్యో ... లక్ష్మణా ! ఎందుకు, నన్ను వదిలి ఇతర లోకాలలో తిరుగుతున్నావు? నువ్వు లేకుండా, ఇక నాకు ఈ యుద్ధముతో కాని రాజ్యముతోకాని ఉపయోగము ఏముంది? సీతతో గాని, చివరకు నాప్రాణములతో కూడా నాకేమిపని?"

మహాభారతం యొక్క మొత్తం కథ సోదర ప్రేమ మరియు ఐక్యత ఎలా శ్రేయస్సుకి కీర్తికి దారితీస్తుందో చూపిస్తుంది; ఎందుకంటే అన్నదమ్ములయిన పాండవులలో వ్యక్తిగత ఆసక్తుల కొరకు పోరాటాలు లేదా వారి విడిపోయిన జీవితాలు మనం మహాభారతంలో ఎక్కడా గుర్తించలేము. యుధిష్ఠిరుడు (యుధి తిష్ఠతి యుద్ధంలో ఉండువాడు కనుక ధర్మరాజునకు యుధిష్ఠిరుడనిపేరు) మొత్తం కుటుంబానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. మరియు యువకులయిన అతని తమ్ముల ప్రయత్నాలన్నీ అతని సుసంపన్నత మరియు శ్రేయస్సు కోసం నిర్దేశించబడతాయి. ధర్మరాజు కోసం తమ్ముళ్లు పోరాడుతారు. ధర్మరాజు కోసమే వారు ఐశ్వర్యాన్ని సంపాదిస్తారు; ధర్మరాజు కోసమే అర్జునుడు క్లిష్టమైన తపస్సు మరియు భీకర పోరాటాలు చేస్తాడు. దివ్యాస్త్రాల కోసం సుదీర్ఘమైన మరియు అలసిపోయిన సంచారాలు చేస్తాడు. వాటిని గెలుస్తాడు. అన్నగారయిన యుధిష్ఠిరుని సంతోషాలు మరియు దుఃఖాలను తన స్వంతంగా భావిస్తాడు.

యుధిష్ఠిరుడు స్వర్గానికి చేరుకున్నాడు. అతని సోదరులు మరియు భార్య కనబడక వారికోసం నలువైపులా చూసాడు. వారు కనబడకపోయేసరికి "నా సోదరులు పోయిన చోటికి వెళ్లాలని నేను కోరుకుంటున్నాను," అని మళ్లీ మళ్లీ అతను విలపిస్తాడు. ప్రకాశవంతమైన దేవతలు మరియు విజయశీలులైన రాజులు ఎంతోమంది స్వర్గంలో ఉన్నారు. కానీ వారి మధ్య, ఎక్కడా, అతను ఎంతో ఇష్టపడే సోదర ముఖాలను ధర్మరాజుకు కనబడలేదు.

"బలవంతులారా!" అని సోదరులకోసం అరిచాడు. "సోదరులు లేకుండా నాకు ఈ స్వర్గం ఎందుకు? నా సోదరులు ఉంటేనే స్వర్గం. వారు లేని స్వర్గం నాకు స్వర్గం కాదు." అని దేవతలతో చెప్పాడు. అప్పుడు దేవతలు ఒక స్వర్గపు దూతను ధర్మరాజు దగ్గరికి పంపారు. ధర్మరాజుని ముందుకు నడిపించి, అతనికి ప్రియమైనవారు నివసించే భూమికి తీసుకెళ్లమని ఆ దూతకు దేవతలు చెప్పారు; స్వర్గమునుండి వెనుదిరిగి, బయటకు వెళ్లి, ధర్మరాజుతో పాటు దేవదూత గాఢమైన చీకటిమార్గంలోనికి నడవడం ప్రారంభించాడు.

రాను రాను వారు నడుస్తున్న ఆ మార్గములో గాలి తీవ్రత పెరిగింది. చీకటి ఇంకా గాఢంగా మారింది. వారు నడుస్తున్న దారిలో వెంద్రుకలు, ఎముకలు విస్తారంగా దట్టంగా పడిఉన్నాయి. దోమలతో, ఈగలతో ఆ దారి రోతగా ఉంది. నడుస్తున్న కొద్దీ క్రిములతో, పురుగులతో రక్తమాంసాల గుట్టలతో, శవాల దుర్గంధంతో, భయంకరంగా వాడిగా ఉన్న నాసికా పుటాలు కలిగిన కాకుల అరుపులతో ఆ దారి చూడటానికి జుగుప్స కలిగిస్తోంది.

దూతతో పాటు ధర్మరాజు ఆ దారిలో వెళ్ళగా వెళ్ళగా బాగా మరగ గాచిన నూనెవలె తెర్లుతున్న నీళ్ళు కనిపించాయి. ఇనుపముక్కలవంటి ముళ్ళు, వాడి కత్తులవలె ఉన్న ఆకులు కలిగిన చెట్లు కలిగిన అడవితో తాకటానికి దారుణంగా ఉన్న ఒడ్డు కలిగిన, వైతరణి అనే పేరు కలిగిన నదిని వారు సమీపించారు. అక్కడ నానావిధాలైన శిక్షలను అనుభవిస్తున్న పాపకర్ములను చూచి 'మనం వెళ్ళవలసిన చోటు ఇక ఎంత దూరం ఉన్నది? ఈ చోటుకూడా దేవతల ఆధీనంలోనే ఉన్నదా?" అని ధర్మరాజు దేవదూతను అడిగాడు. అందుకు దేవదూత ధర్మరాజుతో ఇట్లా అన్నాడు." 'ఈ చోటుకూడా దేవతల అధీనంలోనే ఉన్నది. మీరు కోరుకొన్న మనం రావలసిన చోటు ఇదే! అలసిపోతే, వెనక్కి తిరిగి వెళదా"మని చెప్పాడు.

ఇటువంటి చాలా అసహ్యకరంగా ఉన్న ప్రాంతంలో తన సోదరులు ఉండరని నిశ్చయించుకొని నెమ్మదిగా, సందేహాస్పదంగా, యుధిష్ఠిరుడు వెనుతిరిగాడు, కానీ అతను వెను తిరిగేటప్పుడు ప్రతివైపునుంచి విచారకరమైన ఏడుపులతో పాటు, ధర్మరాజును కొంతకాలం అక్కడే ఉండమని దయతో కూడిన ప్రార్థనలు వినిపించాయి. "మీరెవరు ?" అని ఆశ్చర్యంగా ధర్మరాజు అడిగాడు. సమాధానాలు ప్రతి వైపు నుండి ఏడుపుతో ఇలా వినబడ్డాయి. "నేను కర్ణుడిని." "నేను భీష్ముడను." "నేను అర్జునుడను." "నేను నకులుడిని." నేను సహదేవుడిని." "నేను ద్రౌపదిని."

వారిని అలా చూసి బాగా బాధ చెందిన ఇంద్రియాలు కలిగిన వాడై, కొంచెం సేపు ఊరుకొని తేరుకొన్న మనసుతో ధర్మరాజు ఆలోచించి ఇంద్రుడిపై కోపం రాగా ఆ దూతను చూచి 'పూజ్యుడా! నీవు ఎవరి దూతవో వారి వద్దకు తిరిగిపొమ్ము' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు. "నా ప్రియమైన తమ్ములు దుఃఖపీడితులుగా ఇక్కడ ఉన్నారు. అందువలన నేను ఈప్రదేశం విడిచి నేను ఇక ఆ స్వర్గానికి రాను. ఇక్కడే శాశ్వతంగ ఉండిపోతానని దయానిధియైన ఇంద్రునికి చెప్పు 'అన్నాడు.

ధర్మరాజు అలా మాట్లాడుతున్నప్పుడు స్వర్గపు సువాసన చుట్టుపక్కల ఊపిరి పీల్చుకుంది. అంతటా సుగంధమైన గాలి మరియు ప్రకాశించే కాంతి మరియు దేవతలని ముంచెత్తింది. ఎందుకంటే నరకం కంటే ప్రేమ బలమైనది. మరియు బాధ కంటే విశ్వాసం గొప్పది[7].

కుటుంబం బయటికి ప్రదర్శించవలసిన సద్గుణాలలో, ఆతిథ్యం మొదటి వరుసలో నిలుస్తుంది. దానికి ఎంత ఎక్కువ విలువ ఇవ్వాలి అనేది "సగం బంగారమయిన ముంగిస" కథలో చూడవచ్చు:

ఒకసారి ధర్మరాజు యొక్క అశ్వమేధ యాగం లోకాతీతంగా, అద్భుతంగా నడచింది. ఆ అశ్వమేధ యాగంలో అన్ని తోరణాలు, యజ్ఞశాల భాగాలు, యజ్ఞవేది, మరియు యజ్ఞ పాత్రలు అన్నీ బంగారమే. ఆ యాగంలో రత్నాలు మరియు డబ్బును ఎవరికివారు తమ ఇష్టానుసారంగా తీసుకున్నారు. ఎవరూ నిషేధించలేదు.

అప్పుడు ఒక ముంగిస ఒక కన్నం నుండి బయటికి వచ్చి "ఈ అశ్వమేధయాగం సక్తుప్రస్థుడను పేద బ్రాహ్మణుని మహాధర్మం కంటె గొప్పది కా"దని అరిచింది. ఈ యజ్ఞంలో చేసిన సంపదల యొక్క త్యాగం, ఆ పేద బ్రాహ్మణుడు తన అతిథికి

ఇచ్చిన చిన్న పేలపిండి దానం కంటె తక్కువ విలువైనదని చెప్పింది. ఆ సక్తుప్రస్థుని కథను ముగిసఇలా చెప్పింది.

ఒక బ్రాహ్మణుడు కురుక్షేత్రంలో ఉంఛవృత్తిని(చేనుమళ్ళ వద్ద గానీ, ధాన్యం దంచే రోళ్ళ వద్ద గానీ, అక్కడక్కడ రాలిపడే గింజలను ఏరుకొని వాటితో జీవించడం.) పాటించేవాడు. అతను ఉంఛవృత్తితో సేకరించిన గింజలతో రోజూ తన భార్య కొడుకు మరియు కోడలుతో పొదుపు భోజనం చేస్తూ జీవించేవాడు.అయితే ఒకసారి వచ్చిన భయంకరమైన కరువు భూమిని పాడుచేసింది. ఊర్పిళ్ల ద్వారా రాలే పొట్టు, నేలపై మిగిలిపోయిన ధాన్యపు గింజలు చాలా తక్కువగా దొరుకున్నాయి. ఇటువంటి స్థితి వలన తిండిలేక ఆ బ్రాహ్మణుడు మరియు అతని కుటుంబం సన్నబడి , సన్నబడి సజీవ అస్థిపంజరాలుగా మిగిలారు.

అయితే ఒకరోజు ఆ బ్రాహ్మణునికి కొద్దిగా తృణధాన్యం దొరికింది. దానిని పొడి చేసి, భార్య దానిని నాలుగుమానికల పేల పిండిగా, నలుగురికి సమానంగా విభజించింది . కుటుంబంలో ప్రతి ఒక్కరూ, ఆనందంగా తినడానికి కూర్చున్నారు. కానీ వారు ఆహారం కొరకు ఉన్న ఆపేలపిండి కుప్పలను తాకకముందే, ఒక అతిథి గుమ్మంలో నిలబడ్డాడు. బ్రాహ్మణుడు త్వరగా లేచి, అతనిని తీసుకువచ్చి, అతనికి నీరు మరియు ఆసనం ఇచ్చి, ఆపైన తన వాటాగా ఉన్న తక్కువ ఆహారాన్ని అతని ముందు ఉంచాడు. అతిథి తిన్నాడు. కానీ ఇంకా అతనికి ఆకలితో ఉంది. అతిథి ముందు ఉంచటానికి వీలుగా భార్య తన వాటా పేలపిందని తీసుకువచ్చి తన భర్త చేతిలో పెట్టింది.

"నాప్రియపత్నీ ! నీవు బలహీనతతో వణుకుతున్నావు," అంటూ ఆ బ్రాహ్మణుడు తన భార్యతో ఇంకా ఇలా చెప్పాడు: "నా ఇల్లు సూర్యరశ్మిని కోల్పోకుండా ఉండటానికి నీ భాగంగా వచ్చిన ఆహారం ఉంచుకో! " అన్నాడు. కానీ ఆమె ఆతిథ్యం యొక్క ధర్మం విచ్ఛిన్నం కాకూడదని తన వంతు ఆహారాన్ని తీసుకొని అతిథికి ఇమ్మని భర్తకి నొక్కి చెప్పింది. అప్పుడు బ్రాహ్మణుడు ఒక నిట్టూర్పుతో, భార్య ఆహార భాగాన్ని అతిథికి ఇచ్చాడు. అయినప్పటికీ, అతిథి దానిని తిని తృప్తి పొందలేదు. అప్పుడు కొడుకు తన కొద్దిపాటి వాటాను తీసుకొని అతిథికి సమర్పించమని తండ్రికి చెప్పాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు తన కుమారుడి ఆకలికి మరియు అతని యవ్వన శరీరం యొక్క క్షీణతకు బాధపడుతూ, ఆ మూడవ భాగాన్ని అతిథి ముందు ఉంచాడు.

కానీ, అయ్యో! అప్పుడు కూడా అతిథి ఇంకా ఆకలితో ఉన్నాడు. ప్రతి చిన్న వాటా ఆకలితో ఉన్న ఆ అతిథికి ఏమీ సరిపోవటం లేదు. అప్పుడు కోడలి వాటా బ్రాహ్మణుని యొక్క వణుకుతున్న చేతులకు అందించబడింది. కానీ బ్రాహ్మణుడు తన హృదయంలో వేదనతో ఆ వాటాని తీసుకోవటానికి వెనక్కి తగ్గాడు. "నీ వాటా ఆహారం వద్దు ... చిన్నదానివి, నీ వాటా ఆహారం వద్దు ... నీ వాటా ఆహారం వద్దు ..." అని బ్రాహ్మణుడు అనగా మామగారూ! అని ఆ కోడలు వేడుకొంది. "మీరు చేసే మంచి పనులలో భాగం పంచుకోకుండా నన్ను ఆపవద్దు." ఆమె స్వరంలో సంజ్ఞల యొక్క మధురమైన వినయం ఉన్నది.

ఒక దుష్టుడయిన వేటగాడు ఉన్నాడు. అతడు అమాయకమైన చిన్న పక్షులను మరియు క్రూరమృగాలను ప్రతిరోజు హత్యలు చేసినదానికి ప్రతీకగా అతని చర్మం నల్లగా భయంకరంగా ఉంటుంది. తన బాధితులను దహనం చేస్తాడన్నట్లుగా మండుతున్న దుర్మార్గంలా అతని కళ్ళు ఎర్రగా ఉంటాయి. అతను ఒకసారి ఒక అడవి మధ్యలో భయంకరమైన ఉరుముల మెరుపుల గాలి వానలో బాధకు గురయ్యాడు. అడవిలో చెట్లు లేకుండ ఖాళీగా ఉండే మార్గాలన్నీ సరస్సులుగా మారాయి. ఒక్క క్షణంలో ఆ మార్గాలన్నీ ప్రవహించే ప్రవాహాలుగా మార్చబడ్డాయి. ఈ దారుణ స్థితిలో అతను ఒక ఎత్తయిన మార్గాన్ని కనుగొనడానికి ప్రయత్నించాడు. ఎత్తైన భూములను ఎలుగుబంట్లు మరియు సింహాలు మరియు అడవిలోని ఇతర భయంకరమైన జంతువులు ఆక్రమించాయి. చలితో వణుకుతూ, భయంతో వణుకుతున్నప్పటికీ , ఆ వేటగాడు ఇంకా తన క్రూరమైన అలవాట్లను మానుకోలేదు.

వర్షాల ప్రవాహానికి కొట్టుకుపోయి, చలితో గడ్డకట్టిన నేలపై పడి ఉన్న ఒక ఆడు పావురాన్ని దూరం నుంచి చూసి, దానిని పట్టి బంధించి నిర్దాక్షిణ్యంగా తాను మోసుకెళ్ళే బోనులోకి నెట్టాడు. అలా తిరుగుతూ, అడవి మధ్యలో ఉన్న ఒక పెద్ద చెట్టు దగ్గరికి కొద్దిసేపటికి వచ్చాడు. అనేక జాతుల పక్షులకు ఆ చెట్టు మంచి నీడ మరియు ఆశ్రయం కల్పిస్తోంది.

ప్రపంచ ప్రయోజనాల కోసం జీవిస్తున్న ఒక మంచిమనిషిలాగా, అన్ని జీవుల మంచి కోసం సృష్టికర్త ఉద్దేశపూర్వకంగా అక్కడ ఆ చెట్టును ఉంచినట్లు అనిపిస్తోంది. వేటగాడు ఆ చెట్టు కొమ్మల క్రింద ఆశ్రయం పొందాడు. క్రమంగా, మేఘాలు చెదరగొట్టబడ్డాయి. వాన వెలిసింది. నక్షత్రాలు ప్రకాశించాయి. కానీ తన ఇంటికి

చాలా దూరంగా ఉన్న వేటగాడు ఆ చెట్టు కింద ఆ రాత్రి గడపాలని నిర్ణయించుకున్నాడు. అతను చెట్టు కింద పడుకున్నప్పుడు ఆ చెట్టు మీదే ఒక తొర్రలో కాపురముంటున్న మగ పావురం విలపించడం విన్నాడు: "అయ్యో! నా ప్రియమైన భార్యా! నువ్వు ఇంకా తిరిగి రాలేదు! నీకు ఏమి జరిగింది? నా ప్రియమైన భార్యకు ప్రకాశవంతమైన గులాబీ కళ్ళు; మధురమైన కూతలు కలది. మెత్తటి ఈకలు కలది. అటువంటి నా ప్రియమైన భార్య నా గూడుకు తిరిగి రాలేదు. ఇక నా జీవితానికి విలువలేదు. భార్య లేని ఇల్లు ఇల్లు కాదు. భార్యయే ఇల్లు. నేను తినేటప్పుడు ఆమె తింటుంది. నేను స్నానం చేసినప్పుడు ఆమె స్నానం చేస్తుంది. నేను సంతోషించినప్పుడు ఆమె సంతోషిస్తుంది. నేను దుఃఖించినప్పుడు తాను దుఃఖపడుతుంది. నేను కోపంగా ఉన్నప్పటికీ, ఆమె ఎప్పుడూ మధురంగానే మాట్లాడుతుంది, అలాంటి జీవిత భాగస్వామి లేనప్పుడు ఈ జీవితం శూన్యంగా ఉంటుంది.

భార్య లేకుండా, రాజభవనం ఖాళీ అరణ్యంలా కనబడుతుంది. ఇల్లు పాడుపడినట్లు అవుతుంది. భార్య తన భర్తకు ధర్మం, లాభం మరియు ఆనందం. అన్ని పనులలో విశ్వసనీయ మరియు ప్రియమైన సహచరి. భార్య తన స్వామికి అత్యంత వైభవము కలిగిన ఆస్తి. జీవితానికి సంబంధించిన అన్ని విషయాలలో భార్య –భర్తకి సఫలమైన సహచరురాలు. మనసులోని అన్ని విచారరోగాలకూ ఆమె ఉత్తమ ఔషధం. భార్యవంటి స్నేహితురాలు లేదు, ఆమె కంటె గొప్ప ఆశ్రయం లేదు."

తన భర్త రోదన విని, క్రూరమైన వేటగాని పంజరంలో బంధించబడిన పావురం తనలో తాను ఇలా అనుకుంది : "నా భర్త నా గురించి ఇలా ఆలోచిస్తున్నాడనే భావన నా బాధలో కూడా నాకు ఆనందం అపరిమితంగా కలిగిస్తోంది. తన ప్రభువయిన భర్త సంతృప్తి చెందకపోతే ఆ భార్య భార్య కాదు. అని మనస్సులో అనుకొంటూ తన ఉనికిని భర్తకు తెలిపి " క్రూరమైన తుఫానుతో కొట్టుమిట్టాడుతూ, ఇంటి నుండి దూరంగా ఉంచబడిన ఈ దీనుడయిన వేటగాని గురించి కూడా మనం ఆలోచించాలి. అతను ఇప్పుడు మనకు అతిథి. మన నివాసం క్రింద ఆశ్రయం పొందాడు." అని ఆడుపావురం తన భర్తతో బిగ్గరగా వేటగాని పరిస్థితి చెప్పింది.

మగ పావురం కూడా, తక్షణ సానుభూతితో, తన బాధలను మరచిపోయి,

వేటగాని ఉద్దేశించి ఇలా చెప్పింది: "గౌరవనీయమైన అతిథిగా నా ఇంటికి స్వాగతం. నేను ఏమి చేయాలో చెప్పు" అప్పుడు వేటగాడు ఇలా అన్నాడు: "నేను చలిలో బిగుసుకుపోయాను; నీకు వీలైతే చలిని పోగొట్టి వేడి కల్పించు." ఆ మాటలు విని పావురం ఎండిన మరియు రాలిపోయిన ఆకులకుప్పను ముక్కుతో కరచి తెచ్చి పోగుబెట్టింది. ఆ పక్కనే ఉన్న పల్లెకు గబగబా వెళ్లి చిదుగు చివరన అంటుకొని ఉన్న నిప్పును తీసికొని వచ్చి పుల్లలను ముట్టుకొనేటట్లు చేసింది. బోయవాడిని చలికాచుకోవటానికి మంట దగ్గరకు రమ్మని పిలిచింది.

ఒక క్షణంలో వేటగాడు కృతజ్ఞతతో కూడిన అగ్నితో తన శరీరం కాచుకొని చలిబాధ తీర్చుకొన్నాడు. పావురం ఇంకా ఏమయినా కావాలా అని మళ్లీ వేటగానిని కోరింది. వేటగాడు ఈసారి ఆహారం అడిగాడు. పక్షి ఇలా అనుకుంది: "అతనికి ఆహారం ఇవ్వడానికి నా దగ్గర ఆహార పదార్థాలు లేవు; కాని ఆకలితో ఉన్న అతిథి ఆహారం లేకుండా ఉండకూడదు." ఇలా ఆ పావురం లోతుగా ఆలోచిస్తున్నప్పుడు తన మనస్సులో ఒక కొత్త ఆలోచనాకాంతి కలిగింది. వెంటనే ఆ పావురం తన అతిథితో ఇలా చెప్పింది: "నేను నిన్ను సంతోషపరుస్తాను. !అతిథిని సత్కరించడంలో గొప్ప పుణ్యం వస్తుందని నేను పూర్వకాలంలో ఋషులు మరియు దేవతలు మరియు పితృదేవతల నుండి విన్నాను. మిత్రమా ! నా శరీరాన్ని నీకు ఆహారంగా అర్పిస్తాను. గ్రహించు . నా మీద దయతో నా సేవను అంగీకరించు" అని చెప్పి మగ పావురం అగ్ని చుట్టూ మూడుసార్లు ఎగిరి, ఆపైన మంటల్లోకి ప్రవేశించి, తన అతిథికి ఆహారంగా కావటానికి తన శరీరాన్ని అందించింది.

అరుదయిన ఆ అతిథి-సన్మానం యొక్క హృదయ విదారకమైన చర్యతో- గత జీవితంలో తన పాపం గురించిన ఆలోచన మొదలయి తెలియని భయాందోళనలు వేటగాడి మనస్సును ఆక్రమించాయి. అతని దుష్ట స్వభావాన్ని దాని లోతైన మూలాలను అతని పశ్చాత్తాపపు ఆలోచన సర్వనాశనం చేసింది. "ఈ మగపావురమా! నువ్వు నా అత్యున్నత గురువువి. ఉత్కృష్టమైన పక్షివి! నువ్వు నాకు నా కర్తవ్యాన్ని చూపుతున్నావు! ఈ రోజు నుండి నేను నా పాపాలను పరిహరిస్తాను. ఈ పాపంతో నిండిన ఈ నా శరీరానికి మృదువైన సౌఖ్యాన్ని అందించను. రోజువారీ ఉపవాసం మరియు తపస్సుల ద్వారా ఈ శరీరం యొక్క నేరాలను ఆవిరి చేస్తాను. వేసవి సూర్యుని యొక్క బలమైన కిరణాలతో చిన్న మరియు మురికి కొలనులు ఎండిపోతాయికదా !

ఈ ఉదాహరణను పాటించి నేను ఇక నుండి ధర్మాన్ని ఒంటరిగా ఆచరిస్తాను. వైరాగ్యభావంతో ఇప్పుడే దేహ యాత్ర చాలిస్తాను. పుణ్యాత్ముడిని అవుతాను " అని ఆ వేటగాడు తన దుడ్డుకర్ర, వలలు ఉచ్చులు మరియు ఇనుప పంజరాన్ని విసిరివేసి, మరణించిన పక్షి యొక్క భార్య అయిన ఆడు పావురానికి స్వేచ్ఛనిచ్చాడు. ఆ విధంగా విడుదల చేయబడిన ఆడు పావురం భర్త యొక్క అంత్యక్రియల చితి చుట్టూ ప్రదక్షిణ చేసింది. ఆమె భర్త కొరకు ఏడుస్తూ "భార్య తన తండ్రి తల్లి లేదా కొడుకు నుండి పొందే బహుమతులు పరిమితం. కానీ భర్త ఇచ్చే బహుమతులు అపరిమితంగా ఉంటాయి! భర్త తన సర్వస్వం భార్యకు ఇస్తాడు! ఇన్ని సంవత్సరాలు నీతో ఆనందంగా గడిపిన తర్వాత, నేను ఇక ఒంటరిగా జీవించలేను!" అని చెబుతూ ఆ ఆడుపావురం అగ్ని ప్రవేశం చేసింది.

కొత్తగా జన్మించిన దయా దృష్టికలిగిన వేటగాడు ఆ పావురాలు అద్భుతమైన రూపాలలో స్వర్గానికి చేరుకోవడం చూసాడు; తద్వారా అతని సంకల్పం మరింత ధ్రువీకరించబడి, అతను అడవిని తన నివాసముగా చేసుకున్నాడు. వేసవి తుఫానులో ఎండిపోయిన కొమ్మలు ఒకదానికొకటి రుద్దడం ద్వారా పుట్టే దావాగ్ని అతని శరీరాన్ని కొంతకాలం తరువాత దహించింది. తపస్సు అతని పాపాలను పోగొట్టింది.[9]

తప్పులను క్షమించే సంసిద్ధత నిజమైన గొప్ప స్వభావానికి సంకేతం. రామచంద్రుని గురించి ఇలా చెప్పబడింది. వంద గాయాలు అతని జ్ఞాపకశక్తిపై ఎటువంటి జాడను మిగల్చలేదు. అయితే తాను పొందిన ఒక ప్రయోజనం మాత్రమే అక్కడ పొందుపరచబడింది.[10]

విదురుడు అవమానాన్ని మరచి ఎలా క్షమించాడో వినండి.

దయగల ధృతరాష్ట్రుడు దుర్యోధనుని దుష్ట ప్రవర్తనను సవరించడానికి విదురుని సలహా కోరాడు. విదురుడు తన సోదరునికి తెలివిగా దృఢంగా ఇలా సలహా ఇచ్చాడు. తక్షణమే దుర్యోధనునికి పాండవులతో శాంతిని అమలు చేయమని చెప్పాడు. దుర్యోధనుడు తన మద్దతుదారులతో పాండవుల పట్ల చేసిన తప్పులకు పశ్చాత్తాపబడి, తాము బహిష్కరించిన పాండవుల నుండి క్షమాపణ పొందేలా చేయమని విదురుడు ధృతరాష్ట్రుని ప్రార్థించాడు. దీనితో, ధృతరాష్ట్రుడు చాలా కోపోద్రిక్తుడయ్యాడు. నీతిమంతుడైన తన సోదరుడిని తీవ్రంగా నిందించాడు. విదురునిలో పక్షపాతాన్ని, ద్రోహగుణాలను ఆరోపించి, కోపంతో అతని సోదరుని

బహిష్కరించాడు. అప్పుడు విదురుడు పాండవులను వెతుక్కుంటూ వెళ్ళి , ధృతరాష్ట్రుని కోపంతో తాను ఎలా బహిష్కరించబడ్డాడో వారికి చెప్పి, మర్యాద మరియు సౌమ్య మార్గాలలో పాండవులు నడవాలని కోరుతూ వారికి వివేకంతో సలహా ఇచ్చాడు.

విదురుడు వెళ్ళిన తరువాత, అతనిపట్ల తాను చూపిన కర్కశత్వం మరియు అన్యాయం గురించి ధృతరాష్ట్రుడు పశ్చాత్తాపపడ్డాడు. సోదరుని తిరిగి రమ్మని వేడుకుంటూ సంజయునిద్వారా కబురు పంపాడు: “ఓ జ్ఞాని అయిన సంజయా! నేను కోపంతో పిచ్చిగా తరిమికొట్టిన నా సోదరుడు బ్రతికి ఉన్నాడో లేదో చూడు! నేను అతనికి ఘోరమైన అన్యాయం చేసినప్పటికీ అతను తిరిగి నాకు అన్యాయం చేయలేదు. ఏ తప్పు చేయలేదు. అతనిని వెతికి ఇక్కడికి తీసుకురండి.”అని చెప్పాడు. సంజయుడు “శాంతుడు, బలవంతుడు అయిన విదురుడు తన బలహీన సోదరుని మనోభావాలను మన్నించి మళ్లీ ధృతరాష్ట్రుని సింహాసనానికి స్తంభం అవుతాడా ! తిరిగి వస్తాడా !”అని ఆలోచిస్తూ విదురుని వెతుక్కొంటూ వెళ్లాడు.

సంజయుడు అడవికి వెళ్లి, గొప్పవారయిన యువరాజులచే బాగా గౌరవించబడుతున్న విదురుని కనుగొని, అతనిని సమీపించి, తిరిగి రావాలని ప్రార్థించాడు. అప్పుడు విదురుడు ఒక్క క్షణం కూడా వెనుకాడకుండా లేచి తన మేనల్లుళ్ల నుండి సెలవు తీసుకుని తన అన్నయ్య సన్నిధికి వెళ్లటానికి తొందరపడ్డాడు. తిరిగివచ్చిన విదురుని చూసి ధృతరాష్ట్రుడు తాను చేసిన తప్పును క్షమించమని ప్రార్థించాడు. అప్పుడు మెల్లగా విదురుడు ఇలా అన్నాడు: “ఓ రాజా ! నేను నిన్ను క్షమించాను. నా అగ్రజుడా! నా కంటే ఉన్నతమైనవాడా! నీవు అత్యున్నతమైన గౌరవానికి అర్హునివి. నీ ముఖాన్ని చూడాలనే కోరికతో నేను ఆత్రంగా ఇక్కడకు వచ్చాను. తనలో ఉన్న భావోద్వేగము వలన, మనిషి హృదయం బాధలో ఉన్నవారికోసం సహానుభూతితో ఆరాటపడుతుంది. నేను పాండుకుమారులపట్ల అభిమానం చూపుతున్నట్లు నీకు అనిపించటానికి కారణమిదే! రాజా నీ కుమారులు నాకు ప్రియమైన వారే . కానీ పాండవుల బాధలు నా హృదయాన్ని కదిలించాయి.” ఈ విధంగా ధృతరాష్ట్రుని తమ్ముడయిన విదురుడు తనకు జరిగిన అవమానాలను మరచిపోయి మెల్లిగా మరియు ఉదారంగా అన్నగారితో మాట్లాడాడు.[11]

నాగరికత, మర్యాద అనేది మన ప్రాచీన హిందూ జీవితానికి చాలా ముఖ్యమైన లక్షణం. పురాణ శ్లోకాల్లో మంచివారు, చెడ్డవారు అనే తేడా లేకుండా అతిథుల

పట్ల, మిత్రుల పట్ల, శత్రువుల పట్ల– గొప్పవారు – ఎలా ప్రవర్తించారో మనం చదువుతున్నప్పుడు, వారి భాషలోనూ, చేష్టలలోనూ అత్యంత సున్నితమైన మర్యాద మనకు చిరునవ్వుతో ప్రసంగించటంలో సౌమ్యుడు. దయతో కూడిన చిరునవ్వు శ్రీరాముని ప్రసంగాలకు ముందుగా మనకు కనిపిస్తుంది. [12]

ఒకసారి ఒక స్త్రీ ఇంద్రుని దగ్గరకు వచ్చింది. ఇంద్రుడు "నీవు ఎవరి'వని అడిగాడు. ఆ స్త్రీ "ఓఇంద్రా! నేను తామరపువ్వు నుండి పుట్టిన లక్ష్మీదేవిని. ఇప్పటి వరకు నేను రాక్షసుల దగ్గర ఉన్నాను. ప్రస్తుతము వారి ప్రవర్తన నచ్చక నీ దగ్గరకు వచ్చాను" అన్నది.

ఇంద్రుడు "రాక్షసుల దగ్గర ఏ గుణములు నచ్చి వారి వద్ద ఉన్నావు? ఇప్పుడు ఎందుకు నచ్చలేదు?" అని ఇంద్రుడు అడిగాడు. లక్ష్మి " ఇంద్రా! రాక్షసులు దానములు, వేదాధ్యయనము చేయడము, అతిథులను సత్కరించడం వంటి మంచి పనులు చేసేవారు. అందుకని వారిదగ్గర ఉన్నాను. ఇప్పుడు వారికి గర్వము పెరిగి మంచి గుణములను విడిచి పెట్టారు కనుక నేను కూడా వారిని విడిచిపెట్టాను" అన్నది.

"గురువుల ఎడ భక్తి కలవారు, సత్యమును పలికే వారు, దానశీలురు, ఇతరుల ధనమును కాని భార్యలను కాని కోరనివారు, పగలు నిద్రించని వారు, వృద్ధులపట్ల బాలలపట్ల స్త్రీలపట్ల దయ కలిగిన వారు, నిత్యము శుచి శుభ్రత కలిగిన వారు, అతిథులకు పెట్టికాని భుజించని వారు, నాకు చాలా ఇష్టం. ఇవి దేవతల దగ్గర ఉన్నాయి. అందుకే నేను వారివద్ద ఉండడానికి ఇష్ట పడతాను" అని లక్ష్మి చెప్పింది. [13]

ఒకసారి ఉగ్రసేనుడు శ్రీకృష్ణుడితో "కృష్ణా! నారదుడిలో ఉన్న గొప్పతనము ఏమిటి ?" అని అడిగాడు. "నారదుడు ధీరుడు. మృదుమధురంగా మాట్లాడుతాడు. కాఠిన్యము, దైన్యము, క్రోధము, లోభము, నిరాసక్తత అతనిలో మచ్చుకు కూడా లేవు. ఈర్ష్య, అసూయ అనేవి, ఎలా ఉంటాయో అతనికి తెలియదు. కనుక జనులు నారదుడిని కీర్తిస్తారు." అని శ్రీకృష్ణుడు జవాబు చెప్పాడు. ఈ నారద గుణాలు అందరికి శిరోధార్యాలు. [14]

ఇతరులను కనుచూపుతో, మాటతో లేదా ఆలోచనతో కించపరచకూడదని దేని గురించి చెడుగా మాట్లాడకూడదని భీష్ముడు మనకు మళ్ళీ, మళ్ళీ, బోధిస్తున్నాడు; మనం ఎప్పటికీ ఎవరినీ గాయపరచకూడదు. లేదా విరోధ పూర్వకంగా, క్రౌర్యంగా ప్రవర్తించకూడదు; మనం అసభ్యకరమైన ప్రసంగాలపట్ల ఉదాసీనతను ప్రదర్శించాలి.

ఇతరులు మనపై కోపపడినప్పుడు వారు సమాధానంతో అంగీకరించేలా మాట్లాడాలి. ఎవరయినా అపవాదు మనపై మోపినప్పుడు తిరిగి అపవాదు వారిపై మోపకూడదు.[15]

నారదుడు పద్మడు అనే నాగుని వర్ణించాడు. అతను క్రియ, జ్ఞానం మరియు భక్తి అనే త్రిగుణాల మార్గంలో నడిచేవాడు. ఎప్పుడూ ఇతరులకు చక్కని ఆతిథ్యం ఇచ్చేవాడు. దయాశాలి. ఇతరుల హృదయాలను గాయాలు చేయకుండా ఉండేవాడు.

ఆ పద్మడు సత్యవంతుడు. ద్వేషం లేనివాడు. అన్ని ధర్మాలు తెలిసినవాడు. దయాపూర్వకమైన వాక్కు కలవాడు. అందరి ప్రయోజనాన్ని కోరుకునేవాడు. ఒక బ్రాహ్మణుడు (భృగుడు) పద్మని చూడడానికి మరియు అతని నుండి నేర్చుకోవడానికి ఇంటికి వెళ్ళాడు. కాని పద్మని ఇంటికి వచ్చినప్పుడు అతను బ్రాహ్మణునికి కనిపించలేదు. పద్మని భార్య అపరిచితుడిని సాదరంగా ఆహ్వానించింది . "అమ్మా! నీ భర్తను కలిసి వెళ్ళటానికి వచ్చాను. ఆయన ఎక్కడున్నాడో చెప్పు"మని కోరగా ఆ పద్మని భార్య "సూర్యరథానికి సర్పాలే రజ్జువులని మీకు తెలియనిది కాదు. నెలవారి వంతు రావటంతో నా భర్త సూర్యరథాన్ని మోయటానికి వెళ్ళాడు. ఎనిమిది రోజులలో వస్తాడు." అని జవాబు చెప్పింది.

నీ భర్త వచ్చేంతవరకు ఆ నది ఒడ్డున ఉన్న వనంలో ఉంటాను. ఆ రాజు రాగానే నా సంగతిని వివరించు" అని చెప్పి, ఆ బ్రాహ్మణుడు గోమతీ నది ఒడ్డున ఉన్న అరణ్యంలో జపం చేస్తూ, నిరాహారుడై ఉన్నాడు. అలా ఉండగా ఆ పద్మని బందువులు అతని భార్యాపుత్రులతో ఆ బ్రాహ్మణుని దగ్గరకు వచ్చారు. "నీవు ఆహారం తీసికొనక నేటికి ఆరునాళ్ళయింది. మేము అతిథిపూజ అంటే ఇష్టపడేవాళ్ళం. మాకు ధర్మలోపం జరుగకుండా నువ్వు మా ఆతిథ్యం స్వీకరించు. మా కోరిక మన్నించి అన్నమో, పండ్లో , కందమూలాలో ఏదైనా తినవలసినది.

ఈ నీ ఉపవాసం మేము ఆతిథ్యం యొక్క విధులను నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వదిలివేస్తున్నామని తెలియచేస్తోంది. మా నాగజాతిలోని యువకులు మరియు వృద్ధులు మొత్తం సమాజం నువ్వు ఆహారం తినకపోతే బాధపడుతోంది.' అని ప్రార్థించారు. నాగాధిపతి పద్మడు తిరిగి వచ్చేవరకు తాను తినలేనని బ్రాహ్మణుడు సున్నితంగా సమాధానం చెప్పాడు. "మీకు ఆతిథ్య ధర్మనిరోధం జరగనివ్వను. కాస్త వేచి చూడండి. మరొక రెండురోజులు ఇట్లాగే గడిస్తే నా వ్రతం కూడా పూర్తి

అయిపోతుంది. ఎనిమిదవ రోజుకు ఆ సర్పరాజు పద్మడు వస్తాడు కదా! ఒకవేళ రాకపోతే ఆ మర్నాడు మీరు కోరినట్లే భోజనం చేస్తాను" అని బ్రాహ్మణుడు అన్నాడు.

సూర్యుని అనుమతితో సర్పరాజు పద్మడు ఇంటికి తిరిగి వచ్చాడు. భార్యతో జరిపిన మొదటి సంభాషణలో గృహస్థుని విధులను పద్మడు ఎలా వివరించాడో మనం గమనిస్తాం.

"అందరికీ మేలు చేయడం గృహస్థుని మతం; అతిథులుగా వచ్చిన వారందరికీ గృహస్థుడు ఆతిథ్యమివ్వాలి; గృహస్థుడు మృదువుగా ఉండాలి. కోపం మరియు అహంకారం నుండి గృహస్థుడు దూరంగా ఉండాలి. ఉదారంగా మరియు నిజాయితీగా ఉండాలి.[16] ఆ విధంగా ప్రాచీనకాలం నుండి తన చుట్టూ ఉన్నవారిపట్ల పౌరుని కర్తవ్యమేమిటో బోధించబడింది.

పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా
పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః
యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వా స్తత్రాఫలాః క్రియాః
శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులమ్,
న శోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా
జామయో యాని గేహాని శపంత్యప్రతిపూజితాః
తాని కృత్యాహతానీవ వినశ్యంతి సమంతతః॥[17]

ఎప్పుడూ మేలు కోరు తల్లిదండ్రులు, అన్నదమ్ములు, భర్త , మరదులు మొదలగువారు స్త్రీలను గౌరవిస్తూ భూషణాదులచే అలంకరించి, పూజించి ఆమె యొక్క మెప్పును పొందాలి.

స్త్రీలకు గౌరవమున్నచోట దేవతలు ఎల్లప్పుడు సంతోషిస్తారు. స్త్రీలకు గౌరవము లేనిచో అక్కడ జరుగు దేవతాపూజ, యజ్ఞయాగములు మొదలగు క్రియలన్నీ వ్యర్థమైపోతాయి.

"ఎక్కడ స్త్రీల బంధువులు (తోడబుట్టినవారు, భార్యలు, కోడళ్లు మొదలయినవారు) దుఃఖంతో జీవిస్తారో, ఆ కుటుంబం త్వరలోనే పూర్తిగా నశిస్తుంది; కానీ వారు సంతోషంగా ఉన్న కుటుంబం ఎప్పటికీ అభివృద్ధి చెందుతుంది.

స్త్రీలు సముచితంగా గౌరవించబడని సందర్భంలో ఏ కుటుంబాన్ని వారు శపిస్తారో, ఆ కుటుంబం మాయాజాలపు శక్తితో కొట్టబడినట్లుగా పూర్తిగా నశిస్తుంది."

ఏతావానేవ పురుషో యజ్జాయాత్మా ప్రజేతి హ,
విప్రాః ప్రాహు స్తథా చైతద్యా భర్తా సా స్మృతాంగనా॥[18]

తానొక్కడు మాత్రమే పురుషుడుకాడు. తాను, తన భార్య, పుత్రుడు ముగ్గురు కలిసిననే పురుషుడవుతాడు. అందువలన ఎవడు భర్తయో వాడే భార్య అని వేదవేత్తలు చెబుతారు. కావున అట్టి భార్యయందు పుట్టింపబడిన పుత్రుడు భర్తకే చేరినవాడగును.

అన్యోన్యస్యావ్యభిచారో భవేదామరణాంతికః,
ఏష ధర్మస్సమాసేన జ్ఞేయః స్త్రీ పుంసయోః పరః
తథా నిత్యం యతేయాతం స్త్రీ పుంసౌ తు కృతక్రియా,
యథా నాతిచరేతాం తౌ వియుక్తా వితరేతరమ్॥[19]

స్త్రీ పురుషులిద్దరు (భార్యాభర్తలిద్దరు) జీవితమున్నంతవరకు అన్యోన్యంగా ఒకరినొకరు విడిచిపెట్టక కలిసి మెలసి ఉండాలి. ఇదే సంగ్రహముగా చెప్పిన ముఖ్య ధర్మం.

స్త్రీ పురుషులు పెండ్లిచేసికొని ధర్మార్థ కామాలలో ఒకరినొకరు విడిచిపెట్టక కలసి మెలసి ఉండాలి.

తృణాని భూమిరుదకం వాక్ చతుర్థీ చ సూనృతా ।
ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యంతే కదాచన ॥

h h h

అప్రణోద్యోఽతిథిస్సాయం సూర్యోఢగృహమేధినా,
కాలే ప్రాప్త స్వత్కాలే వా నాస్యానశ్నన్ గృహేవసేత్.
న వై స్వయం తదశ్నీయాదతిథిం యన్న భోజయేత్,
ధన్యం యశస్యమాయుష్యం స్వర్గ్యం చాతిథిపూజనమ్॥[20]

మంచివారి ఇంటిలో అతిథులు పడుకోవటానికి గడ్డిపోచలు, విశ్రాంతి తీసికొనుటకు స్థలము, త్రాగుటకు మంచినీరు, ప్రియమైన మాటలు ఎల్లప్పుడు లభిస్తాయి. వీటికి లోటు ఉండదు.

h h h

సూర్యుడస్తమించిన తరువాత వచ్చిన అతిథి తిరిగి తన ఇంటికి చీకటిలో పోలేడు

కావున అతనికి అతిథి సత్కారములు చేయాలి. అలాగే భోజనసమయానికి వచ్చినా, భోజనకాలము దాటి వచ్చినా అతిధికి సత్కారము తప్పక చేయవలెను.

అతిథికి పెట్టని పాలు, పెరుగు మొదలగు వస్తువులను గృహస్థు తాను కూడా తినకూడదు. అతిథికి పూజచేస్తే ధనము, కీర్తి, ఆయుస్సు, పరలోకములో స్వర్గ సుఖాలు లభిస్తాయి.

h h h

సత్యం బ్రూయా త్ప్రియం బ్రూయా న్న బ్రూయా త్సత్య మప్రియమ్ ।
ప్రియు చ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః ॥[21]

విన్నది విన్నట్లు చూచినది చూచినట్లు చెప్పుట సత్యము, అటువంటి సత్యమును చెప్పాలి. ఎదుటివానిమనస్సుకు తగినట్లు చెప్పుట ప్రియము. అట్టి ప్రియమును పలకాలి. సత్యమయినా అప్రియము చెప్పకూడదు. ప్రియమయినా అసత్యము పలుక కూడదు. ఇది వేదమూలమయిన సనాతన ధర్మం.

యస్య వా వ్మాన సీ శుద్ధే సమ్యగుప్తే చ సర్వదా,
స వై సర్వమవాప్నోతి వేదాంతోపగతం ఫలమ్
నారుంతుదస్స్యాదార్తోఽపిన పరద్రోహకర్మధీః
యయాస్యోద్విజతే వాచా నాలోక్యాం తాముదీరయేత్॥[22]

“ఎవరి మాట అసత్యం మాట్లాడుటవలన చెడిపోకుండా స్వచ్ఛంగా ఉంటుందో, ఎవరి మనస్సు రాగ ద్వేషాదులచేత చెడిపోకుండా నిర్మలంగా జాగ్రత్తగా కాపాడబడుతుందో, అతను వేదాంతము ద్వారా లభించే అన్ని ఫలాలను (సర్వజ్ఞత్వ, సర్వేశ్వరత్వములు) పొందుతాడు.

తాను బాధపడినప్పటికీ, ఇతరుల మర్మములు నొచ్చుకొనునట్లుగా మాటలాడ కూడదు. పరులకు ద్రోహము. చేసే ఆలోచనచేయకూడదు. ఏ మాట చెబితే జనులు భయపడతారో అటువంటి నరకహేతువగుమాటను పలుకకూడదు.

నాస్తిక్యం వేదనిందాం చ దేవతానాం చ కుత్సనమ్ ।
ద్వేషం స్తంభం చ మౌనం చ క్రోధం త్రైక్ష్ణ్యం చ వర్జయేత్॥[23]

నాస్తికత, వేదనింద, దేవతల విషయమున తిరస్కారము, ద్వేషము, మూర్ఖత్వం, గర్వం, కోపం, కరకుదనము అనువానిని పూర్తిగా వదలిపెట్టవలయును.

నారుస్తుదః స్యాన్న నృశంసవాదీ
న హీనతః పరమభ్యాదధీతః ।
యథాస్య వాచా పర ఉద్విజేత
న తాం వదే దుషతీం పాపలోక్యామ్ ॥

అరుంతుదం పురుషం తీక్ష్ణవాచం
వాక్కణ్టకైర్వితుదన్తం మనుష్యాన్ ।
విద్యాదలక్ష్మీకతమం జనానాం
ముఖే నిబద్ధాం నిరృతిం వహన్తమ్ ॥

వాక్సాయకా వదనాన్నిష్పతంతి
యైరాహతః శోచతి రాత్ర్యహాని ।
పరస్య నా మర్మసు తే పతంతి
తాన్పండితో నావసృజేత్పరేషు ॥

నహీదృశం సంవననం త్రిషు లోకేషు విద్యతే ।
దయా మైత్రీ చ భూతేషు దానం చ మధురా చ వాక్ ।
తస్మాత్సాంత్వం సదా వాచ్యం న వాచ్యం పరుషం క్వచిత్ ।
పూజ్యాన్సంపూజయేద్దద్యాన్న య యాచేత్కదాచన॥[24]

ఎవరూ ఇతరుల ఆయువుపట్టులందు పీడించువాడు కారాదు. (ప్రాణాధారాలను గాయపరచకూడదు) క్రూరమైన మాటలు మాట్లాడకూడదు. హీనునినుండి మేలైనదానిని గ్రహించకూడదు. ఎవరూ తన శత్రువును అన్యాయమైన మార్గాల ద్వారా లొంగదీసుకోవడానికి ప్రయత్నించకూడదు. మరొకరు ఉద్రేకానికి గురయ్యే అశుభకరమైన ప్రసంగాన్ని చెప్పకూడదు.

ఇతరుల ప్రాణాధారాలను గాయపరిచేవాడు, కఠినంగా మరియు పదునైన మాటలతో, చెడు మాటల ముళ్ళతో ఇతరులను గుచ్చేవాడు – తన అదృష్టాన్ని వదిలిపెట్టినవాడు అవుతాడు. ఎప్పుడూ తన నోటిలో బంధించబడిన భూతం కలవాడవుతాడు. (అదృష్టాన్ని కోల్పోతాడని, దుష్టభూతంలా మారతాడని భావం)

కొందరి నోటినుండి పలుకులనెడు బాణాలు(చెడ్డ మాటలు) వెలికి వచ్చిపడును. వాటి వల్ల గాయపడినవాడు రాత్రింబగళ్లు దుఃఖిస్తాడు, ఎందుకంటే అవి

ప్రాణాధారాలను గాయపరుస్తాయి. అందువలన ఎరుకగలవాడు వానిని ఇతరుల పై ప్రయోగింపరాదు.

ఈ మూడు లోకాలలో కరుణ, సర్వప్రాణుల పట్ల స్నేహభావం, దానము మధురమైన వాక్కు అను సంపదలతో పోలిన సంపదలు ఎక్కడా లేవు.

"అందుచేత ఎప్పుడూ మృదువుగా మాట్లాడండి. ఎప్పుడూ కఠినంగా మాట్లాడకండి; యోగ్యుడిని గౌరవించండి; ఇవ్వండి, కానీ అడగవద్దు."

క్రుద్ధః పాపం నరః కుర్యాత్క్రుద్ధో హన్యాద్గురూనపి ।
క్రుద్ధః పరుషయా వాచా శ్రేయసోఽప్యవమన్యతే ।
ఆత్మానమపి చ క్రుద్ధః ప్రేషయేద్యమసాదనం
ఏతాందోషాన్ప్రపశ్యద్భిర్జితః క్రోధో మనీషిభిః॥[25]

"కోపము కలిగిన వ్యక్తి ఏదైనా పాపం చేయవచ్చు, అతను తన పెద్దలను కూడా చంపవచ్చు లేదా తన గౌరవానికి తగిన వారిని కఠినమైన మాటలతో అవమానించవచ్చు.

"కోపము కలిగిన వ్యక్తి తనను తాను మృత్యు నివాసానికి పంపవచ్చు. కోపంలో ఉన్న ఈ గొప్ప దోషాలను చూసి, జ్ఞానులు దానిని జయించారు."

కింస్విదేకపదం బ్రహ్మన్పురుషః సమ్యగాచరన్ ।
ప్రమాణం సర్వభూతానాం యశశ్చైవాప్నుయాన్మహత్ ।
సాంత్వమేకపదం శక్ర పురుషః సమ్యగాచరన్ ।
ప్రమాణం సర్వభూతానాం యశశ్చైవాప్నుయాన్మహత్ ।
ఏతదేకపదం శక్ర సర్వలోకసుఖావహం ।
ఆచరన్సర్వభూతేషు ప్రియో భవతి సర్వదా॥[26]

"ఓ బ్రాహ్మణా, (ఇంద్రుడు తన గురువు బృహస్పతిని అడుగుతాడు), ఒక వ్యక్తి ఏది బాగా సాధన చేస్తే, అతను అన్ని జీవులకు ప్రమాణం అవుతాడు? మరియు విస్తృతమైన కీర్తిని పొందుతాడు?

"ఓ శక్రా! సాంత్వము (=తీయనిమాట, మంచిపలుకు, దాక్షిణ్యము.) అనే ఒక దానిని ఏ వ్యక్తి అలుపెరగకుండా సాధన చేస్తాడో , అతను అన్ని జీవులకు ప్రమాణంగా మారతాడు. మరియు విస్తృతమైన కీర్తిని పొందుతాడు.

"ఈ ఒక్క విషయం అన్ని లోకాలకు ఆనందాన్ని కలిగిస్తుంది; అన్ని జీవుల పట్ల దీనిని (దాక్షిణ్యభావాన్ని) ఆచరించడంవలన అతడు అందరికీ ఎల్లప్పుడూ ప్రియమైనవాడు అవుతాడు."

యస్తు క్రోధం సముత్పన్నం ప్రజ్ఞయా ప్రతిబాధతే ।
తేజస్వినం తం విద్వాంసో మన్యతే తత్యదర్శినః॥ [27]

"ఎవడు తనలో రేగిన కోపాన్ని వివేకంతో అణచుకుంటాడో, అతడే నిజమైన తేజస్వి అని సత్యం తెలిసినవాళ్ళు ప్రకటిస్తారు.

సూచికలు

1. మనుస్మృతి 09-45
2. మనుస్మృతి 09- 101
3. రామాయణంలో అడుగడుగున
4. మహాభారతం వన పర్వం, ccxcii - ccxcviii
5. మహాభారతం వన పర్వం, liii- Ixxix
6. మహాభారతం వన పర్వం CCV
7. మహాభారతం, మహా ప్రస్థానిక పర్వం iii మరియు స్వర్గారోహణ పర్వం i
8. మహాభారతం వనపర్వం iv- vi
9. మహాభారతం, శాంతిపర్వం cxliii cxlix
10. రామాయణం అయోధ్యాకాండ
11. మహాభారతం, అశ్వమేధపర్వం, xcii.
12. రామాయణం అయోధ్యాకాండ, i.
13. మహాభారతం, శాంతిపర్వం, ccxxviii.
14. మహాభారతం, శాంతిపర్వం. ccxxx.
15. మహాభారతం, శాంతిపర్వం, cclxxviii.

16. మహాభారతం, శాంతిపర్వం, ccclvi- cc clxi.

17. మనుస్మృతి , iii- 55-68.

18. మనుస్మృతి, ix -5.

19. పై గ్రంథములోనే 101, 102 శ్లోకాలు

20. పై గ్రంథములోనే 03-101, 15-106

21. మనుస్మృతి iv - 138

22. మనుస్మృతి ii -160 162

23. మనుస్మృతి-4-163

24. మహాభారతం, ఆదిపర్వం, lxxxvii 8, 9, 11, 12, 13 శ్లోకాలు.

25. మహాభారతం, వనపర్వం xxix, 4,6 శ్లోకాలు

26. పై గ్రంథములోనే శాంతిపర్వం lxxxiv 2, 3, 4శ్లోకాలు

27. మహాభారతం, వనపర్వం xxix 17 వశ్లో.

అధ్యాయం 10

మన కంటె తక్కువ వారికి సంబంధించి మనం పెంచుకొనవలసిన సద్గుణాలు, విడువవలసిన దుర్గుణాలు

మనం ప్రపంచానికి మరింత దగ్గరగా వెళుతున్నప్పుడు, మనకంటే చాలా చిన్నవారు, తరువాతి తరాలకు చెందినవారు, తక్కువ చదువుకున్నవారు , పేదవారు లేదా సామాజిక హోదాలో మనకంటే తక్కువ మంది వ్యక్తులు మనకు చాలా మంది కనిపిస్తారు. అటువంటి మనకంటే స్థాయి తక్కువ కలిగిన వ్యక్తులతో, ఏదో ఒక ప్రత్యేక సందర్భంలో లేదా సాధారణంగా సంబంధాలు నెలకొల్పుకొంటాం. వారితో మన సంబంధాలు సామరస్యంగా ఉండాలంటే మనం ఏ ధర్మాలను పెంపొందించుకోవాలి, ఏ దుర్గుణాలను నివారించాలి అని తెలుసుకోవాలి.

పిల్లలతో తల్లిదండ్రులకు ఉండే సంబంధం – మనకంటే చాలా చిన్నవారితో ఉండే సంబంధాలలో మొదటిది మరియు అత్యంత స్పష్టమైనది. సున్నితత్వం, కరుణ, సౌమ్యత, దయ, ఈ సద్గుణాలు ప్రేమగల తల్లిదండ్రులలో ఎంతో బలంగా ప్రకాశిస్తాయి. వాటిద్వారా వారు ఇంటిని ఎంత సంతోషపరుస్తారు. తండ్రి మరియు తల్లి తమ పిల్లలను ప్రేమిస్తారు. వారి బాధలలో బాధపడతారు. వారి ఆనందాలలో సంతోషిస్తారు. ప్రతి విషయంలో వారిపట్ల సానుభూతి ప్రదర్శిస్తారు.

ఈ వాస్తవాన్ని సురభి తన పిల్లలు బాధపడినప్పుడు పడే దుఃఖానికి సంబంధించిన ఒక పురాతన కథలో, చాలా అందంగా చూపించబడింది. పూర్వపు రోజులలో, ఆవులు మరియు ఎద్దుల జాతికి చెందిన దివ్యమైన తల్లి అయిన సురభి(కామధేనువు) ఒకసారి దేవతల రాజు ముందు నిలబడి కన్నీళ్లు పెట్టుకుంది.

ఇంద్రుడు ఆమెను చూస్తూ ఆసక్తిగా అడిగాడు: “ ఆవులకు శుభము కలగాలని కోరుకొనే తల్లీ! ఎందుకు ఏడుస్తున్నావు? నీకు ఏదైనా అనారోగ్యం కలిగిందా? మా దేవతలలో ఎవరినుండియైన నీకు తీవ్రమైన పరిస్థితి ఎదురయిందా?

సురభి ఇలా బదులిచ్చింది. దేవేంద్రా! ఏ అనారోగ్యము నా శరీరానికి సంభవించలేదు; మీ దేవతలలో ఎవరినుండియైన నాకు తీవ్రమైన పరిస్థితి ఎదురు కాలేదు. నేను నా సంతానం కోసం దుఃఖిస్తున్నాను! ఇంద్రా! నాకు కొన్ని కోట్ల

మంది బిడ్డలు ఉండవచ్చు, ఈ భూమండలంలో ఉన్న ఆవులు, ఎద్దులు అన్నీ నా శరీరం నుంచి వచ్చినవే. ఇంతమంది బిడ్డలు ఉన్నా, ఈ రెండు ఎద్దులని రైతు పొడుస్తూ, ఎండలో సేద్యం చేయిస్తుంటే, నా బిడ్డలని ఇంత కష్టపెడుతున్నాడని దుఖం ఆగలేక ఏడుస్తున్నాను. "ఇంద్రుడు ఆశ్చర్యంగా అడిగాడు:" కానీ నీ వేలాది మంది నీ సంతానం ప్రతిరోజూ ఇలాగే కష్టపడతారు కదా!?" సురభి ఇలా సమాధానం ఇచ్చింది" ఆ వేలాది మందిలో బాధపడుతున్న ప్రతి ఒక్కరికొరకు, నేను ఏడుస్తున్నాను, రాజా ! నేను వారిలో బలహీనంగా ఉన్న సంతానం కొరకు మరింతగా ఏడుస్తున్నాను. "అప్పుడు ఇంద్రుడు తన బిడ్డ బాధకు తల్లి హృదయంలో కదిలే ప్రేమను అర్థం చేసుకున్నాడు. పొలాలపై వర్షం కురిపించాడు. ఎద్దులకు శ్రమ తగ్గించాడు. ఓదార్పు అనేది మనిషికీ మృగానికీ ఒకేలా అవసరం.[1]

చాలా సున్నితంగా ఇదే రకమయిన ప్రేమని దశరథుడు తన పరిపూర్ణ గుణగణ స్వరూపుడు అయిన కుమారుడు రామచంద్రునిపై ప్రదర్శించాడు. కుమారుని అద్భుతమైన లక్షణాలను స్మరిస్తూ మరియు అతని విరహంలో దుఃఖించాడు. అ దశరథుడు తన కొడుకును తన వారసుడిగా వ్యవస్థాపించాలని ప్రతిపాదించినప్పుడు, అతన్ని సింహాసనంపై కూర్చోబెట్టాలనుకొన్నప్పుడు రాకుమారులను ప్రభువులను సంబోధిస్తూ అతను చెప్పే మాటలు వినండి. ఇందులో ప్రతి వాక్యం దశరథుని ప్రేమను మరియు అహంకారాన్ని పీల్చుకుంటుంది.

మరియు కైకేయి తన వరాలను కోరినప్పుడు రాముడిని అడవికి బహిష్కరించాలని కోరినప్పుడు, దశరథుడు ఆమె పాదాలపై పడ్డాడు. సూర్యుడు లేకుండా ప్రపంచం జీవించినప్పటికీ, రాముడు లేకుండా తాను జీవించలేనని ప్రకటించాడు: "నేను నీ పాదాలపై తల పెడుతున్నాను. నన్ను కరుణించు, వృద్ధాప్యంలో మరియు మరణం అంచున ఉన్న నన్ను కరుణించు."[2]

ఈ మాటలలో చాలా నిజముంది. శ్రీరాముడు తన తండ్రినుండి దూరమై అడవులకు వెళ్ళినప్పుడు, ఆ తండ్రి మనసు విరిగిపోయి, తన కుమారుని పట్ల శోకంతో చనిపోయాడు. తాను అడవులకు వెళుతున్నానని రామచంద్రుడు చెప్పినప్పుడు అతనికి, తల్లి కౌసల్యకు మధ్య జరిగిన దయనీయమైన దృశ్యాన్ని గుర్తుంచుకోండి. రామచంద్రుడు అడవులకు వెళ్ళటానికి వీల్లేదని ఆమె బాధతో ఏడుస్తుంది; "నీవు ఇక్కడ ఉన్నప్పుడే నేను ఇట్టి నిరాదరణకు లోనయ్యాను. నాయనా! నీవు దూరమైనచో

ఇక చెప్పవలసినదియేమి? అప్పుడునాకు మరణము తథ్యము. చంద్రునివంటి ముఖకాంతులు గల ఓ కుమారా! అకాల మరణము నాకు అసంభవమయినప్పుడు ఇక నీకు దూరమై నేను జీవించుటయే వృథా. కావున వాత్సల్య కారణముగా విడిచి ఉండలేని ధైర్యము సడలిన ఆవు లేగదూడను అనుసరించినట్లుగా , నేనుకూడా నిన్ననుసరించి, అడవులకు వస్తాను.".

మరియు కుంతి యొక్క దుఃఖాన్ని చూడండి. ఆమె ఐదుగురు గొప్ప కుమారులయిన పాండవులు, అవమానకరమైన జూదంలో అందరూ ఓడిపోయి తర్వాత అజ్ఞాతవాసానికి తరిమివేయబడ్డారు.

స్త్రీలు మరియు తల్లులలో అత్యంత ధైర్యవంతురాలైన కుంతి, యుద్ధ సమయం వచ్చినప్పుడు, క్షత్రియ స్త్రీకి కొడుకుగా పుట్టిన వాడు గౌరవం కాపాడుకోవలసిన సమయం ఆసన్నమైందని, గౌరవం కోసం ప్రాణాలను కూడా వదులుకోవాలని ఇలా పాండవులకు చెప్పాలని శ్రీ కృష్ణుడిని కోరింది.

మాయాజూదంలో ఆభరణాలు, వస్త్రాలు పోగొట్టుకొని, సిగ్గుతో ముఖాలు దించుకొని, నారచీరలు కట్టుకొని, జింకచర్మాలు చేతపట్టుకొని– మునివేషధారులు, సూర్యతేజులు, ధర్మపరులు అయిన పాండవులను చూచి కుంతి హృదయం దుఃఖించింది. తన కుమారులతో ఇలా అంది. "కుమారులారా! ఈ విధంగా ద్యూతవ్యసనంతో బాధపడుతున్న మిమ్మల్ని చూడకముందే పాండురాజు స్వర్గస్థుడై పుణ్యవంతుడయ్యాడు. భర్తతో చనిపోవటానికి మాద్రి తపస్సు చేసింది. నేను వాళ్ళ వెంట వెళ్ళని దురదృష్టవంతురాలిని ' – అని కుంతి దుఃఖిస్తూ పలికింది. విరిగిపోయిన హృదయంతో, వారు అడవులకు వెళ్ళేటప్పుడు వారిని అనుసరించకుండా ఉండటం చాలా కష్టమయినా వారి వెంట వెళ్ళక తన కుమారుల నుండి తనను తాను బలవంతంగా దూరం చేసుకొన్నది.[3]

మరలా, తన వీర కుమారుడైన అభిమన్యుని మరణంపై అర్జునుని వేదనను గమనించండి; అతను యుద్ధ క్షేత్రం నుండి శిబిరానికి తిరిగి వచ్చినప్పుడు, అలవాటు లేని మేఘం తనను చుట్టుముట్టినట్లు భావించి, సహాయం కోసం, వివరణ కోసం శ్రీ కృష్ణుని వైపు తిరుగుతాడు. అతనికి సమాధానం చెప్పడానికి భయపడే తన సోదరులను అర్జునుడు ఆత్రంగా ప్రశ్నిస్తాడు. విచారకరమైన హృదయంతో తన కుమారుని మరణం యొక్క వేదనను అనుభవిస్తాడు;

అనేకమంది తన చుట్టూ చేరి, బాణాలు, ఖడ్గాలు మొదలైన అస్త్రాలూ, ఆయుధాలూ ప్రయోగిస్తుంటే తనకు సహాయపడేవారు లేక నన్ను తన మనస్సులో తలచుకొనకుండా ఉంటాడా? 'తండ్రీ! నేను శ్రమను పొందకుండా శత్రువులను చంపటానికి రా!' అని ఎన్నోమార్లు పిలిచే ఉంటాడు. తన శత్రువులు తన చుట్టూ మూసుకుపోయిన సమయంలో, "నా తండ్రి నన్ను ఈ భయంకరమైన తుఫాను నుండి రక్షిస్తాడు" అని ఖచ్చితంగా ఆ అభిమన్యుడు అనుకొని ఉంటాడు. అని బాధపడుతూ అర్జునుడు వందగాయాలు శరీరంపై తగిలిన విధంగా పడిపోయాడు. తన బిడ్డను రక్షించుకోవడానికి హాజరు కాలేదనే ఆలోచన అర్జునుడికి పిచ్చి పట్టించింది.

ఎప్పటికీ వీరోచిత ఆత్మ బలహీనులను రక్షించాలని కోరుకుంటుంది; వీరుడు తండ్రి అయినప్పుడు మరియు బలహీనమైన వ్యక్తి బాగా ప్రేమించే కొడుకు అయినప్పుడు ఇది చాలా ఎక్కువ.[4]

బలహీనులను రక్షించే ఈ కర్తవ్యం నీతిమంతుడైన రాజులో అవతరించింది, రాజు ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడం అతని ప్రజలలో విధేయతను మేల్కొల్పుతుంది.

"తన ప్రజలను రక్షించడం రాజ విధుల యొక్క సారాంశం"[5] అని భీష్ముడు చెప్పాడు. "తన గర్భంలో ఉన్న బిడ్డపట్ల తల్లి జాగ్రత్త వహించినట్లు రాజు తన ప్రజల పట్ల ఎల్లప్పుడూ జాగ్రత్త వహించాలి. గర్భవతియైన స్త్రీ తనకు అత్యంత ప్రియమైన వస్తువులను విస్మరించి, తన బిడ్డ యొక్క మేలును మాత్రమే కోరుకుంటుంది. అలాగే రాజులు తాము ప్రజల పట్ల ప్రవర్తించాలి.[6]

ఈ రక్షణ కర్తవ్యం ఎంత కఠినమైనదంటే, రాజయిన సగరుడు తన సొంత పెద్ద కొడుకు అసమంజసుడిని రాజ్యం నుంచి బహిష్కరించాడు. ఎందుకంటే ఆ యువరాజు నిర్లక్ష్యపు క్రూరత్వంతో తన ప్రజల పిల్లలను నదిలో ముంచేవాడు.[7]

ఉత్తములయిన రాజులు తమ రక్షణను విశ్వసించే బలహీనులను రక్షించిన మార్గాల గురించి చాలా కథలు ఉన్నాయి. ఈ కర్తవ్య భావం దిగువ జంతువులతో మనిషిని ఆలింగనం చేయించింది. కేవలం ఒక కుక్క హస్తినాపురం నుండి రాజు యుధిష్ఠిరుడిని అనుసరించింది. అతని చివరిదయిన మహా ప్రయాణంలో అలసిపోయిన సంచారంలో, అతనితో పాటు కొండలు, నదులు, అడవులు విశాలమైన ఎడారులను దాటింది. ఆ సుదీర్ఘ ప్రయాణంలో ప్రాణాలతో బయటపడిన ఏకైక జీవిగా రాజును రక్షించింది.

ధర్మరాజును స్వర్గానికి తీసుకురావడానికి ఇంద్రుడు స్వర్గం నుండి దిగివచ్చాడు. ధర్మరాజును దివ్యరథం ఎక్కమన్నాడు. తనతో పాటు పైకి వేగంగా వెళదామని కోరాడు. ధర్మరాజు ఇంద్రునికి వంగి నమస్కరించాడు. తన నమ్మకమైన అనుచరుడైన కుక్క తలను మెల్లగా తాకాడు: "ఈ కుక్క, గతానికి మరియు వర్తమానానికి ప్రభువు. నా పట్ల చాలా అంకితభావంతో ఉంది. ఇది కూడా స్వర్గానికి రావాలి. నా హృదయం ఈ పేద బిడ్డపట్ల కరుణతో నిండి ఉంది" అని ధర్మరాజు అన్నాడు.

"ఏ కుక్క కూడా స్వర్గప్రదేశాలను త్రొక్కదు" అన్నాడు ఇంద్రుడు. "ఓ ధర్మరాజా! అమరత్వాన్ని నాలాంటి ఉన్నత స్థితిని సుదూర అదృష్టంచే నువ్వు పొందావు. అధిక విజయాన్ని మరియు స్వర్గం యొక్క అన్ని ఆనందాలను నువ్వు ఈ రోజు గెలుచుకున్నావు. నీ ఆరోహణకు(ఉన్నత స్థితికి) ఆటంకం కలిగించే కుక్కను తరిమివేయి. ఈ కుక్కను వదిలిపోవటం కఠినమైన పని కాదు; ఈ కుక్క భూమిపై నివసించే అర్హత కలిగినది. "

"ఓ వేయి కన్నులవాడా ! ధర్మబద్ధంగా జీవించేవాడా! సత్పురుషుడు తనకి అనర్హమైన పనికి పాల్పడలేదు.అంకిత భావంతో నాయందు భక్తి కలిగిన సేవకుని వదిలిపెట్టడం ద్వారా కలిగే ఆనందము నాకు వద్దు." అని ధర్మరాజు అన్నాడు.

"కుక్కలు అనుసరించే వ్యక్తులకు స్వర్గంలో చోటు లేదు" అని ఇంద్రుడు కఠినంగా చెప్పాడు.

"కుక్కను విడిచిపెట్టి రా! సమయం వేగంగా గడిచిపోతుంది. ఆలస్యం చేయకు" అని ఇంద్రుడు అన్నాడు.

"ఓ ఇంద్రా! పరాక్రమవంతుడా! భక్తితో కూడిన సేవకుని విడిచిపెట్టడం బ్రాహ్మణుని చంపినంత అపరిమితమైన పాపమని బుద్ధిమంతులు చెబుతారు. నేను ఆనందాన్ని పొందడం కోసం ఈ కుక్కను వదలివేయడం పాపం. అది కుదరని పని" అని ధర్మరాజు అన్నాడు.

ఇంద్రుడు చెప్పిన మాట ఫలించలేదు. ధర్మరాజు స్థిరమైన అభిప్రాయంతో ఉన్నాడు. అతని స్పష్టమైన దృష్టిని గందరగోళపరచటానికి ఇంద్రుడు వితండవాదం చేసాడు. "పుణ్యాత్ముడా! ప్రజలందరూ కొనియాడగా పుణ్యభాగ్యంతో దివ్యత్వాన్ని దర్శించి కూడ స్వర్గానికి రాకపోవటం సముచితంగా ఉందా? ద్రౌపదిని, భీమసేన, అర్జున నకుల సహదేవులను కూడా వదలివెయ్యటానికి సిద్ధపడ్డావే! కుక్కను

విడిచిపెట్టటానికి ఎందుకు వెనుకాడుతున్నావు? పండితులచేత ప్రశంసలు పొందిన నీకు నేను ఉచితానుచితాలు నేర్పాలా? ఈ పని నీకు తగినదేనా?' అని ఇంద్రుడు అన్నాడు.

"నీకంటె మంచి చెడు పద్ధతులు తెలిసినవాడినా నేను? అదీ కాకుండా మహాత్ములతో వాదం చేయటం ఎవరికయినా సాధ్యమవుతుందా! అయినా కూడా విన్నవించదగిన విషయం ఉంటే విన్నవించటం తప్పు కాదనే ఆలోచనతో విన్నవిస్తున్నాను. చనిపోయిన వారితో స్నేహం గాని, ఇంకా గొడవలు గాని ఉండవని లోకంలో అందరికీ తెలిసిన విషయమే. నా సోదరులు మరియు కృష్ణుడు పడిపోయి మరణించినప్పుడు, వారిని తిరిగి బ్రతికించే శక్తి నాకులేదు. అందుకే నేను వారిని విడిచిపెట్టాను. నేను వారిని వారు జీవించి ఉన్నంత కాలం విడిచిపెట్టలేదు. ఈ కుక్క జీవించి ఉన్నది.

శరణుకోరినవాడిని స్వీకరించకపోవటం, మంచిమిత్రునికి ద్రోహం చెయ్యటం, కులవధువును చంపటం, బ్రాహ్మణుని ధనాన్ని అపహరించటం అనే ద్రోహాలతో సమానమయినది ఏ ఆపరాధమూ చేయని సేవకుడిని నిర్దాక్షిణ్యంగా వదలివెయ్యటం. ఈ పాపాన్ని ఎట్లా భరిస్తాను? "అని ధర్మరాజు అన్నాడు.

ఇలా దృఢనిశ్చయంతో పలికిన తన కుమారుని చూచి ధర్మప్రభువయిన యమధర్మరాజు చాలా సంతోషం పొంది కుక్కరూపాన్ని వదలి తన రూపాన్ని పొంది ఎదుట నిలిచాడు.

అప్పుడు గంధర్వులు, దేవఋషులు, మరుత్తులు, అశ్వినులు ఆనందంతో వచ్చారు. వారందరూ యముడు, ఇంద్రునితో కలిసి పరమాదరంతో ధర్మరాజును దివ్యరథంలో ఆసీనుని చేశారు. దేవతలు స్తోత్రాలు చేస్తుండగా, ఋషులచే స్తుతించబడిన, ధర్మరాజును అందరూ స్వర్గలోకానికి తీసుకువెళ్లారు.[8]

పురాతన కాలం నాటి మరో కథ వినండి.

ఒకసారి ఉశీనరుని కుమారుడైన శిబి మహారాజు తన విశాలమైన ఆస్థాన సమావేశ మందిరంలో కూర్చున్నాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా, గాలిలో పరుగెత్తుకుంటూ ఒక పావురం లోపలికి ఎగిరి వచ్చి , రాజు యొక్క విశాలమైన ఒడిలోకి వచ్చి వాలింది. ఊపిరి పీల్చుకుని, అలసట మరియు భయంతో అది మూర్ఛపోయింది. రాజు ఆశ్చర్యకరంగా సున్నితంగా దాని కలతబడిన ఈకలను

మృదువుగా నిమిరి , చదును చేస్తూ, తన లాలనతో దాని ఊపిరిని మరియు ప్రాణాన్ని ఉపశమింపచేసాడు. ఇంతలో అకస్మాత్తుగా కోపంగా ఉన్న ఒక గద్ద కూడా హాల్లోకి దూసుకొచ్చి, రాజు ముందు నిలబడింది.

బీభత్సాన్ని పునరుజ్జీవింపజేస్తూ , (చావునకు సిద్ధమై తిరిగి బ్రతికిన) పావురం మానవ స్వరంతో ఇలా రాజుతో విషాద స్వరంతో చెప్పింది. "నేను నివసించే ఈ భూమికి నువ్వే సార్వభౌమాధికారివి. (చక్రవర్తివి) నీనుండి రక్షణ పొందే హక్కు నాకు కూడా ఉంది. నా శత్రువు నుండి ఆశ్రయం పొందేందుకు నేను నీ వద్దకు వచ్చాను."

కానీ గద్ద కూడా ఇలా మానవ స్వరంతో రాజుతో చెప్పింది.: "రాజా ! నేను కూడా నీ సార్వభౌమాధికారంలో నివసిస్తాను. మరియు ఈ పావురం విధిద్వారా నాకు నియమితమయిన ఆహారం. మీరు దానిని నాకు ఆహారంగా నిరాకరించి నట్లయితే, మీరు ఖచ్చితంగా నా హక్కును తిరస్కరించినవారవుతారు."

అప్పుడు రాజు కాసేపు ఆలోచించి ఇలా అన్నాడు: "మీరిద్దరు చెప్పినది నిజమే! పావురమా! నేను నీ అమాయక ప్రాణాన్ని హాని నుండి రక్షించవలసిన బాధ్యత నాకు ఉంది. నా నుండి రక్షణ పొందే హక్కు నీకు ఉంది; ఓ గద్దా ! నేను నీకు న్యాయమైన ఆహారాన్ని నీకు అందచేయవలసిన బాధ్యత నాకు ఉన్నది. నేను ఈ ధర్మాన్ని ఈ విధంగా పరిష్కరిస్తాను.

"గద్దా ! నీకు ఆకలి తృప్తి కలిగేటంతవరకు నేను ఇతర మాంసాహారాన్ని ఇస్తాను. తీసుకో!" ఇలా చెప్పిన శిబి మాటలు విని గద్ద ఇలా చెప్పింది : "రాజా! నాకు ఈ పావురపు మాంసమే కావాలి. మరే ఇతర పక్షుల, జంతువుల మాంసం వద్దు. లేకపోతే, ఈ పావురం ఎంత బరువుందో అంత బరువు కలిగిన మాంసం నీ శరీరం నుండి నాకు ఇవ్వవలసినది"

గద్ద మాటలకు కోపంతో ఉన్న మంత్రులు తమ ప్రియమైన రాజు యొక్క మాంసాన్ని కోరి, తద్వారా రాజు యొక్క ప్రాణ హానిని తలపెట్టిన గద్దను చంపాలని, గద్దకు వ్యతిరేకంగా కేకలు చేసారు.

కానీ శిబి వారిని వారిస్తూ ఇలా అన్నాడు: "నేను ఇక్కడ నేను నా ప్రజలకు ఉదాహరణగా, ధర్మం యొక్క సజీవ స్వరూపునిగా సార్వభౌమాధికారిగా కూర్చున్నాను. చిన్న లేదా గొప్పవారి కోసం లేదా పావురం లేదా గద్ద కోసం నేను సింహాసనంపై

కూర్చోలేదు. నేను ఈ చిన్న విషయాన్ని పరిష్కరించలేక విఫలమైతే, గొప్ప విషయాలను కూడా పరిష్కరించలేక విఫలమవుతాను; అందువల్ల నా ప్రజలు నన్ను అనుకరిస్తూ ఘోరంగా జీవితంలో విఫలమవుతారు. ఒక జత త్రాసులను (తక్కెడలు) పైకి తీసుకురండి!" అని రాజు ఆజ్ఞాపించాడు.

చాలా దుఃఖంతో, అవిధేయత పాటించలేక, పళ్ళ బిగువున బాధను అణచుకొని, మంత్రులు త్రాసును తీసుకువచ్చి పైకి లేపారు. శిబి చక్రవర్తి ఒక మృదువైన చేతితో, పావురాన్ని తక్కెడలో ఒకవైపు ఉంచాడు. ఇంకొక చేతితో తన శరీరమునుండి మాంసాన్ని కత్తిరించి తక్కెడలో రెండవవైపు ఉంచాడు. కానీ పావురం చాలా బరువుగా ఉంది. తన మాంసం సరిపోలేదు.

రాజు మరొక ముక్కను శరీరం నుండి కత్తిరించి తక్కెడలో ఉంచాడు. అయినా పావురం చాలా బరువుగా ఉంది. సరితూగలేదు. ఆశ్చర్యపోయిన రాజు తన శరీరం నుండి మరొక మాంసపు ముక్కను కత్తిరించాడు. కానీ పావురం అంతకంతకూ బరువెక్కింది. చివరికి రాజు తన శరీరాన్నంతటినీ త్రాసులో ఉంచాడు. వెంటనే గద్ద మరియు పావురం అదృశ్యమయ్యాయి. వారి స్థానంలో ఇంద్రుడు మరియు అగ్ని నిలబడ్డారు.

వారు బిగ్గరగా శిబిని పొగుడుతూ ఆశీర్వదిస్తూ ఇలా అన్నారు. : "నిజంగా నువ్వే రాజుపదానికి అర్హునివి. సార్వభౌమాధికారి యొక్క మొదటి కర్తవ్యం రక్షణ. దీని ఆచరణ గురించి నీకు బాగా తెలుసు! మేము విన్నదానికంటే ఎక్కువగా రక్షణ గుణాన్ని నీలో ఈరోజు చూసాము. నీ శరీరము ఇక ఛిన్నాభిన్నం కాదు. యథాప్రకారంగా నీ శరీరాన్ని నువ్వు పొందుతావు. నువ్వు నీ ప్రజల హృదయాలలో చిరకాలం జీవిస్తావు."[9]

ఈ కథలు రాజుల గురించి చెప్పబడిన మాట నిజం. ఎందుకంటే వారు బలహీనుల రక్షకులుగా పేరుపొందారు. అంత ఉన్నత స్థాయిలో లేకపోయినా బాలురు తమ కంటే బలహీనంగా ఉన్న వారందరి రక్షణ బాధ్యతను తక్కువ స్థాయిలో అయినా నిర్వర్తించాలి. ఈ కథలను మనం ఉదాహరణగా తీసుకొని, వారు వివరించే సద్గుణాలను మన జీవితాల్లో నకలుగా చేసుకునేందుకు, ఆచరించేటందుకు ఈ కథలు చెప్పబడ్డాయి.

కరుణకు ఒక విశిష్టమైన ఉదాహరణగా నిలిచిన ఒక మహారాజు ఉన్నాడు. ఆ మహారాజుయొక్క కరుణ "రంతిదేవుని వలె కరుణ" అని లోకంలో ఒక సామెతగా మారింది. రంతిదేవుడు తను కూడబెట్టిన సమస్త సంపదలు బీదలకు దానం చేసాడు. కడు పేదవాడై అన్నం నీళ్ళుదొరకక భిక్షాటనచేస్తూ తనపై ఆధారపడిన వారితో కలిసి నలభైఎనిమిది దినాలు గడిపాడు. అయినా ధైర్యం కోల్పోలేదు. ఒకనాడు ఉదయం కొంత నెయ్యి, పరమాన్నం, మంచినీరు లభించాయి. ఈ పొదుపు భోజనము చేయటానికి వారు కూర్చోబోతుండగా ఒక బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. అన్నం అర్థించాడు. అతనిని కాదనకుండా ప్రీతిగా ఆదరించి, కృష్ణార్పణం అంటూ రంతిదేవుడు అన్నంలో సగభాగం పెట్టాడు..

ఆ బ్రాహ్మణుడు వెళ్ళిపోయాక, మిగిలిన ఆహారాన్ని సమభాగాలుగా విభజించి,తమలో ఒక్కొక్కరికి ఒక్కో భాగాన్ని రంతిదేవుడు కేటాయించి విభజించాడు.

తన భాగంగా లభించినదానిని రంతిదేవుడు తినడానికి సిద్ధమైనప్పుడు, ఒక దీనుడు ఆహారం కొరకు వచ్చాడు. రంతిదేవుడు సంతోషంగా విభజింపబడిన భోజనంలో అతనికి ఒక వాటా ఇచ్చాడు. దీనుడు వెళ్ళిన తరువాత , అతను ఇంకా ఉపవాసం విరమించుకోకముందే, ఒక వ్యక్తి కుక్కల దళంతో వచ్చాడు. తనకు తన పరివారానికి ఆహారం ఇమ్మని కోరాడు. అతిథులకు ఇవ్వగా మిగిలిన ఆహారాన్ని , రంతిదేవుడు వారికి ఇచ్చాడు. ఇక ఒకనికి మాత్రమే సరిపడు నీరు ఉండగా రంతిదేవుడు తన ఎండిపోయిన పెదవులపై ఆ పానీయానికి స్వాగతం ఇచ్చి దాహం తీర్చుకోబోతున్నాడు.

ఇంతలో "నీళ్ళు ఇవ్వండి, కొంచెం నీరు," అని దగ్గరలో ఒక స్వరం వినిపించింది; రంతిదేవుడు, దయతో కూడిన కళ్లను తిప్పుతూ, నేలపై పడి ఉన్న ఒక దయనీయమైన రూపంతో ఉన్న ఆర్తుని చూసాడు. అతనిపైకి వంగి, తన లేత కళ్ల నుండి మధురమైన కరుణను ఆ రంతిదేవుడు కురిపించాడు. ఆ ఆర్తుని తలను మెల్లగా పైకెత్తి, చల్లటి స్వచ్ఛమైన నీటిని దాహంకోసం తపిస్తూ ఉక్కిరిబిక్కిరి అవుతున్న అతని పెదవులపై రంతిదేవుడు ఉంచాడు.

"ఓ అన్నా! అన్నం లేదు కాని కొద్దిగా మంచినీళ్ళు ఉన్నాయి. తాగు నాయనా! రా నాయనా! తోటి మానవుడికి కష్టం వచ్చినప్పుడు, వాని కష్టాలను వెంటనే పోగొట్టి ఆదుకోవడం కంటె ఉత్తమమైన పని లేదు కదా! నాకు అండ దండ శ్రీమహా విష్ణువు

మాత్రమే సుమా!" " అంటూ రంతిదేవుడు తన సౌమ్యమైన దయా వచనాలతో తన జలదాన బహుమతి విలువను రెట్టింపు చేసాడు. ఆ ఆర్తుడు నీటిని తాగుతున్నప్పుడు, రంతిదేవుని ప్రేమగల హృదయం హరిని ఇలా ప్రార్థించింది: "నేను అష్ట సిద్ధులను (1. అణిమ, 2. మహిమ, 3. గరిమ, 4. లఘిమ, 5. ప్రాప్తి, 6. ప్రాకామ్యము, 7. ఈశత్వము, 8. వశిత్వము) అడగను," అంటూ ఇంకా ఇలా చెప్పాడు; "నేను మోక్షాన్ని అడగను. నేను అన్ని జీవులలో దుఃఖ రూపంలో వ్యాపించాలి. వారి కష్టాల కోసం నేను బాధలు పడాలి. పరదుఃఖములు పోవుటయే నా సర్వ దుఃఖములు పోవుట. ఏ జీవి దుఃఖం లేకుండా జీవించాలని మాత్రమే నేను అడుగుతున్నాను. ఈ నీటిని ఈ కష్టపడుతున్న వ్యక్తికి ఇవ్వడం ద్వారా నా కష్టాలు, నా ఆకలి, దాహం, నీరసం, మరియు మూర్ఛత్వం అంతా పోయింది." రంతిదేవుని యొక్క ఈ ప్రార్థన కరుణ యొక్క అత్యంత పరిపూర్ణ వ్యక్తీకరణగా మిగిలిపోయింది.[10]

మనకంటే బలహీనులపట్ల మనం చూపే సున్నితమైన రక్షణ భావన, (నేను రక్షిస్తున్నాను" అనే భావన) మన గర్వము యొక్క దుర్మార్గముతో సంబంధం కలిగి ఉంటుంది. ఇది అహంకారం నుండి పుడుతుంది. ఈ అహంకారం "నేనువేరు" "నువ్వు వేరు" అనే భావాన్ని పెంచుతుంది. "నేనువేరు", "నువ్వు వేరు" అనే భావాన్ని విడిచి "నేను ఈ బలహీనునికి సహాయం చేస్తున్నాను. ఈ బలహీనునికి సహాయం చేసే అవకాశాన్ని భగవంతుడు నాకు కలిగించాడు." అనే వాస్తవాన్ని ఎక్కువగా ఆలోచించి ఆచరిస్తే అది ఉత్తమమార్గమవుతుంది. ఒకరి స్వంతానికి నేను ఉపయోగపడుతున్నానని భావించి, మంచి చేసే శక్తిపై మన మనస్సును నిలిపితే, మనలో గర్వం మేల్కొంటుంది. ఇది చేసిన మంచి పని యొక్క ఫలితాన్ని త్వరగా నాశనం చేస్తుంది. అహంకారము అని పిలువబడే ఈ సూక్ష్మమైన మరియు అత్యంత ప్రమాదకరమైన శత్రువు నుండి శరీరాన్ని ధరించే వారు ఎవరూ తప్పించుకోలేరు.

జాగ్రత్త లేని క్షణాల్లో అహంకారపు ఊగిసలాట క్రింద జీవితంలో చాలా ఎక్కువ పతనం జరుగుతుంది. అనివార్యంగా అనేక పర్యవసానాలను చవిచూస్తుంది. కర్మ యొక్క చట్టం దేనికి లొంగనిది. అధికమయినదానికి మరియు తక్కువదానికి రెండింటికీ అహంకారపు ఫలితం సమానంగానే ఉంటుంది. తెలివికలిగినవారికి మరియు బలవంతులకు గొప్పదయిన మరియు సూక్ష్మమయిన శత్రువుగా భావించబడే

అహంకారానికి వ్యతిరేకంగా స్మృతులలో చాలా హెచ్చరికలు ఇవ్వబడ్డాయి. వీటిలో కొన్నింటిని వినండి.

ప్రాచీన ఋషి అయిన నారాయణుడు అనేవాడు హిమాలయ పర్వతాలలోని బదరీ అనే పేరుతో పిలువబడే శిఖరంపై (బదరికాశ్రమంలో) వెయ్యేళ్లకు పైగా కఠోరమైన తపస్సు చేసాడు. అతని ఇంద్రియ నిగ్రహాన్ని పరీక్షించటానికి, తన తపస్సు నుండి దృష్టిని మరల్చడానికి, అతని తపోవనంలో నృత్యగానాదులను చేయడానికి వేలాది అప్సరసలను ఇంద్రుడు పంపాడు. వారు ఇంద్రుడు నిర్దేశించినట్లు చేసారు.

ఋషి నారాయణుడు తన ప్రకాశించే జ్ఞాన నేత్రంతో అప్సరసల రాక లోని ఉద్దేశ్యాన్ని గమనించి దైవం మీద విశ్వాసంతో లోలోపల నవ్వుకొన్నాడు. తన యోగశక్తితో అనేక వేల అప్సరసలను సృష్టించాడు. వారు ఇంద్రుడు పంపిన అప్సరసలకు ఆతిథ్యం ఇచ్చారు. అప్సరసలు సిగ్గుపడి, తమను క్షమించమని ఋషిని ప్రార్థించారు. నారాయణ ఋషి సంతోషించాడు. వారిని క్షమించాడు. వారి వినయానికి సంతృప్తి చెంది వారిని నారాయణ ఋషి వరం కోరుకొమ్మన్నాడు. అతనినే తమకు భర్తగా మరియు రక్షకుడిగా ఉండమని అప్సరసలు వరం కోరారు. నారాయణ ఋషి గొప్పదయిన అయోమయంలో పడ్డాడు. వరం ఇస్తానని చెప్పి, కాదని చెప్పలేకపోయాడు.

నారాయణ ఋషి పశ్చాత్తాపపడ్డాడు; "వీరిని భార్యలుగా అంగీకరిస్తే నా తపస్సు అంతా గంగపాలవుతుంది. సాటి మునిబృందంలో అపహాస్యం పాలవుతాను. ఇంద్రునితో పాటు వీళ్ళకి కూడా బుద్ధి చెబుదామని అహంకరించి, వరం కోరుకోమని ఇలా కష్టాల్లో ఇరుక్కున్నాను. ధర్మవినాశనానికి అహంకారమే మొదటి కారణం. సంసారవృక్షానికి ఇదే మూలం. పెదవికదపకుండా అలా మౌనంగా ఉన్నా బాగుండేది. పాడీ ఆడి అలసిపోయి వీళ్ళదారిన వీళ్లు వెళ్ళిపోయుండేవారు. నా తపస్సును ఖర్చుపెట్టి వీళ్లకు సేవలు చేయటం కోసం అప్సరసలను సృష్టించాను. ఊర్వశిని సృష్టించాను. విందులు చేసాను. ఇలా ఇరుక్కున్నాను. వీళ్ళంతా నన్ను పెళ్ళాడ మంటున్నారు. అయ్యో! సాలెపురుగులా నా వలలో నేనే చిక్కుకున్నాను" అని తనలో తాను నారాయణ ఋషి బాధపడ్డాడు.

తరువాత నారాయణ ఋషి కన్యలతో ఇలా అన్నాడు: "ఈ జన్మలో గృహస్థ జీవితంలోకి ప్రవేశించడం నా ప్రతిజ్ఞకు విరుద్ధం. వేరే ఇతరమయిన కార్యనిర్వహణ

కొరకు మరొక జన్మలో, కృష్ణునిగా నేను అవతరిస్తాను. నేను నా వాగ్దానాన్ని అప్పుడు నెరవేర్చుకొంటాను. భయంకరమైన బరువు కలిగిన భారీ కుటుంబము కలిగిన గృహస్థాశ్రమాన్ని స్వీకరిస్తాను. ఉన్నత కుటుంబాలలో పుట్టబోయే మీ అందరినీ వివాహం చేసుకుంటాను" అన్నాడు.[11]

విశ్వామిత్రుడు (విశ్వస్య మిత్రమ్, విశ్వం మిత్రం అస్య ప్రపంచమునకు మిత్రుడు; ప్రపంచము మిత్రునిగా గలవాడు. విశ్వామిత్ర ఋషి.) గాధి పుత్రుడు. బ్రహ్మ నుండి నేరుగా ఉద్భవించిన కుశుడు స్థాపించిన క్షత్రియ రాజుల శ్రేణికి చెందినవాడు. ఒకసారి విశ్వామిత్రుడు తన సైన్యాలతో తన రాజ్యానికి తిరిగి వస్తున్నాడు. దారిలో వసిష్ఠ ఋషి యొక్క తపోవనం వచ్చింది. (అతిశయేన వశీ ఇంద్రియములను వశపరుచుకొన్నవాడు వసిష్ఠుడు). తన సేనలను దూరంగా వదిలి, విశ్వామిత్రుడు ఆ మహర్షికి నమస్కరించడానికి ఆశ్రమానికి వెళ్ళాడు. వసిష్ఠుడు అతనిని సకల గౌరవాలతో, దయతో ఆదరించాడు. విశ్వామిత్రుడు తిరిగి బయలుదేరే సమయంలో, అతనితో పాటు అతని సైన్యాలకు కూడా వసిష్ఠుడు ఆతిథ్యం ఇస్తానన్నాడు. విశ్వామిత్రుడు పదే పదే తిరస్కరించాడు. సన్యాసి యొక్క స్వల్ప వనరులపై భారం వేయడానికి అతను ఇష్టపడలేదు; కానీ వసిష్ఠుడు తన తపస్సు యొక్క శక్తులతో తన అద్భుతమైన ఆవు నందినీ ధేనువు సహాయంతో, తన రాచరికపు అతిథికి పరివారముతో సహ కావలసినవన్నీ సులభంగా అందించగలనని పదే పదే నొక్కి చెప్పాడు.

అలా వసిష్ఠునిలో అహంకారం ఉద్భవించింది. విశ్వామిత్రుని ఈ విధంగా వసిష్ఠుడు అతిగా ఒత్తిడి చేసి అతను పరివారంతో సహ అతిథి సేవలు పొందటానికి సమ్మతింపచేసాడు. విశ్వామిత్రుడు అతిథి సేవలో ఆవు యొక్క అద్భుతాలను చూసాడు. అప్పుడు అతని మనస్సులో దురాశ ఏర్పడింది. వెంటనే వసిష్ఠునితో "ఇటువంటి ఆవు యొక్క అవసరం బ్రాహ్మణునికి ఏముంది? : ఈ ఆవు రాజుల దగ్గర ఉండటానికి మాత్రమే తగినది," అంటూ ఆవును రాజునైన తనకు ఇమ్మని అడిగాడు.

వసిష్ఠుడు విచారంతో ఇలా అన్నాడు: "ఆవు నన్ను విడిచిపెట్టడానికి అంగీకరిస్తే దానిని తీసుకోండి." కానీ విశ్వాసపాత్రురాలయిన ఆవు అలా చేయలేదు; వసిష్ఠుని విడిచిపెట్టటానికి ఇష్టపడలేదు. మరియు విశ్వామిత్రుని సైనికులు ఆవును

బలవంతంగా లాగడానికి ప్రయత్నించినప్పుడు, ఆమె తన యజమానికి దయతో తనని విడిచిపెట్టవద్దని విజ్ఞప్తి చేసింది.

అప్పుడు సూక్ష్మమైన అహంకారం మరియు గర్వం తర్వాత సహజమైన తదుపరి దశయైన కోపాన్ని వసిష్ఠుడు పొందాడు. బ్రాహ్మణ క్షత్రియుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. ఇది భూమి యొక్క మొత్తం చరిత్రను మార్చింది. ఆవు తనకు సహాయం చేయడానికి అనేక ఆర్యేతర తెగలు, శకులు మరియు పహ్లవులు, యవనులు మరియు బార్బరులను పిలిచింది. ఆ జాతుల వారందరూ విశ్వామిత్రునిచే నాశనం చేయబడ్డారు; కానీ చివరకు వసిష్ఠుని యొక్క బ్రాహ్మణశక్తి విశ్వామిత్రుని క్షత్రియ పరాక్రమాన్ని అధిగమించింది:

అప్పుడు వైరాగ్యంలో, విశ్వామిత్రుడు తన రాజ్యాన్ని విడిచిపెట్టాడు. అనేక యుగాలు తీవ్రమైన తపస్సును ఆచరించి, బ్రాహ్మణశక్తిని పొందాలని నిర్ణయించుకున్నాడు; మరియు దీర్ఘకాలం పాటు ఆత్మ నిగ్రహాన్ని జితేంద్రియత్వాన్ని పొందిన తర్వాత విశ్వామిత్రుడు బ్రహ్మ శక్తిని పొందటంలో విజయం సాధించాడు. అతనికి మరియు వసిష్ఠునికి మధ్య శాంతి ఏర్పడింది. వశిష్ఠుడు అతన్ని బ్రహ్మర్షిగా (బ్రహ్మ వంటి ఋషి. బ్రహ్మతో సమానమైన ఋషి) గుర్తించాడు.

దేవతలకు రాజుగా ఉండడమంటే హృదయాన్ని సులభంగా అహంకారంతో నింపే పదవిని కలిగి ఉండటం. ఈ కారణంగా ఇంద్రుడు చాలాసార్లు తన ఉన్నతమైన పదవి నుండి కిందికి పడిపోయాడు. (పదవిని కోల్పోయాడు) ఒకసారి, తన దేవతలందరూ తన చుట్టు ఉండగా, ఇంద్రుడు మూడు లోకాలను పాలించే సింహాసనంపై కూర్చున్నాడు. అప్పుడు దేవతలందరికి గురువు అయిన బృహస్పతి అతని ముందుకు వచ్చాడు. గురువుకు స్వాగతం చెప్పటానికి ఇంద్రుడు తన ఆసనం నుండి లేవలేదు. గురువును గౌరవించలేదు.

అప్పుడు బృహస్పతి దేవతలను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. రాక్షసులకు బృహస్పతి ఆశీర్వచన ఫలం కలిగింది. అప్పుడు రాక్షసులు దేవతలపై దాడి చేసి, వారిని మరియు వారి రాజయిన ఇంద్రునిస్వర్గం నుండి తరిమికొట్టారు. ఇది అనేక ఇతర సమస్యలకు కూడా దారితీసింది. ఆ తరువాత ఇంద్రుడు రెండు సందర్భాలలో బ్రాహ్మణుని చంపాడు. ఆ పాపం పోగొట్టుకోవటానికి అతను చాలా తపస్సు చేయవలసి వచ్చింది. తరువాత కొంతకాలానికి ఇంద్రుడు శుద్ధి అయ్యాడు. [12]

ఇంద్రుడు దీర్ఘ తపస్సు చేస్తున్నసమయంలో, దేవతలు, స్వర్గము అరాచక దుష్ప్రవర్తనకు గురికాకుండా ఉండేందుకు, భూలోక రాజులలో చంద్ర వంశానికి చెందిన నహుషుని స్వర్గానికి అధిపతిగా నియమించారు. వానికి సరిపోయే మరొకరు కనుగొనబడలేదు. కానీ, నహుషుడు ఇంద్రుని కంటే గొప్ప శక్తితో పరిపాలించినందున, అతని హృదయంలో రోజురోజుకు గర్వం పెరిగింది. గర్వం యొక్క ఆలోచనల వెనుక అతని మనస్సులో పాపపు ఆలోచనలు వచ్చాయి. అతను దేవతలతో ఇలా అన్నాడు :

"నేను ఇంద్రుని భారాలను భరిస్తున్నాను. కనుక నాకు అతని హక్కులు కూడా ఉండాలి. కనుక ఇంద్రుని భార్య శచిని నా ముందు కనిపించేటట్లు చేయండి." అప్పుడు ఆ మాటలు విన్న దేవతలు బాధతో ఒకరితో ఒకరు మాట్లాడుకొన్నారు. ఈ మాటలు పలికిన నహుషుడు ఇకపై స్వర్గంలో పాలించటానికి సరిపోడని, ఇంద్రుడు తిరిగి వచ్చే సమయం దగ్గరపడిందని దేవతలు ఖచ్చితంగా భావించారు. అయితే నహుషుని ముందు నిలబడి అతనిని శపించటానికి ఎవరు బలంగా ఉన్నారు? అని ఆలోచించారు.

నహుషుడు చేసే భయంకరమైన నేరం ద్వారా, మహర్షుల యొక్క కోపాన్ని రేకెత్తిస్తే, గతంలో అతడు మంచి పనుల ద్వారా సంపాదించిన శక్తిని ఋషుల శాపం ద్వారా ఓడించవచ్చని దేవతలు భావించారు. అందువల్ల వారు శచీదేవితో ఈ విషయం గురించి మాట్లాడారు. ఋషులు మోసే పల్లకీలో శచీదేవి ఇంటికి నహుషుడు వస్తే, ఆమె అతనికి కనిపించి గౌరవించి ఆదరిస్తుందని నహుషునితో దేవతలు చెప్పారు.

నహుషుడు (బంధింపబడిన వాడని వ్యుత్పత్తి చంద్రవంశపు రాజు) ఋషులు తనను మోయటానికి వీలుగా ఒక పల్లకి కావాలని ఆదేశించాడు. అగస్త్యుడు మొదలయిన ఋషులను ఆ పల్లకీ మోయమని ఆదేశించాడు. వారు సున్నితంగా అంగీకరించారు. కానీ, పల్లకీ నడుస్తున్నప్పుడు, నహుషుడు తన ఆత్రుతతో మరియు పొంగిపొర్లుతున్న అహంకారంతో, కోపంతో అగస్త్యుని తలను తన పాదంతో తాకి, వేగంగా వెళ్ళమని నహుషుడు ఆదేశించాడు.

అప్పుడు నహుషుడు భ్రష్టుడయ్యే సమయం వచ్చిందని అగస్త్యుడు భావించాడు. నహుషునికి శాపం పెట్టాడు. నహుషుడు స్వర్గం నుండి భ్రష్టుడయి భూమిపై ఒక

పెద్ద పాముగా(కొండచిలువ) మారాడు. చాలా సంవత్సరాలు పాము శరీరానికి పరిమితం చేయబడి అనేక బాధలను సహించాడు. తరువాత శత్రువులులేని అజాత శత్రువైన ధర్మరాజు జవాబుల ద్వారా శాప విముక్తి పొందాడు.[13]

ఇప్పుడు విరోచన కుమారుడయిన బలి కథ చదువుకొందాం. లక్ష్మీదేవి బలి చేసిన మంచి పనులకు ప్రతిఫలంగా అతనిని తన నివాసంగా చేసుకొంది. కొంతకాలానికి బలి తాను చేసే ధర్మకృత్యాలవలన తానే అధిక ధర్మాత్ముడని, ఇతరులు తనకంటె తక్కువవారనే అహంకారం వచ్చింది. తానే అందరికంటే గొప్ప అనే భావన అతని హృదయంలోకి ప్రవేశించింది. అతను తన గురించి ఇతరుల గురించి ఎక్కువగా ఆలోచించడం మొదలుపెట్టాడు మునుపటిలా వారి క్షేమం కోరే బదులు వారికి కీడు చేసాడు. అప్పుడు బలిపై లక్ష్మీదేవి అసంతృప్తి చెందింది. అతనిని విడిచిపెట్టాలని నిశ్చయించుకున్నది. స్వర్గములో దేవరాజు అయిన, బలి శత్రువైన ఇంద్రుని దగ్గరకు వెళ్లి అతనితో కలిసి నివసించడం మొదలుపెట్టింది.

తనను చాలాకాలంగా ఆశీర్వదించిన దేవి తన ప్రత్యర్థితో కలిసి జీవించడం చూసిన బలి తన మూర్ఖత్వానికి విలపించాడు. "ఇది దురభిమానం మరియు అహంకారం యొక్క ఫలితమని మాంధాతకు ఉతథ్యుడు చెప్పాడు. "మాంధాతా ! లక్ష్మీదేవి కోపంతో నిన్ను విడిచిపెట్టకుండా ఉండటానికి నువ్వు చాలా జాగ్రత్తగా ఉందాలి. అధర్మం లక్ష్మీదేవితో ఉన్నప్పుడు గర్వం అనే కొడుకును కంటుంది. ఈ విషయం గుర్తు పెట్టుకో. రాజా ! ఈ అహంకారం, అనేక మంది దేవతలు మరియు రాక్షసులను నాశనం చేయడానికి దారితీసింది."

చాలా మంది రాజర్షులు కూడా అహంకారం వలన విధ్వంసాన్ని చవిచూసారు. అందుచేత ఓ రాజా! మాంధాతా! నీవు మేలుకో! అహంకారాన్ని జయించడంలో విజయం సాధించినవాడు రాజు అవుతాడు. అహంకారంచేత జయింపబడినవాడు దానితో బాధపడుతూ బానిస అవుతాడు." అని ఉతథ్యుడు చెప్పాడు.[14]

కొన్నిసార్లు చిన్నవారు తన తెలివైన చర్య ద్వారా– తనకంటే పెద్దవాళ్లను కోపం మరియు అహంకారం కారణంగా పాపంలో పడకుండా రక్షించవచ్చు. ఈ విధంగా ఒక కొడుకు చాలా ప్రాచీన కాలంలో తన తండ్రిని రక్షించాడు. చిరకారి అని ఒక మునికుమారుడు ఉన్నాడు. చిరకాలం ఈ పని చేయొచ్చా? చేయకూడదా? అంటూ ఆలోచించి పనిని నిర్వహించటం వలన ఈ మునికుమారుడికి 'చిరకారి'

అన్న పేరు స్థిరపడింది. ఇతడు అంగీరస వంశానికి చెందిన గౌతముని కుమారుడు. ఒకనాడు పాపం చేసిందని భార్య మీద భగ్గున మండిపడ్డాడు గౌతముడు. కోపాన్ని అణచుకోలేక చిరకారిని పిలిచి కత్తిని అందజేసి, తల్లిని నరకమని చెప్పి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

చేతిలో ఉన్న కత్తినీ, తల్లినీ మార్చి మార్చి చూసి చిరకారి ఆలోచనలో పడ్డాడు. తండ్రి మాట మీరకూడదు. అలా అని చెప్పి తల్లిని నరకడం మహాపాపం. 'తండ్రీ! నీ ఆలోచన తప్పు' అని చెబుదామంటే, తండ్రి మాటను కాదన్నట్లవుతుంది. వంశాభివృద్ధికి ఇద్దరూ కావాలి. ఇద్దరినీ తాను వదులుకోలేడు. తండ్రే కొడుకులా పుడతాడనీ, తండ్రి మాట పాటిస్తే పాపాలన్నీ నశిస్తాయనీ పెద్దలు చెబుతారు. తపస్సు, ధర్మం. విద్య, దైవం అన్నీ తండ్రి. అటువంటి తండ్రికి ఇష్టమయిన పని చేస్తే దేవతలు కూడా సంతోషిస్తారు.

తండ్రి ఆనందపు మాటలు కుమారునికి దీవెనలు తెస్తాయి. కానీ తల్లి? ఆమె శరీర దాత. బిడ్డకు రక్షకురాలు. కొడుకు తన తల్లిని కోల్పోయినప్పుడు, అతనికి ప్రపంచం అంతా శూన్యమవుతుంది. ఆమెవంటి ఆశ్రయం లేదు, రక్షణ లేదు; ఆమె అంత ప్రియమైన వారు ఎవరూ లేరు." ఈ విధంగా చిరకారి వివాదాస్పద వాదనలతో తనలో తాను కలవరపడ్డాడు. మళ్లీ అతను ఇలా అనుకున్నాడు: "భర్త అనగా పాలించువాడు, పోషించువాడు, రక్షించువాడు. రక్షకుడు. రాజు; భర్త; నేత; ఇంద్రుడు. అతను భార్యను రక్షించడం మానేస్తే, అతను భర్త అని ఎలా అనిపించుకొంటాడు? నా తల్లి నాకు అత్యంత గౌరవనీయమైనది .

ఇంతలో గౌతముడు, ధ్యానంతో తన మనస్సును శాంతింపజేసుకొన్నాడు. తన కొడుకును తన భార్యను చంపమని ఆజ్ఞాపించడంలో తాను చేసిన పాపాన్ని తలచుకుని బాధపడ్డాడు. తాను భార్యపట్ల చేసిన అపరాధానికి తనను తాను నిందించుకొంటూ , ఏడుస్తూ, త్వరగా ఇంటికి చేరుకున్నాడు. తల్లిని కొడుకు చంపి ఉండకపోతే బాగుణ్ణనుకున్నాడు. "నన్ను రక్షించు,"అంటూ, "నన్ను, నీ తల్లిని మరియు నేను సాధించిన తపస్సులను ఘోర పాపాల నుండి రక్షించు" అని పెద్దగా అరుచుకొంటూ వచ్చాడు. ప్రాణాలతో ఉన్న భార్యని చూసి ఆనందించాడు. కొడుకుని దగ్గరగా తీసుకొని "తల్లిగర్భంలో నువ్వు చిరకాలం బతికావు. నిన్ను ఆ తల్లి కంటికి రెప్పలా చిరకాలం కాపాడింది. నువ్వు కూడా చిరకాల ఆలోచనతో తల్లిని చంపకుండా

చిరకారి అన్న పేరు సార్థకం చేసుకొని, మహాపాపానికి లోనుగాకుండా నన్ను రక్షించావు" అని అభినందించాడు.[15]

అహింసయైవ భూతానాం కార్యం శ్రేయోఽను శాసనమ్ ।
వాక్ చైవ మధురా శ్లక్ష్ణాప్రయోజ్యా ధర్మమిచ్ఛతా ॥

"ధర్మం తెలిసిన ఆచార్యుడు శిష్యులను క్రూరంగా హింసించకూడదు. దయతో వారికి మేలయిన విషయాలు బోధించాలి. మధురమైన మరియు సున్నితమైన ప్రసంగాన్ని మాత్రమే చేయాలి."[16]

రక్షణాదార్యవృత్తానాం కంటకానాం చశోధనాత్,
నరేంద్రా స్త్రిదివం యాంతి ప్రజాపాలనతత్పరాః"

"ఆర్యులుగా (మంచివారిగా) జీవించేవారిని రక్షించడం ద్వారా మరియు దుర్మార్గుల వంటి ముళ్ళను తొలగించడం ద్వారా, (దొంగలు మొదలయిన వారిని రూపుమాపుట ద్వారా) రాజులు, తమ ప్రజలను రక్షిస్తూ , స్వర్గానికి చేరుకుంటారు." [17]

స్వే స్వే ధర్మే నివిష్టానాం సర్వేషామనుపూర్వశః ।
వర్ణానామాశ్రమాణాం చ రాజా సృష్టోఽభిరక్షితా ॥

"తమ తమ ధర్మాలలో పట్టుదల కలిగిన కులాలు మరియు ఆశ్రమాలను చక్కగా రక్షించుటకై బ్రహ్మదేవుడు రాజును సృష్టించినాడు."[18]

యథోద్ధరతి నిర్ధాతా కక్షం ధాన్యం చ రక్షతి ।
తథా రక్షేన్నృపో రాష్ట్రం హన్యాచ్చ పరిపంథినః ॥

"రైతు చేనులో వరి, కలుపు కూడ మొలచినప్పటికీ, కలుపును పీకేసి, ధాన్యమును మాత్రము కాపాడునట్లుగా రాజు దుష్టులను చంపి, సజ్జనులను కాపాడాలి."[19]

'సువాసినీః కుమారీశ్చ రోగిణో గర్భిణోస్తథా ।
అతిథిభ్యోఽగ్ర ఏవైతాన్ భోజయేదవిచారయన్ ॥

"కొత్తగా పెళ్ళైన స్త్రీలు, యువతులు, జబ్బుపడినవారు మరియు గర్భిణీ స్త్రీలకు అతిథులకంటె ముందుగా నిస్సంశయంగా భోజనం పెట్టాలి."[20]

చక్రిణో దశమీస్థస్య రోగిణో భారిణః స్త్రియాః ।
స్నాతకస్య చ రాజ్ఞశ్చ పంథా దేయో వరస్య చ ॥

రథముపైన ఉన్న వానికి, తొంభై సంవత్సరములు దాటిన వానికి, రోగికి, బరువును ఎత్తుకున్నవానికి, స్త్రీకి, విద్యను పూర్తిచేసికొని స్నాతకవ్రతము చేసికొన్నవానికి, రాజుకు, వివాహమునకై బయలుదేరినవానికి అడ్డురాక త్రోవని ఇవ్వాలి. "

అనుక్రోశో హి సాధూనామాపద్ధర్మస్యలక్షణమ్ ।
అనుక్రోశశ్చ సాధూనాం సదా ప్రీతిం ప్రయచ్ఛతి ॥

"కరుణ అనేది సజ్జనుల యోగ్యతకు గుర్తు; కరుణ ఎప్పుడూ మంచివారి ఆశీర్వాదాలను (లేదా ప్రేమను) భద్రపరుస్తుంది." [21]

న కామయేఽహం గతిమీశ్వరాత్పరామష్టర్ధియుక్తా మపునర్భవం వా ।
ఆర్తిం ప్రపద్యేఽఖిల దేహభాజామంతః స్థితో యేన భవంత్య దుఃఖాః ।
క్షుత్తృట్ శ్రమోగాత్ర పరిభ్రమశ్చ దైన్యం క్లమశ్శోక విషాద మోహాః
సర్వేని వృత్తాః కృపణస్య జంతోర్జిజీవిషోర్జీవ జలార్పణాన్మే॥ [22]

సూచికలు

1. శ్రీమద్రామాయణం అయోధ్యాకాండ సర్గ 074
2. శ్రీమద్రామాయణం అయోధ్యాకాండ సర్గ 20-21
3. మహాభారతం, సభాపర్వం lxxix
4. పై పుస్తకంలోనే, ద్రోణపర్వం, lxxii
5. పై పుస్తకంలోనే, శాంతిపర్వం lviii.
6. మహాభారతం, శాంతిపర్వం, lvi
7. పై పుస్తకంలోనే, lvii
8. మహాభారతం, మహాప్రస్థానికపర్వం
9. మహాభారతం, వన పర్వము, cxxxic xcvi ; మరియు అనుశాసనికపర్వం xxxii. విభిన్న రాజుల త్యాగ గుణానికి ప్రతీకగా ఈ కథ చెప్పబడింది.
10. భాగవత పురాణము, నవమ స్కంధం 21 వ అధ్యాయం
11. దేవీభాగవతం నాలుగవ స్కంధం ఆరవ అధ్యాయం

12. భాగవత పురాణము vi, vii. viii.
13. మహాభారతం, వన పర్వము, clxxxi
14. మహాభారతం, వన పర్వము, 190
15. మహాభారతం, శాంతి పర్వము, ccxIyi
16. మహాభారతం, శాంతి పర్వము, ccxlvi. మనుస్మృతి, ii, 159
17. మనుస్మృతి, 9 - 253.
18. అదే పుస్తకం vii- 35.
19. అదే పుస్తకం 110.
20. అదే పుస్తకం iii- 114
21. మహాభారతం, అనుశాసన పర్వము, v- 28
22. విష్ణుభాగవతం, నవమ స్కంధం 21 వ అధ్యాయం 12, 13 శ్లోకాలు. [అనువాదం కొరకు 10 వసూచిక గుర్తుగా గల ఈ అధ్యాయంలోని వాక్యాలను చూడవలసినది].

అధ్యాయం 11

సద్గుణాలు మరియు దుర్గుణాల మధ్య పరస్పర ప్రతిక్రియ

మనం ఇప్పటిదాకా అనేక ధర్మాలు మరియు దుర్గుణాలను విడివిడిగా పరిగణించాము. అనేక దృష్టాంతాలలో, సద్గుణాలు ఆనందానికి మరియు దుర్గుణాలు దుఃఖానికి ఎలా దారితీస్తాయో చూసాము. ఒక సద్గుణం మరొకరిలో సద్గుణాన్ని మరియు ఒక దుర్గుణం మరొకరిలో దుర్గుణాన్ని ఎలా ఉత్పత్తి చేస్తుందో మనం చర్య యొక్క అంతిమ ఫలితంలో చూడవలసి ఉంటుంది. తద్వారా మంచి ఆలోచనలు మరియు వాటి చర్య సడలిపోకుండా ఉండటానికి ఇతరులకు ఏ పద్ధతిలో ఎలా సహాయం చేయాలో మనం నేర్చుకోవచ్చు. మరియు ఆనందాన్ని పెంపొందించు కోవచ్చు.

ఇతరులపై ప్రేమను చూపడం ద్వారా, మనం వారిలో ప్రేమను మేల్కొల్పుతాము; ద్వేషాన్ని చూపడం ద్వారా, మనం ఇతరులలో ద్వేషాన్ని మేల్కొల్పుతాము. ఇతరులు భావించినట్లుగా మనం కూడా అనుభూతి చెందడం సముచితం. కోపంగా ఉన్న వ్యక్తి తన చుట్టూ ఉన్నవారికి కోపం తెప్పిస్తాడు. తద్వారా కలహాలు తలెత్తుతాయి. మరింతగా చేదుతో కూడిన వాతావరణం పెరుగుతుంది. కోపంతో కూడిన పదం మనకు కోపంతో కూడిన ప్రత్యుత్తరాన్ని తెస్తుంది. మరియు అది ఇంకా ఎక్కువ చెడుఫలితాన్ని తెస్తుంది. కోపంతో ప్రతినిందలు మొదలయినవి పెరుగుతాయి. మరోవైపు, మృదుమధురమైన మాటలు మంచితనాన్ని అందిస్తాయి. దయ దయను రేకెత్తిస్తుంది. మంచి పనులు ఇతరులలో మంచి పనులు చేయటానికి ప్రేరణ కలిగిస్తాయి.

ఇది అర్థం చేసుకున్నప్పుడు, ఇతరులలోని తప్పులను ఎదుర్కోవడానికి సరైన భావోద్వేగాలను ఉపయోగించాలని తెలుస్తుంది. ఎవరయినా మన తప్పులను ఎత్తి చూపినప్పుడు మనం తప్పుడు భావోద్వేగాలకు లోనవుతాము. ఒక వ్యక్తి మనతో కోపంగా మాట్లాడితే, మనం కోపంగా సమాధానం చెప్పాలని భావిస్తే, ముందుగా మనల్ని మనం పరిశీలించుకోవాలి. వారికి చాలా సున్నితంగా సమాధానం చెప్పాలి.

ఈ సున్నితమైన సమాధానం మనపై కోపపడినవానికి ఉపశమనం కలిగిస్తుంది. అతనికి కోపం తగ్గేలా చేస్తుంది. చెడుకు మంచిని తిరిగి ఇవ్వడం అంటే ఇదే. ఈ విధంగా ప్రవర్తించడం ద్వారా మాత్రమే మనం చెదిరిన సామరస్యాన్ని పునరుద్ధరించ గలము. అందరి సంతోషం కోసం దానిని భద్రపరచగలము.

"ఇది మనము ప్రతాపము చూపదగినకాలమని భావిస్తున్నాను. ఆ కౌరవులు మిక్కిలి స్వార్థపరులు అపకారము చేయు స్వభావము కలిగిన వారు. అటువంటి వారి విషయములో సహనముతో ఉండకూడదు. కోపము చూపుటకు తగినకాలములో కోపమునే చూపించాలి. కనుక కౌరవులపై దాడి చేయ"మని ఒకసారి ద్రౌపది యుధిష్ఠిరుడిని కోరింది. తాము కౌరవులచే చాలా క్రూరంగా మోసం చేయబడి, నాశనమయినప్పటికీ, వారు చెడు చేసారని వారికి తిరిగి చెడు చేయడం దుఃఖాన్ని కొనసాగించడానికి దారితీస్తుందని తెలివైన ధర్మరాజు ద్రౌపది సూచించాడు. "హింసించబడినప్పటికీ, తన కోపాన్ని ప్రదర్శించక జ్ఞాని తనను వేధించేవారిపట్ల ఉదాసీనతను చూపి మరో ప్రపంచంలో ఆనందిస్తాడు. ఈ కారణంగా, తెలివైనవాడు, బలవంతుడు, ఎప్పటికీ క్షమాగుణంతో ఉండాలని పెద్దలు చెప్పారు.

కోపం గొప్పపాపం. కోపంవలన ధర్మానికి, అర్థానికి, కామానికి కీడు సంభవిస్తుంది! బాగా కోపించినట్టివాడు కర్తవ్యాన్ని గ్రహించలేడు. కోపి గురువు నైనా నిందిస్తాడు. కోప గుణము కలిగినవాడు చంపకూడనివారిని సయితం చంపివేస్తాడుబీ ఆత్మహత్యకు పాల్పడతాడు. జ్ఞాని అయినవాడు జ్ఞానమనే నీటితో కోపమనే పెద్దమంటను చల్లార్చుతాడు.

భూదేవితో సమానుడైన ఓర్పు కలిగినవానికి ఎప్పుడూ విజయం సిద్ధిస్తుంది. క్షమించడంలో భూమికి సమానమైన మనుషులు లేకుంటే, మనుషుల మధ్య శాంతి ఉండదు. క్షమావంతుని పరాక్రమం అన్ని సమయాలలోను ఫలిస్తుంది.

ఓర్వలేనితనం, దయ, పరాక్రమం, వేగం అనే నాలుగు గుణాలు పరాక్రమం నుంచి పుట్టాయి. అవి క్షమావంతుని పట్ల బలంగా మారతాయి. వేదాలు, యజ్ఞాలు, సత్యం, ధర్మం,విద్య, చరాచర సృష్టి అన్నీ క్షమమీదే నిలుస్తాయి. బ్రహ్మజ్ఞానులు, వేదాధ్యయనం చేసిన యజ్ఞకర్తలు పొందే ఉత్తమగతులను క్షమావంతులు పొందుతారు.

కోపంతో పుట్టిన తగాదాలు కొనసాగుతూనే ఉంటాయి. గాయపడిన వారు తిరిగి గాయపరుస్తారు. తన పై అధికారి చేత శిక్షించబడిన వ్యక్తి తిరిగి తన పై

అధికారిని శిక్షించినట్లయితే, దాని పర్యవసానంగా ప్రతి జీవియొక్క జీవితం నాశనం అవుతుంది పాపం ప్రబలంగా వ్యాపిస్తుంది.

ఇంకొకరినుండి చెడు ప్రసంగాలను విన్న వ్యక్తి ఆ ప్రసంగాలను తిరిగి చేస్తే; గాయపడిన వ్యక్తి తన గాయాలను తిరిగి ఎదుటి వ్యక్తికి ఇస్తే; శిక్షించబడిన వ్యక్తి ప్రతిగా శిక్షిస్తే; తండ్రులు కొడుకులను, కొడుకులు తండ్రులను చంపుతారు; భర్తలు భార్యలను, మరియు భార్యలు భర్తలను చంపుతారు; అప్పుడు, కృష్ణా, (నలుపు వర్ణము గలది కనుక ద్రౌపదిని కృష్ణా అని అంటారు). ఈ విధంగా కోపంతో నిండిన ప్రపంచంలో జన్మ ఎలా జరుగుతుంది? జీవుల పుట్టుక శాంతి వల్లనే అని నీవు తెలుసుకో."[1]

చక్కని వినయము కలిగిన, భార్య కోపంతో దశరథ రాజు ఎలా కుమిలిపోయాడో వినండి. రామచంద్రుని తల్లి కౌసల్య తన అసమాన కుమారుడు దూరమయిన బాధతో, అడవులకు చాలా సంవత్సరాలు రాముడు బహిష్కరించబడిన దుఃఖంతో, మొదటి సారి కోపంతో దశరథునితో ఇలా అన్నది:

"రాజా! పాపం చేయని నీ కొడుకును నీ చేతులతో చంపావు. సనాతన ధర్మము వేదసమ్మతమైనది. శాస్త్ర ప్రోక్తమైనది. అది అవిచ్ఛిన్నంగా పూర్వీకులచే ఆచరింపబడుచున్నది. శ్రీరాముడు అటువంటి ధర్మనిరతుడు. అటువంటి వానిని నువ్వు అడవులకు పంపావు. ఇలా చేయుట ధర్మబద్ధమేనా?

ఓ మహారాజా! రక్షణ విషయములో స్త్రీకి భర్తయేగతి. అతడు ఆదుకోనప్పుడు ఆమెను రక్షింపవలసినవాడు కుమారుడే. పుత్రుని వలనను రక్షణ కఱవైనప్పుడు ఆమెను ఆదుకొనవలసిన వారు జ్ఞాతులు. (అనగా ఆమె తల్లిదండ్రులు మొదలగు వారు). ఈ మార్గములలో స్త్రీకి ఆలంబనము దొరకని సమయంలో ఆమెకు నాల్గవ దారియేలేదు.

నీవు ఆ కైకేయి చేతిలో కీలుబొమ్మవయ్యావు. కనుక రక్షణకై నేను నీమీద ఆధారపడుట వృథా. కుమారుడైన శ్రీరాముడు అడవుల పాలైనాడు. దూరమైనందున నన్ను ఆదుకొను జ్ఞాతులు లేరు. భర్తవైన నిన్ను విడిచి అడవులకు వెళ్లుటకు నేను ఇష్టపడను. నీవు నన్ను అన్నివిధములుగా మృతప్రాయను (చనిపోయిన దానితో సమానంగా) చేసావు. 'నీవు శ్రీరాముని అడవులకు పంపి, ఈ కోసల రాజ్యమునే దిక్కులేనిదానిగా చేసావు. నీమిత్రులు పాలించు సామంతరాజ్యముల మనుగడనే

శూన్యమొనరించావు. నీవలన బంధుమిత్రులు, మంత్రులు అందరు దిక్కుతోచని వారయ్యారు. నాకు, నారామునకు అండలేకుండ చేసావు."

రాజు కౌసల్య యొక్క పరుషమైన మాటలు విని, అంతకన్నా ఎక్కువ దుఃఖభారంతో వంగిపోయాడు.

కౌసల్య మాటలతో దశరథుని మనస్సు అంతా కలత చెందింది. స్పృహ కోల్పోయాడు. చాలా సేపటికి తేరుకుంటూ తన పక్కనే ఉన్న కౌసల్యను చూశాడు. ఆ క్షణంలో అతని గత పాపం(ఋషి పుత్రుడైన శ్రవణకుమారుని చంపిన పాపం) జ్ఞాపకం వచ్చింది.దాని పర్యవసానంగా ఈ దుస్థితి ఏర్పడిందని బాధపడ్డాడు. ఆ పాపంతో పాటు మరియు రాముని ఎడబాటుతో కలిగిన దుఃఖం రెట్టింపు కాగా, వణికిపోతూ చేతులు జోడించి , తల వంచి ఆమెతో ఇలా అన్నాడు. "

"ఓ కౌసల్యా! నమస్కరించి , నిన్ను వేడుకొంటున్నాను. ప్రసన్నురాలివి కమ్ము. నీవు ప్రతికూలుర పట్ల వాత్సల్యముతో దయచూపిస్తావు. ఇక నీ భర్తనైన నాపట్ల ఈ కఠినత్వమెందుకు? ఓ దేవీ! భర్త గుణవంతుడైనా, గుణహీనుడైనా ధర్మ నిరతిగల స్త్రీలు సహిస్తారు కదా !నీవు ఎప్పుడూ ధర్మతత్పరురాలవు.. నీవు తీరనిదుఃఖమునకు గుఱియై ఉన్నావు. నీవలెనే బాధపడుతున్న నన్ను ఇట్లు తూలనాడుట న్యాయమా? నాపై దయ చూపు".

వినయపూర్వకమైన రాజు యొక్క ఆ దీన ప్రసంగాన్ని కౌసల్య విన్నది. జలపాతాల నుండి కొత్త వర్షపు నీటిలా ఆమె కళ్ళ నుండి జాలితో కూడిన కన్నీళ్లు ప్రవహించాయి. ఆమె కోపం మాయమైపోయింది, ఆ కఠినమైన మాటలకు గాఢమైన వినయం మరియు పశ్చాత్తాపం మరియు పాప భయానికి లొంగిపోయింది. ఆమె రాజు చేతులను పట్టుకుని, తన తలపై పెట్టుకుని, చాలా ఆందోళనతో ఇలా చెప్పింది: "క్షమించండి, నన్ను క్షమించు, రాజా! నీ పాదాలపై నా తలపెట్టి వేడుకుంటున్నాను. క్షమాపణ నువ్వు నన్ను అడగకూడదు. నేను నిన్ను అడగాలి. నన్ను యాచిస్తే అతి పెద్ద పాపం నా దగ్గరకు వస్తుంది.

ఓ వీరా! ప్రశంసార్హుడు, ప్రజ్ఞాశాలియు ఐన భర్తచేత బ్రతిమలాడించుకొను. స్త్రీ ఇహపర లోకములలో చెడిపోతుంది. (బ్రతికియున్నంతకాలము నలుగురిచే నిందింపబడుచుండును, మరణానంతరము నరక యాతనలకు గుఱియగును.)

ఓ ధర్మాత్మా! నాకు ధర్మము తెలియకపోలేదు. మీరు సత్య సంధులనియు తెలుసు. పుత్రశోకార్తనై యుండుటవలన నేను అవిధంగా అనుచితముగా మాట్లాడాను. దుఃఖములో మునిగినవారు ధైర్యమును కోల్పోతారు. అట్టి స్థితిలో వారి జ్ఞానము అడుగంటిపోతుంది. దుఃఖము సర్వనాశనమునకు మూలము. దుఃఖమునకు మించిన శత్రువేలేదు. హఠాత్తుగా శత్రువుచేతిలో ఎంతటి దెబ్బతిన్నను తట్టుకొనవచ్చును. కాని దైవవశముతో ఆకస్మాత్తుగా స్వల్పశోకమునకు గురియైతే దానినుండి బయటపడుట కష్టం. నా ప్రియ కుమారుడిని తలచుకుంటే వర్షాకాలంలో నదుల్లా నా హృదయంలో దుఃఖం ఉప్పొంగుతుంది."[2] ఇలా దశరథుని మధురమైన వినయం మరియు సహనంతో కౌసల్య యొక్క చేదు అధిగమించబడింది.

ఒకవేళ దశరథుడు తన భార్య కౌసల్య చేదు మాటలకు ఘాటుగా సమాధానం చెప్పినట్లయితే, గొడవ పెరిగి, వారి సాధారణ దుఃఖం ఒకరినొకరు దూరం చేసి ఉండేది. కానీ అతను ఆమె అహంకారాన్ని వినయంతో, ఆమె నిందను సౌమ్యతతో, ఆమె కోపాన్ని సున్నితత్వంతో ఓర్చుకొన్నాడు. తద్వారా ఆమెలో వినయం, సౌమ్యత మరియు సున్నితత్వం ఉద్భవించాయి.

అందుకే రామచంద్రుడు లక్ష్మణుడి కోపంలో భరతునిపై నమ్మకాన్ని నిదుర లేపుతూ, ఆ నమ్మకాన్ని తానే నిరూపించాడు. రాముడు, తన తండ్రి మాటను నిలబెట్టుకోవటానికి అయోధ్య నుండి బయలుదేరి, తన భార్య మరియు సోదరునితో, అడవుల్లో నివసిస్తున్నాడు. ఒకరోజు దూరంగా కవాతు చేస్తున్న సైన్యం యొక్క చప్పుడు విని, లక్ష్మణుడిని చెట్టు ఎక్కి అదేమిటో చూడమని చెప్పాడు.. లక్ష్మణుడు పెద్ద సైన్యంతో అడవిలోకి వస్తున్న భరతుని చూసాడు.

అరణ్యవాసంలో తాము ఉన్న కోపంతో, లక్ష్మణునికి భరతునిరాకపై అనుమానం కలిగింది. భరతుడు తన సార్వభౌమాధికారాన్ని నిష్కంటకం చేసుకోవటానికి తమను వధించడానికి సైన్యంతో వస్తున్నాడని భావించి, ఈ విషయం చెప్పటానికి రాముని వద్దకు లక్ష్మణుడు తొందరగా వచ్చాడు. భరతునిపై యుద్ధానికి సిద్ధమవుదామని అనుమతి ఇమ్మని రాముని కోరాడు. అయితే రాముని మనసులో భరతునిపై ప్రేమే తప్ప కోపం లేదు. ఆప్యాయంగా రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు: "లక్ష్మణునిపై అపనమ్మకం పెట్టుకోకు. నేను భరతునితో 'ఈ రాజ్యమంతా లక్ష్మణునికే ఇవ్వమని చెబుతాను. అప్పుడు భరతుడు "సరే" అని ఒక్క మాట మాత్రమే చెబుతాడు.

"లక్ష్మణుని కోపమంతా నశించిపోయింది. దాని స్థానంలో అవమానము చోటు చేసుకొంది. భరతుడు వచ్చి, అయోధ్యకు తిరిగి వెళదామని రాముని వేడుకున్నాడు. కానీ రాముడు తన తండ్రి మాటను ఉల్లంఘించనని, త్రికరణశుద్ధిగా పాటించి తీరతానని చెప్పాడు. అప్పుడు భరతుడు "అన్నా! నీ పాదుకలు బంగారముతో తాపబడినవి. ఆ పాదరక్షలను ఒక్కసారి నీ పాదములకు తొడిగికొని నాకు అనుగ్రహించు." అని ప్రార్థించాడు.

రాముడు ఆ పాదుకలను ఒకసారి తొడిగికొని, వెంటనే వాటిని మహాత్ముడైన భరతునకు ఇచ్చివేసాడు. అప్పుడు ఆ భరతుడు ఆపాదుకలకు నమస్కరించి ఈ పదునాలుగు సంవత్సరములు రాజ్యపాలన భారమును శ్రీరాముని పాదుకలమీద ఉంచుతానని చెప్పి ఆవిధంగానే రాముని పేరు మీద అతని రాజప్రతినిధిగా, పద్నాలుగు సంవత్సరాలు భరతుడు రాజ్యపాలన చేసాడు.[3]

పాండవులు అరణ్య అజ్ఞాతవాసాల యొక్క చీకటి రోజులలో, అతని భార్య మరియు సోదరులు పదే పదే హృదయాన్ని మరియు సహనాన్ని కోల్పోయారు. కౌరవులతో జరిగిన ఒప్పందానికి విధేయతతో యుధిష్ఠిరుడు కట్టుబడి ఉన్నందుకు మరియు తప్పులను సహనంతో సహించినందుకు అతనిని నిందించారు. పదే పదే ఆ ఉదాత్త హృదయం, తన ప్రియమైనవారి నిందలచే ఛిద్రమై, హింసించబడి, సౌమ్యతతో సత్యం మరియు గౌరవం యొక్క మార్గంలో వారిని తిరిగి గెలుచుకుంది.

భీముడు తీవ్రమైన కోపముతో, కఠినమైన పదజాలంతో తన అన్నయ్యను నిందించాడు. "కేవలం ధర్మాన్ని అనుసరిస్తే శత్రువులను జయించటానికి వీలు కాదు. మోసం చేసే వాళ్ళపై మోసం ప్రయోగించాలి. నువ్వు శత్రువులతో చేసికొన్న ఒడంబడికను నెరవేర్చాలనే నియమం విడిచిపెట్టి, వాళ్ళను జయించటానికి ప్రయత్నించు" భీమసేనుడు ఈ విధంగా పలుకగా మహానుభావుడు, సత్యవ్రతుడు, అజాత శత్రువు అయిన ధర్మరాజు రాజు ధైర్యమును కూడదీసికొని భీమునికి ఇలా జవాబిచ్చాడు. "భీమా! నీవు ఆక్షేపించిన ప్రతి మాటా సత్యమే. నీమాటలను కాదని నిన్ను నేను నిందింపను. నా నీతిమాలినతనమువలననే మీ అందరికి ఈ కష్టము వచ్చింది.

జూదమాడే సమయంలో పురుషుని ధైర్యమును క్రుంగదీయు పట్టుదల కలుగకున్నచో మనస్సును నియమించుకొనుట సాధ్యమయి ఉండెడిది. పరులకు

అనుకూలముగా ఉన్న పాచికలను చూచిన కోపమువలన నేను ద్యూతము మానుట చేయలేకపోయాను. నిజానికి నేను ఆ సమయంలో నా మనస్సును నియంత్రించాలి. అహంకారంతో ప్రభావితమయిన మనస్సును నియమించలేకపోయాను. భీమా! నీ వేగవంతమైన మాటలకు నేను నిన్ను నిందించలేను. అయినా నేను ప్రతిజ్ఞ చేసాను. చేసిన వాగ్దానాన్ని ఎవరు ఉల్లంఘిస్తారు? అబద్ధం ద్వారా రాజ్యాన్ని పొందడం కంటే మరణం భరించడం సులభం. అలాంటప్పుడు నాతో ఇంత కఠినంగా మాట్లాడటం వల్ల ఏం లాభం? నా వలన మీరు పడుతున్న బాధలను చూసి నా గుండె పగిలిపోతుంది. కానీ నేను నా మాటను ఉల్లంఘించలేను. సోదరా! విత్తనమునాటి పంటకొరకు ఎదురుచూచు రైతు వలె, మనకు సుఖము కలుగు కాలమునకై ఎదురుచూద్దాం. మంచి రోజులు తిరిగి రావడానికి వేచి ఉండండి.

భీమా! సత్యమైన నా ప్రతిజ్ఞను నీవు తెలుసుకో! జీవితం కంటే లేదా స్వర్గం యొక్క ఆనందాల కంటే ధర్మము ఉత్తమమైనది. రాజ్యం, పుత్రులు, కీర్తి, సంపద, ఇవన్నీ సత్యంలో పదహారవ వంతుకు కూడా సమానం కావు. ఈ విధంగా ధర్మరాజు తన సోదరుడు భీమసేనుడు కోపంతో చేసిన అవహేళనలను ఓపికగా భరించాడు. సున్నితమైన వినయంతో కఠినమైన నిందలను ఎదుర్కోవడానికి, అలాగే తన గర్వించదగిన పరాక్రమవంతులైన సోదరులను ఎన్నటికీ ఆగ్రహానికి గురిచేయని ప్రేమతో గెలవడానికి ధర్మరాజు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు.[4]

సున్నితమైన సానుభూతి ప్రేమను రేకెత్తించినట్లే, ఆలోచనలేని హేళన ద్వేషాన్ని రేకెత్తిస్తుంది. దాని మలుపులో ద్వేషం అనేక చెడులకు దారి తీస్తుంది. యుధిష్ఠిరుని కీర్తి చాలా దూరం వ్యాపించింది. మరియు అతని రాజసూయ త్యాగం యొక్క వైభవాన్ని ప్రజలందరూ ప్రశంసించారు. ఈ ప్రశంసలు అతనిని అసహ్యించుకునే ప్రత్యర్థి అయిన దుర్యోధనుని హృదయాన్ని అసూయతో నింపాయి. భీముడు మరియు ఇతరులు అతని భావాలను నిర్లక్ష్యంగా పట్టించుకోకపోవడం వల్ల ఈ దుష్ట భావోద్వేగం దుర్యోధనునిలో మరింత తీవ్రంగా మరియు మరింత చురుకుగా మారింది.

ఒకరోజు యుధిష్ఠిరుడు తన బంగారు సింహాసనంపై కూర్చుని ఉండగా, అతని సోదరులు, అనేక మంది సభికులు మరియు రాజులు అతనిని చుట్టూ ఉన్నారు. అదే సమయంలో దుర్యోధనుడు మరియు అతని సోదరులు సభా మందిరంలోకి ప్రవేశించారు. అతను వస్తూనే యుధిష్ఠిరుని రాజభవనాన్ని తన నైపుణ్యంతో

అపూర్వంగా తీర్చిదిద్దిన, మాయా శిల్పి అయిన మయుని యొక్క కళతో మోసపోయాడు. మయసభలో స్పటిక సరస్సును నీరుగా భ్రమించాడు. తన వస్త్రాలను తడవకుండా పైకి లాక్కున్నాడు. దృఢమైన నేలలా కనిపించిన చోట నీరు లేదనుకొని భ్రమిస్తూ మాములుగా నడుస్తూ నీటిలో పడిపోయాడు.

అప్పుడు భీముడు విపరీతంగా మరియు మొరటుగా నవ్వాడు. మరియు ఇతరులు అతని చెడు ప్రవర్తనను అనుసరించారు. యుధిష్ఠిరుడు తన వారిలో మర్యాద లేకపోవడాన్ని ఖండించాడు. అప్పుడు ఆ ఎగతాళి నవ్వుకు దుర్యోధనుని ముఖం అవమానంతో నల్లబడింది. సిగ్గుతో, హృదయంలో కోపంతో అక్కడినుంచి వెళ్లిపోయాడు. అవమానానికి ప్రతీకారం తీర్చుకుంటానని హస్తినాపురానికి తిరిగి వచ్చాడు; చివరకు జూదం ,అజ్ఞాతవాసం, కురుక్షేత్రములోని భీకర యుద్ధం, దుర్యోధన యుధిష్ఠిరుని బంధువుల వధకు దారితీసిన అనేక కారణాలలో ఈ నవ్వు కూడా ఒకటి.[5]

మనం చేసే చెడుపని తిరిగి చెడుపనితో మన దగ్గరకు తిరిగి వస్తుంది. కొత్త చెడుకు జన్మనిస్తుంది. తద్వారా దుఃఖం యొక్క గొలుసును పొడిగిస్తుంది. భృగునికి జమదగ్ని అనే కుమారుడు ఉన్నాడు, అతను తన గొప్ప తపస్సుతో మరియు కఠినమైన నియమ నిష్ఠలతో కూడిన జీవితానికి ప్రసిద్ధి చెందాడు. మరియు అతని కుటుంబంలో రాముడు జన్మించాడు. తరువాత కాలంలో అతను పరశురాముడు అను పేరుతో ప్రసిద్ధి పొందాడు. (పరశునా రామ రమణం యస్య గొడ్డలిచే ఆనందపడువాడు వాడు కనుక పరశురాముడు అని పేరు) పరశురాముడు పుట్టుకతో బ్రాహ్మణుడైనప్పటికీ, హృదయంలో క్షత్రియ లక్షణాలున్నాయి. అతని తాత భృగువు చెప్పినట్లుగా, ఇటువంటి హృదయం "సైనిక వ్యవస్థకు తగినది;" జమదగ్నిలో కూడా ఆ భీకరమైన కోపపు విత్తనము దాగి ఉంది. అది పూర్తిగా కాలిపోవడానికి అతని తపస్సులు ఉపయోగపడలేదు. ఈ కోపం ఈ గొప్ప జాతికి బాధాకరమైన పరీక్షలను మరియు కష్టాలను కలిగించింది.

జమదగ్ని తన భార్య పవిత్రతపై తొందరపాటు సందేహం కారణంగా హృదయంలో ఉన్న కోపంతో, తన కొడుకులను ఒక్కొక్కరిగా ఆమెను చంపమని ఆదేశించాడు; ఒక్క పరశురాముడు తప్ప మిగిలిన కొడుకులు ఎవరూ తల్లిలాంటి పవిత్ర వ్యక్తిపై చేయి ఎత్తలేదు. చిన్నవాడయిన పరశురాముడు తండ్రి మాట పాటించి

గొడ్డలితో తల్లి తల నరికాడు. వెంటనే తన తండ్రి నుండి వరం పొంది, తన తల్లిని తిరిగి బ్రతికించమని కోరాడు, ఆపై మాతృహత్యా నేరం చేసిన ప్రాయశ్చిత్తం కోసం తీర్థయాత్రకు వెళ్ళాడు. జమదగ్ని కోపంతో చేసిన చెడు తీరలేదు. అతని కుమారులు లేనప్పుడు, జమదగ్ని భార్య రేణుక ఒంటరిగా మిగిలిపోయింది. అప్పుడు ఆమె కృతవీర్యుని కుమారుడైన అర్జునుడికి ఆతిథ్యం ఇవ్వవలసి వచ్చింది; అతను ఒక యోధుడి గర్వపు మత్తులో ఉన్నాడు. ఆమె ఆదరణ తన గొప్పతనానికి అర్హమైనదిగా కార్తవీర్యార్జునుడు భావించలేదు. జమదగ్ని ఆశ్రమంలో రోజువారీ యజ్ఞవిధుల కోసం పాలను ఇచ్చే హోమధేనువు యొక్క దూడను బలవంతంగా తనవెంట తీసుకువెళ్లాడు.

పరశురాముడు తిరిగి వచ్చినప్పుడు, జమదగ్ని ఏమి జరిగిందో అతనికి చెప్పాడు. మరియు ఆవు తన దూడ కోసం దుఃఖంతో చేస్తున్న అరుపుల వల్ల పరశురామునిలో మరింతగా కోపం పెరిగింది; అందువలన, మోహముతో ఆత్మనిగ్రహం కోల్పోయి, పరుగెత్తుకుంటూ వెళ్లి పరశురాముడు కార్తవీర్యార్జునునితో భీకర పోరాటం చేసి చివరకు అతని వెయ్యి చేతులు నరికేసాడు. అతనిని చంపాడు. ఈ చర్య కార్తవీర్యార్జునుని బంధువర్గం యొక్క తీవ్ర కోపాన్ని రేకెత్తించింది. చెడుతో చెడును తిరిగి ఇవ్వడానికి, వారు జమదగ్ని యొక్క ఆశ్రమానికి చేరుకున్నారు. ఎవరూ లేని సమయంలో రక్షణ లేకుండా ధ్యానంలో నిమగ్నమై ఉన్న జమదగ్నిని బాణాలతో కొట్టి చంపివేసారు.

ఇంకా వధ యొక్క కథ పూర్తి కాలేదు. ఎందుకంటే క్షమాపణ మాత్రమే చెడు యొక్క గొలుసును తెంచగల ఏకైక విషయం. కాని ఆ కోపాన్ని తెంచే గొడ్డలి పరశురాముని హృదయంలో లేదు. అతను, తన తండ్రికొరకు విలపించి, అతని శరీరాన్ని తగిన కర్మలతో దహించాడు. తండ్రి అంత్యక్రియల చితిముందు నిలబడి క్షత్రియ కులాన్ని చంపుతానని ప్రతిజ్ఞ చేసాడు. ఆ విధంగా దుష్టత్వం పెరిగి పెద్దదిగా మరింత పెద్దదిగా పరిమాణంలో పెరుగుతూనే ఉంది. ఆ తరువాత తన గొడ్డలిని తీసుకుని, కార్తవీర్యార్జునుని బంధుమిత్రులపై దాడి చేసి వారిని చంపి, ఆ తర్వాత క్షత్రియులందరితో యుద్ధం చేసి, ఆ యోధకులాన్ని అంతమొందించాడు.[6]

మనపట్ల అన్యాయం మరియు నిర్దయను ఎవరైనా ప్రదర్శించినప్పుడు కూడా, మాధుర్యముతో కూడిన అంగీకారపు ప్రవర్తన ద్వారా మన నడవడిని కాపాడుకోవడం

ఉత్తమం. తద్వారా మనతో వ్యవహరించే వ్యక్తిని గెలిపించాలి. అతను ఉన్నతుడయినా, సమానుడయినా లేదా తక్కువవాడయినా, అతని అన్యాయపు ప్రవర్తనకు ప్రతిస్పందనగా మాధుర్యముతో కూడిన అంగీకారాన్ని తెలుపాలి. ఒకసారి దుర్వాసుడు దుర్యోధనుని సందర్శించాడు. సత్కారము చేయటానికి చాలా కష్టమైన అతిథిగా దుర్వాసుడు నిరూపించబడ్డాడు. దుర్యోధనుడు మరియు అతని సోదరులు అతని కోసం చాలా గౌరవంగా ప్రవర్తించారు. పగలు మరియు రాత్రి అతని కోసం వేచి ఉన్నారు. కొన్ని సార్లు దుర్వాసుడు ఇలా అంటాడు: “నాకు ఆకలిగా ఉంది రాజా! నాకు కొంచెం ఆహారం ఇవ్వండి,” అని చెప్పి కొన్నిసార్లు అతను స్నానానికి బయటకు వెళ్తాడు. దుర్యోధనుడు ఆహారం సిద్ధం చేస్తాడు. తిరిగి వచ్చిన దుర్వాసుడు ఇలా అంటాడు: “ ఈ రోజు ఏమీ తినను, ఎందుకంటే నాకు ఆకలి లేదు.”

ఒక్కోసారి అకస్మాత్తుగా వచ్చి, దుర్వాసుడు ఇలా అంటాడు: “నాకు త్వరగా ఆహారం ఇవ్వండి.” మరొకసారి, అర్ధరాత్రి లేచి, భోజనం కావాలంటాడు. భోజనం తీసుకువస్తే , భోజనంలో తప్పు పట్టి , దానిని తాకడానికి నిరాకరిస్తాడు. దుర్వాసుడు, దుర్యోధనుని కొంతకాలం బాధపెట్టాడు. కానీ దుర్యోధనుడు ఎప్పుడూ కోపంగాని, అసహనాన్నిగాని ప్రదర్శించలేదు. అది గుర్తించిన దుర్వాసుడు దుర్యోధనుని పట్ల దయతో ఇలా అన్నాడు: “నీకు వరం ఇవ్వడానికి నాకు అధికారం ఉంది. నువ్వు కోరుకున్నది ఎంచుకో. నేను సంతోషంగా ఉన్నాను. నువ్వు నా నుండి మతానికి లేదా నైతికతకు వ్యతిరేకం కాని ఏ వరాన్నయినా పొందవచ్చు.”[7] (దుర్యోధనుడు తనను బాధపెట్టిన దుర్వాసునిపట్ల దురుసుగా ప్రవర్తించినందువలన వరం పొందాడని సారాంశం).

కొన్నిసార్లు, నిజానికి, ఒక మనిషి చాలా కఠిన హృదయంతో ఉంటాడు. ఏ దయకూడా అతనిని కరిగించదు. చివరకు శరీరము నశించే వరకు కూడా అలానే కొనసాగుతాడు. దుర్యోధనుడు దీనికి అద్భుతమైన ఉదాహరణగా చెప్పవచ్చు. జిత్తుల మారి అయిన శకుని సలహాతో తన దాయాదుల రాజ్యాన్ని, సంపదలను దోచుకుని, వారిని అజ్ఞాతవాసానికి తరిమికొట్టిన దుర్యోధనుడు, పాండవుల పేదరికం మరియు కష్టాలను అడవిలో చూసి తన కళ్లకు విందు చేయాలని నిర్ణయించుకున్నాడు. శత్రువులయిన పాండవుల దుఃఖాన్ని చూసి ఆనందాన్ని పెంచుకోవచ్చునని శకుని బోధ. దుర్యోధనుడు తన సోదరులను, స్నేహితులను మరియు రాజ స్త్రీలను

తనతోపాటు అడవికి తీసుకెళ్లాడు. పాండవులు ఈ సంపదను చూసి బాధపడి అవమానానికి గురవుతారని దుర్యోధనుని ఊహ.

దుర్యోధనుని క్రూరమైన పన్నాగం విఫలమైంది. గంధర్వుల రాజు చిత్రసేనుని సైన్యము దుర్యోధనునిపై దాడి చేసి బంధించింది. పర్యవసానంగా, దుర్యోధనుడు తన అహంకారంతో అవమానించబడ్డాడు. గంధర్వుల యుద్ధం నుండి పారిపోయిన భటులలో కొందరు యుధిష్ఠిరుని వద్దకు పరిగెత్తారు. అతని సహాయాన్ని ప్రార్థించారు; సౌమ్యుడైన ధర్మరాజు, అ సమయంలో "కాగల కార్యం గంధర్వులు తీర్చారు" అని మాట్లాడిన భీముని తిరస్కరణ మాటలకు మందలిస్తూ, అతని సోదరులను ఆయుధాలు ధరించి కౌరవులను రక్షించమని ఆజ్ఞాపించాడు. దుర్యోధనుని, తమ ఇంటి ఆడపడుచులను గంధర్వులు స్వాధీనం చేసుకోవడంతో కుటుంబ గౌరవం మసకబారిందని చెప్పాడు. "అయ్యో, నా సోదరుల సహాయానికి తొందరపడండి' అని ధర్మరాజు వారిని ఆజ్ఞాపించాడు. ఇలా తన శత్రువుకి కూడా సహాయం చేసేంత ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తి దగ్గర చేతులు జోడించి దుర్యోధనుడు ఆశ్రయం పొందవలసి వచ్చింది.

"దానమివ్వగలిగే అంతులేని ఐశ్వర్యం, సార్వభౌమాధికారం మరియు రాజుకు కొడుకుగా పుట్టడం గొప్ప ఆనందానికి మూలాలు. కానీ, పాండు పుత్రులారా! శత్రువుని కష్టాల నుండి విముక్తి పొందించటం ఈ మూడు ఆనందాలతో సమానం. "అని గొప్ప మనస్సు గల అజాత శత్రువైన ధర్మరాజు చెప్పి, దుర్యోధనుని విడిపించమని చెప్పాడు. అతని మాటను సోదరులు పాటించారు. కొంతకాలం యుద్ధం జరిగింది. ఆపై అర్జునుడు, అతని స్నేహితుడయిన గంధర్వరాజు చిత్రసేనుడు యుద్ధాన్ని విరమించారు. అర్జునుడు దుర్యోధనునిపై దాడికి గల కారణాన్ని ఆరా తీసాడు. గంధర్వరాజు చిత్రసేనుడు ఈ విధంగా అర్జునునితో చెప్పాడు. "అర్జునా ! నీమీద నాకు కోపంగాని అసూయ కాని లేదు. నీవు నాకు ప్రియమిత్రునివి. ఈ దుర్యోధనుడు దుష్టుడు. మీరు ఈ అడవిలో పలుపాట్లు పడుతుండగా మిమ్మలిని ఎగతాళి చేయటానికి ఈ ఘోషయాత్ర అనే కారణంతో ఇక్కడికి వచ్చాడు. ఈ సంగతి తెలిసిన ఇంద్రుడు ఈ దుర్యోధనుని ఈ దుర్యోధనుని పరివారాన్ని బంధించి తెమ్మని నాకు ఆజ్ఞ ఇచ్చాడు. నీవు వేరుమాట చెప్పవద్దు. ఇతనిని దేవేంద్రుని దగ్గరకు తీసుకు వెళదాం." అర్జునుడు చిత్రసేనుడితో ఈ విధంగా చెప్పాడు: 'ఈ దుర్యోధనుడు ఎటువంటి వాడైనా మాకు

సోదరుడు. ఇతడిని నీవు విడిచిపెట్టటమే చేయదగిన పని. ఎందుకంటే అదే ధర్మరాజుకు ఆనందాన్ని ఇచ్చే పని" అని అర్జునుడు ప్రార్థించాడు. ధర్మరాజు జరిగిన కథ మొత్తం విన్న తర్వాత అలాగే చేస్తానని చిత్రసేనుడు ఒప్పుకొన్నాడు.

ఆ తరువాత జరిగిన కథ అంతా ధర్మరాజుకు చిత్రసేనుడు చెప్పాడు. తమను అవమానించటానికి దుర్యోధనుడు చేసిన నీచమైన మరియు క్రూరమైన ఆగ్రహకృత్యాన్ని చిత్రసేనుడు చెబుతుంటే ధర్మరాజు నిశ్శబ్దంగా విన్నాడు. ఆ తరువాత ధర్మరాజు చిత్రసేనునితో ఇలా అన్నాడు. 'మహానుభావా! ఈ దుర్యోధనుడు మాకు సోదరుడు. మా అదృష్టంవలన ఈతడు ఈతని భార్యలు, తమ్ములు, మంత్రులు, మీచేత సంహరించ బడక సజీవులై ఉన్నారు. మీరు దయ చూపించటం వలన మాకుటుంబానికి హాని కలుగలేదు. మీకు మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు. మీకు ఈ దుర్యోధనుడు ఎటువంటి అపచారం చేసినా మన్నించండి. మాపై దయచూపించి ఇతనిని విడిచిపెట్టండి' అని అన్నాడు. ధర్మరాజు మాటలు కాదనలేక చిత్రసేనుడు దుర్యోధనుడు మొదలయిన వారిని విడిచిపెట్టాడు.

గంధర్వులు వెళ్ళిపోయాక యుధిష్ఠిరుడు తన తమ్మునితో ప్రేమగా ఇలా అన్నాడు:

"నాయనా! దుర్యోధనా! ఇంకెప్పుడూ ఇంత ఆవేశపూరితమైన పని చేయకు. ఎప్పుడైనాసరే ఇటువంటి అవమానాన్ని కలిగించే సాహసకృత్యాలు చేయకు. దురభిమానం ఎన్నటికీ సంతోషానికి దారితీయదు. ఓ భారతా! ఓ కురు జాతి వంశీయుడా! ఇపుడు జరిగిందేదో జరిగింది. జాగ్రత్త సుమా! ఇక శీఘ్రంగా తమ్ములు మొదలయినవారిని తీసుకొని నీ రాజధాని నగరానికి వెళ్లు. మంచివారిచేత పొగడబడినవాడా! ఇట్టి అవమానం జరిగినందుకు, ఎటువంటి దుఃఖాన్ని నీ మనస్సులో అనుభవించవద్దు. విచారంగా ఉండకు. ఉల్లాసంగా ఉండు" ఆ విధంగా నిందారహితుడైన ధర్మరాజు తన దుఃఖానికి సంబంధించిన కర్త అయిన తన శత్రువుతో దయతో వ్యవహరించాడు; కానీ దుర్యోధనుడు, వెళ్ళిపోతూ, మరింత దుఃఖంతో మరియు కోపంతో నిండిపోయాడు; ధర్మరాజు దయ దుర్యోధనునికి ఒక కొత్త నేరంగా అనిపించింది. మరియు అతను హస్తినాపురానికి తిరిగి వచ్చాడు. తాను చెడు చేసినా తనపై దయ చూపించిన వారిని ద్వేషించాడు.[8]

అదృష్టవశాత్తూ, అలాంటి ప్రతిస్పందన (తాను చెడు చేసినా దయ చూపించిన

వారిపట్ల ద్వేషం) మానవులలో చాలా అరుదు. ఎందుకంటే సూర్యుడు వెన్నను మృదువుగా చేసినట్లే, దయగల అనుభూతి యొక్క వెచ్చదనం కోపంతో కూడిన మానసిక స్థితిని మృదువుగా చేస్తుంది. మనపై చూపిన కోపం మనలో కోపానికి సంబంధించిన భావాన్ని రేకెత్తించినప్పటికీ, మనం దానిని తనిఖీ చేయడానికి ప్రయత్నించవచ్చు. దానిని మాటలో, చూపులో లేదా సంజ్ఞలో వ్యక్తీకరించడానికి నిరాకరించవచ్చు. అలాంటి అణచివేత క్రమంగా అనుభూతిని ఆపివేస్తుంది. కనీసం దాని దహనాన్ని పెంచడానికి మంటపై ఇంధనాన్ని వేయకుండా విజయం సాధించాలి. ఈ రకమైన కొంత అభ్యాసం తర్వాత, మరొకరి కోపం మనలో కోపాన్ని కలిగించదని మనము కనుగొంటాము. మరొకరి యొక్క కఠినమైన అనుభూతిని తీర్చడానికి దయగల అనుభూతిని మనలోనుండి ఎదుటివారికి పంపడంలో మన శక్తిని ఉపయోగించగలము.

చెడు సాంగత్యానికి ఎందుకు దూరంగా ఉండాలో చూడటం ఇప్పుడు మనకు సులభం; మనం దయలేని, అపవిత్రమైన, చెడు ఆలోచనలు తప్పుడు పనులు చేసే అపవిత్రమైన, తిండిపోతు పనులు చేసే వ్యక్తులతో ఉంటే, వారి భావాలు మనపై పని చేస్తాయి. అదే విధంగా ఆలోచించడం మరియు ప్రవర్తించడం వైపు మనల్ని పురికొల్పుతాయి. మనలో దాగి ఉన్నటువంటి ఏదైనా చెడులు అటువంటి ప్రభావాలలో మరింత చురుకైన జీవితాన్ని ప్రారంభిస్తాయి. వాటిపై పోరాడటం మరింత బలంగా మరియు మరింత కష్టతరం అవుతుంది. ఈ కారణాల వల్ల పాఠశాలలో స్వచ్ఛమైన మరియు కష్టపడి పనిచేసే జీవితాన్ని గడపాలని కోరుకునే బాలుడు, ఉన్నతమైన మరియు సమాజానికి ఉపయోగకరమైన వ్యక్తిగా తయారవటం కోసం తనను తాను సిద్ధం చేసుకోవాలి. అందుకొరకు అతను వీలైనంత వరకు చెడు సాంగత్యానికి దూరంగా ఉండాలి.

ఏ సమయంలోనైనా ఒక్కోసారి అతను చెడు సాంగత్యానికి బలవంతం చేయబడతాడు. అతను తప్పించుకోలేడు. కాని ఆ సమయంలో అతను తన మనస్సును స్వచ్ఛమైన మరియు ఉన్నతమైన ఆలోచనలతో ఉంచుకోవాలి. తద్వారా తన చుట్టూ ఉన్నవారిని తన మంచితనంతో ప్రభావితం చేయడానికి ప్రయత్నించాలి. తనలో దుష్టత్వానికి అనుమతించకుండా తోటివారిని మంచిగా ప్రభావితం చేయాలి. ఈ విధంగా మనం మన జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. జ్ఞానాన్ని మన స్వంత జీవితంలో సాధనకు వర్తింపజేయాలి. తద్వారా మాత్రమే మనం మన జ్ఞానాన్ని

ఫలవంతం చేయగలము. ఈ గొప్పదయిన జీవనం ద్వారా ప్రపంచానికి కూడా గొప్ప ఆనందాన్ని మనం కలిగించవచ్చు.

h h h

క్రుధ్యన్తం న ప్రతిక్రుధ్యే దాపృష్టః కుశలం వదేత్।।[9]

తనపై కోపపడు వానిని ఎదిరించి తిరిగి కోపపడరాదు.తనను నిందించినా తాను మాత్రం మృదువుగా మాట్లాడాలి.

సేతూంస్తర దుస్తరాన్ అక్రోధేన క్రోధం సత్యేతామృతం।।[10]

"కష్టతరమైన దారులను దాటండి" క్షమాపణ ద్వారా కోపాన్ని, సత్యం ద్వారా అసత్యాన్ని దాటండి.

ఆత్మానంచ పరాశ్చైవ త్రాయతే మహతో భయాత్ ।
క్రుధ్యన్తమప్రతి క్రుధ్యన్ద్వయోరేవ చికిత్సకః।।[11]

"కోపముతో కోపపడనివాడు ఇద్దరికీ వైద్యుడు. తనతో పాటు ఇతరులను కూడా పెను ప్రమాదం నుండి కాపాడుతాడు."

క్షమా బ్రహ్మ క్షమా సత్యం క్షమా భూతం చ భావి చ।
క్షమా తపః క్షమా శౌచం క్షమయేదం ధృతం జగత్।।[12]

క్షమ అనేది నిజం, క్షమ అనేది గతం మరియు భవిష్యత్తులకు మూలం మరియు మద్దతు కలిగిస్తుంది. క్షమయే తపస్సు, క్షమయే స్వచ్ఛత; ఈ ప్రపంచం క్షమ ద్వారా ధరించబడుతున్నది.

పరశ్చేదేనమతివాదబాణై; ర్భృశం విధ్యేచ్ఛమ ఏవేహ కార్యః ।
సంరోష్యమాణః ప్రతిమృష్యతే యః; స ఆదత్తే సుకృతం వై పరస్య ।।

ఆక్రుశ్యమానో న వదామి కిం చి; త్క్షమామ్యహం తాడ్యమానశ్చ నిత్యం ।
శ్రేష్ఠం హ్యేతత్క్షమమప్యాహురార్యాః; సత్యం తథైవార్జవమానృశంస్యం ।।

ఆక్రుశ్యమానో నాక్రోశేన్మన్యురేవ తితిక్షతః ।
ఆక్రోష్టారం నిర్దహతి సుకృతం చాస్య విందతి ।।

యో నాత్యుక్తః ప్రాహ రూక్షం ప్రియం వా;

యో వా హతో న ప్రతిహంతి ధైర్యాత్ ।
పాపం చ యో నేచ్ఛతి తస్య హంతు;
స్తస్మై దేవాః స్పృహయంతే సదైవ ॥
పాపీయసః క్షమేతైవ శ్రేయసః సదృశస్య చ ।
విమానితో హతోఽఽక్రుష్ట ఏవం సిద్ధిం గమిష్యతి ॥[13]

ఇతరుడు బాధించు వాగ్బాణములను తనపై ప్రయోగించినా, వాటిచేత మనసు గాయపడినా జ్ఞాని శాంతమునే వహించాలి. ఇతరుల చేత కోపింపచేయబడినప్పటికీ సంతోషముతో ఉండువాడు తనను రెచ్చగొట్టే వ్యక్తి పుణ్యమును పొందును.

ఎదుటివారు నిందించినా బదులు పలుకను, కొట్టినా క్షమిస్తాను. ఎందుకంటే ఉత్తములు సత్యము, సరళత దయ, క్షమ ఇవి సర్వోత్తమ గుణములని చెబుతారు.

పరుషంగా సంబోధించినా, కఠినంగా సమాధానం చెప్పకండి. కోపంతో ఉన్న దుష్టుని యొక్క కోపం తనను తాను తినేస్తుంది. అతని యోగ్యత మొత్తాన్ని తొలగిస్తుంది. (దూషించువానిని మరల దూషించరాదు. ఇట్లు క్షమించువాడు తనలోనే అణచుకొనిన కోపము నిందించిన వానిని దహించుటేకాక అతని పుణ్యమును కూడా తీసుకొని వచ్చును).

"తన విషయమున కఠినముగా మాటలాడిన వాని విషయములో కఠినంగా మరియు ప్రియమును మాటలాడనివాడు, తనను గాయపరచినను ధైర్యముతో మరల గాయపరచని వాడు, తనను కొట్టినవానికి హాని కలుగవలయునని కోరనివాడు దేవతల చేత కూడా దర్శనమును కోరబడువాడగును.

అపరాధము చేసినవాడు తనసాటి వాడైనను తనకంటే గొప్పవాడైనను అతనిచేత అవమానించబడినను నిందించబడినను క్షమించగలిగినవాడే ఉత్తమ సిద్ధిని పొందుతాడు.

ఆక్రుష్టస్తాడితా క్రుద్ధః క్షమతే యో బలీయసః ।
యశ్చ నిత్యం జితక్రోధో విద్వానుత్తమపూరుషః॥[14]

తనకంటెను బలముకలవాడు తనను కారు కూతలు కూసినా, కొట్టినను, కోపము చెలరేగునట్లు చేసినా బలహీనుడు ఎవ్వడు పడియుండునట్లు క్షమించియుండునో, క్రోధమును జయించునో అతడే విద్వాంసుడు, ఉత్తమ పురుషుడు అగును.

యది న స్యుర్మానుషేషు క్షమిణః పృథివీసమాః ।
న స్యాత్ సంధిర్మనుష్యాణాం క్రోధమూలో హి విగ్రహః॥ 03-29-28

అభిషక్తో హ్యభిషజేదాహన్యాద్గురుణా హతః ।
ఏవం వినాశో భూతానామధర్మః ప్రేథితో భవేత్॥ 03-29-29

ఆక్రుష్టః పురుషః సర్వే ప్రత్యాక్రోశేదనన్తరమ్ ।
ప్రతిహన్యాద్ధతశ్చైవ తథా హింస్యాచ్చ హింసితః ॥ 03-29-30

హన్యుర్హి పితరః పుత్రాన్ పుత్రాశ్చాపి తథా పితృన్ ।
హన్యుశ్చ పతయో భార్యాః పతన్ భార్యాస్తథైవ చ ॥ 03-29-31

ఏవం సంకుపితే లోకే జన్మ కృష్ణో న విద్యతే ॥ 03-29-32

(ఈ శ్లోక తాత్పర్యాలు అధ్యాయం 11లో ఉన్నాయి).

సర్వస్తరతు దుర్గాణి సర్వో భద్రాణి పశ్యతు ।
సర్వః సుఖమవాప్నోతు సర్వః సర్వత్ర నన్దతు
ఓం సత్యం వద ధర్మ చర
సత్యమేవ జయతే నానృతమ్

ఓమ్

అందఱు కష్టములనుండి గట్టెక్కుదురు గాక! శుభములను పొందుదురు గాక! ఏ ఒక్కరును దుఃఖమును పొందకుందురు గాక!

"ఓమ్ ! నిజం మాట్లాడు. న్యాయంగా జీవించు.

"సత్యమే గెలుస్తుంది, అసత్యం కాదు.

జీవులందరికీ శాంతి కలుగుగాక !

ఓమ్!

సూచికలు

1. మహాభారతం, వన పర్వము, xxix, 13 -25
2. రామాయణం అయోధ్యాకాండ 62 వసర్గ 01-18 శ్లోకాలు

3. రామాయణం అయోధ్యాకాండ 96 వసర్గ నుండి 112 వసర్గవరకు ఉన్న కథాభాగములో కొంత
4. మహాభారతం, వన పర్వము, xxxiii xxxiv
5. మహాభారతం, సభా పర్వము
6. మహాభారతం, వన పర్వము, cxv cxvii
7. మహాభారతం, వన పర్వము, cclx
8. మహాభారతం, వన పర్వము, ccxxxv -ccl
9. మనుస్మృతి 06–43
10. సామవేదం ఆరణ్యగాన అర్క పర్వ 2 ప్రపాఠకము
11. మహాభారతం, వన పర్వము, xxix-9
12. మహాభారతం, వన పర్వము 73
13. మహాభారతం, శాంతి పర్వము ccc 10,12, 16–81
14. మహాభారతం, వన పర్వము xxix 25–18

సనాతన ధర్మంలో సూచింపబడిన పుస్తకాలు,
(అకారాది గ్రంథ సూచి)

1. అనుశాసనికపర్వం
2. ఈశోపనిషత్
3. ఋగ్వేదం
4. ఐతరేయారణ్యకము
5. కఠోపనిషత్
6. గరుడ పురాణం
7. ఛాందోగ్యోపనిషత్
8. దేవీభాగవతం
9. నృసింహోత్తర తపనీయ ఉపనిషత్
10. పతంజలి మహాభాష్యము,
11. పరాశర–గృహ్య–సూత్ర, హరిహర భాష్య
12. పాణిని–శిక్ష,
13. బృహదారణ్యకోపనిషత్
14. బ్రహ్మాండ పురాణం.
15. భగవద్గీత
16. భాగవత పురాణము
17. మనుస్మృతి
18. మహాభారతం
19. ముండకోపనిషత్
20. యాజ్ఞవల్క్య స్మృతి

21. వాల్మీకి రామాయణం
22. వశిష్ఠ స్మృతి
23. విష్ణుపురాణం
24. విష్ణుభాగవతం
25. వ్యాస-స్మృతి
26. శ్వేతాశ్వతరోపనిషత్,
27. సర్వసారోపనిషత్
28. సామవేదం